వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 14 సంచిక : 5 హైదరాబాద్ 178 మే 2016 పేజీలు : 68 రు. 20

- తెలంగాణలో కరవుపై నివేదిక
- పనామా పేపర్లు వెల్లడించిన అక్రమాలు
- 'భారత్ మాత' వివాదంపై రెండు వ్యాసాలు
- చేనేత కార్మికులకు దక్కిందేమిటి?
- ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు
- నిజమైన దేశద్రోహులెవరు?
- యూరప్‌ను వణికిస్తున్న ఐసిస్

మరిన్ని రచనలు పంపించండి !
మెరుగైన రచనలు పంపించండి !
నాలుగు కాలాలు నిలిచే రచనలు పంపించండి !

గతంలో అనేకసార్లు చెప్పినట్టుగానే వీక్షణం ప్రధానంగా మూడు రకాల రచనలకు చోటు కల్పించడం తన బాధ్యతగా భావిస్తుంది. ఒకటి, ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలలో ప్రచారంలోకి వచ్చిన వార్తల, పరిణామాల వెనుక కథలను ప్రజా కోణం నుంచి అర్థం చేసుకుని, వివరించే రచనలు. రెండు, ప్రధాన స్రవంతి వార్తాపత్రికలు విస్మరించే, అతి తక్కువగా రాసే ప్రజా అంశాల మీద వివరమైన, విశ్లేషణాత్మకమైన రచనలు. మూడు, ఏ విషయాన్నయినా ప్రజానుకూల దృక్పథం నుంచి అర్థం చేసుకోవడానికి వీలైన సైద్ధాంతిక, విశ్లేషణాత్మక దృక్పథం ఇచ్చే రచనలు.

ఇటీవలి కాలంలో మొదటి రెండు రకాల రచనలు ఎంతో కొంత వస్తున్నప్పటికీ, మూడో రకం రచనలు తక్కువవుతున్నాయని పాఠకులూ, అభిమానులూ హెచ్చరిస్తున్నారు. మేం కూడ అనుకుంటున్నాం. రచనల ప్రమాణాలు కూడ పెరగవలసిన స్థాయిలో పెరగడం లేదనే అభిమానుల విమర్శతో కూడ మేం అంగీకరిస్తున్నాం.

కనుక, సైద్ధాంతిక, విశ్లేషణాత్మక రచనలవైపు దృష్టి సారించవలసిందిగా, సమకాలీన అంశాల మీద రచనలలో ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయవలసిందిగా రచయితలందరికీ సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రపంచీకరణ, హిందుత్వ ప్రమాదం, సామాజిక, రాజకీయార్థిక, సాంస్కృతిక రంగాలలో సంక్షోభం, పాలక విధానాల దివాళాకోరుతనం వంటి ఎన్నో సమకాలీన అంశాల మీద, వాటిని అర్థం చేసుకోవలసిన విశాల, సమగ్ర శాస్త్రీయ సైద్ధాంతిక దృక్పథం మీద రాయవలసినవి ఎన్నో ఉన్నాయి. సందర్భవశాత్తూ రాయవలసిన సైద్ధాంతిక అంశాలు కూడ ఎన్నో ఉంటున్నాయి.

అలా సందర్భవశాత్తూ రాయడానికి రానున్న రెండు సంవత్సరాలలో ఎన్నో సందర్భాలున్నాయి. ప్రపంచ చరిత్రలో ఒక మహత్తర అధ్యాయానికి నాంది పలికిన బోల్షివిక్ విప్లవం 1917 అక్టోబర్‌లో విజయవంతమైంది. 2016 అక్టోబర్ నుంచి 2017 అక్టోబర్ వరకు బోల్షివిక్ విప్లవ శతజయంతి సంవత్సరం. బోల్షివిక్ విప్లవ నాయకుడు వ్లదీమిర్ ఇల్యిచ్ లెనిన్ సామ్రాజ్యవాదం మీద అత్యంత ప్రామాణికమైన, అద్భుతమైన విశ్లేషణతో 'సామ్రాజ్యవాదం – పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' 1916 వసంతకాలంలో రాశాడు. సమకాలీన రాజ్యాన్నీ, దాన్ని కూలదోయవలసిన విప్లవాన్నీ ఎలా అర్థం చేసుకోవాలో నిశితంగా విశ్లేషించిన 'రాజ్యం – విప్లవం' 1917 ఏప్రిల్ – మేలో రాశాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి 2016 జూలైకి 70 ఏళ్లు, నక్సల్బరీ ప్రజ్వలనానికి 2017 మేలో, శ్రీకాకుళ విప్లవోద్యమపు తొలి నిప్పురవ్వ కోరన్న–మంగన్నల అమరత్వానికి 2017 అక్టోబర్‌లో యాభై సంవత్సరాలు నిండుతాయి. ఇటువంటి ఎన్నో సందర్భాలలో ఎన్నో కోణాల నుంచి వివరమైన విశ్లేషణా వ్యాసాలు రాయడానికి అవకాశం ఉంది.

ప్రజాపక్ష రచయితలందరికీ ఇదే ఆహ్వానం

వీక్షణం మీది. వీక్షణం ప్రజలది

ప్రజలకు అవసరమైన ప్రతి సైద్ధాంతిక, అవగాహనా అంశానికీ వీక్షణం వేదిక

రాయండి! రాయించండి! చదవండి! చదివించండి!

178 ISSN 2231-6892
వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

మే 2016
సంపుటి : 14
సంచిక : 5

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం **VEEKSHANAM**

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి.
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2016 ఏప్రిల్ నెలలో వచ్చిన విరాళాలు - జి.ఎస్. వాసు, హైదరాబాద్ - రు. 5,000; కె. రామచంద్రమూర్తి, హైదరాబాద్ - రు. 10,000; శ్రేయోభిలాషులు, హైదరాబాద్ - రు. 17,000. మిత్రులకు కృతజ్ఞతలు- సం.

కోరేగావ్ రాజకీయ మేళా గురించి చాలా వివరాలు, సమాచారం ఇచ్చిన ఎం. కృష్ణ ఆదిత్య వ్యాసం ఏమి చెప్పదలచుకున్నదో అర్థం కాలేదు. దళితులు బ్రిటిష్ వారి సైన్యంలో పనిచేసారనే వాస్తవాన్ని చెపుతూ, పనిలో పనిగా తెలుగు మేధావుల్నీ, మార్క్సిస్టుల్నీ, మార్క్సేతరుల్నీ ఆయన ఎందుకు ఎగతాళి చేశారో అర్థం కాలేదు. ఆయన ఏమి చెప్పదలచుకున్నారో తెలియకపోయినా, "కులవ్యవస్థను పడికట్టు పద్ధతులలోనూ, పూర్వ నిశ్చితాభిప్రాయాలతోనూ విశ్లేషిస్తే, దాని సమగ్ర, నిర్దిష్ట చలన రూపాలు సరిగ్గా బోధపడవు. సిద్ధాంతాలు సాధనాలే కానీ అవరోధాలు కారాదు. వాస్తవాల ఆధారంగా సత్యాన్వేషణ అనే పద్ధతి సరైనది, అవసరం. పాలకవర్గ సిద్ధాంతాలు, దళితవాదాలు, "మార్క్సిజాలు" (ఇందులోనూ రకాలున్నాయి గనుక) ఇలా ఆయా సిద్ధాంతాల కళ్లద్దాలతో మాత్రమే చూస్తే సత్యాన్వేషణ సరిగ్గా సాగదు. సరైన సత్యాన్వేషణ ఈ సమస్య సమగ్ర పరిష్కారానికి తొలిమెట్టు" అని ఆయన రాసిన చివరిమాటలు బాగున్నాయి. మూడు పేజీల రచన తర్వాత రాసిన ఈ మాటలు ఆ మూడు పేజీలకు ముందు ఆయనకు గుర్తు వచ్చి ఉంటే బాగుండును.

– ఎం. హరిభూషణ్
వరంగల్

వీక్షణం పత్రికలో వస్తున్న ఉత్తరాల్లో కొన్ని చర్చకు దారితీసేవిగా ఉంటున్నాయి. మరికొన్ని ఉత్తరాలు ఏ వ్యాసం పైన చర్చించకుండా వారికి తోచింది రాసినట్లుగా ఉంటున్నాయి. ఇలాంటి ఉత్తరాలు చర్చకు దారితీసేకన్నా, పత్రికలో వారి పేరు కనపడాలనే తాపత్రయంతో రాసినట్లుగా ఉంటున్నాయి. ఈ విషయాన్ని నిర్వాహకులు కూడా గమనించగలరని మనవి. ఇక కొందరు రాసే రచనలు రోజు వారి పేపర్లో వస్తున్న సమాచారంతో నిడివి కూడా ఎక్కువగా ఉంటున్నాయి. రాసిన రచయితలే రాస్తున్నారు కాబట్టి వారి రచనను మొత్తంగానే చదువకుండా వదిలిపెడుతున్న పరిస్థితి ఉంది, కాబట్టి రచయితలు విషయాలను సూటిగా విశ్లేషణతో కూడి ఉండేలా రెండు పేజీలు రాసినా బాగుంటుంది. పాఠకులం కూడా చదవడానికి ఆసక్తి చూపుతాము.

– రాజు
వరంగల్

ఇ. ఎస్. బ్రహ్మచారి గారెవరో గాని పిల్లిమెడలో గంట కట్టారు. అభినందనలు.

1\. మార్క్స్ పెట్టుబడిలో చెప్పిన మౌలిక అభిప్రాయాలనే తోసి రాజంటున్న రంగనాయకమ్మ గారు తాను మార్క్సిజమే చెబుతున్నానని ఎందుకు అంటున్నారో తెలియదు. శ్రమకు వేతనం అందుతున్నది అని, అది న్యాయంగానే జరుగుతున్నదని మార్క్స్ పూర్వపు అర్థశాస్త్ర వేత్తలు అనేవారు. వేతనం అదుతున్నది శ్రమకు కాదని, శ్రమశక్తికి అని అనడమే మార్క్స్ కొత్తగా సాధించిన మౌలికమైన అంశం అని మార్క్సిజం విద్యార్థులు ఎవరికైనా తెలుసు. రంగనాయకమ్మ గారే ఇష్టంగా మళ్లీ అచ్చు వేయించిన అనీకిన్ మార్క్స్ పూర్వ అర్థ శాస్త్రం కూడా అదే చెపుతుంది. ఇది మౌలికమైన విభజన అని, తద్వారానే తాను అదనపు విలువ దగ్గరికి, శ్రమ దోపిడీ దగ్గరికి రాగలిగానని మార్క్స్ తానే చెప్పుకున్నాడు. ఈ భావన కొత్తదనం గురించి ఎంగెల్స్, లెనిన్ కూడా రాసారు. ఇప్పుడు రంగనాయకమ్మ అదే మార్క్స్ పొరపాటు అంటున్నారు.

2\. పెట్టుబడికీ శ్రమకీ సమానమారకం అనే పునాది మీదనే మార్క్స్ పూర్వపు అర్థశాస్త్రవేత్తలు తమ వాదనలు చేశారు. మార్క్స్ ఆ పునాదిని ఒప్పుకుంటూనే, మోసం ఎక్కడ జరుగుతున్నదో చూపాడు. రంగనాయకమ్మ గారు మార్క్స్‌తో మూలంలోనే విభేదిస్తూ అది అసమాన మారకమే అంటున్నారు.

3\. మారకం ఉందని మార్క్స్ అంటుండగా, రంగనాయకమ్మ గారు, తానే అసమాన మారకం అన్నానని మరచిపోయి, అసలు మారకమే లేదు అని కూడా అంటున్నారు.

4\. రంగనాయకమ్మ గారి మార్క్స్ అసలు కార్ల్ మార్క్స్‌కు ఎంత దూరం జరిగిపోయాడో, వ్యతిరేకంగానే మారిపోయాడో చూపడానికి ఎన్నో ఆధారాలున్నాయి. మార్క్స్ ఎక్కడన్నా పొరపాటు పడ్డాడని అనుకుంటే సవరించడం వేరు. మార్క్స్ అభిప్రాయాలకు పునాది అయిన అంశాలనే తప్పులు అంటూ ఇంకా మార్క్స్‌నే పరిచయం చేస్తున్నానని అనటం గందరగోళంగా ఉంది. బ్రహ్మచారి గారు అదే ప్రశ్నించారు. 'నేను ఒకటి, రెండు అనే అంకెలను గుర్తించను, ప్లస్, ఇంటూ అనే భావనలను అంగీకరించను. కాని గణితశాస్త్రం మీద పుస్తకం రాస్తాను' అని ఎవరైనా అంటే తెలుగుసీమలో తప్ప మరెక్కడైనా నవ్విపోతారు. కాని ఇక్కడ మార్క్స్‌ను చదువుకున్న వాళ్లు తక్కువగా ఉండడం కొంత, రంగనాయకమ్మ గారిని తప్పంటే ఆమె భక్తులు ఎక్కడ విరుచుకుపడతారో అనే భయంతో కొంత ఇప్పటివరకూ పిల్లి మెడలో గంట కట్టడానికి ఎవరూ సాహసం చేయలేదు. పైగా ఆమె అభ్యుదయ, ప్రగతిశీల, మార్క్సిస్టు శిబిరంలోని కనీసం వంద మంది మీద దురుసుగా దాడిచేసి, తన మీద ఎవరైనా విమర్శ చేయడానికి భయపడే వాతావరణాన్ని సృష్టించారు. ఒక్కసారి ఆమె రచనలన్నీ చూస్తే ఆమె రాజ్యం మీద, ప్రభుత్వాల మీద, అభివృద్ధి నిరోధకుల మీద చేసిన విమర్శలు ఒకటో రెండో ఉంటే, విప్లవ ఆచరణలో ఏదో ఒక స్థాయిలో ఉన్నవాళ్ల మీద విమర్శలు (విమర్శలు కూడా కాదు, అహంకారం, దురుసుతనం, వెటకారం నిండిన వ్యాఖ్యలు) వందకు పైన ఉంటాయి. అందరితో పాటు విప్లవకారుల మీద రాయి విసరటం సులభం. రాజ్యాన్ని ఏమైనా అంటే పర్యవసానాలు ఎదుర్కోవాలి గదా.

5\. అంతవరకూ ఎవరూ కాపిటల్ తెలుగు చేయలేదు గనుక, ఆమె మాత్రమే చేసారు గనుక ఆమెను విమర్శించగూడదని కొందరు వాదిస్తుంటారు. ఎవరూ చేయని పని చేయటం గొప్పే. కాని అది సరిపోదు, తప్పులు లేకుండా చేయటం కావాలి. ఇది ఆమె సూత్రమే. మార్క్సిస్టు ఆచరణలో ఉన్నవారిని, ప్రగతిశీల, అభ్యుదయ రచయితలను ఎందరినో ఆమె వారు చేయని తప్పులకు

(మిగతా 60వ పేజీలో)

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య;
ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ
(ఈ సంచికలోని వరంగల్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్న వారు ఎస్. వెంకటేశ్)

బెంగళూరు మహిళా కార్మికుల పోరాటం ఆశాసూచిక

దేశవ్యాపిత విద్యార్థి ఆందోళనలతో ప్రారంభమైన 2016 కార్మిక ఆందోళనలకు కూడ విస్తరించి సంఘ్ పరివార్ హిందుత్వ పాలకవర్గాల దౌర్జన్యానికి ప్రశంసనీయమైన ప్రతిఘటనను చూపుతున్నది. జనవరిలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల వ్యవస్థాగత హత్యకు నిరసనగా విద్యార్థులు ప్రారంభించిన ఆందోళన ఈ దేశంలో తప్పనిసరిగా జరగవలసిన కుల వివక్ష గురించిన చర్చను మళ్లీ ఒకసారి కేంద్రస్థానంలోకి తెచ్చింది. ఆ చర్చను పక్కదారి పట్టించడానికి పాలకవర్గాలు, న్యూఢిల్లీ జెఎన్‌యు లో జరిగిన ఒక సమావేశం సాకుగా దేశభక్తి–దేశద్రోహం చర్చను ముందుకు తెస్తే అది కూడ అత్యవసరమైన మరొక చర్చను, నిజమైన దేశద్రోహులు పాలకులే అనే చర్చను ముందుకు తెచ్చింది. విశ్వవిద్యాలయాలలో ఆధిపత్య ధోరణులకు, రాజ్యం జోక్యానికి వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన దేశవ్యాప్తంగా విస్తరించింది.

ఇలా దేశం అట్టుడుకుతుండగానే ప్రావిడెంట్ ఫండ్ విషయంలో కార్మికుల, ఉద్యోగుల ప్రయోజనాలను కాలరాయడానికి కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో ప్రయత్నాలు ప్రారంభించింది. కార్మికులూ, ఉద్యోగులూ తమ నెత్తుటిని చెమట చేసి సంపాదించుకున్న వేతనాలలో నుంచి కొంత భాగాన్ని వృద్ధాప్యంలో, పదవీ విరమణ సమయంలో, మధ్యలో ఇతర అవసరాలకో వాడుకోగలిగిన ప్రావిడెంట్ ఫండ్‌లో దాచుకుంటుండగా, అసలు ఆ నిధుల మీద ఆ శ్రామికులకు పూర్తి హక్కు ఉందా లేదా అనే కొత్త చర్చను ప్రభుత్వం ప్రారంభించింది. దేశంలో లక్షల కోట్ల రూపాయలుగా విస్తారంగా పోగుబడిన ప్రావిడెంట్ ఫండ్, ఎల్ ఐసి నిధులను బహుళ జాతి సంస్థలకు, దేశదేశాల సంపన్నులకు కట్టబెట్టడానికి మార్గాలు వెతకడానికే గత ఇరవై ఐదు సంవత్సరాల ప్రపంచీకరణ విధానాలలో భాగంగా ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఆ తహతహలో కొత్త అంకమే 2016 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు. ఈ ఉత్తర్వుల ప్రకారం కార్మికులకు తమ ప్రావిడెంట్ ఫండ్ నుంచి తమకు కావలసినప్పుడు రుణం తీసుకునే అవకాశం రద్దయిపోతుంది. వారు తమ వాటాగా చెల్లించిన భాగం తీసుకోవడానికి మాత్రమే అర్హులవుతారు గాని యాజమాన్య వాటా తీసుకోవడానికి రిటైర్మెంట్ దాకా, అంటే 58 ఏళ్ల వయసు వచ్చేదాకా వేచి ఉండాలి. ఈ మధ్యలో తమ వాటా కూడ ఏయే సందర్భాలలో తీసుకోవచ్చునో ఎన్నో ఆంక్షలు విధించారు. ఈ ఉత్తర్వులు ఆగస్ట్ 1 నుంచి అమలు లోకి వస్తాయన్నారు.

నిజానికి అసంఘటిత రంగంలో ఉన్న కోట్లాది మంది కార్మికులకు, ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యమే లేదు. సంఘటిత రంగంలో, కార్మికోద్యమం బలంగా ఉన్నచోట కార్మికులు పొందిన ఈ హక్కును కూడ ధ్వంసం చేస్తున్న ఈ ఉత్తర్వుల మీద దేశవ్యాప్తంగా కార్మికులలో, ఉద్యోగులలో అసంతృప్తి చెలరేగింది. ఆ అసంతృప్తికి శిఖరాయమానంగా ఏప్రిల్ 18, 19 తేదీల్లో బెంగళూరు రెడీమేడ్ దుస్తుల తయారీ రంగంలోని మహిళా కార్మికులు 'మోడీగె ధిక్కార" (మోడీ విధానాలను ధిక్కరిద్దాం) అనే నినాదంతో వెల్లువలా తమ నిరసన ప్రకటించారు. ఈ దుస్తుల తయారీ రంగంలో, ముఖ్యంగా బెంగళూరు నగరంలోనూ, చుట్టుపట్లా ఐదున్నర లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారి దుర్భరమైన పని పరిస్థితులను మెరుగు పరచాలనీ, చట్టబద్ధ హక్కులు అమలు పరచాలనీ కొన్ని సంవత్సరాలుగా వారు పోరాటాలు సాగిస్తున్నారు. ఫిబ్రవరి ఉత్తర్వులు వారి అసంతృప్తికి ఆజ్యం పోసి, ఒక్కుమ్మడిగా ఒక లక్ష మంది మహిళా కార్మికులు వీథుల్లోకి వచ్చారు. రెండు రోజుల పాటు బెంగళూరు నగరంలోని అనేక ప్రాంతాలు స్తంభించిపోయాయి. దారుణమైన పోలీసు నిర్బంధాన్ని కూడ ఎదిరిస్తూ నిరసనకారులు అనేక క్రియాశీల పోరాట రూపాలతో తమ ఆందోళన కొనసాగించారు. చివరికి ప్రభుత్వం దిగివచ్చి, ఫిబ్రవరి ఉత్తర్వులను ఉపసంహరించుకుంటున్నానని ప్రకటించిన తర్వాతనే ఆందోళన విరమించారు. గార్మెంట్ అండ్ టెక్స్‌టైల్ వర్కర్స్ యూనియన్ 2015లో ఇచ్చిన ఒక నివేదిక ప్రకారం ఈ దుస్తుల రంగం కార్మికులు రోజుకు 17 గంటలు పనిచేస్తూ, నెలకు రు. 7000 వేతనాలతో అత్యంత దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఈ దుర్భర స్థితికి వ్యతిరేకంగా వారిలో సంవత్సరాలుగా పేరుకుంటున్న అసంతృప్తే ఈ హఠాత్ ప్రజ్వలనకు దారితీసింది. ఈ బెంగళూరు మహిళా కార్మికుల ఆందోళనకు సమాంతరంగా, అటూ ఇటూగా దేశంలో అనేక చోట్ల చిన్నవో పెద్దవో కార్మిక ఆందోళనలు చెలరేగాయి, చెలరేగుతున్నాయి. మరొకవైపు కొనసాగుతున్న పరిస్థితులకు నిరసనగా దేశవ్యాప్తంగా రైతాంగ అసంతృప్తి విచారకరమైన ఆత్మహత్యలకు దారితీస్తున్నది. ఆదివాసులలో పెరుగుతున్న అసంతృప్తి క్రియాశీల, సంఘటిత పోరాటాలలో వ్యక్తమవుతున్నది. ఇవాళ జరగవలసినదల్లా ఇటువంటి విభిన్న వర్గాల చెదురు మదురు ఆందోళనలను సమన్వయం చేసి ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా సంఘటితపరచి ఐక్యం చేయడం. తద్వారా ఈ పోరాటాల శక్తిని ఇనుమడింపజేసి యథాస్థితికి ముగింపు పలకడం.

ఇటువంటి విడివిడి పోరాటాలు ఏకకాలంలో ఉవ్వెత్తున చెలరేగడం యాదృచ్ఛికం కాదు, గత ఏడు దశాబ్దాలుగా దేశంలో సాగుతున్న అభివృద్ధి నమూనా, అక్రమ పాలన, రెండు సంవత్సరాలుగా సాగుతున్న సంఘ్ పరివార్ పాలన ఈ ప్రజా అసంతృప్తి భగ్గుమని మండడానికి తగిన పరిస్థితిని కల్పించాయి. సంఘ్ పరివార్ శక్తులు, ప్రభుత్వంలోనూ, బైటా ఈ సంవత్సర కాలంలో కుల వివక్ష, దేశద్రోహం, ప్రపంచీకరణ శక్తులకు దేశసంపదలను అప్పగించడం అనే మూడు కీలకమైన చర్చనీయాంశాలను రంగస్థలం మీదికి తెచ్చాయి. నిజానికి ఈ మూడు అంశాలూ ఇవాళ భారత రాజకీయార్థిక వ్యవస్థలో, సామాజిక వ్యవస్థలో అత్యవసరంగా చర్చించవలసినవి. ఈ అంశాల ప్రాతిపదికపై ప్రజాచైతన్యాన్ని రగిలించి ప్రజా సమీకరణ జరపవలసి ఉంది. ప్రజలకూ ప్రజాశత్రువులకూ మధ్య స్పష్టమైన విభజన రేఖ గీయవలసి ఉంది. సంఘ్ పరివార్ శక్తులు తమ ఎన్నికల ఎత్తుగడల కోసమో, తమ అగ్రవర్ణ, మతోన్మాద, సామ్రాజ్యవాద దళారీ రాజకీయాల కోసమో ముందుకు తెస్తున్న విభజన ఈ దేశంలో విశాల ప్రజారాశులను ఏకంచేసి, శత్రువులను ఒంటరులను చేసి, విస్తృత పోరాటం సాగించడానికి ఒక మంచి అవకాశం. ఈ అవకాశాన్ని ప్రజాశక్తులు ఎంత సమర్థంగా, ఎంత క్రియాశీలంగా, ఎంత చైతన్యయుతంగా వాడుకుంటాయనే దానిమీదనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

ప్రైవేటు విద్యుత్తు అక్రమాలకు ప్రభుత్వ మద్దతు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన ప్రజావ్యతిరేక స్వభావాన్ని రోజురోజుకూ మరింతగా బహిర్గతం చేసుకుంటున్న క్రమంలో గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరించిన ఏ అక్రమ విధానాలను తీవ్రంగా విమర్శించిందో, అవే విధానాలను అక్షరాలా పాటించడం మాత్రమే కాదు, ఆ విధానాలను మరింత దూకుడుగా అమలు చేస్తానని చూపుతున్నది. ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి సంస్థ జెన్‌కో సాగించే విద్యుదుత్పత్తిని నానాటికీ తగ్గిస్తూ, ప్రైవేటు రంగ విద్యుదుత్పత్తి సంస్థలనుంచి కొనుగోళ్లు పెంచుతూ, దాదాపు రు. 800 కోట్ల ప్రజాధనాన్ని వ్యర్థం చేస్తున్నది. విద్యుత్ వినియోగదారులమీద అదనపు భారాన్ని మోపుతున్నది. ఈ అక్రమం గురించి వార్తలు వెలువడగానే స్వయంగా ఆర్థిక మంత్రి ఎట్టి పరిస్థితిలోనూ ప్రైవేటు విద్యుత్తును వదులుకోలేమని, ఒకసారి ఒప్పందం చేసుకున్నాక, ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు ఆమేరకు చెల్లించక తప్పదనీ బాహాటంగానే ప్రకటించారు. ప్రైవేటు ఉత్పత్తిదారులతో చట్టప్రకారమే ఒప్పందాలు జరిగాయని, ఆ ఒప్పందాల మేరకు చెల్లింపులు జరుగుతున్నాయని సమర్థించుకున్నారు. నిజానికి, ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డును ముక్కలు చేసి, బలహీనం చేసి, విద్యుత్ నియంత్రణ మండలిని ఏర్పరచింది గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకే ప్రైవేటు ఉత్పత్తిదారులతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ – పిపిఎ) చేసుకున్నదీ ఆ ప్రభుత్వమే. ప్రైవేట్ ఉత్పత్తిదారులు విద్యుత్తు ఉత్పత్తి చేసినా చేయకపోయినా, సరఫరా చేసినా చేయకపోయినా వందల కోట్ల రూపాయలు చెల్లిస్తూనే ఉంటామని ఈ ఒప్పందాల్లో రాశారు. ఈ పిపిఎలు ఎంత అక్రమంగా, ప్రైవేటు ఉత్పత్తిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా, ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా జరిగాయో గత పదిహేను సంవత్సరాలలో ఎన్నోసార్లు బైటపడింది. ఎంతో చర్చ జరిగింది. ఆ సందర్భంలోనే జరుగుతున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కూడ ప్రైవేటు విద్యుదుత్పత్తిదారులకు వ్యతిరేకంగానూ, పిపిఎలకు వ్యతిరేకంగానూ ఎంతగానో మాట్లాడింది. కాని తెలంగాణ ఏర్పడినతర్వాత విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ అనుసరించిన విధానాలే యథాతథంగా సాగుతున్నాయి. చివరికి గతంలో లేని విధంగా ప్రైవేటు విద్యుత్తును ఎంతమాత్రం వదులుకోం అనే బరితెగంపు ప్రకటనకు కూడ తెలంగాణ ప్రభుత్వం సిద్ధపడింది. విద్యుత్ రంగం కీలకమైనదనీ, ఆ రంగంలో ప్రపంచబ్యాంకు ఆదేశాలను పాటించి, ప్రైవేట్ విద్యుత్ రంగాన్ని ప్రోత్సహించి, విద్యుత్ ఛార్జీలు పెంచి, చివరికి నిరసించిన ప్రజలపై బషీర్ బాగ్ కాల్పులు జరిపిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పతనానికి నాంది పలికినది విద్యుత్ ఆందోళనేననే పాఠాన్ని తెలంగాణ పాలకులు గుర్తుంచుకోవాలి. కోతలు లేకుండా విద్యుత్తు అందిస్తున్నామని మధ్యతరగతి ప్రశంసలు చూరగొనడం సరే, ప్రభుత్వ రంగంలో ఉండవలసిన, పెరగవలసిన్ విద్యుత్ రంగాన్ని బలహీన పరుస్తూ, ప్రైవేటు విద్యుదుత్పత్తిదారుల మీద ఇటువంటి ప్రేమను ప్రదర్శిస్తే దానికి తగిన మూల్యం చెల్లించక తప్పదు. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

అవినీతి ఆరోపణల నిజానిజాలు తేలాలి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనూ, ఆ మాటకు వస్తే అంతకు పది సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ ఆర్థిక వ్యవహారాలను చూస్తున్నప్పటి నుంచీ అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆయన ప్రవేశపెట్టిన రాజకీయార్థిక విధానాలు, దేశ దేశాల సంపన్నులతో ఆయన సంబంధాలు, రాష్ట్ర సంపదలను, వనరులను ఆయన బహుళ జాతి సంస్థలకు అప్పగించిన తీరు ఆ అవినీతి ఆరోపణలకు పునాది కల్పించాయి. రాష్ట్రంలోని ఒక మారుమూల పల్లెలో రెండెకరాల రైతుబిడ్డగా ప్రారంభమై రెండువేల కోట్ల ఆస్తిపరుడయ్యాడని, ఆ ఆస్తి సంపాదనకు రాజకీయాధికారాన్ని అడ్డుపెట్టుకున్న అవినీతే ఆధారమని అప్పుడు ప్రతిపక్షాలు, ప్రచారసాధనాలు ప్రచారం చేశాయి. ప్రజలు నమ్మారు. న్యాయస్థానాలలో నిరూపణ జరిగి ఉండకపోవచ్చు, ఎన్నికలలో ఆయనే మళ్లీ మళ్లీ గెలిచి ఉండవచ్చు. కాని ఆయన మీద అవినీతి ఆరోపణలు నిజం కాదని నమ్మేవాళ్ల సంఖ్య చాల తక్కువ. ఇటువంటి స్థితిలో కొత్త విభజిత రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రెండు సంవత్సరాలు నిండకుండానే ఆయన అవినీతి గురించి చర్చ మళ్లీ మొదలయింది. ప్రధాన ప్రతిపక్షం వై ఎస్ ఆర్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి అవినీతి మీద 'ఎంపరర్ ఆఫ్ కరప్షన్' అనే 128 పేజీల పుస్తకాన్ని ప్రచురించి ఢిల్లీలో విడుదల చేసింది. రాజధానీ నగర నిర్మాణం పేరిట ఒక లక్ష కోట్ల రూపాయల అవినీతితో పాటు, నీటిపారుదల రంగం, మద్యవ్యాపారం, విద్యుత్ రంగం, ఇసుక, కాంట్రాక్టర్ల నిర్మాణ వ్యయం పెరుగుదల, బొగ్గు దిగుమతులు, పారిశ్రామికవేత్తలకు రాయితీలు వంటి 29 పద్దుల కింద మరొక రు. 34,295 కోట్ల అవినీతి జరిగిందని ఆ పార్టీ ప్రకటించింది. ఇవన్నీ హాస్యాస్పదమైన అంకెలని, అసలు అవినీతే జరగలేదని, జరగడం లేదని అధికార పార్టీ నాయకులు, స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రధాన ప్రతిపక్షమే అవినీతిమయమని, కనుక దానికి ఈ ఆరోపణలు చేసే అర్హత లేదని విమర్శించారు. ఇవాళ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న పార్టీ అగ్రనాయకుడు గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడ్డారన్నది బహిరంగమే. కాని ఆ ప్రత్యారోపణ చేసినంతమాత్రాన ఆరోపణలకు జవాబు చెప్పినట్టు కాదు. విమర్శకులకు దురుద్దేశాలు ఉన్నాయని చూపినంత మాత్రాన విమర్శలకు జవాబు చెప్పవలసిన బాధ్యత తొలగిపోదు. ఒక్కొక్క పద్దు కింద పది కోట్ల నుంచి ఒక లక్ష కోట్ల వరకు ముడుపులు ముట్టాయని, అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చినప్పుడు, ప్రతి ఒక్క ఆరోపణ లోని నిజానిజాలను పారదర్శకంగా ప్రజల ముందు ఉంచడం ప్రభుత్వ బాధ్యత. టెండర్ల అక్రమాలు, కాంట్రాక్టర్లకు అదనపు చెల్లింపులు, భూకేటాయింపులు, భూమికి హెచ్చుధరలు లేదా తక్కువ ధరలు లెక్కగట్టడం వంటి ఆరోపణలు స్పష్టంగా, నిర్దిష్టంగా నిజాలో అబద్ధాలో తేల్చడానికి అవకాశం ఉన్నవే. ప్రత్యారోపణలతో తప్పించుకుపోయే పద్ధతి మాని అన్ని ఆరోపణల మీద నిజానిజాలు తేల్చాలి. వీ

లెబనాన్ మెడకు ఐసిస్ ఉరితాడు

అమెరికా అగ్రరాజ్యం తానో సింహాన్నని ప్రకటించుకుంది. తనే ఈ భూగోళానికి అధిపతినని స్వయంపత్రం రాసుకుని తానే సంతకం పెట్టుకుంది. తనకు ఎదురు చేప్పే వారిని కుక్కలుగా చిత్రిస్తుంది. అమెరికా దుర్నీతిని ప్రశ్నించే దేశాలు, దేశ నాయకులు అమెరికా దృష్టిలో పిచ్చి కుక్కలు. తనకు తలాడించినంత కాలం అవి మంచి పెంపుడు కుక్కల జాబితాలో ఉంటాయి. అడ్డంగా తోకాడిస్తే అవి పిచ్చికుక్కల జాబితాలో చేరిపోతాయి. పిచ్చి కుక్కలని, ప్రమాదకారులని ముద్రలు వేసి ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్,ఇరాక్, లిబియా, ఈజిప్ట్, సోమాలియా, సిరియా ఇలా ఒకొక్క దేశాన్ని కబళిస్తూ వస్తున్న అగ్రరాజ్యపు పన్నాగంలో ఇపుడు లెబనాన్ ఆహుతి కాబోతోంది. లెబనాన్ మెడకు ఐసిస్ ఉరితాడును అమెరికా బిగిస్తోంది. అగ్రరాజ్యపు మధ్య ఆసియా కబళింపు కుట్రలో అమాయకంగా బలైపోయి కుప్పకూలబోతున్న లెబనాన్‌లో పెను మానవ విషాదం పొంచి ఉంది.

లెబనాన్ దేశానికి తనకాళ్లపై నిలబడి మనగలిగే స్థితి లేకుండా పోయింది. అది అతలా కుతలమై, భయకంపితమై, విచ్ఛిన్నమై పోతున్నది. లెబనాన్ తూర్పు, ఉత్తరపు సరిహద్దుల్లో ఐసిస్, దక్షిణాన పెను నాగులా పొంచి ఉన్న ఇజ్రాయిల్, ఏ నిముషాన్నైనా ఈ భయకంపిత దేశాన్ని నామరూపాలు లేకుండా చేసేసే పనిలో పొంచి ఉన్నాయి.


దీనికి తోడు 15 లక్షల సిరియా శరణార్థుల పెనుభారం ఇప్పటికే కునారిల్లుతున్న లెబనాన్ వెన్ను విరిచేసింది. అసలే బలహీనపడి ఉన్న లెబనాన్ ఆర్థిక, ప్రజా సౌకర్యాల వ్యవస్థలు ఈ ఊహించని పరిణామంతో మొత్తంగా కుప్పకూలిపోయే దుస్థితి దాపురించింది. లెబనాన్‌లో దేశభక్త హెజ్బుల్లా ప్రజా మిలిషియా బలగాలు ఐసిస్ చర్యలను, దాడులను అడ్డుకుంటున్నాయి. లెబనాన్ సైన్యం సుశిక్షితమైనదైనప్పటికీ తన ఆయుధ సంపత్తి, ఆర్థిక వనరులు దయనీయ స్థితిలో ఉన్నాయి. లెబనాన్ ప్రజల అభిమానం మూటగట్టుకుని, పోరాట పటిమ కలిగి ఉన్న హెజ్బుల్లా అంటే అమెరికా, యూరప్, సౌదీ అరేబియా ముఠాకు సరిపడదు.


హెజ్బుల్లా ప్రధానంగా షియా శాఖకు చెందిన మహమ్మదీయ సంస్థ. దానికి ఇరాన్, సిరియా మద్దతు ఉంది. హెజ్బుల్లా కేవలం మతపరమైన తాత్వికతే కాకుండా అభ్యుదయ వామపక్ష దృక్పథం కలిగి ఉంది. ప్రజా యుద్ధ పంథాననుసరిస్తోంది.

ఐదారేళ్ల క్రితం మధ్య ఆసియాలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులు లెబనాన్‌లో నిర్వహించిన ఒక ఐక్య వేదికలో మాట్లాడుతూ హెజ్బుల్లా నేత 'ఈ రోజు ప్రపంచ ప్రజల శత్రువైన సామ్రాజ్యవాదాన్ని అంతం చేయాలన్నా, ప్రపంచ ప్రజలు శాంతి సామరస్యాలతో జీవించాలన్నా ఇస్లామీయ శక్తులు, మావోయిస్టు శక్తులతో కలిసి పనిచేయడం, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా యుద్ధంలో కలిసి పోరాడడం అత్యంత ఆవశ్యకం, ఇది చరిత్ర మన ముందుంచిన కర్తవ్యం' అని ప్రకటించాడు. ఇలా ప్రకటించిన హెజ్బుల్లాను నమ్ముతున్న లెబనాన్ శ్రామిక ప్రజలకు సామ్రాజ్యవాదులు మద్దతునివ్వరు. సహాయ సహకారాలను అందించరు. అయితే, హెజ్బుల్లా కూడా అటువంటి భ్రమల్లో లేదు. ప్రజలతో కలిసి మెలసి, సామ్రాజ్యవాద దురాక్రమణదారులపై పోరాడి, లెబనాన్ స్వాతంత్ర్యాన్ని, ఉనికిని కాపాడుకోవాలన్నదే దాని ఆకాంక్ష. వీరి పోరాటానికి సహాయ సహకారాలు అందించడం ప్రపంచ ప్రజలందరి బాధ్యత.


– బి.ఎస్. రాజు వీ

ఢిల్లీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఫిబ్రవరి 9న జరిగిన ఘటనలు, ఆ తరువాత పరిణామాల మీద విచారణ జరపడానికి వైస్ ఛాన్సలర్ జగదీశ్‌కుమార్ నియమించిన ఉన్నత స్థాయి విచారణ కమిటీ సిఫారసుల మేరకు ఉమర్ ఖలీద్, అనిర్బన్ భట్టాచార్యలను, మరొక కశ్మీరి విద్యార్థిని రస్టికేట్ చేయాలని, విద్యార్థి సంఘం అధ్యక్షుడు కన్హయ్య కుమార్‌తో సహా పది మందికి పైగా విద్యార్థులకు పదివేల నుంచి ఇరవై వేల వరకు జరిమానా విధించాలని, ఇద్దరు మాజీ విద్యార్థులు క్యాంపస్‌లోకి రాకుండా నిషేధించాలని యూనివర్సిటీ నిర్ణయించింది. ఆ నిర్ణయం ప్రకటించిన తరువాత విద్యార్థుల నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ కార్టూన్ ప్రచారంలోకి వచ్చింది.







❖ **భారత విప్లవోద్యమ అరుణతార – రాయల సుభాష్ చంద్రబోస్** – సంస్మరణలో – సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రచురణలు – 199 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: వాయిస్ ఆఫ్ న్యూడెమోక్రసీ, మార్ఫ్ భవన్, 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్ – 44; నవ తెలంగాణ బుక్‌హౌస్; నవోదయ బుక్‌హౌస్; విశాలాంధ్ర



❖ **నాగలిజాడ** – గంటేడ గౌరునాయుడి సాహిత్య పరామర్శ – సంపాదకుడు: అట్టాడ అప్పలనాయుడు – సిక్కోలు బుక్ ట్రస్ట్ – 190 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: గంటేడ కిరణ్‌కుమార్, ఎస్ఎన్‌పి కాలనీ, రామమందిరం దరి, బెలగాం, పార్వతీపురం; ఫోన్: 9441415182



❖ **డా. కేశవరెడ్డి...** – (ఓ జర్నలిస్ట్ డైరీ) – యాటకర్ల మల్లేష్ – ఉదయ్ పబ్లికేషన్స్ – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: ఉదయ్ పబ్లికేషన్స్, ఈదుల మల్లయ్య నిలయం, ఇ.నం. 2-107, కేశ్‌పల్లి, జక్రాన్‌పల్లి మం. నిజామాబాద్; సెల్: 9492225111; సహచర; నవోదయ బుక్‌హౌస్




❖ **దండకారణ్యంలో చలసాని ప్రసాద్** – చేతనా నాట్యమంచ్ – విరసం ప్రచురణ – 14 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు: డి.వి. రామక్రిష్ణారావు, ఎంఐజి – 14, ఎపిఐఐసి కాలనీ, కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ – 500 040; అన్ని ప్రముఖ పుస్తక షాపులు



❖ **హరిత భారతం** – ప్రొ. అల్దాస్ జానయ్య – 256 పేజీలు, 1/8 డెమీ, రు. 280, ప్రతులకు: ఎ. సాత్విక్, 72, కేశవపురి కాలనీ, హస్తినాపురం (నార్త్), హైదరాబాద్ – 500 079, తెలంగాణ; సెల్: 94411 80889




❖ **సామ్రాజ్యవాద దోపిడీ మండలాలు** – ఎం. రత్నమాల – నూతన ప్రచురణలు – 56 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: ఎం. రత్నమాల, మేఘా అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం. 302, నల్లకుంట, హైదరాబాద్–44; ఫోన్: 27662957, సెల్: 9440329445




❖ **కలం యోధుడు చెరబండరాజు** – వి. చెంచయ్య – విరసం – 52 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: వి. చెంచయ్య, 'సాహితీ నిలయం', 10-40-15ఎ/1, జనతాపేట నార్త్, కావలి-524 201, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా; ఫోన్: 08626-242277; సెల్: 9440638035;
ఇమెయిల్: chenchaiah.sahitinilayam@gmail.com




❖ **అరుణ కిరణాలు** – ప్రజల పాటలు – అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రచురణ – 190 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: పోరండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి (అరుణోదయ) రామనర్సయ్య భవన్, క్రీస్తు రాజపురం, విజయవాడ – 8; సెల్: 8106073661; అన్ని పుస్తక కేంద్రాలలో




❖ **మీరు సామాన్యులు కావడం ఎలా?** – కందుకూరి రమేష్‌బాబు – 165 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: లివాల్ట్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 8-2-676/1/ఎ, రోడ్ నం. 13, బంజారా హిల్స్, హైదరాబాద్ – 44; సెల్: 8096721184, 9505488844



❖ **లెనిన్ ప్రసిద్ధ రచన – వామపక్ష కమ్యూనిజం – ఒక బాలారిష్టం** – క్లుప్తీకరణ: ఎన్‌విఎస్ నాగభూషణ్– ఆలోచనా ప్రచురణ – 64 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు: ఎన్‌విఎస్ నాగభూషణ్, ఆలోచనా ప్రచురణలు, డోర్ నం. 3ఎ-5-13, రైల్వే గూడ్స్ షెడ్ రోడ్, కృష్ణానగర్, పాలకొల్లు, – 534 260, పశ్చిమ గోదావరి; సెల్: 94934 74836




❖ **డా. బి.ఆర్. అంబేద్కర్ – బెర్ట్రాండ్ రసెల్ – విలియం వర్డ్స్‌వర్త్** – ప్రపంచ విజేతలు: వ్యక్తిత్వ నిర్మాణం 2 – డా. కత్తి పద్మారావు – లోకాయత ప్రచురణలు – 265 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ కాలని, పొన్నూరు, గుంటూరు – 522 124; ఫోన్ : 9849741695




❖ **తెలంగాణ శాస్త్రాలు** – నిజామాబాద్ ప్రాంతానివి – డా. కె. ముత్యం – డెక్కన్ ఆర్కెయాలజికల్ అండ్ కల్చరల్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ – 176 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: డా. అపర్ణ, ప్లాట్ నం. 42, గుల్‌మోహర్ పార్క్ కాలనీ, శేరిలింగంపల్లి, హైదరాబాద్ – 500 019; ఫోన్: 9440399796;



❖ **మీడియా స్కాన్** – పత్రికలపై పరిశీలనా నేత్రం – డా. నాగసూరి వేణుగోపాల్ – ఎన్.కె. పబ్లికేషన్స్ – 236 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు ఎన్.కె. పబ్లికేషన్స్, ఇ. నెం. 24-8-1, సమీర రెసిడెన్సీ, విజయనగరం, 535 002; ఫోన్ : 9440343479; ప్రముఖ పుస్తక కేంద్రాల్లో



❖ **ఎన్నీల ముచ్చట్లు – 26, 27, 28** – తెలంగాణ రచయితల వేదిక – సాహితీ సోపతి ప్రచురణ – 34 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: సాహితీ సోపతి, 406, మారుతి హెవెన్స్, భగత్‌నగర్, కరీంనగర్ – 505 001; ఫోన్: 9440763479, 949159800, 9494723743



❖ **అంపశయ్య నవీన్ కథలు** – లైఫ్ ఇన్ ఎ కాలేజ్; ఎనిమిదో అడుగు – నవచేతన పబ్లిషింగ్ హౌస్ – 488 పేజీలు, 1/8 డెమీ, రు. 325



❖ **భారత స్వాతంత్ర్య సమరవీరులు** – కందిమళ్ల ప్రతాపరెడ్డి – నవచేతన పబ్లిషింగ్ హౌస్ – 237 పేజీలు, 1/8 డెమీ, రు. 175

పై రెండు ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్ – 068; ఫోన్: 24224453 / 54;
ఇమెయిల్: navachethanaph@gmail.com

రోడ్ల మీద బందిపోట్లు - టోల్ టాక్స్ దోపిడీ

రోడ్ల మీద ప్రయాణాలు చేసేవారందరూ ఇటీవలి కాలంలో టోల్ గేట్ల దగ్గర విపరీతమైన వసూళ్ల సమస్య గురించి తప్పనిసరిగా చిరాకు పడుతున్నారు. అనేక రకాల ప్రత్యక్ష, పరోక్ష పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వాలు మళ్లీ ఇలా రోడ్ల మీద ప్రయాణం చేసినందుకు కూడ పన్ను ఎందుకు వసూలు చేస్తున్నదో అర్థం కానివాళ్లు కొందరయితే, ప్రయాణ వ్యయంలో ఇదొకటి అదనంగా చేరిందని విసుక్కునే వాళ్లు మరికొందరు. అసలు ప్రజా రవాణా అవసరాలు తీర్చవలసిన బాధ్యత ఉన్న ప్రభుత్వమే ఇటువంటి అదనపు పన్నులు విధించడమేమిటని ప్రశ్నించేవాళ్లు కొందరు. నిజానికి ఈ టోల్ గేట్లు, టోల్ పన్నుల విధానం మన రాజకీయార్థిక వ్యవస్థ ఎంత నిస్సిగ్గుగా దొంగల దోపిడీగా సాగిపోతున్నదో చూపే బ్రహ్మాండమైన ఉదాహరణ.

దేశంలో మొత్తం ముప్పై మూడు లక్షల కి.మీ. రహదారులుండగా, వాటిలో 66,590 కి.మీ. జాతీయ రహదారులుగా గుర్తించారు. దేశంలోని రోడ్ల నిడివిలో ఈ జాతీయ రహదారులు 2 శాతం మాత్రమే ఆక్రమిస్తున్నప్పటికీ, మొత్తం రోడ్డు రవాణాలో 40 శాతం ఈ రోడ్ల మీదనే సాగుతున్నది. కాగా 2012 నాటి అంచనాల ప్రకారం దేశంలో వాహనాల సంఖ్య సాలీనా 10.5 శాతం చొప్పున పెరుగుతున్నది. ప్రస్తుతం అది మరికాస్త పెరిగి ఉండవచ్చు. ఈ వాహనాల మీద మామూలుగా విధించే పన్నులకు, పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాల మీద విధించే పన్నులకు అదనంగా, రోడ్డుమీద ప్రయాణించినందుకు కూడ సుంకం వసూలు చేస్తే బోలెడంత ఆదాయం వస్తుంది గదా అని పాలకులు ఆలోచించారు. రోడ్ల మీద అడ్డంగా టోల్ గేట్లు కట్టి, ప్రతి వాహన ప్రయాణికుల దగ్గరా ముక్కు పిండి టోల్ టాక్స్ (పన్ను, సుంకం) వసూలు చేస్తే తనకూ అప్పనంగా వందల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని, లేదా ఆ సుంకం వసూలు చేసే బాధ్యతను ఆశ్రిత నిర్మాణ సంస్థలకు, దళారీ కంపెనీలకు అప్పగిస్తే వారికి కూడ వందల కోట్ల రూపాయలు సంపాదించుకునే అవకాశం ఇచ్చినట్టవుతుందని ప్రభుత్వ పెద్దలు ఆలోచించారు. ప్రపంచ బ్యాంకు సూచనలూ ఆదేశాలూ ఆ ఆలోచనకు పురికొల్పాయి.

ఇలా రోడ్ల మీద ప్రయాణించినందుకు పన్ను వసూలు చేసినా, రోడ్ల నిర్మాణాన్ని, నిర్వహణను, పన్ను వసూలు బాధ్యతను ప్రైవేటు కంపెనీలకు అప్పగించినా విమర్శలు వస్తాయనే అనుమానంతో దానికి ఒక సాకు సృష్టించారు. దేశవ్యాప్తంగా 55,000 కి.మీ. జాతీయ రహదారులను అభివృద్ధి చేయవలసి ఉందని, ఆ బృహత్తర కర్తవ్యానికి మూడు లక్షల కోట్ల రూపాయలు కావాలని, అంత భారీ నిధులు తమ దగ్గర లేవని, అందువల్ల ప్రజల దగ్గరి నుంచి రహదారి సుంకాలు వసూలు చేయకతప్పదని సమర్థన సృష్టించుకున్నారు.

జాతీయ రహదారులను పునరుద్ధరించినా, అభివృద్ధి చేసినా, నిర్వహించినా ఆ రహదారుల మీద ప్రయాణం చేసేవారి నుంచి సుంకం వసూలు చేయాలనే ఆలోచన నూతన ఆర్థిక విధానాలలో, ప్రపంచీకరణలో భాగంగా 1997లో మొదలై, 1998 మార్చ్ నుంచి అమలులోకి వచ్చింది. భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రహదారుల నిర్మాణమే దేశప్రగతికి సోపానం అనే భావజాలాన్ని ప్రచారం చేసి, 2000లో నేషనల్ హైవే డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎన్ఎచ్‌డిపి) ప్రకటించింది. మొదటి అడుగుగా అరవై వేల కోట్ల రూపాయల భారీ గోల్డెన్ క్వాడ్రిలేటరల్ (స్వర్ణ చతుర్భుజి) అనే ఆరువేల కి.మీ. పథకాన్ని 2001లో ప్రారంభించింది.

ఈ రోడ్ల నిర్మాణం, అభివృద్ధి, నిర్వహణలను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్-పిపిపి) అనే కొత్త పద్ధతి కింద చేపట్టాలనే ప్రపంచబ్యాంకు ఆదేశాన్ని ప్రభుత్వం పాటించింది. పూర్తిగా ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసిన రోడ్లు కూడ కొన్ని ఉన్నాయి గాని వాటిని నిర్వహించే, టోల్ వసూలు చేసే బాధ్యతను కూడ ప్రైవేట్ రంగానికి అప్పగించారు. దాన్ని ఓఎంటి (ఆపరేట్‌మేంటేన్ ట్రాన్స్‌ఫర్ -నిర్వహించు, అజమాయిషీ చేయి, బదిలీ చేయి) పద్ధతి అంటారు. ఇక, పూర్తిగా పిపిపి కింద, ప్రైవేటు రంగ నిర్మాణ సంస్థలే నిర్మించి, అభివృద్ధి చేసి, నిర్వహించే రోడ్లను బిఒటి (బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ - నిర్మించు, నిర్వహించు, బదిలీచేయి) పద్ధతి అంటారు. ఈ బిఒటి కాంట్రాక్టు గెలుచుకున్న నిర్మాణ కంపెనీతో ప్రభుత్వం సాధారణంగా 25 సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకుంటుంది. కన్సెషనేర్ అనే పేరుతో పిలిచే ఈ ప్రైవేటు నిర్మాణ కంపెనీ ఆ రోడ్డు అభివృద్ధికి అవసరమైన ఆర్థిక, యంత్ర, మానవ వనరులు సేకరించుకుని రోడ్డును నిర్మించి లేదా అభివృద్ధి చేసి, అప్పటి నుంచి తన ఒప్పంద గడువు పూర్తయ్యే వరకూ ఆ రోడ్డు మీద వెళ్లే వాహనదారుల దగ్గర నుంచి టోల్ వసూలు చేయవచ్చు. ఇక ఎంవోటి పద్ధతిలో నిర్వహించే కంపెనీలు తాము వసూలు చేసే టోల్‌లో కొంత భాగాన్ని ప్రభుత్వానికి చెల్లించవలసి ఉంటుంది.

బిఒటి పద్ధతి కింద నిర్మించే ప్రైవేటు నిర్మాణ కంపెనీల ఆదాయానికి రెండు పద్ధతులున్నాయి. ఒకటి ఆన్యుటీ (సాంవత్సరిక ఆదాయం) అనే పద్ధతి, రెండు టోల్ (రహదారి సుంకం) అనే పద్ధతి. ఆన్యుటీ పద్ధతిలో నిర్మాణ సంస్థకు నిర్మాణానికి, నిర్వహణకు అయ్యే ఖర్చును, నిర్ణీత లాభపు రేటు ప్రకారం లాభాన్ని అంచనా వేసుకుని నిర్మాణ సంస్థ టెండర్‌లో పాల్గొంటుంది. తక్కువ ఆన్యుటీ కోరిన సంస్థకు ఆ పని అప్పగించిన నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ఎచ్ఎఐ) ఆ మొత్తాన్ని ఏడాదికి ఇంత చొప్పున ఒప్పంద కాలమంతా ఇస్తూ ఉంటుంది. టోల్ పద్ధతిలో నిర్మాణ సంస్థ తానే నిర్మాణ, నిర్వహణ వ్యయాలు మొత్తం భరించి అందుకు బదులుగా నిర్ణీత కాలానికి టోల్ వసూలు చేసుకుంటుంది.

ఇతర దేశాలలో ఉన్న టోల్ పన్ను ఆ రోడ్డు మీద వాహనం ఎంత దూరం ప్రయాణం చేస్తున్నదనే ప్రాతిపదికపై ఉండగా, భారతదేశంలో మాత్రం ఆ రోడ్డు మీద ఒక్క కి.మీ. ప్రయాణించినా, అరవై కి.మీ. ప్రయాణించినా ఒకే టోల్ పన్ను చెల్లించవలసి ఉంది. చాల దేశాలలో టోల్ రోడ్డుకు సమాంతరంగా మరొక రోడ్డు ఉంటుంది. వాహనదారులు తమ ఇష్ట ప్రకారం ఆ రోడ్డు మీద కూడ ప్రయాణించవచ్చు. కాని భారతదేశంలో జాతీయ రహదారులన్నీ పూర్తిగా టోల్ పన్ను పరిధిలోకే

వచ్చేవే. ప్రత్యామ్నాయ రోడ్లను వాడితే జరిమానా విధించే అవకాశం కూడ ఉంది. ఇతరదేశాలతో పోలిస్తే భారత దేశంలో టోల్ పన్ను తక్కువే గాని, భారత పౌరుల సగటు కొనుగోలు శక్తితో పోల్చినప్పుడు అది చాల ఎక్కువ.

కేంద్రప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్‌ఎచ్‌ఎఐ వెబ్‌సైట్ ప్రకారం దేశంలో ప్రస్తుతం మొత్తం 386 టోల్ గేట్లు ఉండగా, వాటిలో తెలంగాణలో 13, ఆంధ్రప్రదేశ్ లో 29 ఉన్నాయి. జాతీయ రహదారుల మీదనైతే దాదాపు ప్రతి 60 కి.మీ. దూరానికి ఒకటి చొప్పున, రాష్ట్ర రహదారుల మీదనైతే కొత్తగా వేసిన రోడ్ల మీదా, బైపాస్‌లు, వంతెనలు, ఫ్లై ఓవర్లు నిర్మించిన చోట్లా ఈ టోల్ గేట్లున్నాయి.

తెలంగాణలో ప్రభుత్వ నిధులతో నిర్మించి, ఓఎంటి పద్ధతిలో ఉన్నవి భిక్నూర్, మనోహరాబాద్, రోల్మామిడ, పిప్పల్‌వాడ, గమ్జాల్ టోల్ గేట్లు. వీటికి ఓఎంటి కాంట్రాక్టర్లుగా జిఎంఆర్, పటేల్ కెఎన్ఆర్ హెవీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆదిలాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే, నిర్మల్ బిఓటి వంటి సంస్థలు, కొన్ని చోట్ల వ్యక్తులు కూడ ఉన్నారు. తెలంగాణలో బిఓటి పద్ధతిలో ప్రొగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్స్ నిర్మించిన పటాన్‌చెరు, జిఎంఆర్ నిర్మించిన పంతంగి, కొర్లపాడు, హైదరాబాద్-యాదగిరి టోల్‌వే నిర్మించిన గూడూరు, ఎల్ అండ్ టి వెస్టర్న్ ఆంధ్రా టోల్ వేస్ నిర్మించిన శాఖాపూర్, ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌ప్రెస్ వేస్ నిర్మించిన పుల్లూరు, నవయుగ డిచ్‌పల్లి టోల్‌వే నిర్మించిన ఇందల్ వాయి, జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వేస్ నిర్మించిన రాయికల్ టోల్ గేట్లున్నాయి.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ నిధులతో నిర్మించి, ఓఎంటి పద్ధతిలో ఉన్నవి వేంపాడు, నాతవలస, ఈతకోట, మడపం, ఉంగుటూరు, కృష్ణవరం, అగనంపూడి టోల్ గేట్లు. వీటి నిర్వాహకులుగా కోణార్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఈగిల్ ఇన్‌ఫ్రా ఇండియా, ఐవిఆర్‌సిఎల్, కె కుమార్ రాజా ప్రాజెక్ట్స్ వంటి సంస్థలు, కొన్నిచోట్ల వ్యక్తులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బిఓటి పద్ధతిలో సింహపురి ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించిన ముసునూరు, టంగుటూరు, బొల్లాపల్లి, విజయవాడ-గుండుగొలను రోడ్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించిన పొట్టిపాడు, కలపర్రు, జిఎంఆర్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించిన చిల్లకల్లు, విజయ్ ఆగ్రో ప్రాజెక్ట్స్ నిర్మించిన లక్ష్మీపురం, బివిఎస్ ఆర్ కన్‌స్ట్రక్షన్స్ నిర్మించిన బెల్లుపాడ, ఎంఐపి హైదరాబాద్-బెంగళూరు టోల్‌రోడ్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించిన కాసెపల్లి, అమకతాడు, మారూరు, జెఎస్ఆర్ ముల్బాగల్ టోల్‌వేస్ నిర్మించిన గద్దురూరు, స్వర్ణ టోల్‌వే నిర్మించిన కీసర, సూళ్లూరుపేట, వెంకటాచలం, బుదనం, సహకార్ గ్లోబల్ లిమిటెడ్ నిర్మించిన చిలకపాలెం, ట్రాన్స్‌ట్రాయ్ నిర్మించిన ఎస్‌విపురం, విజయవాడ టోల్‌వేస్ నిర్మించిన కాజ, కోస్టల్ కార్పొరేషన్ నిర్మించిన గోస్తని, ఐవి ఆర్‌సిఎల్ నిర్మించిన చాగలమర్రి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించిన పాలెంపల్లి టోల్ గేట్లు ఉన్నాయి.

ఈ ప్రైవేట్ కంపెనీల రోడ్ల నిర్మాణం, అభివృద్ధి, నిర్వహణ, టోల్‌గేట్లు, టోల్ వసూలు వ్యవహారమంతా నిజానికి భారీ కుంభకోణం. పై జాబితాలోని ప్రైవేటు కంపెనీలు, మిగిలిన దేశంలోని ప్రైవేటు కంపెనీలు కూడ అత్యధిక భాగం బడా పెట్టుబడిదారులకు, రాజకీయ నాయకులకు, రాజకీయ నాయకుల బేనామీలకు చెందినవి. గత సంవత్సరం రహదారుల రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిపై పరిమితిని రద్దు చేయడానికి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి సంస్థల మీద ఆంక్షలు సడలించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ కంపెనీలలోకి విదేశీ మౌలిక సదుపాయాల ద్రవ్య సంస్థలు కూడ పెద్ద ఎత్తున ప్రవేశిస్తున్నాయి. అంటే, మన దేశంలో మన పన్నులతో మన ప్రభుత్వం నిర్మించే రోడ్ల మీద తిరగడానికి మనం బడా పెట్టుబడిదారులకూ, విదేశీ పెట్టుబడిదారుల దళారీలకూ, విదేశీ పెట్టుబడిదారులకూ పన్నులు చెల్లించవలసిన దుస్థితి ఉందన్నమాట.

ఈ కుంభకోణంలో ఒక ప్రధాన భాగం ప్రైవేటు నిర్మాణ సంస్థలు తమ సొంత నిధులు రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా వందల కోట్ల రూపాయలు సంపాదించే అవకాశం ఉండడం. మొట్టమొదట ఆ కంపెనీలు, సంబంధిత మంత్రిత్వ శాఖలోని ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కయి ఆ రోడు నిర్మాణ వ్యయాన్ని విపరీతంగా పెంచి చూపుతారు. టెండర్ గెలుచుకున్న కంపెనీ ఆ వ్యయంలో ఎనభై తొంభై శాతాన్ని బ్యాంకుల నుంచీ, ప్రభుత్వ రంగ ద్రవ్యసంస్థలనుంచీ రుణాలుగా తీసుకుంటుంది. ఎట్లాగూ ఖర్చు ఎక్కువ చేసి చూపడం జరిగింది గనుక బ్యాంకుల నుంచి సంపాదించే రుణంలోనే వారికి మిగులు ఉంటుంది. అప్పటికీ లోటు చూపి, ప్రభుత్వం నుంచి వయబిలిటీ గాప్ ఫండ్ పేరిట ప్రజాధనాన్ని అప్పనంగా కొల్లగొట్టే అవకాశమూ ఉంటుంది. ఆ రోడ్డు మీద ఎన్ని వాహనాలు నడుస్తాయో, అవి ఏటేటా ఎలా పెరుగుతాయో, వాటి నుంచి ఎంత టోల్ వసూలవుతుందో అంచనాలు వేసి, తద్వారా ఈ నిర్మాణ, నిర్వాహక కంపెనీకి ఎన్ని సంవత్సరాల టోల్ వసూలు హక్కులు ఇవ్వవచ్చునో నిర్ణయిస్తారు. దాన్ని కన్సెషన్ పీరియడ్ అంటారు. సాధారణంగా ఈ స్థాయిలో విపరీతమైన అవినీతి జరిగి వాహనాల సంఖ్యను, వసూలయ్యే టోల్ నూ తక్కువ చూపించడం జరుగుతుంది. అలా ఖర్చును ఎక్కువ చేసి, ఆదాయాన్ని తక్కువ చేసి చూపడం ఆయా కంపెనీలకు, రాజకీయ నాయకులకు, అధికారులకు ఇబ్బడి ముబ్బడిగా అక్రమ నిధులు సమకూర్చే వ్యవహారం.

ఇటువంటి అక్రమాల గురించి ప్రభుత్వ విధానాల విమర్శకులు మాత్రమే కాదు, స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అయిన కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వార్షిక నివేదికల్లో కూడ ఎన్నో సార్లు ప్రస్తావనకు వచ్చింది. ఉదాహరణకు, 2013 కాగ్ నివేదిక చాల స్పష్టంగా, నిర్దిష్టంగా రు. 3233.71 కోట్ల విలువైన (ఖర్చుపెట్టిన) టోల్ రోడ్ల మీద టోల్ వసూళ్ల ద్వారా ఆయా కంపెనీలు రు. 28,095.54 కోట్లు ఆదాయం సంపాదిస్తున్నాయని, ఒప్పందం కాలవ్యవధిని అవసరమైన దానికన్న పెంచడం వల్ల ఇది సాధ్యమయిందని రాసింది.

జిఎంఆర్ గ్రూపుకు చెందిన జిఎంఆర్ హైదరాబాద్ విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ అధికార ప్రతినిధులు 2012లో పిటిఐకి ఇచ్చిన వార్త ప్రకారం అది హైదరాబాద్-విజయవాడ హైవేలో 72 కి.మీ. రోడ్డు నిర్మించింది. ఆ నిర్మాణానికి అయిన మొత్తం ఖర్చు రు. 1740 కోట్లు. ఆ రోడ్డుకు టోల్ వసూలు చేయడానికి నక్రేకల్ దగ్గర కొర్లపాడులో నిర్మించిన టోల్ గేట్ దగ్గర రోజుకు రు. 80 లక్షల ఆదాయం ఉంటుందని ఆ ప్రతినిధులే చెప్పారు. అంటే ఇదే సగటు ఆదాయ మనుకున్నా 25 సంవత్సరాల ఒప్పందపు కాల వ్యవధిలో ఆ కంపెనీ రు. 9000 కోట్లు సంపాదిస్తుంది. అయితే ఇది కూడ పూర్తి అంకె కాదు. 2015 ఆగస్ట్ నాటికి ఆ టోల్ గేట్ దగ్గర ప్రతి రోజూ 26950 వాహనాలు అటూ ఇటూ ప్రయాణిస్తాయని అంచనా. అవి రోజురోజుకూ ఇంకా ఇంకా పెరుగుతున్నాయి. అంటే ఆదాయం అంచనా వేసినదానికన్న ఇంకా ఎక్కువ ఉండవచ్చు. ఎవరి సొమ్ము ఇది? ఎవరి బొక్కసాల్లోకి పోతున్నది? ఈ అక్రమానికి ప్రభుత్వాలు ఎట్లా సహకరిస్తున్నాయి? వీ

తెలంగాణలో కరవు బీభత్సం

తెలంగాణలోని రంగారెడ్డి, నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఏర్పడిన తీవ్ర కరవు పరిస్థితులపై తెలంగాణ జాయింట్ ఆక్షన్ కమిటీ, తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రకటించిన నివేదిక

ఉపోద్ఘాతం

తెలంగాణ అంతటా తీవ్రమైన కరవు వ్యాపించి ఉన్నది. గత 50-60 సంవత్సరాలలో ఎన్నడూ ఇటువంటి కరవును చూడలేదని చాలా గ్రామాల్లో వయసు మీదపడిన వృద్ధులు మాతో అన్నారు.

ప్రస్తుతం నెలకొన్న ఈ కరవు పరిస్థితులను అధ్యయనం చేయడానికి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటజీ, తెలంగాణ విద్యావంతుల వేదిక బృందాలు రంగారెడ్డి, నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పర్యటించి సమాచారాన్ని సేకరించాయి. పోగైన సమాచారాన్ని పరిశీలించి, విశ్లేషించినప్పుడు దిగువ విషయాలు కనబడుతున్నాయి.

వాస్తవానికి కరవును గుర్తించడం, కరవు వలన కలిగిన నష్టాన్ని అంచనా వేయడం కష్టమైన పనే. కరవు వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరిత్యాల కన్నా భిన్నమైనది. ఎందుకంటే కరవు, వరదల వలె ఎకాఎకిన వచ్చి ప్రభావాన్ని చూపి వెంటనే వెళ్లిపోయే సంఘటన కాదు. కరవు కానీ, కరవు వలన తలెత్తే అనర్థాలు కానీ మెల్లమెల్లగా బహిర్గతమవుతుంటాయి. ఎక్కడ కరవు మొదలైందో, ఎక్కడ అంతమైతదో తేల్చి చెప్పలేము. భౌతికంగా కంటికి కరవు కారణంగా తలెత్తిన కష్టాలన్నీ కనబడవు. అందుకనే కరవును నిర్వచించే విషయంలోను, కరవు నివారణ కార్యక్రమాలను, కరవు సహాయక చర్యలను గుర్తించడంలోను విభేదాలు తలెత్తుతుంటాయి. ఈ వివాదాలను పరిష్కరించడం నివేదిక లక్ష్యం కాదు.

కరవు మాన్యువల్

ప్రభుత్వం కరవును గుర్తించే విషయంలోను, కరవు సహాయక చర్యల రూపకల్పన విషయంలోను కరవు మాన్యువల్‌ను అనుసరిస్తది. ఈ మాన్యువల్‌ను 1995లో సవరించి పెంపొందించారు. 2009లో కేంద్రం కరవు పరిస్థితులను గుర్తించి ఈ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల రూపకల్పనకు నమూనా కరవు మాన్యువల్‌ను తయారు చేసింది. ఆ వెలుగులో రాష్ట్ర కరవు మాన్యువల్ మారవలసిన అవసరమున్నది.

అది అట్లుండగ ఇప్పుడున్న కరవు మాన్యువల్ ప్రకారం కరవును గుర్తించడానికి నాలుగు అంశాలను పరిగణలోనికి తీసుకుంటరు. అందులో మొట్టమొదటిది వర్షపాతం చాలా ముఖ్యమైనది. సగటుకన్నా వర్షపాతం తగ్గితే కరవును ప్రకటించవచ్చు. ఒక మండలాన్ని కరవు మండలంగా ప్రకటించడానికి లోటు ఎంత ఉండాలన్నది ఆ మండలం సగటు వర్షపాతాన్ని బట్టి నిర్ణయిస్తారు. ఆ వివరాలు పట్టికలో ఉన్నాయి.

సగటు వర్షపాతం	కరువు మండలంగా గుర్తించడానికి ఉండవలసిన లోటు శాతం
1000 మి.మీ.	25 శాతం
750-999 మి.మీ.	20 శాతం
749.9 లేక అంతకన్నా తక్కువ	15 శాతం

వర్షపాతంలో లోటు ఉన్నట్టయితే అప్పుడు దిగువ అంశాలు కూడా లెక్కలోకి తీసుకుంటారు. వర్షపాతం లోటుతో పాటు కింద ఇచ్చిన మూడు పరిస్థితులలో ఏవేనీ రెండు ఉంటే అప్పుడు ఆ మండలాన్ని కరవు మండలంగా ప్రకటించవచ్చు.

- సాగు భూమి సగటు సాగుభూమి కన్నా 50 శాతం తగ్గిపోవడం.
- పంటల దిగుబడి సగటుకన్నా 50 శాతం పడిపోవడం.
- వర్షాలు లేని రోజులు ఎక్కువ కావడం.

వర్షపాతం లోటు ఉన్న మండలాల్లో ఈ మూడింటిలో ఏ రెండు పరిస్థితులున్నా కరవు మండలంగా ప్రకటించవచ్చు.

వర్షాలు లేని పొడి రోజులను లెక్కగట్టడం చాలా అవసరం. ఎందుకంటే వర్షపాతం లోటు తక్కువగా ఉన్నా కీలకమైన సమయంలో వానలు లేకపోతే పంటలు పూర్తిగా దెబ్బతింటాయి. 750 మి.మీ. సగటు వర్షపాతం కన్నా తక్కువ వానలు పడే మండలాల్లో 2.5 మి.మీ. కన్న తక్కువ వానపడిన రోజులను, అసలు వానలు లేని రోజులను పొడిరోజులుగా గుర్తిస్తారు. 750 మి.మీ. కన్నా ఎక్కువ సగటు వర్షపాతం కల మండలాల్లోను 5 మి.మీ. లేక ఇంతకన్నా తక్కువ వానపడిన రోజులు పొడి రోజులుగా లెక్కకడతారు.

కరవు ప్రకటించిన తరువాత మాన్యువల్ ప్రకారం దిగువ వివరించిన కరవు సహాయ చర్యలను మొదలు పెట్టాలి.

1) భూమి శిస్తు, సెసు, ప్రత్యేక భూట్యాక్సులు, డ్రైనేజీ సెస్సు సేకరణ ఆపాలి.

2) సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు టర్మ్ రుణాలను, పంట రుణాలను రీషెడ్యూలు చేయాలి. రబీకి అవసరమైన పంటరుణాలను ఇవ్వాలి. ఆర్థిక కార్యకలాపాలను పెంపొందించి ప్రజలకు ఉపాది ఆదాయాన్ని కల్పించే లక్ష్యంతో వ్యవసాయానికి, వ్యవసాయ అనుబంధ రంగాలకు టర్మ్ లోన్స్ ఇవ్వాలి.

3) వ్యవసాయ విస్తరణధికారులు వ్యవసాయ రుణాల రీషెడ్యూల్ అవకాశాలను రైతులకు వివరించాలి.

4) రీ షెడ్యూల్ సౌకర్యాన్ని పొందడానికి అవసరమైన రికార్డులను, పత్రాలను గ్రామ రెవెన్యూ అధికారులు ఆలస్యం చేయకుండా ఇవ్వాలి.

5) గ్రామీణాభివృద్ధి శాఖ తదితర జిల్లా అధికారులు ఉపాధి కల్పన పథకాలను రూపొందించి అమలు చేయాలి. ఉపాధి హామీ పనులు వచ్చిన తరువాత ఈ ప్రకరణ నిరర్థకం. ఇప్పుడు కరవు ప్రాంతాలలో ఉపాధి హామీ పనులను 100 రోజుల నుండి 150 రోజులకు పెంచుతున్నారు.

6) తాగు నీటి వనరులను పెంచాలి. పశు గ్రాసం సరఫరా చేయాలి.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అంటురోగాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలి.

7) ఖరీఫ్ విఫలమైన చోట స్వల్పకాలిక పంటలకు విత్తనాలను సరఫరా చేయాలి.

8) విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల కొనుగోళ్లకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి. ఈ మధ్య కాలంలో ఇన్‌పుట్ సబ్సిడీలను ఎప్పుడు వెంటనే చెల్లించరు. బకాయిలు పేరుకొని పోయాయి. పాత బకాయిలను ఈ మధ్యకాలంలో చాలా వరకు చెల్లించారు. అయితే ఇంకా ఒక సంవత్సరం బకాయిలు మిగిలిపోయాయి.

ఇన్‌పుట్ సబ్సిడీల చెల్లింపుల్లోను అవకతవకలు, అవినీతి, ఆశ్రితజన పక్షపాత ధోరణి ఉందని చాలా చోట్ల ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి రైతుకు ఉన్న భూమికన్నా తక్కువ రాసి, కావలసిన వారి పేర ఎక్కువ సాగు భూమి చూపిస్తున్నారని చాలా చోట్ల అభియోగాలు ఉన్నాయి. అందుకని గ్రామ పంచాయితీ ఆఫీసులలో ముందుగానే లిస్టులను ప్రదర్శించి, రైతులకు లోపాలను ఎత్తి చూపే అవకాశం కల్పించాలి. రాష్ట్ర స్థాయిలో కమిషనర్ మొత్తం మీద కరవు సహాయ చర్యలు పర్యవేక్షణకు సహాయచర్యల శాఖ, వాతావరణ శాఖ, పశుసంవర్ధక శాక, వ్యవసాయ శాఖ, సాగునీటి శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖతో సమన్వయంతో పనిచేయాలి. కానీ వాస్తవంగా వివిధ ప్రాంతాలలో రెవెన్యూ శాఖ తప్ప మిగతా ఏ శాఖలు కూడా పనిచేసిన దాఖలాలు లేవు.

కరవు పరిస్థితులు అన్ని జిల్లాలలోన ఒకే రకంగా లేవు. వాటి ప్రభావం ఒక్కొక్క జిల్లాల్లో ఒక్కొక్క రూపంలో వ్యక్తమౌతున్నది. జిల్లాల వారీగా పరిస్థితి ఇలా ఉన్నది.

రంగారెడ్డి

రంగారెడ్డి జిల్లాలో కాలువల కింద పారకం లేనే లేదు. ఒకప్పుడు జిల్లాలోని తూర్పు ప్రాంతంలో చెరువులు చాలా ఉండేవి. కానీ క్రమంగా చెరువుల కింద సాగు తగ్గిపోతున్నది. ఎందుకంటే అనంతగిరి గుట్టల నుండి మూసీనది ద్వారా వచ్చే వరద నీరు ఫిరంగి నాలా ద్వారా 38 చెరువులను నింపుతూ చివరికి ఇబ్రహింపట్నం చెరువుకు చేరుకునేది. కానీ హైదరాబాద్ నగర విస్తరణ పెరిగి పోవడంతో ఈ నాలాలు ఆక్రమణకు గురయ్యాయి. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించిన తరువాత మిగిలిన వరద ప్రవాహాల దిశ పూర్తిగా మారిపోయింది. గత 30 సంవత్సరాల కాలంలో ఇబ్రహింపట్నం చెరువు కానీ మిగతా చెరువులు కానీ నిండ లేదు. ఆ ప్రభావంతో రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల మట్టం పడిపోయింది.

సరిగ్గా ఈ పరిస్థితులతో కరవు వచ్చింది. రంగారెడ్డి జిల్లాలో జెఎసి ఆధ్వర్యంలో దిగువ గ్రామాలను సందర్శించినాం.

మండలం పేరు	సందర్శించిన గ్రామాల పేర్లు
యాచారం	మల్కీజుగూడెం, నక్కర్తి మేడిపల్లి
మంచాల	చిత్తాపూర్
కందుకూరు	గుమ్మడివెల్లి

అన్ని గ్రామాలలోను పరిస్థితి కొంచెం అటుఇటుగా ఒకే విధంగా ఉన్నది. వానలు లేవు. చెరువుల్లో ఒక్క చుక్క నీరు లేదు. బోర్లలో నీళ్లు పూర్తిగా అడుగంటి పోయినై. ఖరీఫ్ పంట దాదాపు మొత్తంగా పోయింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని రైతులు చెప్పినారు. ఒకటి రెండు గ్రామాలలో స్థానిక అధికారులతో మాట్లాడి సమాచారాన్ని తెలుసుకున్నప్పుడు వారు కూడా రైతులు చెప్పిన విషయాన్ని ధృవీకరించినారు. రంగారెడ్డి జిల్లాలో ఎక్కడా రబీ పంట వెయ్యలేదు. రైతులు పంటను కాపాడుకోవడానికి అదనంగా బోర్లు ప్రతీ రైతు కనీసంగా రెండైనా అదనంగా బోర్లు వేసినారు. అభినవ అర్జునులు పాతళగంగను వెలికి తీయడానికి వేసిన బోరుబాణాలన్నీ ఫెయిలై పోయినాయి. అప్పులు మాత్రం నెత్తిన బడినాయి. రంగారెడ్డి జిల్లాలో చాలా మంది రైతులకు పాడి పశువులున్నాయి. జిల్లాలో పాల సేకరణకై ప్రత్యేక పాల ఉత్పత్తిదారుల యూనియన్ లేదు. ఎందుకో గాని రంగారెడ్డి జిల్లాను నల్గొండ జిల్లాకు అనుసంధానం చేసినారు. నల్గొండ జిల్లాకు చెందిన మదర్ డైయిరీ నల్గొండ రైతులకు చెల్లించిన ధరకన్నా రంగారెడ్డి జిల్లా రైతులకు తక్కువ ధర చెల్లిస్తున్నదని మాతో మాట్లాడిన పాల రైతులు అన్నారు. కరవులోను అధికమాసం అన్నట్టు ఈసారి పశుగ్రాసం లేక పాల దిగుబడి బాగా తగ్గిపోయింది. రైతులు, గ్రామ పాల సేకరణ కేంద్రం ఏజెంట్లు చెప్పిన లెక్కల ప్రకారం పాల ఉత్పత్తి మునుపటి సేకరణలో సగానికి పడిపోయింది. బీళ్లు లేక పశుగ్రాసం దొరకక ఉన్న పశువులను కూడా అమ్ముకుంటున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఏ గ్రామానికి వెళ్లినా 70 శాతం అమ్ముడు పోయాయని చెప్తున్నారు. వ్యవసాయ కూలీలకు వ్యవసాయం పనులు లేవని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కానీ ఇటువంటి సమయాలలో ఆసరాగా నిలువవలసిన ఉపాధిహామీ పనుల అమలులో దిగువ లోపాలు తలెత్తడం వలన ఆశించిన ప్రయోజనం కలుగడం లేదు.

1) 4–5 వారాల బకాయిలు పేరుకొనిపోయి ఉన్నాయి. అందువలన తక్షణ అవసరాలకై ఇతర పనులను వెతుక్కొంటున్నారు.

2) నేల బాగా గట్టిపడి పోవడంతో కూలీ రేటు పడిపోయింది. వస్తున్న కూలీ చాలక, లేక ఇంతటి కష్టమైన పని చేయలేక మేము పర్యటించిన అన్ని గ్రామాలలోను వలసపోతున్న కార్మికుల సంఖ్య బాగానే ఉన్నది.

ఇంత కష్టకాలంలోను ఇంటి ట్యాక్సు కట్టమని పంచాయితీ అధికారులు వేధిస్తుండగా, తీసుకున్న రుణాలను చెల్లించాలని పొదుపు సంఘాలపైన, రైతులపైన బ్యాంకు అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఉపాధి హామీ పనుల కారణంగా మహిళలు ఇంటి వద్ద ఉండడం లేదని బ్యాంకు అధికారులు ఉపాధి హామీ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ పనులను కూడా ఒకటి రెండు రోజులు ఆపించిన వైనాన్ని కందుకూరు మండలం గమ్మడివెల్లి గ్రామ మహిళలు విన్నవించుకున్నారు.

నీళ్లకు చాలా ఇబ్బంది పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం ప్రాంతంలోని గ్రామాలకు తాగునీటిని కృష్ణానది నుండి సరఫరా చేస్తున్నారు. కృష్ణానదీ జలాలను హైదరాబాదుకు తెచ్చే పైప్‌లైన్ల నుండి కొంత నీటిని ఇబ్రహింపట్నం ప్రాంతానికి ఇస్తారు. అయితే ఈ నీళ్లు గ్రామ అవసరాలను తీర్చలేవు. స్థానికంగా బోర్లను తవ్వి అవసరమైన నీటిని ఇస్తారు. కానీ ఈ సారి బోర్లలో నీళ్లు అడుగంటి పోయినాయి. తాగునీరు చాలినంత దొరకడం లేదు. పశువులకు నీళ్లు కష్టమై పోయింది.

నల్గొండ

నల్గొండ జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు నాగార్జునసాగర్ కాలువల నుండి నీళ్లు వస్తాయి. మరికొన్ని మండలాలు మూసీనది కింద పారకంలో ఉన్నాయి. ఇక మిగిలిన మండలాలల్లో చెరువులు, బావుల కింద సాగవుతున్నది. మేము ప్రధానంగా కాలువల కింద సాగవుతున్న ప్రాంతాలకు వెళ్లినాము. ఈ సారి కృష్ణానదిలో నీళ్లు లేవు. సాగుకు

నీళ్లను విడుదల చేయలేక పోయారు. అందుకని బావులపైన ఆధారపడి వరిపంట వేసినారు. కొన్ని ప్రాంతాలలో భూగర్భ జలాలు లేవు. మొత్తంగా సాగర్ కాలువ పారే ప్రాంతాలలో భూమిపై పొర కింద రాయి ఉన్నది. అందుకని ఎక్కువ లోతు బోర్లు వేసే అవకాశం లేనందున బావులు తవ్వుతుంటారు. ఈ సారి రైతులు కోట్ల రూపాయలు ఖర్చు చేసి బావులు తవ్వినారు. బావులను తవ్వడానికి ఇప్పుడు కొత్తరకం పొక్లెయినులు వచ్చినాయి. ఇవి ఒక్క రోజులోనే బావిని తవ్వుతాయి. ఇలాంటి పొక్లెయినుల సాయంతో కోట్ల రూపాయలు వెచ్చించి వందలాది బావులను తవ్వినారు. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో ఎక్కడచూసినా కరెంటు తీగలు, బావులు కనబడుతుంటాయి.

భూగర్భ జలాలు ఉన్న ప్రాంతాలలో ఖరీఫ్‌లో వరి పంట వేసినారు. హాలియా లాంటి కొన్ని ప్రాంతాలలో భూగర్భ జాలాలు లేక పొలాలను పడావు ఉంచినారు. చాలా గ్రామాల్లో భూగర్భ జలాలు లేవు. చివరకు కాలువల ద్వారా మంచినీటి అవసరాలకు వదిలిన నీళ్లను పొలాలకు మళ్లించుకొని ఖరీఫ్ పంటను దక్కించుకోగలిగారు. దాదాపు 80 శాతం పంట వచ్చింది.

మూసీ కింద పారకం ఉన్న ఎండ్లపల్లి గ్రామ పరిస్థితి వేరు. ఈసారి మూసీ ప్రాజెక్టు రిపేరులో ఉండడం వలన నీళ్లు రాలేదు. ఉన్న నీటిని సూర్యపేట తాగునీటి అవసరాలకు నిల్వఉంచారు. అందువలన పూర్తిగా బావుల కింద సేద్యమైంది. మొత్తం భూమి సాగుకాలేదు. సాగైన భూమిలోను దాదాపు 40 శాతం పంట వచ్చింది.

అయితే రబీల బావులను మరింత లోతు తీసినా ఆశించిన స్థాయిలో నీళ్లు రాలేదు. దాదాపు 50 శాతం భూమి సాగైనా నామమాత్రమైన దిగుబడి వచ్చింది. కానీ బావుల మీద భారీ మొత్తంలో ఖర్చు పెట్టినారు. మునగాల మండలంలోని నారాయణగూడెంలో బావులకై 3 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే పక్కనే ఉన్న గణపవరం గ్రామస్తులు బావులపై 2 కోట్ల రూపాయలు ఖర్చు చేసినారు. అయినా చాలినన్ని నీళ్లు రాలేదు. సాగర్ నుండి నీళ్లు విడుదలవుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ఇంకొక విషయమేమిటంటే సాగర్ కాలువలకు సిమెంట్ లైనింగ్ చేసినప్పటి నుండి కాలువల నుండి నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాల్లోకి చేరడం లేదని రైతులు అంటున్నారు. అందుకని మునుపటి వలె భూగర్భ జలాల రిచార్జింగ్ కావడంలేదు. ఫలితంగా భూగర్భ జలాల మట్టం వేగంగా పడిపోతున్నది. అనుభవం ద్వారా రైతులు గ్రహించిన ఈ విషయాన్ని శాస్త్రజ్ఞులు పరిశీలించవలసిన అవసరమున్నది. కాలువలను చెరువులతో అనుసంధానం చేస్తే భూగర్భ జలాలను కాపాడుకోవచ్చునని రైతులందరు చెప్తున్నారు. ఈ సంవత్సరం నల్గొండ జిల్లాలోను తీవ్రమైన నీటి ఎద్దడి ఉన్నది. సాగర్ నీళ్లు వదిలితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదు.

నీటి ఎద్దడి కారణంగానే పశువులను అమ్ముకుంటున్నారు. దాదాపు 70 శాతం పశువులు ఈ పాటికే సంతకు చేరుకున్నాయి. పశుసంపద ఇంకా తగ్గిపోయే ప్రమాదమున్నది.

చాలా గ్రామాల్లో కల్లుగీత కార్మికులు తాటి చెట్ల నుండి కల్లు తగ్గిపోతున్నదని చెప్పినారు. ఎండ్లపల్లిలో కలిసిన కల్లుగీత కార్మికులు కల్లు సగానికి తగ్గిందని చెప్పినారు.

గ్రామాలలో కరవు కారణంగా పిల్లల ఫీజులు కట్టడానికి చాలా ఇబ్బంది పడ్తున్నారు. ఒక్కొక్క గ్రామంలో 40-50 లక్షల రూపాయలు ఫీజు రూపంలో కడ్తున్నారు. గణపవరం నుండి మునగాలలోని ప్రైవేటు స్కూళ్లకు దాదాపు 200 మంది వెల్తుంటారు.

కరీంనగర్

కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల డివిజన్‌లో మార్చినెల 19, 20 తేదీలలో దాదాపు 260 కి.మీ. పర్యటించాము. రైతులతో పాటు వివిధ వర్గాల ప్రజలతో మాట్లాడినాము. ఈ డివిజన్‌లో కొంత ప్రాంతం శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు ఆయకట్టు, మరికొంత ప్రాంతం గోదావరి నదిపై కట్టిన గంగనాల ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఉంది. శ్రీరామ్‌సాగర్ ప్రాజక్టు కాలువల కింద ఉన్న గ్రామాలలోను టెయిలెండ్ గ్రామాలకు ఎప్పుడు నీళ్లురావు. ఇవికాక ఈ ప్రాంతంలో రోళ్లవాగు ప్రాజెక్టు ఉంది. దీనికింద ధర్మపురి, సారంగాపూర్ మండలాల్లోని సుమారు 20 గ్రామాలకు మంచినీరు సరఫరా అవుతుంది. అధికారిక లెక్కల ప్రకారం 6000 ఎకరాలకు సాగునీటి సౌకర్యం అందుతున్నది. అయితే ఈసారి రోళ్లవాగు ప్రాజెక్టులోనూ నీళ్లు లేవు. ఈ ప్రాజెక్టులు కాక ప్రతి గ్రామంలో ఏదో ఒక చెరువు ఉన్నది. దాదాపుగా అన్ని ఎండిపోయినై. కొన్ని చెరువుల్లో కొద్దిపాటి నీళ్లున్నాయి. వాటిని కూడా పశువుల కోసం నిలువ ఉంచినారు. అవి కూడా ఎక్కువ రోజులు నిలువవు. అందుకని జగిత్యాల ప్రాంతంలో బావులు, బోర్లు ప్రధాన సాగునీటి ఆధారంగా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల్లో కూడా నీళ్లు లేకుండా పోయాయి. ఈసారి డివిజన్‌లోని మండలాల్లో వర్షపాతం సగటు వర్షపాతం కన్నా 20 నుండి 50 శాతం తక్కువగా కురిసింది.

వానలు లేక కాలువలు పారక, భూగర్భ జలాలు అడుగంటి జగిత్యాల డివిజన్లో వ్యవసాయం పూర్తిగా చితికిపోయింది. ఖరీఫ్‌లో డివిజన్‌లోని అన్ని మండలాల్లో వరిసాగు సగటు కన్నా సగానికి పడిపోయింది. దాదాపుగా వరి మొత్తం ఎండిపోయింది. ఇక మిగతా పంటల కిందనున్న సాగుభూమి పెద్దగా తగ్గలేదు. పసుపు, సోయాబీన్, మిరప, మక్క వంటి పంటలతో పాటు ఉద్యానవన శాఖ ప్రోద్బలంతో అరటి కూడా సాగుచేసినారు. ఒక్క మొక్కజొన్న పంట మాత్రమే కొంత చేతికొచ్చింది. మిగతావన్నీ ఎండిపోయినాయి. పంటను కాపాడుకోవటానికి రైతులు విపరీతంగా బోర్లు వేసినారు. ఇబ్రహీంపట్నం అమ్మక్కపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు 2008 నుండి ఇప్పటి వరకు 75 బోర్లు వేస్తే, మరొకరైతు రెండు నెలల్లోనే 35 బోర్లు వేసినాడు. 35 బోర్లలో ఒక్కటే బోరు నుండి కొద్దిపాటి నీళ్లు పారుతున్నాయి. దీనిని బట్టి రైతులు బోర్లు ఏ స్థాయిలో వేసింర్రో అర్థం చేసుకోవచ్చు. దాదాపు ప్రతి రైతు ఉన్నబోరు కాకుండా అదనంగా ఒక్కటైనా బోర్‌వేసి ఉంటాడు. లేదా బావినైనా తవ్వి ఉంటాడు.

రైతులు పంట కోసం ఎకరాకు 25,000 నుండి 1,50,000 రూపాయల వరకు పంటను బట్టి పెట్టుబడి పెట్టినారు. మక్కకు తక్కువ ఖర్చు, పసుపు, మిర్చి పంటలకు అత్యధిక పెట్టుబడి అవుతుంది. దాదాపు సాగు చేసి పంటరాక పోవడంతో రైతులు పెట్టుబడి నష్టపోయారు. భారీగా అప్పులు పెరిగిపోయాయి. వర్షాలు లేకపోవడం వలన వ్యవసాయేతర వృత్తులు సంక్షోభంలో పడినాయి. గొర్రెలు, మేకల పెంపకానికి మేతలు లేవు. తాగడానికి నీరు కూడా లేదు. అమ్మక్కపేట గ్రామంలో మామిడి ముత్తయ్య అనే రైతు బతుకుదెరువు కోసం గల్ఫ్ పోయిండు. అక్కడా అతనికి పని దొరుకలేదు. వెనుకకు వచ్చి వ్యవసాయం చేస్తే అందులోనూ నష్టం వచ్చింది. చివరకు కులవృత్తిని నమ్ముకొని మేకలు, గొర్రెలు కొన్నాడు. ఈ సారి మేతకు కరవున్నది. ఎండుచొప్ప తెచ్చివేసిండు. మేకలు, గొర్రెలు చొప్పను తినవు. కానీ గత్యంతరం లేక ఆకు నములుతున్నాయి. బెండును చప్పరిస్తుంటాయి. కానీ మేత ఎన్ని రోజులు చాలుతుందో తెలియదు. మళ్లీ మేతకొనాలన్నా అప్పుచేయక తప్పదు.

ఇప్పటికే ఫీజుకట్టలేక కొడుకు ఇంటర్మీడియట్ చదువును మధ్యలో ఆపివేసిండు. వాస్తవానికి ఫీజు ప్రభుత్వమే కడుతుంది. కానీ సమయానికి ఫీజు రియంబర్సుమెంటు కావడం లేదు. కనుక విద్యార్థులను ముందు ఫీజు కట్టమని యాజమాన్యం ఫీజుకట్టమని ఒత్తిడి తెచ్చింది. గత్యంతరం లేక ముత్తయ్య కొడుకు వెంకటేశ్ చదువు ఆపేసినాడు. శ్రీకాంత్ అనే మరో యువకుడు పదవ తరగతి పూర్తయిన తరువాత ఫీజు కట్టలేక ఇంటర్మీడియట్‌లో చేరలేదు.

చాకలి వాళ్లకు బట్టలు ఉతకడానికి నీళ్లలేవు. అందుకని పనులు బందైపోయినాయి. ఎవరైనా అవసరముంటే ఇంటి వద్ద బట్టలు ఉతికించుకుంటారు. చాకలివారు ఇతర పనులు చేసుకొని బతుకవలసి వస్తున్నది.

నీళ్లలేక కల్లు పారుతలేదని కల్లుగీత కార్మికులు అన్నారు. ప్రత్యేకంగా నీళ్లు పోసి కొన్ని చెట్లనుండి కొంతైనా కల్లుపొందడానికి కల్లుగీత కార్మికులు కృషిచేస్తున్నారు. ఎన్ని నీళ్లు పోసినా కల్లు పారకం తగ్గిపోతున్నది. ఎండవేడి పెరిగి, నీళ్లు తగ్గుతున్నప్పుడు కల్లు చిక్కగా అయిపోతది. అట్లా చిక్కపడిన కల్లు ఆరోగ్యానికి మంచిది కాదు. చెట్లు నీళ్లలేక ఎండిపోతున్నాయి.

అందరికీ ఉపాధి హామీ పనులు ఏకైక బతుకుదెరువు ఆధారంగా నిలిచాయి. ఇదివరకెన్నడూ పనులకు వెళ్లనివారు సైతం మొదటిసారి ఉపాధి కార్డులు తీసుకున్నారు. కానీ చాలా గ్రామాలలో పనులు నిలిచిపోయాయి. కొత్తపనులను గుర్తించి అమలులోకి తేలేదు. 4-5 వారాల కూళ్లు కూడా చెల్లించవలసి ఉన్నది. సమయానికి కూలీ రాకపోవడంతో చాలా మంది ఉపాధి హామీ పనులను వదిలి ఇతర పనులకు వెళ్తున్నారు.

జగిత్యాల డివిజన్లో బీడీ కార్మికుల సంఖ్య చాలా ఎక్కువ. ముఖ్యంగా సారంగాపూర్ మండలంలో బీడీ కార్మికులు ఎక్కువగా ఉన్నారు. బీడీ పరిశ్రమ కూడా సంక్షోభంలో ఉన్నది. నెలకు 15 రోజులు కూడా బీడీ పని దొరకడం లేదు. మరోవైపు నీటి ఎద్దడి కారణంగా చాలా మంది మహిళలకు నీళ్లు మోయడానికే సమయం చాలడం లేదు. అందుకని వారెవ్వరూ బీడీలు చేయలేకపోతున్నారు. సారంగాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపెల్లి గ్రామంలో 30 బోర్లకు గాను 20 బోర్లు నడుస్తున్నాయి. ఏ బోరు కూడా చాలినన్ని నీళ్లు ఇవ్వడం లేదు. గంటసేపు కూర్చుంటే ఒక బిందెడు నీళ్లు దొరుకుతున్నాయి. నీళ్లకు బాగా కష్టమైతున్నది. నీళ్లు మోసుకోవడానికే సమయమంతా పోతున్నదని మహిళలు అన్నారు. 300 కటుంబాలున్న ఎస్.సి. కాలనీకి ఒక్కటే బోరు ఆధారం. ఎస్.టి. కాలనీ పరిస్థితి అదే విధంగా ఉన్నది.

మేములకుర్తిలో రోజుకు 20 నిముషాలు నీళ్లు వస్తాయి. అవి చాలవు. ఆ తరువాత ఎక్కడ దొరికితే అక్కడికి పోయి నీళ్లు తెచ్చుకుంటరు. నీటి ఎద్దడి చాలా తీవ్రంగా ఉన్నది. మగవాళ్లు సైకిల్ మోటర్ల మీద, ఎడ్ల బండ్లమీద వెళ్లి నీళ్లు మోసుకొస్తున్నారు. ఆసరా లేని మహిళలు చాలా అవస్తలు పడుతున్నారు. నీళ్లు మోయడానికే సమయం చాలడం లేదు. ఇంకొక పని చేసుకోలేక పోతున్నారు. కోరుట్లలో ప్రత్యేక పరిస్థితి నెలకొనిఉన్నది. అక్కడ ట్యాంకర్లతో నీళ్లు సప్లయి చేస్తున్నారు. నీళ్లు నిల్వ ఉంచుకోవడానికి ప్రత్యేకంగా డ్రమ్ములు కొనుక్కోవలసి వస్తున్నది. ఆ ఊరి ప్రజలు ప్లాస్టిక్ డ్రమ్ముల కొనుగోలుకు సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసినారు.

మామిడితోటలు జగిత్యాల డివిజన్లో చాలా ఎక్కువ. కానీ ఈసారి నెలకొన్న వేడి కారణంగా మామిడి పూత రాలేదు. ఎక్కడైనా పూసినా పిందెలు నిలవలేదు. కొమ్మలు, చెట్లు విరిగిపోతేనే పంటనష్టపరిహారం దొరుకుతది. అట్లాంటి నష్టం ఈసారి జరగలేదు. కానీ ఈసారి పూత రాలేదు. నష్టానికి పరిహారం ఉండదు. నీటి ఎద్దడి కారణంగా పనులు లేక పంటలు పండక చాలా మంది బొంబాయికి, దుబాయికి వలసపోతున్నారు. గత రెండు నెలల్లో ఒక్క లక్ష్మీదేవిపల్లె నుండి 50-60 మంది యువకులు బయటకు వెళ్లినారు.

కరవు కారణంగా ఇంత నష్టం జరిగినా, వర్షాభావ పరిస్థితులున్నా జగిత్యాల డివిజన్‌లోని ఏ మండలాన్ని కూడా కరవు మండలంగా ప్రకటించలేదు. రైతు సంఘాలు సమచార హక్కు కింద వర్షపాతం లెక్కలు తీసుకున్నారు. దాని ఆధారంగా జగిత్యాల డివిజన్‌లోని మండలాలను కరవు మండలాలుగా ప్రకటించాలని కోరినా స్పందన రాలేదు.

ఆదిలాబాద్

ఏప్రిల్ 5,6 తేదీలలో కరవు అధ్యయన బృందం ఆదిలాబాద్ జిల్లా పడమటి ప్రాంతాలను పర్యటించింది. ముథోల్, భైంసా, కుంటాల, దిలావర్‌పూర్, నేరడిగొండ, బోథ్, బజార్‌హత్నూర్ మండలాల్లో వివిధ గ్రామాలకు వెళ్లి వివిధ వర్గాల ప్రజలను కలిసి కరవుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించింది.

ఆదిలాబాద్ జిల్లా పడమటి ప్రాంతాల నేల స్వభావం వేరు. కొంచెం వాన తగ్గితే భూమి నెర్రెలువారుతది. వాన కొంచెం ఎక్కువైనా నీళ్లు నిలిచి పంటలు పాడైపోతాయి. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కరవు పరిస్థితులను పరిశీలించాలని చాలా గ్రామాల్లో రైతులు మాతో అన్నారు.

ఆదిలాబాద్ కరవు లేదంటున్న అధికారుల వాదనను చాలా గ్రామాలలో ప్రస్తావించినాము. దానికి గ్రామ ప్రజల నుండి చాలా స్పష్టమైన సమాధానం వచ్చింది. వాగులు, ఒర్రెలు పారలేదు. చెరువులు నిండలేదు. బావులల్లో నీళ్లు అడుగంటినై అని కరవుకు సాక్ష్యాలు చూపించినారు. ఎన్నడూ ఎండని కుంటాల మండలంలోని అందకూరు చెరువు ఈసారి ఎండిపోయింది. దాన్ని బట్టి చూస్తే కరవు ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు అని కూడా అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోను వర్షాలు సరిగ్గా కురువలేదు. ఈ సారి వర్షపాతం అంతటా ఒకే విధంగా లేదు. ఒక చోట వానపడుతుంటే పక్కన ఒక కిలోమీటరు దూరంలో వాన అసలే ఉండటం లేదు. ఒకే ఊళ్లో ఒక పక్క వానుంటే మరోపక్క ఒక్క చుక్క కూడా కురియదు.

మొత్తం మీద పరిస్థితి ఏమిటంటే జూన్‌లో వానలు పడినాయి. వర్షపాతం కొన్ని చోట్ల ఎక్కువ మరికొన్ని చోట్ల తక్కువగానే ఉన్నది. కొన్ని వానలు కురిసిన తరువాత వరుసగా సుమారు 20 రోజులు దాకా పొడిదినాలు రావడంతో పంట సరిగ్గా ఎదగలేదు. చివరకు మళ్లీ వానలు కురిసాయి. జూలై మాసంలో కొద్దిపాటి వానలు, ఆగస్టు మొదటి పక్షంలో జల్లులు పడినాయి. దీంతో ఎరువులు చల్లినారు. చెట్టు ఎదుగుతున్న సమయంలో వానలు వెనుదిరిగిపోయాయి.

ఆగస్టు మూడవ వారం ప్రత్యేకంగా చెప్పాలంటే రాఖీపౌర్ణమి నుండి ఒక్క చుక్క పడలేదు. ఈ పరిస్థితి కారణంతో మిర్చి, పసుపు, మక్క వంటి పంటలు పూర్తిగా ఎండిపోయినై. కాని పత్తి, సోయ కొంత దిగుబడి వచ్చింది అది కూడా మామూలుగా వచ్చే దిగుబడిలో నాలుగోవంతు మాత్రమే. కొంత వర్షపాతం ఎక్కువగా ఉన్నచోట పత్తిపంట వేసిన వారికి పెట్టుబడి దక్కింది. పంటను కాపాడుకోవటానికి విపరీతంగా బోర్లు వేసినారు. భూగర్భ జలాల మట్టం బాగా పడిపోయింది.

అందువలన సాధారణ స్థాయికన్నా రెండు, మూడు రేట్లు లోతుకు పోయినా ఆశించిన నీళ్లు ఎవ్వరికీ రాలేదు. బోథ్‌లో నీటిమట్టం ఇంకా లోతుకు పోయింది. నేరడిగొండ లోని కొన్ని ప్రాంతాలలో అసలు భూగర్భ జలాలు లేవు. ఒక 20 శాతం బోర్లలో మాత్రమే కొంత నీళ్లు పడినాయి. నీళ్లు బాగా పడ్డాయని చెప్పిన రైతును ఒక్కరినే చూసినం. మేము పరిశీలించిన గ్రామాల్లో ఈ ఒక్క సంవత్సరంలోనే 100 నుండి 300 దాకా బోర్లు వేసినారు.

చాలా బోర్లు ఎండిపోయినై. అందుకే రబీలో సాగు బాగా తగ్గిపోయింది. బోర్లలో నీళ్లుంటాయని ఆశపడి వేసిన పంటలు మొత్తంగా ఎండిపోయినై. వేసిన పంటల్లో 20 శాతం మించి దిగుబడి రాలేదని చాలా మంది రైతులు అన్నారు.

మంచినీళ్లకు చాలా ఇబ్బంది ఉన్నది. ఈ సందర్భంగా బాసర పక్కనే ఉన్న బిద్రెల్లి గురించి ఒక మాట చెప్పాలి. ఇక్కడ భూగర్భ జలాలు ఉప్పుగా ఉంటాయి. తాగడానికి అస్సలు పనికి రావు. సాగుకు ఇవి ఉపయోగపడవు. వాడితే భూమిపై తెల్లటి పొర ఏర్పడుతుంది. తిండిగింజల్లో రుచికూడా మారిపోతది. 4-5 సంవత్సరాలకొకసారి పత్తిపంటకు మాత్రం వాడుతుంటరు. అందుకని ఈ గ్రామంలో పూర్తిగా వర్షాధారంగా పంటలు పండిస్తరు. గోదావరి తలాపునే ఉన్నా మా గ్రామానికి నీళ్లు రావడం లేదని గ్రామస్తులన్నారు. రెండు సంవత్సరాలుగా గ్రామ తాగు అవసరానికి కావలసిన నీళ్లను ట్యాంకు ద్వారా సప్లయి చేస్తున్నారు. గ్రామం వాగుపై కట్టకట్టి దాని నుండి చెరువుకు నీళ్లను మళ్లించినా, గోదావరి నుండి నీళ్లు తెచ్చి గ్రామ చెరువు నింపినా ఈ సమస్య పరిష్కారమవుతుంది. కానీ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు ఎవ్వరు బిద్రెల్లి సమస్య పరిష్కారానికి పూనుకోలేదని గ్రామస్తులు వాపోయారు. తిమ్మాపూర్ గ్రామంలో గతంలో 4 బోర్లతో ఊరందరికి నీళ్లందించ గలిగారు. కానీ ఇప్పుడు 21 బోర్లు నడుస్తున్నా గ్రామ తాగునీటి అవసరాలకు చాలడం లేదు.

దిలావర్‌పూర్ మండలం గ్రామం గుండంపల్లిలో నీళ్లకొరకు లైన్లలో నిలబడుతున్నారు. బోథ్ మండలం సోనాల గ్రామం కింద ఉన్న వజ్జెర మరో నాలుగు ఇతర ఆదివాసీ గూడెంలలోను బోర్లు పడవు. చెరువులు లేవు. ఈసారి తాగడానికి కూడా నీళ్లు లేవు. 4-5 రోజులకొకసారి ట్యాంకర్లతో నీళ్లు సప్లయి చేస్తరు. ఆ ఊరికి చెందిన కోవజైతు పటేల్ 'కొండెంగల లెక్క బతుకుతున్నామని' తమ పరిస్థితి గురించి అన్నాడు. నేరేడిగొండ మండలం తేజాపూర్ గ్రామంలో బోర్లు పడవు. 2 కి. మీ. దూరం నుండి నీరు తెచ్చుకుంటరు. మేము తిరిగిన చాలా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ఆగిపోయినై. దాదాపు నెలరోజుల బకాయిలు చెల్లించలేదు.

జిల్లాలో ఎక్కడికి వెళ్లినా అడవి పందులు, నెమళ్ల దాడి కారణంగా తిండి గింజలు పండించలేక పోతున్నామని అన్నారు. అందుకని సోయా, పత్తి వంటి పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలకు రైతులు సిద్ధంగా ఉన్నారు. పశువులు, పక్షుల దాడి కారణంగా పంటల మార్పిడి సాధ్యం కావడం లేదు. చాకలి వారు నీళ్లు లేక వృత్తిని వదులుకొని ఏ పని లేకుండా ఉన్నారు. తొట్టెలు నిర్మించి వాటిని నీటితో నింపితే వృత్తిని కొనసాగించవచ్చునని అన్నారు.

తీవ్రమైన కరవు జిల్లాలో ఉన్నా ఏ ఒక్క మండలాన్ని కూడా ప్రభుత్వం కరవు మండలంగా గుర్తించలేదు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లాను కరవు జిల్లాగా ప్రకటించాలని తీర్మాణం చేసింది. పలు మండలాలకు చెందిన సర్వసభ్య సమావేశాలు కూడా తమ మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని తీర్మాణం చేసినాయి. అయినా అధికారుల నుండి స్పందన రాలేదు.

కరవు సమస్యకు శాశ్వత పరిష్కారాలను గ్రామస్తులు సూచించారు. ఉన్న చెరువులను గోదావరి నదితోని, జిల్లాలోని వాగులతోని అనుసంధానం చేయాలన్నారు. అవసరమైన చోట కొత్త చెరువులు నిర్మించాలన్నారు. జిల్లాలోని పడమటి ప్రాంతంలో ఉన్న మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులు సాంకేతిక కారణాల వలన నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని పునరుద్దరించాలని చాలా మంది సూచనలు చేసినారు.

ముగింపు

రైతులు చెప్పిన దాని ప్రకారం వర్షపాతం కొలమానం శాస్త్రీయంగా లేదు. వర్షపాతాన్ని కొలిచే గేజ్‌లు మండల కేంద్రంలో మాత్రమే ఉంటాయి. వాతావరణ మార్పు వలన వానలు నిలకడగాను, అన్ని చోట్ల సమానంగాను ఉండడం లేదు. ఒక్కొక్కసారి మండల కేంద్రంలో బాగానే వానలు పడుతున్నాయి. కానీ మిగతా గ్రామాలలో వానలు ఉండటం లేదు. ఇటువంటి పరిస్థితి ఈసారి నల్గొండ జిల్లా గుండాల మండలంలో తలెత్తింది. గుండాల గ్రామంలో వానలు బాగా పడడంతో మంచి వర్షపాతం నమోదైంది. కానీ మండలంలోని ఇతర గ్రామాలలో అస్సలు వానలు లేవు. ఈ విషయాన్ని ప్రస్తుత కరవు మాన్యువల్ గుర్తించడం లేదు.

- కరవును అంచనా వేయడానికి రైతులు ఉపయోగిస్తున్న కొలమానాలు వేరు, నదులు, వాగుల్లో ప్రవాహం లేకపోవడం, చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటి పోవడం రైతుల దృష్టిలో కరవుకు గుర్తులు. తెలంగాణలో బావులు, బోర్లు ప్రధానమైన సాగునీటి సౌకర్యంగా ఉన్నాయి. మొత్తం సాగునీటి సౌకర్యం కల భూమిలో 80 శాతం భూగర్భ జలాలల తోనే సాగవుతున్నది. భూగర్భ జలాలు పడిపోతే చాలా గ్రామాల్లో వ్యవసాయం నిలిచిపోతది. కరవును గుర్తించేటప్పుడు పైన చెప్పిన అన్ని విషయాలను పరగణలోనికి తీసుకోవాలని రైతులు అంటున్నారు.
- కరవు కారణంగా రైతులు పెట్టుబడిని నష్టపోయారు. పంటపైన పెట్టుబడి ఈ మధ్య కాలంలో బాగా పెరిగిపోయింది. అయితే వ్యయం అన్ని పంటలకు ఒకే రకంగా లేదు. మక్క, సోయా వంటి పంటలకు తక్కువగా ఉన్నది. కానీ పసుపు, మిర్చి వంటి పంటలకు చాలా ఎక్కువగా ఉన్నది. పంటలు దెబ్బతినడంతో రైతులు వేల కోట్ల రూపాయలు మునిగిపోయారు.
- పంటను బతికించడానికి రైతులు బోర్లు వేయడానికి, బావులు తవ్వడానికి విపరీతంగా ఖర్చు చేసినారు. బావులు తవ్వడానికి కొత్తగా వచ్చిన ప్రొక్లైయిన్లు బాగా ఉపయోగపడుతున్నాయి. గతంలో అత్యవసర పరిస్థితులల్లో బోర్లు మాత్రమే వేసేవారు. ఈసారి బోర్లతో పాటు ఉన్న బావులను లోతు చేయడానికి కొత్త బావులను తవ్వడానికి కూడా అవకాశం ఉన్నది. అందువలన గతంకంటే ఈసారి బోర్లు, బావులపై ఎక్కువ ఖర్చు చేసినారు. పంటను బతికించడానికి రైతు చేసే కృషిని బావులు, బోర్ల తవ్వకం ఒక సాక్ష్యం మాత్రమే. నీళ్లు దొరుకుతాయన్న ఆశతో రైతు కోట్ల రూపాయలు ఖర్చు చేసిండు.

- నీళ్లు లేక మేతలు దొరకక రైతులు పశువులను అమ్ముకున్నారు. గత్యంతరం లేక, విధిలేని పరిస్థితులలో అమ్మకంతో దళారులు ధరలను బాగా తగ్గించినారు. నామమాత్రమైన ధరలకే పశువులు అమ్ముడుపోతున్నాయి. రేపు వ్యవసాయానికి ముఖ్యంగా సేంద్రీయ వ్యవసాయానికి ఆధారం లేకుండా పోతున్నది. అదనంగా పాలు అమ్మడం ద్వారా కొంత ఆదాయాన్ని సమకూర్చుకుంటున్న రైతులు భవిష్యత్తులో పాడి ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోతారు.
- చాలా మంది రైతులు అందినకాడికి అప్పులు చేసినారు. పంటలు పోవడంతో ఆ అప్పును తీర్చలేని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం మొత్తం తాను రద్దు చేస్తానన్న అప్పు మొత్తాన్ని బ్యాంకులకు కట్టలేదు. బ్యాంకుల నుండి రావలసిన దానికన్నా తక్కువ మొత్తంలో లోన్ పొందినారు. ఎక్కువగా బయటనుండి 2 నుండి 3 రూపాయల వడ్డీకి అప్పు తెచ్చుకున్నారు. అప్పు తీరక ఆత్మహత్యలు చేసుకున్న రైతులున్నారు. మొత్తంమీద వచ్చే ఖరీఫ్ కాలానికి అప్పు పొందడం కష్టమే. అందుకే వచ్చే ఖరీఫ్‌లో సాగుకు అవసరమైన విత్తనాలను, ఎరువులను ప్రభుత్వం సమకూర్చాలి.
- రైతులు కాక నీళ్ల మీద ఆధారపడి బతికే ఇతర వృత్తులు కూడా ఉన్నాయి. నీళ్లు లేకుంటే చాకలి వృత్తి సాగదు. చేపల పెంపకం దెబ్బతింటది. కల్లుగీత కార్మికుల ఆదాయం తగ్గిపోతది. ఎందుకంటే నీళ్లు లేకపోతే కల్లు పారకం తగ్గిపోతది. నీళ్లులేకపోతే పశుపోషణ ఎంతకష్టమో పైన తెలుసుకున్నాం.
- పరోక్షంగా గ్రామంలోను, చుట్టు పక్కల పట్టణాలలోను వృత్తులు, వ్యాపారాలు దెబ్బతింటాయి. ఆసుపత్రులకు వేళ్లేవారు కూడా తగ్గిపోతారంటే ఎంతగా బిజినెస్ నిలిచిపోతుందో ఊహించవచ్చు.
- రైతులు, గ్రామస్తులు శాశ్వత పరిష్కారాలను కోరుకుంటున్నారు. చెరువులను నదులు, వాగులతో అనుసంధానం చేయాలని సూచిస్తున్నారు. అవసరమైన చోట కొత్త చెరువులను నిర్మించాలంటున్నారు.
- పండిన పంటకు లాభసాటి ధర ఇవ్వాలని, రైతుల ఆదాయాలను పెంచడానికి తోడ్పడాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.
- మంచి నీళ్లకు చాలా ఇబ్బంది ఉన్నది. ప్రత్యేకంగా దళిత వాడలల్లో, ఆదివాసీ గూడాలల్లో సమస్య ఇంకా తీవ్రంగా ఉన్నది. ఈ రెండు వాడలల్లో నీటి సౌకర్యాన్ని పెంచాలి.
- ఆడవాళ్లు మరీ ముఖ్యంగా మగదిక్కులేని ఆడవాళ్లు నీళ్లను మోసుకోవడానికి సమయం చాలడం లేదు. వాళ్లు అన్ని పనులను వదులుకొని నీళ్లను మోసే పని ఒక్కటే చేయవలసి వస్తున్నది. తాగునీటి సప్లయి చేసే బాధ్యతను స్థానిక సంస్థలు నెత్తిన వేసుకుంటే స్త్రీలకు పనిభారం తగ్గుతది.
- అనువుగాని పంటలను వేసి రైతులు కరవుతో ఎక్కువ నష్టపోతున్నారనే విమర్శలకు రైతులు జవాబు చెప్పినారు. పంటల మార్పిడికి రైతులు సంసిద్ధంగా ఉన్నారు. అంతేకాక సేంద్రీయ వ్యవసాయానికి సముఖంగా ఉన్నామని చాలా చోట్ల రైతులు అన్నారు. కాకపోతే కోతులు, పక్షులు, నెమళ్ల తాకిడిని అరికట్టాలి. ప్రత్యామ్నాయ పంటలకు, సేంద్రీయ పంటలకు మంచి ధరను ముందే ప్రకటించాలి. ఈసారి ప్రత్యామ్నాయ పంటలను వేసి చేతులు కాల్చుకున్న వారు చాలా మంది ఉన్నారు.

సూచనలు :

1. తెలంగాణ రాష్ట్రంలో వాస్తవ పరిస్థితుల ఆధారంగా అర్హత కలిగిన అన్ని మండలాలను కరవుపీడిత ప్రాంతాలుగా ప్రకటించి, 'డ్రాట్ మాన్యువల్' ప్రకారం తక్షణమే కరవు నివారణ చర్యలు తీసుకోవాలి.
2. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల ప్రభావం కారణంగా ఒక గ్రామంలోని వేర్వేరు ప్రాంతాలలో వర్షపాతం ఒకే విధంగా ఉండడం లేదు. అందువల్ల మండలాన్ని ఒక యూనిట్‌గా వర్షపాతాన్ని నమోదు చేయడంవల్ల కరవు పరిస్థితులను, దుర్భిక్షాన్ని అంచనా వేయడంలో వాస్తవ పరిస్థితిలు ప్రతిబింబించడంలేదు. అందువల్ల గ్రామాన్ని యూనిట్‌గా వార్షిక వర్షపాతాన్ని నమోదు చేయాలనే రైతుల సూచనలను పరిగణలోకి తీసుకుని ప్రతి గ్రామం లోనూ వర్షపాత నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వర్షపాతాన్ని నమోదు చేయడంలో భూగర్భజలాల లభ్యతను కూడా ప్రమాణంగా స్వీకరించాలి.
3. వర్షాభావం, దుర్భిక్షపరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులందరికీ ఎకరానికి కనీసం 10వేల రూపాయల తక్షణ సహాయంగా నేరుగా రైతులకే నగదు రూపంలో అందించాలి.
4. కరవు పీడిత గ్రామాలలో ప్రజలందరికీ తాగునీటి సరఫరాకు తక్షణం తగిన చర్యలు తీసుకోవాలి. పశువులకు తాగునీరు, మేతను అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.
5. కరవుపీడిత ప్రాంతాల్లోని అన్ని గ్రామాల్లో పాఠశాల విద్యార్థు లందరికీ మధ్యాహ్నభోజన పథకం సెలవుదినాలతో నిమిత్తం లేకుండా కొనసాగించాలి. గ్రామంలోని నిరుపేద వృద్ధులకు కూడా మధ్యాహ్నభోజన పథకాన్ని వర్తింపజేయాలి.
6. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న వృత్తులపై ఆధారపడిన రజకులకు, కల్లుగీతకార్మికులు, పశువులకాపర్లు, గొర్లుమేకల పెంపకందారులు, మత్స్యకారులు తదితరులను కరవుకాలంలో ఆదుకునేందుకు ప్రత్యేక సహాయక చర్యలు తీసుకోవాలి.
7. గ్రామీణ ఉపాధి పథకాన్ని గ్రామీణ వ్యవసాయ అభివృద్ధితో అనుసంధానం చేసి మరింత పకడ్బందీగా అమలుచేయాలి.
8. ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీని ఒకేసారి చెల్లించి వెంటనే పంటరుణాలను ఇప్పించాలి.
9. పంటల బీమా పేరుమీద ఇన్సూరెన్స్ కంపెనీలు రైతులనుండి వసూలు చేసిన ప్రీమియం డబ్బులను తిరిగి ఇప్పించాలి. రైతులు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.
10. కృష్ణా, గోదావరి, తదితర నదులు, వాటికి అనుబంధంగా ఉన్న ఉపనదులు, వాగులు, వంకలు, తదితర నీటి వనరుల నుండి సమీప ప్రాంతాలలోని చెరువులు, కుంటల్లోకి నీటిని తరలించాలనే రైతులు చేస్తున్న సూచన శాశ్వితకరవు నివారణకు ఉపయోగకరం గానూ, ఆచరణయోగ్యంగానూ ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన, అమలు చేస్తున్న సాగునీటి ప్రాజెక్టుల్లో ఈ ప్రతిపాదనను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నాం.
11. గ్రామీణ వ్యవసాయ స్థిరీకరణకోసం వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, పాడిపరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉన్నది.

(తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీజీ, తెలంగాణ విద్యావంతుల వేదిక) వీ

ఎన్నికలు ఎన్నిసార్లొస్తేనేమి?

ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చినా పార్టీలు మారుతున్నాయి తప్ప ప్రజల జీవన విధానంలో మౌలికమైన మార్పు లేదని, దాని కోసం ప్రజలు పోరాటం చేయవలసిన అవసరం ఉందని అంటున్నారు బి. రామకృష్ణ

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు 2016 మే 22న, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ మే 29న, కేరళ అసెంబ్లీ మే 31న , పుదుచ్చేరి అసెంబ్లీ జూన్ 2న, అస్సాం అసెంబ్లీ జూన్ 5న ముగుస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఈ ప్రాంతాలలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. అసోంలో 2016 ఏప్రిల్ 4, ఏప్రిల్ 11న రెండు దశల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. పశ్చిమబెంగాల్‌లో ఆరు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 4, ఏప్రిల్ 11, ఏప్రిల్ 17న రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఇంకా 2016 ఏప్రిల్ 21, ఏప్రిల్ 25, ఏప్రిల్ 30, మే 5న ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలలో 2016 మే 16న ఒకే రోజున ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు అసెంబ్లీలలో ఓట్ల లెక్కింపు 2016 మే 19న జరుగుతుంది. ప్రస్తుతం అసోంలో తరుణ్ గోగోయ్ ముఖ్యమంత్రిగా, పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా తృణమూల్ కాంగ్రెస్, కేరళలో ఉమన్ చాందీ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్, పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామి ముఖ్యమంత్రిగా ఎఐఎన్ఆర్‌సి అధికారంలో ఉన్నాయి. అసోంలో 126, పశ్చిమబెంగాల్‌లో 294, తమిళనాడులో 234, కేరళలో 140, పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలున్నాయి.

అసోం

అసోంలో మొదటి నుండి కూడా కాంగ్రెస్ అధికారంలో ఉంటున్నది. ఆల్ అసోం స్టూడెంట్స్ యూనియన్ ఉద్యమాల నుండి వచ్చిన ప్రఫుల్ల కుమార్ మహంత నాయకత్వంలో అసోం గణ పరిషత్ (ఎజిపి) 1985, 1996లలో అధికారంలోకి వచ్చింది. 1991లో ఆ తరువాత 2001, 2006, 2011లలో వరుసగా కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 2001 నుండి నేటి వరకు తరుణ్ గోగోయ్ ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ప్రస్తుతం ఇక్కడ కాంగ్రెస్, యునైటెడ్ పీపుల్స్ పార్టీ ఒక కూటమిగా, బిజెపి, ఎజిపి, బోడో పీపుల్స్ ఫ్రంట్ (బిపిఎఫ్) మరో కూటమిగా, ఎఐయుడిఎఫ్, ఆర్‌జెడి, జెడి(యు)లు ఒక కూటమిగా మొత్తం మూడు కూటములు ఎన్నికల్లో పాల్గొన్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జతకట్టిన బిపిఎఫ్ ఈసారి బిజెపితో కలిసి పోటీ చేస్తున్నది. గతంలో కాంగ్రెస్‌తో కలిసి ఉన్న ఎఐయుడిఎఫ్ ఈసారి వేరే కుటమిలో ఉన్నది.

2014 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 14 స్థానాల్లో 7 స్థానాలను నెగ్గింది. 2015లో 74 మున్సిపాలిటీల్లో 38 స్థానాలను బిజెపి గెలుచుకున్నది. ఈ నేపథ్యంలో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడం కష్టంగా ఉన్నది. బిజెపి కూటమికి అధికారం దక్కే అవకాశాలెక్కువగా ఉన్నాయి. 1967లో ఎఎఎస్‌యు, 1979లో యుఎల్ఎఫ్ఎ, 1987లో బిఎస్‌యులు ఏర్పడ్డాయి. ఇవన్నీ కూడా అసోం అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని కాపాడే ఉద్దేశంతో వచ్చినవే. ఈ సంస్థల నేతృత్వంలో దీర్ఘకాలికంగా పోరాటాలు నడిచాయి. సమస్యలు అలాగే ఉండిపోయాయి. బెంగాల్, నేపాల్, ప్రధానంగా బంగ్లాదేశ్ నుండి అక్రమ వలసలు, చొరబాట్లు సమస్యగా ఎన్నో ఏళ్ల నుండి ఈ ప్రాంతంలో రగులుతూ ఉన్నది. బిజెపికి బంగ్లాదేశ్ నుండి ముస్లింలు అక్రమంగా చొరబడుతున్నారని, వారిని పారదోలాలనేది ఎన్నికల ఆయుధంగా పనికొస్తున్నది. ఈ వలసలను ఇండియా, బంగ్లాదేశ్ ఇరు దేశాలు పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చు. వీటి వెనుక ఉన్న ప్రధాన సమస్యలైన ఉపాధి, సామాజిక భద్రత, స్థానిక అస్తిత్వాలపై సమగ్రమైన పరిష్కారాన్ని సూచించాల్సి ఉన్నది. విద్య, ఉపాధి, భద్రతలను కల్పించవల్సి ఉన్నది. స్థానిక సంస్కృతులను, అస్తిత్వాలను గౌరవిస్తూ కాపాడవలసి ఉన్నది. వీటిని వదిలేసిన ప్రభుత్వాలు వారి వారి అధికార ప్రయోజనాల కోసం ఈ సమస్యలను వీలైనప్పుడల్లా రెచ్చగొట్టి, మరికొన్ని సార్లు ఆ ఉద్యమాలను అణచివేస్తూ పబ్బం గడుపుకుంటూ వస్తున్నాయి.

ఈ మధ్యకాలంలో అసోంలో బిజెపి బలం పుంజుకుంటున్నది. మార్చ్ 2016లో అరుణాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చీల్చి తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని బిజెపి ఏర్పాటు చేయించింది. ఇక అసోంలో కూడా అధికారంలోకి రావడం ద్వారా ఈశాన్య రాష్ట్రాల్లో అధికారాన్ని, సంఘపరివార్ భావజాలాన్ని సుస్థిరం చేసే ప్రయత్నంలో బిజెపి ముందుకెళుతున్నది. అసోంలోని మరో ఆరు తెగలకు ఎస్‌టి హోదా కల్పిస్తామని మోడీ 2014 లోక్‌సభ ఎన్నికల్లో ప్రకటించి ఉన్నాడు. ఈ ఆరు తెగలవారు మొత్తం జనాభాలో 40 శాతం వరకు ఉంటారు. అసోంలోని తేయాకు తోటల్లో పనిచేసేవారు మొత్తం జనాభాలో 15 శాతం వరకు ఉంటారు. వీరికి కనీస వేతనాలను రు. 130 నుండి రు. 250 వరకు పెంచాలనేది డిమాండ్‌గానే ఉండిపోయింది. ఇవన్నీ ఎన్నికల హామీలుగానే మిగిలిపోయాయి.

పశ్చిమ బెంగాల్

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) రెండో సారి అధికారం కోసం పోటీ పడుతున్నది. 1997లో కాంగ్రెస్ నుండి బయటకు వచ్చిన మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేసింది. 2011 ఎన్నికల్లో కంగ్రెస్‌తో జతకట్టి 34 ఏళ్లుగా నిరంతరాయంగా కొనసాగుతున్న సిపిఐ (ఎం) నాయకత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ పాలనకు అంతం పలికి అధికారం చేతబట్టి ముఖ్యమంత్రి అయింది. 2011లో మమతకు మద్దతు పలికి లెఫ్ట్ ఫ్రంట్‌కు వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్ ఈసారి లెఫ్ట్ ఫ్రంట్‌తో జతకట్టింది.

నేడు ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్‌లకు దూరంగా టిఎంసి ఉన్నట్లు కనిపిస్తున్నది. కాని గతంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏతో, కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ-2తో జతకట్టి పనిచేసిన చరిత్రను కలిగి ఉన్నది. పశ్చిమ బెంగాల్‌లో ముస్లింల ఓట్లు 28 శాతం ఉన్నాయి. వీరిని

ఆకట్టుకోవడంలో భాగంగా మమతా బెనర్జీ ఇమామ్‌లకు నెలవారీ గౌరవ వేతనం ప్రకటించింది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వర్గాల వారికి ఆర్థిక స్వావలంబన కోసం విద్య, వైద్యం, ఉద్యోగ ఉపాధులను సంపదపై సమాన హక్కులను కల్పించకుండా ఇలాంటి చవకబారు ప్రయత్నాలు చేస్తున్నారు.

జంగల్ మహల్ నవ్వుతున్నదని డార్జిలింగ్ చిరు నవ్వులు నవ్వుతున్నదని మమతా బెనర్జీ తను సాధించిన ఘనకార్యాలలో ఒకటిగా గొప్పగా చెబుతున్నది. జంగల్ మహల్‌లో మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేశామని సంతోషంగా చెబుతున్నది. 2011లో ఎన్నికల ముందు ఇదే ఉద్యమంపై పోలీసుల అరాచకాలను ఖండిస్తూ పీపుల్స్ కమిటీ ఎగెనెస్ట్ పోలీస్ అట్రాసిటీస్ వేదికలపై మాట్లాడిన చరిత్ర కూడా మమతా బెనర్జీకి ఉన్నది. జల్, జంగల్, జమీన్‌లపై స్వయం నిర్ణయాధికారం, స్వావలంబనల దిశలో జరుగుతున్న ఉద్యమాలను రక్తసిక్తం చేస్తూ శాంతిని మమతా బెనర్జీ ప్రవచిస్తున్నది. టిఎంసి అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే మావోయిస్టు అగ్రనాయకుడు కిషన్‌జీని నవంబర్ 2011లో ఎన్‌కౌంటర్ పేరుతో చంపేశారు. ఇది పట్టుకుని కాల్చి చంపిన హత్య అని, నిజమైన ఎన్‌కౌంటర్ కాదని దేశవ్యాప్త పౌర హక్కుల సంస్థలు ప్రకటించి ఉన్నాయి.

సమాజ మౌలిక మార్పు కోసం జరుగుతున్న ఉద్యమాలపై మమతా బెనర్జీ ఉక్కు పాదాన్ని మోపుతూ వస్తున్నది. ఈ ఉద్యమాలపై టిఎంసినే కాదు, ఎన్‌డిఎ లేదా యుపిఎల భాగస్వామ్య పార్టీలు ఒకే విధంగా విరుచుకు పడుతున్నాయి. ఈ విషయంలో గతంలోని సిపిఐ (ఎం) నాయకత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం గాని, అంతకు ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ గాని టిఎంసికి భిన్నంగా ఏమిలేవు. ఉద్యమాలను అణచివేసే విషయంలో ఇవన్నీ ఒకేలా పనిచేస్తుంటాయి.

భారత ప్రభుత్వ జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం 3.5 కోట్ల అతిపేదలకు ఆహార భద్రతను అందుబాటులో ఉంచాలి. మమతా బెనర్జీ దీన్ని 8 కోట్ల మంది ప్రజలకు విస్తరించిందని గొప్పగా చెపుతున్నారు. అసలు విషయం ఏంటంటే అన్నానికి కరువు వచ్చే పరిస్థితులు ఎందుకు దాపురించాయని. సంపదలు లేకనా, సంపద పంపకం సరిగ్గా లేకనా? అనేది చర్చించాల్సి ఉంది. మమతా బెనర్జీ అధికారంలోకి వచ్చాక 15 కొత్త విశ్వవిద్యాలయాలు, 46 కాలేజీలు నెలకొల్పారని చెబుతున్నారు. కాని మొత్తం విద్యా వ్యవస్థ ప్రభుత్వ అదీనంలో ఉండి, అందరికి ఉచిత నాణ్యమైన, సమానమైన విద్య అందించడం గురించి నోరు మెదపడం లేదు. 41 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను నెలకొల్పారని, జెనరిక్ మందులను తక్కువ ధరకే లభించేలా చేశారని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పారు. ప్రైవేట్, కార్పొరేట్ వైద్యం ప్రజల జేబులను చిల్లులు చేస్తున్నది. ఉన్నవారికో వైద్యం, లేనివారికో వైద్యం ఈ వివక్షతల గురించి టిఎంసినే కాదు, ఏ పార్టీ మాట్లాడడం లేదు. ఒకవేళ మాట్లాడినా అధికారం నడుపుతున్నప్పుడు వీటిని చిత్తశుద్ధితో పాటిస్తారనేదేమి లేదు. 'ఒడ్డుదాటే దాక ఓడ మల్లన్నా దాటాక బోడి మల్లన్న' అనడం ఎన్నికల ప్రహసనంలో అందరం చూస్తున్నదే.

ఉత్తర బెంగాల్ ప్రాంతంలో గత 5 ఏళ్లలో 200 లకు పైగా తేయాకు తోటల కార్మికులు పోషకాహార లోపంతో, సరైన వైద్యం అందక మరణించారు. టీ తోటలు మూతపడుతున్నాయి. ఆ కార్మికులు బజారున పడుతున్నారు. దూర ప్రాంతాలకు కాలినడకన ఉపాధి కోసం వెళుతున్నారు. వీరికి టిఎంసి చేసిందేమీ లేదు. ఈ ప్రాంతంలో గుర్ఖా జనముక్త మోర్చ (జిజెఎం) బలంగా ఉన్నది. బిజెపికి జిజెఎం సహకరిస్తున్నది. ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌లో బిజెపి, టిఎంసి, సిపిఐ (ఎం), సిపిఐ, ఫార్వర్డ్ బ్లాక్ (ఎఫ్‌బి) రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పి) లతో కూడిన లెఫ్ట్ ఫ్రంట్‌తో జతకట్టిన కాంగ్రెస్‌తో కూడిన త్రిముఖ పోటీ ఉన్నది. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ఓడినా ప్రజలకు ఒరిగేదేమి ఉంది. ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్‌లను దాటి ఆర్థిక స్వావలంబనను, దేశ సార్వభౌమాధికారంను, ప్రజల హక్కులకు గ్యారంటీని సాధించే దిశలో పనిచేసే పార్టీలే లేవు.

పశ్చిమ బెంగాల్‌లో ఇప్పటికిప్పుడు లెఫ్ట్ ఫ్రంట్ – కాంగ్రెస్ కూటమి అధికారం చేపట్టే పరిస్థితి లేదు. కాకుంటే మళ్లీ టిఎంసినే కొంత తక్కువ మెజారిటీతోనైనా అధికారం పొందే అవకాశాలున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తో జతకట్టిన సిపిఐ (ఎం), లెఫ్ట్ ఫ్రంట్ కేరళలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అధికారం కోసం కుస్తీ పడుతున్నది. దేశంలో మొదటిసారిగా 1957లో కాంగ్రెస్ వ్యతిరేక ప్రభుత్వం కేరళలో నంబూద్రిపాద్ నేతృత్వంలో ఏర్పడింది. అప్పటి నుండి సిపిఐ (ఎం) నాయకత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్), కాంగ్రెస్ నాయకత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)లు మార్చి, మార్చి అధికారంలోకి వస్తున్నాయి. 1977 నుండి ఏ రెండూ వరుసగా రెండు సార్లు అధికారంలోకి రాలేదు. ఈ సారి ఎన్నికల్లో మూడవ శక్తిగా బిజెపి ప్రయత్నిస్తున్నది. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్ అధికారంలో ఉన్నది. ఎల్‌డిఎఫ్‌లో సిపిఐ (ఎం), సిపిఐ, జెడి (ఎస్), ఎన్‌సిపి, డెమోక్రటిక్ కేరళ కాంగ్రెస్, కేరళ కాంగ్రెస్ (బి) మొదలైనవి ఉన్నాయి. యుడిఎఫ్‌లో కాంగ్రెస్, ముస్లింలీగ్, కేరళ కాంగ్రెస్ (ఎం), జెడి (యు), ఆర్ఎస్‌పి, కేరళ కాంగ్రెస్ (జాకబ్), సిఎంపి ఉన్నాయి. కేరళలో ముస్లింలు 25 శాతం, క్రిస్టియన్లు 20 శాతం ఉన్నారు. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో 1 శాతం ఓట్ల తేడాతో ఎల్‌డిఎఫ్ ఓడి, యుడిఎఫ్ అధికారంలోకి వచ్చింది. యుడిఎఫ్ 72 స్థానాలను, ఎల్‌డిఎఫ్ 68 స్థానాలను గెలిచాయి.

కేరళ

1960ల నుండి కేరళలో మత రాజకీయాలలో భారతీయ జనసంఘ్, ముస్లిం లీగ్‌లు ఉనికిలోకి వచ్చాయి. జనసంఘ్ 1980లో బిజెపిగా రూపుదాల్చింది. అది నేటి వరకు ఒక్క ఎంఎల్ఎ గాని, ఎంపి సీటును గాని పొందలేకపోయింది. అయితే ముస్లింలీగ్ మాత్రం పోటీ చేసిన ప్రతిసారి కొన్ని సీట్లను పొందుతూ అసెంబ్లీలో మూడవ లేదా నాలుగవ స్థానంలో ఉంటున్నది. కేరళలో 1965 నుండి సంకీర్ణ రాజకీయాలు మొదలై నేటికీ కొనసాగుతూ వస్తున్నది. 2011లో 30 పార్టీలు పోటీ చేస్తే, 11 పార్టీలు అసెంబ్లీలోకి అడుగు పెట్టాయి. క్రమంగా బిజెపి ఓట్లను పెంచుకుంటూ వస్తున్నది. పాలక్కడ మున్సిపాలిటీలో అతిపెద్ద పార్టీగా నిలిచింది. తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో 100 సీట్లలో 34 సీట్లను గెలుచుకున్నది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో తిరువనంతపురం స్థానంలో శశిధరూర్‌తో పోటీపడి రెండు లక్షల ఎనభై రెండు వేల ఓట్లు సాధించింది కాని, 15 వేల ఓట్ల తేడాతో ఓడిపోయింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 10 శాతం ఓట్లు సాధించగలిగింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఒక్క సీటును గెలవలేకపోవచ్చు కాని, ఎన్నికలను ప్రభావితం చేయగలిగే స్థాయికి చేరుకోవడం గమనించదగ్గది. 2010లో కేరళ మున్సిపాలిటీల్లో 79 స్థానాల్లో గెలుపొందితే, 2015లో 236 స్థానాలను గెలుచుకున్నది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో బిజెపికి మద్దతు లభిస్తుండడం గమనించవచ్చు.

కేరళలో ఎజవా కులస్థులు 23 శాతం, నాయర్‌లు 14 శాతం ఉన్నారు. ఈ రెండు హిందూ మతస్థులపై బిజెపి కన్నేసింది. వీరిని తన మద్దతుదార్లుగా చేసుకునే పనిలో పడింది. ఎజవా కులానికి చెందిన సంఘ సంస్కర్త నారాయణగురు సమాధిని గత డిసెంబర్‌లో మోడీ సందర్శించాడు. బిసి నేత ఆర్. శంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించాడు. అగ్రవర్ణాలకు చెందిన నంబూద్రి, నాయర్‌లు ఈ మధ్య స్మృతి ఇరానీని కలిశారు. భారత్ దర్మన్ జనసేనకు (బిడిజెఎస్) నాయకత్వం వహిస్తున్న నటేషన్ ఎజవా కులానికి చెందినవాడు. బిడిజెఎస్ ఈ ఎన్నికల్లో బిజెపితో కలిసి పనిచేస్తున్నది. ఈ నేపథ్యంలో బిజెపి హిందూ మత ప్రాతిపదికన ఓట్ల రాజకీయాల్లో తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ, ఆర్‌ఎస్‌ఎస్ విద్వేషపూరిత మత భావజాలాన్ని పటిష్టం చేసే పనిలో చురుకుగా పనిచేసుకుంటూ పోతున్నది.

తమిళనాడు

తమిళనాడులో గత 50 సంవత్సరాలుగా ఎఐఎడిఎంకె కాకుంటే డిఎంకెలు లేదా వాటి కూటములు అధికారంలోకి వస్తున్నాయి. ఈ రెండు పార్టీలు ప్రత్యర్థులుగా మిగతా జాతీయ, ప్రాంతీయ, ఉప ప్రాంతీయ పార్టీలు వీటితో జతకట్టి ఎన్నికల్లో పోటీ చేస్తుంటాయి. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభావవంతమైన రాజకీయ శక్తిగా విజయ్‌కాంత్ నేతృత్వంలోని డిఎండికె ముందుకు వచ్చింది. డిఎంకెకు 23 అసెంబ్లీ సీట్లు వస్తే, డిఎండికెకు 29 అసెంబ్లీ స్థానాలు లభించాయి. 2011లో డిఎండికె, ఎఐఎడిఎంకెతో కలిసి పోటీ చేసింది. అయితే ఎఐడిఎంకెకు 151 సీట్లు వచ్చి స్వతంత్రంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసింది. డిఎండికె ప్రతిపక్షంలో కూర్చుండి పోయింది.

డిఎండికెను తమతో కలువమని బిజెపి, డిఎంకెలు గట్టిగానే కృషి చేశాయి. కాని వాటితో కలిస్తే తాను కింగ్ మేకర్‌నే అవుతాను తప్ప కింగ్‌ను కాలేనని వాటికి దూరంగా ఉండిపోయాడు. సిపిఐ (ఎం), సిపిఐ మారుతులచ్చి ద్రవిడ మున్నేట్ర కజగమ్ (ఎండిఎంకె), విదుతులై చిరుత్తైగల్ కొచ్చి (విసికె) లతో పీపుల్స్ వెల్ఫేర్ ఫ్రంట్ (పిడబ్ల్యుఎఫ్) ఏర్పడింది. ఎండిఎంకె నాయకుడు వైకో చొరవతో డిఎండికెతో పిడబ్ల్యుఎఫ్ కలసి కూటమిగా ఏర్పడ్డాయి. విజయ్‌కాంత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. డిఎంకె, కాంగ్రెస్ ముస్లింలీగ్‌లు ఒక కూటమిగా పిడబ్ల్యుఎఫ్ – డిఎండికె మరో కూటమిగా, ఎఐఎడిఎంకె, బిజెపి, పిఎంకెలు మొత్తంగా ఐదు ముఖాల పోటీ తమిళనాడు ఎన్నికల్లో ఉంటున్నది. బిజెపి ఇటు ఎఐఎడిఎంకె, డిఎంకె, డిఎండికె లతో జత కట్టాలని తీవ్రంగానే పనిచేసింది. కాని, చివరకు ఒంటరిగా మిగిలిపోయింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె, పిఎంకెలతో కలిసి బిజెపి పోటీ చేసింది. ఎఐఎడిఎంకె గాని, డిఎంకె గాని గతంలో ఎన్‌డిఎ లేదా యుపిఎ లతో కేంద్రంలో పనిచేసినవే ఈ పొత్తులు. పొత్తు కుదిరితే తనవాడు, లేకుంటే కక్షిదారుడు. ఇకపై ఎన్నికల్లో విమర్శల దండకాలతో ప్రజలపైకి దూసుకొస్తారు. చివరికి వీరంతా ఒకటేనని అధికారం కోసం ఇన్ని తిప్పలని తెలిసిపోతుంది.

అక్రమ ఆస్తులను కలిగి ఉన్నారని ఒక కోర్టు తీర్పుననుసరించి ముఖ్యమంత్రి పదవిని కోల్పోయింది జయలలిత. తన కీలుబొమ్మను ముఖ్యమంత్రిగా పెట్టి జైలు నుండే అధికారం వెలగబెట్టింది. ప్రత్యేక కోర్టులో ఈ కేసు వీగిపోగా తిరిగి వెంటనే జయలలిత ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేశారు. తిరిగి ఈసారి ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. ఇలాంటి వారికి కేసుల్లో గాని, మరితర అక్రమాల విషయాల్లో గాని ఎంతో వెసులుబాటు లభిస్తుంటుంది. ఏళ్లకేళ్లు కేసులు విచారణలు లేకుండా లేదా వాయిదాలతో మురిగిపోతుంటాయి. ఈ లోపు వీరు అధికారాన్ని, ఆస్తులను, అంతస్థులను, విలాసవంతమైన జీవితాలను అనుభవిస్తూనే ఉంటారు. రాజ్య యంత్రాంగాల నెన్నింటినో తమ గుప్పిట్లో పెట్టుకుని అశేష సాధారణ ప్రజానీకాన్ని పేదరికంలో, మతం, కులం, ప్రాంతం, వ్యక్తి పూజ, మద్యం మత్తులో ముంచుతుంటారు. ఆకర్షణీయమైన స్కీంలతో, ఎన్నికల వాగ్దానాలతో ప్రజలను వంచిస్తుంటారు. ప్రజల సొమ్మును వారికి ఖర్చు పెట్టేటప్పుడు ఆ డబ్బేదో జయలలిత తన కష్టార్జితం అయినట్లు అమ్మ పేరుతో పలు పథకాలకు పేరు పెట్టారు.

ఈసారి తమిళనాడు ఎన్నికల్లో అన్ని పార్టీలు మద్య నిషేధం విధిస్తాయని ప్రకటిస్తున్నాయి. ఇది మంచిదే కాని, మాట నిలబెట్టు కుంటాయా? అన్నది సందేహమే. గతంలో ఎఐడిఎంకె, డిఎంకెలే మద్యం గేట్లు బార్లా తెరిచినవి. ప్రభుత్వమే దుకాణాలు పెట్టి అమ్మే తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ (టిఎస్‌ఎంఎసి) వ్యవస్థను తెచ్చింది ఈ పార్టీలే. రాష్ట్ర ఆదాయంలో మూడో వంతు వరకు మద్యం అమ్మకాల ద్వారానే సమకూరుతున్నది. మద్యం తాగించి, ఆ డబ్బుతో కొంత ప్రజాకర్షక పథకాలకు వెచ్చించి తామేదో గొప్పలు చేసినట్లుగా ప్రజల్లో చెప్పుకుంటున్నారు. కలర్ టివిలు, సెల్‌ఫోన్‌లు, మిక్సీలు, గ్రైండర్లు ఎన్నికల వాగ్దానాలుగా మారడం అంటే రాజకీయ పార్టీలు ప్రజలను ఎంతలా అవమానపరుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. మౌలిక అవసరాలైన విద్య, వైద్యం, ఉద్యోగ ఉపాధిల గురించి స్పష్టమైన ప్రణాళికలు చెప్పకుండా పోవడం వారి బాధ్యతా రాహిత్యాన్ని సూచిస్తున్నది. కొన్ని పార్టీలు వీటి గురించి మాట్లాడినట్లుగా మేనిఫెస్టోల్లో కనిపిస్తాయి. కాని చాలా సౌకర్యవంతంగా అందరికి ప్రభుత్వ అధీనంలోనే విద్యనందించడం, ప్రజలందరికి వివక్షతలు లేని పూర్తిస్థాయి వైద్యం ఉచితంగా అందజేయడం గురించి మాట్లాడవు. ప్రైవేట్ సంస్థలన్ని అలాగే ఉంటాయి. ఉన్నోడికి సౌకర్యవంతమైన విద్యను, వైద్యంను అందిస్తూనే ఉంటాయి. పేదలు వీటికి దూరంగా మిగిలిపోయి, దిక్కులేని వారుగా మిగిలి పోతుంటారు. ఒక పిఎంకె ఇంటికో ఉద్యోగం ఇస్తామని వాగ్దానం చేసింది. తెలంగాణలో కెసిఆర్ కూడా ఎన్నికల ముందు ఈ మాట అన్నట్లుగా ఎవరో గుర్తు చేస్తే దాన్ని ఖండిస్తూ ఇలా ఇవ్వడం కుదరని పని అని, అలాంటి మాట ఎప్పుడూ ఇవ్వలేదని కెసిఆర్ ఈ మధ్యనే ప్రకటించి ఉన్నాడు.

పుదుచ్చేరి

కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామి ముఖ్యమంత్రి గా ఎఐఎన్‌ఆర్‌సి అధికారంలో ఉన్నది. 1963లో పుదుచ్చేరిలో రాష్ట్ర అసెంబ్లీని ఏర్పాటు చేశారు. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో అంతకు ముందు మూడు నెలల ముందే కాంగ్రెస్ నుంచి వేరుపడి ఎఐఎన్‌ఆర్‌సిని ఏర్పాటు చేసి, ఎఐడిఎంకెతో జతకట్టి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో గెలిచి రంగస్వామి ముఖ్యమంత్రి అయ్యాడు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఎఐఎన్‌ఆర్‌సి బిజెపితో జతకట్టింది. పుదుచ్చేరిలో ఒకే ఒక ఎంపి స్థానమున్నది. ఈసారి ఎఐఎన్‌ఆర్‌సి, ఎఐఎడిఎంకెతో గాని, బిజెపితో గాని ఇంతవరకు పొత్తుల అవగాహనకు రాలేదు. డిఎంకె – కాంగ్రెస్ కూటమి, పిడబ్ల్యుఎఫ్ – డిఎండికె కూటములు పోటీలో ఉన్నాయి. డిఎంకె – కాంగ్రెస్ కూటమికి విజయావకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

ఎన్నికల్లో పార్టీల మధ్య పొత్తులు అధికారం కోసం ఆరాటాన్ని సూచిస్తున్నాయి. ఎన్నికల ముందు ఒకలాగా తరువాత మరోలాగా

ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యమేలుతున్న అసహనం

చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న జన్మభూమి కార్యక్రమం ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం కాదనీ, గ్రామ సభల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రజలపై పోలీసుల అణచివేత దానికి నిదర్శనమనీ అంటున్నారు **మర్రి కామయ్య**

రాష్ట్రంలోని 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమ లక్ష్యం పూర్తిగా గాడి తప్పింది. కేవలం చంద్రబాబు నాయుడు భజనకే పరిమితమైంది. ఓ వైపు రాష్ట్రం ఇబ్బందుల్లో ఉందని చెపుతూ కోట్ల ఖర్చుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నిర్దేశిత లక్ష్యానికి ఆమడ దూరంలో కొనసాగుతోంది. ప్రచారం పొందడమే ఏకైక లక్ష్యంగా చంద్రబాబు జన్మభూమి – మా ఊరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమం నిర్వహణకు అధికారికంగా రు. 13 కోట్లు ఖర్చు చేస్తున్నా అనధికారికంగా అది అనేకరెట్లుంటుంది. ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న జన్మభూమిలో చేయాల్సిన పనులు తప్ప మిగిలినవన్నీ జరుగుతున్నాయి.

వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో ప్రజలతో సమావేశమై ఆయా గ్రామాలు, వార్డుల అభివృద్ధి ప్రణాళికలకు రూపకల్పన చేయాలన్నది జన్మభూమి ఉద్దేశం. ఇందుకోసం జన్మభూమి కార్యక్రమ ప్రారంభానికి నెల రోజుల ముందు నుంచే ప్రభుత్వ యంత్రాంగం గ్రామాలు, వార్డుల్లో పర్యటించి, నివేదికలు రూపొందించాలి. ఆ నివేదికలను జన్మభూమి గ్రామ సభల ముందుంచి, ప్రజల అవసరాలపై చర్చించాలి. ఈ అవసరాలను తీర్చడానికి ఆయా శాఖలు ఎంత మేరకు ఆర్థిక తోడ్పాటు అందించగలవన్న దానిపై కూడా సమీక్ష జరపాలి. స్మార్ట్ విలేజ్ – స్మార్ట్ వార్డ్ కార్యక్రమాల్లో గ్రామాలు, వార్డులను దత్తత తీసుకున్న వారిని జన్మభూమి గ్రామ సభల్లో భాగస్వాములను చేయడంతో పాటు వారు గ్రామాభివృద్ధికి ఏ విధంగా తోడ్పడగలరన్న దానిపై చర్చించాలి. చివరకు

మితృత్వాలు, శతృత్వాలు వెంట వెంటనే కనుమరుగై పోతుంటాయి. ఎప్పుడెవరి పంచన చేరతారో, ఎవరిని విమర్శిస్తారో, ఎవరిని నెత్తికెక్కించుకుంటారో చాలా విచిత్రంగా అనిపించినా, దీని మొత్తంలో ప్రజలు ప్రజా సంక్షేమం, రాజ్యాంగ విలువలు, భారత స్వాతంత్రోద్యమ త్యాగాల ఆశయాలు, ఆకాంక్షలు వారికనవసరం. కావాల్సిందల్లా అధికారం, డబ్బు, హోదా, జల్సాలు మరెన్నో. ఇదంతా చూస్తుంటే పార్లమెంటరీ రాజకీయ ఎన్నికలు నాటకంగా, కపటాలకు, మోసాలకు, వంచనలకు, ప్రజలను అవహేళన చేయడానికి చిరునామాగా మారాయి అని అనిపిస్తే తప్పెందుకు అవుతుంది.

దేశ సంపదలను సృష్టిస్తున్న అశేష ప్రజానీకానికి ఆ సంపదపై హక్కు లేకుండా చేస్తూ, కొద్దిమంది ఆధిపత్య వర్గాలు వాటికి హక్కు దార్లుగా మారి వాటిని అనుభవించడానికి ఎన్నికలు సోపానాలుగా మారాయి. నేడు చట్ట సభల్లోకి నేరస్థులు, కోటీశ్వర్లు అధిక సంఖ్యలో ప్రవేశిస్తున్నారు. వారిపై ఉన్న కేసులు ఎప్పటికీ తేలవు. చాలా మట్టుకు నిర్దోశులుగానే బయటపడుతుంటారు. కాని నిరుపేద రైతులు ఆత్మహత్యలకు గురవుతుంటారు. ఆదివాసులు, దళితులు, తదితర ప్రజానీకం ఆకలి, దారిద్రంతో సహవాసం చేస్తుంటారు. దేశంలో జరిగిన, జరుగుతున్న కుంభకోణాల్లోని మొత్తంలో పావు భాగం వెచ్చించినా రైతులు ఆత్మహత్యకు గురయ్యే పరిస్థితి రాదు. దేశంలోని ఈ బడా బాబుల అక్రమాస్తులను నిజాయితిగా సమాజపరం చేస్తే విద్యా, వైద్యం, ఉపాధులు అందించడం సులువవుతుంది. మొన్నటికి మొన్న రాజ్యసభ సభ్యుడు విజయ్ మాల్యా వేల కోట్ల ప్రజా ధనాన్ని బ్యాంకుల ద్వారా రుణాల రూపేణా తీసుకుని ఎగ్గొట్టే ప్రక్రియలో దేశం విడిచి వెళ్లిపోయాడు. అదే ఓ చిన్న పిక్ పాకెటరో, చిల్లర దొంగో అయితే పోలీస్ స్టేషన్‌లో తుక్కు తుక్కుగా తన్నబడేవాడే. ఈసారే కాదు ప్రతిసారీ ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాలు విచ్చల విడిగా ప్రవహిస్తుంటాయి. ఇదంతా అందరికీ తెలిసే జరుగుతుంటుంది. రాజ్య వ్యవస్థ ఏదీ కూడా వీటిని పెద్దగా పట్టించుకోదు. అక్కడక్కడా కొన్ని వెలుగులోకి వస్తుంటాయి. కాని వెంట వెంటనే కనుమరుగై పోతుంటాయి. ఏ ఒక్కరికి శిక్షలు పడవు. ఎవరూ అనర్హులుగా ప్రకటించబడరు.

కులాలు, మతాలు, ప్రాంతాల పేర్లతో ప్రజలను ఎవరికి వారిని ఒంటరిగా చేస్తూ తమ పాలనను స్థిరపరుచుకుంటున్నారు తప్పిస్తే మౌలిక అవసరాలను తీర్చకుండా, సంపదపై సమాన హక్కులు కల్పించకుండా, పెట్టుబడి కార్పొరేట్ శక్తులను నియంత్రించకుండా తమ తమ అధికారాలను ఒకరు కాకపోతే మరొకరు పదిలపరుచుకుంటున్నారు. ప్రజలు తమ కాళ్ల మీద తాము నిలబడి ఆర్థిక స్వావలంబనను సాధించడానికి, సామాజిక భద్రత, ఆత్మగౌరవం పెంచడానికి మౌలిక అంశాలైన విద్యా, వైద్యం, ఉద్యోగం ఉపాధి ఆర్థిక వనరులపై పూర్తిస్థాయి హక్కులను కల్పించడం కాకుండా కొన్ని ప్రజాకర్షక పథకాలను ప్రకటిస్తుంటారు. ఆదాహరణకు రెండు రూపాయలకు కిలో బియ్యం, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత విద్యుత్తు, సబ్సిడీలు వంటివి.

ప్రజలు ఈ ఎన్నికల నాటకంలో ఒకరు కాకుంటే మరొకరిని గెలిపిస్తున్నారు. అంతేగాని సమ సమాజ దిశలో ప్రజలందరికి శ్రమకొద్ది గౌరవం, సంపద అనే మెరుగైన సమాజాన్ని ప్రతిపాదించే రాజకీయ వ్యవస్థలు ఎదిగి రాకపోవడం అనే అనివార్యతను ఎదుర్కొంటున్నారు. ఈ ఎన్నికల చట్రానికి ఎన్నో పరిమితులున్నాయి. అవి ప్రజలందరికి సంపదను సమ పంపిణీని చేయలేవు. విద్యా, వైద్యం, ఉపాధి సమాన హక్కులు అందించే పరిస్థితి లేకుండా పోయింది. ఏ రాయి అయితేనేమి పళ్లూడకొట్టుకోవడానికి అన్న చందంగా ఎన్నికలు, ఎన్నికల పార్టీలు మారడం వల్ల ఒకసారి ఒకరిని గెలిపిస్తే, మరోసారి వారినే లేదా మరొకరిని గెలిపించడం జరుగుతున్నది. సమసమాజ దశలు సమూల మార్పుల కోసం జరిగే ఉద్యమాల, చైతన్యాల అవసరం, ఆవశ్యకత ఎంతగా ఉన్నదో ఈ పరిస్థితి తెలుపుతున్నది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు పంచాయితీల సొంత ఆదాయ వనరులు దాతల విరాళాలతో గ్రామ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలి.

రాష్ట్రంలో మొత్తం 12,918 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. 11,674 గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఈ 11,674 గ్రామాల్లో కేవలం 59 గ్రామాల్లో మాత్రమే గ్రామాభివృద్ధి ప్రణాళికలపై చర్చ, వాటి రూపకల్పన జరిగింది. దాదాపు నాలుగు వేల గ్రామాల్లో ప్రభుత్వ సిబ్బంది జన్మభూమికి ముందస్తుగా చేపట్టాల్సిన సర్వే నివేదికల రూపకల్పనే పూర్తి చేయలేదు. జన్మభూమి సభల్లో ఫించన్లు, రేషన్ సరుకులు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. జన్మభూమి కార్యక్రమం ఉన్నా లేకపోయిన ప్రతి నెల వాటిని పంపిణీ చేయడం పరిపాటే. గతంలో అధికారంలో ఉన్నప్పుడు తాను మాత్రమే సమర్థంగా పనిచేస్తున్నాననీ, అధికారులు ప్రజలను, వారి సమస్యలను పట్టించుకోవడం లేదన్నట్లుగా చిత్రీకరించిన చంద్రబాబు ఈ సారి కూడా అదే తంతు కొనసాగిస్తున్నారు. ప్రతిదినం ఏదో ఒక చోట ప్రజల సమక్షంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది కచ్చితంగా నియంతృత్వ పోకడకు నిదర్శనం.

ప్రజా సమస్యల ప్రస్తావనే లేకుండా పోతున్నది. గ్రామాలు, వార్డుల వారీగా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన ముఖ్య లక్ష్యంగా ప్రారంభమైన జన్మభూమిలో చంద్రబాబు భజనే ఎక్కువగా జరిగింది. జిల్లా అధికారులు, టిడిపి ఎంఎల్ఏలు, ఎంపిలు, స్థానిక నేతలు చంద్రబాబును పొగిడేందుకే గ్రామ సభలు ఉపయోగపడ్డాయి. ప్రభుత్వ విధానాలు, పనితీరును ప్రజలు ప్రశ్నిస్తే వారి మైకు కట్ చేయడం, ప్రజల మౌలిక సమస్యల ప్రస్తావనే రానివ్వడం లేదు. ఎవరైతే ప్రజా సమస్యలు లేవనెత్తేందుకు ప్రయత్నిస్తారో వారు అధికార పార్టీ నేతల దౌర్జన్యాలకు, దాడులకు గురికావాల్సిందే. సిఎం చంద్రబాబుతో పాటు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు దాడులు, దౌర్జన్యాలు ప్రోత్సహించే విధంగా వ్యవహరిస్తున్నారు. జన్మభూమి కార్యక్రమంలో ప్రజలను ఏమాత్రం భాగస్వాములను చేయడం లేదు. ప్రజాస్వామికమైన ప్రక్రియలో చర్చ జరగడం అంతకన్నా లేదు. ఏకపక్షంగా నిర్ణయాలు ప్రకటించి ప్రజలపై రుద్దుతున్నారు. దీనికి అడ్డు తగిలినవారి గొంతును పోలీసుల సాయంతో బలవంతంగా నొక్కేయడం గమనార్హం.

జన్మభూమి ద్వారా ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెపుతున్న చంద్రబాబు వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. గత రెండు జన్మభూమి కార్యక్రమాల్లో వచ్చిన లక్షలాది వినతులను పరిష్కరించని ప్రభుత్వం ఒక్క రోజులో వాటన్నింటినీ పరిష్కరించామని చెప్పుకునే ప్రయత్నం చేస్తోంది. సిఎం కోర్‌డ్యాష్ బోర్డులో జనవరి 1 నాటికి రెండు జన్మభూమి కార్యక్రమాల్లో రేషన్ కార్డులు, ఫించన్లు, ఇళ్లు కావాలని వచ్చిన 33.27 లక్షల దరఖాస్తుల్లో 28.52 లక్షల దరఖాస్తులను పరిష్కరించలేదని అధికార వర్గాలే చెపుతున్నాయి. మొదటి రెండు విడతల జన్మభూముల్లో వచ్చిన ఫిర్యాదులే పరిష్కారం కాలేదు. ఇక మూడో విడత జన్మభూమిలో వచ్చిన ఫిర్యాదులు ఎలా పరిష్కారమవుతాయో అర్థం చేసుకోవచ్చు. జన్మభూమి అంటూ మాయ మాటలతో ప్రభుత్వం మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది తప్ప మరొకటి కాదు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జన్మభూమి సభలు ప్రజల ఆందోళనలకు వేదికలైనట్లే, విశాఖ మన్య ప్రాంతంలో కూడా జన్మభూమి సభలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వేదికలైనాయి. విశాఖ ఏజెన్సీలోని దాదాపు అన్ని గ్రామాల్లో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జన్మభూమి సభల్లో తీర్మాణాలు చేశారు. బాక్సైట్ తవ్వకాలపై జారీ చేసిన జిఒ నెం. 97ను ఉపసంహరించుకోవాలని, అధికార యంత్రాంగాన్ని నిలదీశారు. చాలా చోట్ల బాక్సైట్ తవ్వకాల ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, బాక్సైట్ తవ్వకాల కోసం విడుదల చేసిన జిఒ నెం. 97ను ఉపసంహరించుకున్నాకనే జన్మభూమిని జరగనిస్తామని, అప్పటి వరకు జరగనివ్వబోమని తేల్చి చెప్పారు. జన్మభూమి కార్యక్రమం లో భాగంగా మన్యం అంతటా ప్రత్యేక పోలీసు బలగాలతో నింపి వేశారు. సర్కారు తీరుపట్ల ఎక్కడ ఏ చిన్న నిరసన వ్యక్తం అయినా అణిచి పెట్టేందుకు కాచుకుని కూర్చున్నారు.

బాక్సైట్ తవ్వకాల కోసం కుదుర్చుకున్న ఒప్పందాలు, 97 జిఒ ఉపసంహరించుకోవాలనీ తీర్మాణాలు ప్రవేశపెట్టి చర్చించడానికి పట్టు పట్టిన చాలా చోట్లా పోలీసులు, ఉన్నతాధికారులు అడ్డుకునే ప్రయత్నం చేసి ప్రజల ఆగ్రహావేశాలకు గురికాక తప్పలేదు. జన్మభూమి కార్యక్రమం పూర్తయేంత వరకు ప్రతిరోజూ ప్రజలు తమ మౌలిక సమస్యలపై వినతి పత్రాలు అందించడంతో మొదలుకొని, నిరసన తెలియజేయడం, అధికార యంత్రాంగాన్ని నిలదీయడంతో పాటు జన్మభూమి కార్యక్రమాన్ని బహిష్కరించడం వంటి రూపాల్లో తమ ఆందోళనను కొనసాగించారు. దీంతో చంద్రబాబు పోలీసు బలగాల సాయంతో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలకు పూనుకున్నారు. అంటే నిరసన గళాలపై ప్రభుత్వ దమనకాండ ఏ స్థాయిలో కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ఎమర్జెన్సీని గుర్తుకు తెచ్చేలా రాష్ట్రంలో టిడిపి పాలన సాగుతోంది.

మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామో, నియంతృత్వంలో ఉన్నామో అర్థం కావడం లేదనే వారికి ఇప్పుడు అర్థమవుతుంది ఈ దేశంలో ప్రజాస్వామ్యం లేదు. ఉన్నదల్లా నియంతృత్వమేనని. ఎందుకంటే అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాకపోవడం వల్ల, సంక్షేమ పథకాలను అధికార పార్టీ నేతలు, కార్యకర్తలకే పరిమితం చేస్తుండడం, తమకు మొండిచేయి చూపుతుండడంపై, ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన రుణమాఫీ అమలు కాకపోవడంతో, అన్ని రకాల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామంటూ హామీ ఇచ్చి, ఓట్లు దండుకున్న టిడిపి ప్రభుత్వం ఇప్పుడెందుకు వాటిపై నోరు మెదపడం లేదని జనం ప్రశ్నిస్తుంటే దానికి సమాధానం చెప్పకుండా, వారిపై బల ప్రయోగం చేయడమంటే దాన్ని ఏమనుకోవాలి?

రాజ్యాంగం ఆర్టికల్ 19-22లో పేర్కొన్న విధంగా తమకు నచ్చని విషయాలపై భిన్నాభిప్రాయం కలిగి ఉండి వ్యక్తం చేసే హక్కు ప్రభుత్వ పనితీరుని ప్రశ్నించి, నిరసన, ఆందోళన వ్యక్తం చేసే హక్కు ఉంది కదా! దాన్ని చంద్రబాబు ప్రభుత్వం గుర్తిస్తున్నట్లా లేదా? ఒకవేళ గుర్తిస్తున్నట్లయితే జన్మభూమి కార్యక్రమంలో తమ ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల నుండి వచ్చిన విమర్శలను ఎందుకు సానుకూలంగా వినలేదు, స్వీకరించనూ లేదు? ఇది దేన్ని సూచిస్తుంది. ముమ్మాటికి ఇది నియంతృత్వమే. అందుకే ఈ దేశంలో ప్రజలకు స్వాతంత్ర్యం లేదు. స్వేచ్ఛా అంతకన్నా లేదు. ఉన్నదల్లా పాలకులకు ప్రజాస్వామ్యం, పాలితులకు నియంతృత్వం. అదే ఈ రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం. భవిష్యత్‌లో మరింత పెచ్చరిల్లే ప్రమాదం ఉంది.

జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలను ప్రస్తావించి, ప్రభుత్వాన్ని ఇరుకున పెడతారనే అనుమానంతో విపక్ష నేతల నిర్బంధం కూడా రోజూ కొనసాగింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో

పెల్లుబికిన నిరసన, ఆందోళనల్లో అనివార్యంగానే విపక్షాలు భాగం కావాల్సి వచ్చింది. రెండవది జన్మభూమి కార్యక్రమాలలో విపక్షాలను ఏమాత్రం భాగస్వాములను చేయకపోవడం. శాసనసభలో ఉన్న ఏకైక ప్రతిపక్షం వైఎస్‌ఆర్‌సిపి ఎంఎల్‌ఎలను కనీసం జన్మభూమి సభలకు ఆహ్వానించడం లేదనే అక్కసుతో కూడా జన్మభూమి వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొనవలసి వచ్చింది. అంతే తప్ప, నిజంగా ప్రభుత్వ విధానాల పట్ల వ్యతిరేకత ఉండి, ప్రజల పట్ల సానుభూతితో పాల్గొన్నది మాత్రం కాదు. అందుకే వారి వ్యవహార శైలిలో కూడా ఆ తేడా స్పష్టంగా కనబడుతుంది.

అభివృద్ధి కార్యక్రమాలకు పరిమితం కావాల్సిన జన్మభూమి సభలను చంద్రబాబు నాయుడు రాజకీయ సభలుగా మార్చేస్తున్నారని, ప్రతిపక్షంపై రాజకీయ విమర్శలు చేసేందుకే చంద్రబాబు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని, జన్మభూమి సభల్లో తమకు తగిన ప్రాధాన్యతనివ్వడం లేదని, ప్రొటోకాల్‌కు మంగళం పాడారని విపక్షం విమర్శలు గుప్పిస్తే, జన్మభూమి సభల్లో చంద్రబాబుకు ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే ఓర్వలేక జగన్ తన పార్టీ వారిచే జన్మభూమి సభలకు ఆటంకాలు సృష్టిస్తున్నారని ప్రకటన చేస్తారు. మరునాడు వైఎస్‌ఆర్‌సిపి నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి ఇది తెలుగుదేశం పార్టీ కుట్ర అని చెప్తారు. ఈ విధంగా ప్రత్యారోపణల పర్వంతో ప్రజలను పక్కదారి పట్టించడమే పాలక వర్గాల నైజం. ఇందుకు వైఎస్‌ఆర్‌సిపి మినహాయింపేమి కాదు.

అయితే గత కొంత కాలంగా వైఎస్‌ఆర్‌సిపి శ్రేణులపైన, నాయకుల పైన అమలవుతున్న రాజ్య నిర్బంధం వారి మధ్య ఉన్న అధికారకాంక్ష నేపథ్యంలో జరుగుతున్న దాడులే. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి అవలంభించిన ఫ్యాక్షనిస్టు రాజకీయాలే నేడు చంద్రబాబు కొనసాగిస్తున్నాడు. మరొక్క మాటలో చెప్పాలంటే అధికారంకై పోటీని లేకుండా చేసుకోవడానికే రాజకీయ కక్ష సాధింపు చర్యలను పాలక వర్గాలు ఒక ఆయుధంగా చేపట్టి కొనసాగిస్తాయి. అందులో భాగంగానే వైఎస్‌ఆర్‌సిపిపై టిడిపి అవలంబిస్తున్న వైఖరీ.

అయితే ప్రజల్లో తమ పట్టు కోల్పోకుండా ఉండేందుకు, వారిలో సానుభూతి పొందేందుకు, ప్రజా సమస్యలపై పోరాడుతున్నందుకే తమపై అధికార పార్టీ దాడులకు తెగబడుతున్నదనీ నమ్మింపచేయడానికి ప్రయత్నిస్తారు. అయితే ఇందులో వాస్తవం లేదా అంటే ఉంది. కానీ అదే ప్రధానం కాదు. వారి మధ్య ఉన్న అధికార కాంక్షే ప్రధానం. అయినప్పటికీ వైరిపక్షం (ప్రతిపక్షం) అభిప్రాయాలు, సూచనలు, సలహాలు పాటించడం ప్రజాస్వామిక ప్రక్రియలో ఒక భాగం. దీన్ని విస్మరిస్తే ఉండేది నియంతృత్వమే.

రాష్ట్ర శాసనసభలో ఏకైక ప్రతిపక్షం వైఎస్‌ఆర్‌సిపియే. దానిపట్ల అధికార పక్షం అహంభావంతో, పెత్తందారీ పోకడలతో వ్యవహరిస్తోంది. ఫలితంగా విధానపరమైన పాలసీల విషయంలో శాసన సభలో అర్థవంతమైన చర్చకు ఆస్కారం లేకుండా పోయింది. చివరకు అధికారపక్షం అనుకున్నదే సర్వస్వంగా, వేదంగా మారిపోయింది. ఎప్పుడైతే ప్రజాస్వామిక ప్రక్రియలో భావాలు స్వేచ్ఛగా చర్చించబడదో అప్పుడు నియంతృత్వమే తలెత్తుతుంది. అదే నేడు రాష్ట్రంలో రాజ్యమేలుతోంది.

ఈ రోజు దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపన్నుల అభివృద్ధి కోసం పీడిత ప్రజల సర్వ హక్కుల్ని బలవంతంగా లాక్కుంటున్నాయి. వాళ్లందరినీ నిర్వాసితబాట పట్టిస్తున్నాయి. మరొక పక్క రాజధాని నిర్మాణం పేరుతో రైతుల పంట భూముల్ని బల ప్రయోగం జరిపి గుంజుకొని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, బహుళజాతి కంపెనీల పాదాల కింద సమాధి చేయబోతున్నారు. ఈ సమాధుల మీద నిర్వాసిత రైతాంగాన్ని బిచ్చగాళ్లుగా నిలబెడుతుందీ రాజ్యం. ఈ పరిస్థితుల్ని సహించలేని ప్రజలు తిరుగుబాటు మార్గం అనుసరించకుండా నిరోధించడానికే రాజ్యం సంస్కరణలు ప్రవేశపెడుతుంది. దాంట్లో భాగమే 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమం. అంతే తప్ప! వాస్తవంగా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించి గౌరవ ప్రదమైన ప్రమాణాలతో కూడిన జీవనాధారాన్ని కల్పించాలనే సదుద్దేశంతో జరుగుతున్నది మాత్రం కాదు. అందుకే ప్రారంభం నుండి 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమం ప్రజల వ్యతిరేకత – నిరసనల మధ్యనే కొనసాగింది. రేపు కూడా కొనసాగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పాలక వర్గాల తప్పుడు విధానాలు, ప్రజా వ్యతిరేక అభివృద్ధి విధానాలు మారనంత వరకు వారు చేపట్టబోయే ఎంతటి ప్రజాకర్షక పథకాలైనా – సంస్కరణలైనా ప్రజల ఆగ్రహావేశాలకు గురికాక తప్పదు.

సామ్రాజ్యవాదం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఉంది. దాని నుండి బయట పడడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఎటువంటి ఫలితాలు సాధించలేని స్థితిలో మరింత క్రూరంగా మత విధానాలను అమలు చేయడం కోసం భారత దోపిడీ పాలక వర్గాలపై తమ ఒత్తిడిని పెంచుతున్నాయి. సామ్రాజ్యవాదులకు సేవ చేయడమే పరమార్థంగా భావించిన నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్రంలో అధికారం చేపట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను అమలు చేయడంలో అత్యంత దూకుడుగా వ్యవహరిస్తోంది. మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా, జన్‌ధన్ యోజన లాంటి అనేక జిమ్మిక్కులతో ప్రజలను మభ్య పెడుతూ, దేశ సంపదను బహుళజాతి కంపెనీలకు, సామ్రాజ్యవాదులకు ధారదత్తం చేసి, తమ ప్రభు భక్తిని చాటుకునేందుకు ప్రయత్నిస్తోంది.

ఈ పరంపరలో ప్రపంచ బ్యాంకు నమ్మిన బంటు చంద్రబాబు రాష్ట్రాన్ని టోకుగా సామ్రాజ్యవాదులకు అమ్మి వేసేందుకు పరుగులు తీస్తున్నాడు. అయితే వాళ్ల ప్రయత్నాలను ప్రజలు వివిధ పద్ధతుల్లో సంఘటితపడి ప్రతిఘటిస్తుండడంతో తమ దోపిడీని యథేచ్ఛగా కొనసాగించలేని స్థితి ఎదురుకాబోతుందనే విషయాన్ని గ్రహించిన పాలకులు ప్రజల నుండి ఏ చిన్న నిరసన ఎదురైనా తీవ్రంగా అణచి వేసేందుకు పూనుకుంటున్నారు. 'జన్మభూమి – మా ఊరు' సందర్భంగా ప్రజల్లో వ్యక్తమైన నిరసన జ్వాలలను చంద్రబాబు సర్కారు ఉక్కుపాదంతో అణచివేసేందుకు విఫల ప్రయత్నం చేసింది. మొత్తం రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ – సామాజిక పరిణామాలు పరిశీలించినట్లయితే ప్రభుత్వం చాలా అసహనంతో వ్యవహరిస్తోంది.

శాంతియుతంగా నిరసన తెలియజేసే స్వేచ్ఛ కూడా లేదు. ప్రభుత్వ పనితీరు పట్ల భిన్నాభిప్రాయం వ్యక్తం చేసే హక్కు లేదు. 'భావ ప్రకటన చుట్టూ ఎన్నో ఇనుప కంచెలు, ఎంతో పోలీసు పహారా' అయినా అవన్నీ సహిస్తూనే నిర్బంధ శిబిరంలోనే పోరాటంకు నడుం భిగించాలి. అందుకే పేద ప్రజలంతా ఆకలి ఎంత సహజమో, అన్నం ఎంత అవసరమో పోరాటాన్ని అంతే అవసరంగా చేసుకోవాలి. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థి, యువజన, మహిళ సమైక్యమై పోరాడాలి. అప్పుడే దోపిడీ వర్గాల కబంధ హస్తాల నుండి విముక్తి లభిస్తుంది. వీ

(రచయిత రాజనీతి శాస్త్ర విద్యార్థి)

'మహా' నేరం తెలంగాణకు శాశ్వత గుదిబండ

మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య గోదావరి నదిపై నిర్మించే ప్రాజెక్టుల వల్ల ప్రజలకు పెద్దగా మేలు జరిగే అవకాశం లేదనీ, పాలకులు కేవలం తమ పబ్బాలు గడుపుకోవడానికే భ్రమలు కల్పిస్తున్నారనీ అంటున్నారు **నైనాల గోవర్ధన్**

మహారాష్ట్రకీ మనకీ మధ్య నదులపై ఉమ్మడి ప్రాజెక్టుల ప్రతిపాదన ఈనాటిది కాదు. దానికి ఎంతో చరిత్ర ఉంది. 6-10-1975న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర సిఎంలు వెంగళరావు, ఎస్.బి. చవాన్‌ల మధ్య ఒప్పందం జరిగింది. 1979లో గోదావరి జల వివాద ట్రైబ్యునల్ తీర్పు వచ్చింది. 1980లో కొన్ని వచ్చాయి. గోదావరిపై సరిహద్దుల్లోని నదులపై గాని ఈ రెండు రాష్ట్రాల్లో ఏదైనా ఒక కొత్త ప్రాజెక్టు నిర్మించుకుంటే పొరుగు రాష్ట్రంతో ఒప్పందం చేసుకోవలసిందే. ప్రాణహిత డిజైన్ మార్చి కొత్తగా మేడిగడ్డ ప్రాజెక్టుకు కెసిఆర్ సన్నద్ధమౌతున్నందునా, తెలంగాణ కొత్త రాష్ట్రమైనందునా, మహారాష్ట్ర సిఎంతో ఒప్పందం చేసుకోవలసి వచ్చింది. ఈ కొత్త ఒప్పందంలో కొత్త మేలు ఏమీ లేదు. 'ప్రాణహిత - గోదావరి' నదులపై గత ఒప్పందాల ఆధారంగానే కుదుర్చుకొన్న స్థూలమైన ఒప్పందం మాత్రమే. ప్రభుత్వం చెప్పేంత 'చారిత్రాత్మకత' కాని, 'మహా' కాని ఏమాత్రం లేదు. ఏ ప్రాజెక్టుపైనా నిర్దిష్టమైన సమాచారం లేదు. ఏ ప్రాజెక్టు ఎత్తు ఎంత, ముంపు ఎంత వంటి అంశాలపై ఎలాంటి స్పష్టతలేదు. కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి ముందు దాని ఎత్తు, ముంపులను తేల్చడానికి హైదరాబాద్‌లో సాగుతున్నట్లు, అనేక సార్లు కింది కమిటీలు చర్చించి ఫైనల్ చేసి, అన్ని అనుమతులు వచ్చాకే తేలుతుంది.

తుమ్మిడిహెట్టి తెలంగాణలో ఏడు జిల్లాలకు ఏనలేని మేలుచేసేది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు కొండంత అండనిచ్చే తుమ్మిడిహెట్టి ప్రధాన ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాలని ప్రభుత్వం ఎందుకు నిర్ణయించింది అన్నదే ప్రశ్న. 152 మీ ఎత్తులో నిర్మిస్తే తెలంగాణకు అనేక ప్రయోజనాలతో పాటు, 80 కి.మీ.లు గ్రావిటీతో నీరు వస్తుంది. ఏటా భారీ విద్యుత్తు వినియోగం, ఖర్చు తగ్గుతుంది. ఒప్పందమైనట్టు ఎత్తు తగ్గిస్తే తెలంగాణకు ఐరావతం అవుతుంది. మేడిగడ్డకు మార్చడంతో, తుమ్మిడిహెట్టి వద్ద ఎత్తు 4 మీ. తగ్గించి 148 మీ. ఎత్తులో నిర్ణయించడం వల్ల మహారాష్ట్రకు తలొగ్గారని తేలుతుంది. తెలంగాణకు ఎనలేని మేలు చేసే ఈ 4 మీ. అతిముఖ్యమైన నిలువు. నూతన రాష్ట్ర ప్రయోజనాలను మహారాష్ట్రకు తాకట్టు పెట్టారన్నది స్పష్టమౌతుంది.

అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకుపోయి ప్రధాని ద్వారా అదే పార్టీ సిఎంను ఒప్పించేట్టు చేయమని ఎన్ని విజ్ఞప్తులు చేసినా మన సిఎం లెక్కచేయరు. పార్టీలు, ప్రజా, రైతు సంఘాలు, ప్రజలు చెప్పినా వినరు. కెసిఆర్ ఏకపక్ష ధోరణితో ఏకైక భారీ గ్రావిటీ కనుమరుగైతుంది. విద్యుత్తు అవసరం కనీసానికి తగ్గి పర్యావరణానికి మేలు చేకూరుతుంది. అతి తక్కువ ఖర్చుతో ప్రాజెక్టు పూర్తయి, తెలంగాణంతటికి నీరందుతూ, మిగిలే వేలకోట్లు బావిజనుల జీవితోద్ధరణకు చెందుతుంది. కెసిఆర్ రీడిజైన్ మేడిగడ్డ 3 బ్యారేజీలతో ఎల్లంపెల్లి వరకు అన్నీ భారీ ఎత్తిపోతలే. ఒక్క అడుగు గ్రావిటీ లేనేలేదు. రాష్ట్ర ఏర్పాటులో తెలంగాణ ప్రదర్శించిన చతురత, తెలంగాణ సిఎం పుణ్యమా అని, 4 మీ. ఎత్తును సాధించడంలో ఆ చతురత ప్రదర్శించలేక పోయిందే అన్న బాధ కలుగుతోంది.

152 మీ. వద్ద మహారాష్ట్రలో 1852 ఎ. ముంపు అని ప్రభుత్వం తేల్చింది. మహారాష్ట్ర భూమి ఒక్క ఎకరం కూడా ముంపుకు గురికాకుండా మేడిగడ్డలో ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు కెసిఆర్. మేడిగడ్డ వద్ద 103 మీ ఎత్తులో, మహారాష్ట్రలో ముంపు గురయ్యే భూమి 3075 ఎ. పైగా ఈ మహారాష్ట్ర భూముల విలువ చాలాఎక్కువ. తుమ్మిడి సమీపంలోని మహారాష్ట్ర భూమి ఖరీదైనది కాదు. మేడిగడ్డలో 3075 ఎ భూమి ముంపుకు అంగీకరించే మహారాష్ట్ర ప్రభుత్వం, తుమ్మిడి వద్ద ఏ ప్రయోజనంలేని 1852 ఎకరాల ముంపు భూమిని మహారాష్ట్ర ఎందుకు అంగీకరించదో ఎవరికి అర్థం కాదు. అన్ని ఎత్తులలో మేడిగడ్డ కంటె తుమ్మిడిహెట్టి వద్దే ముంపు తక్కువ. అక్కడ అంగీకరిస్తే ఇక్కడ ఎందుకు అంగీకరించదు. దీనిలోని మతలబుఏమిటి?

గతంలో ప్రాణహిత-చేవెళ్ల 38,500 కోట్లు. మేడిగడ్డ ఖర్చు 75 వేలకోట్లకు ఎందుకు పెరిగింది? నిపుణుల అంచనా 83 వేల కోట్లు. ప్రాజెక్టు ఖర్చు రెండింతలు పెంచడంలోని పరమార్థం ఏమిటి? ఇందులో ఎవరికి ఎలాంటి స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయి? ఈ కుట్ర వెనుక ఉన్న కథా రచయితలు, పాత్రధారులు ఎవరు?

1. భారీ నీరు పల్లమెరుగుననే ఏకైక ప్రాజెక్టు తెలంగాణలో ఒక్క తుమ్మిడిహెట్టి మాత్రమే. దానికి ఈ కొత్త ఒప్పందం గొడ్డలి పెట్టు. తెలంగాణకు ప్రాణహిత, ఇంద్రావతి తప్ప గతిలేదంటూనే తుమ్మిడిని ఎందుకు కర్కశంగా బలిపెడుతున్నారు? 2. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మేడిగడ్డ ఒక శాశ్వత గుదిబండ. 'చరిత్రాత్మక ఒప్పందం కాదు, చరిత్రాత్మక నేరం ఇది.' సాగునీటి అక్షరాస్యత లేని తెలంగాణ సామాన్య జనాన్ని ఎందుకు మోసం చేస్తున్నట్టు? ప్రజల పన్నులకు శాశ్వత కన్నం ఎందుకు వేస్తున్నారు? 3. 'పెనుముప్పుగా మారిన వాతావరణ మార్పులలో ప్రజలు పిట్టల్లా రాలుతుంటే మేడిగడ్డ 3 బారేజీలు భారీ పర్యావరణ విపత్తు' కాదా?'

4. నాగార్జునసాగర్‌ను 20-25 కి.మీ దిగువన కట్టి నల్గొండకు అన్యాయం చేసారని తెలంగాణ గొంతెత్తుతుంది. స్వరాష్ట్రంకై పోరాడి ఏర్పడిన ప్రభుత్వమే తుమ్మిడి నుండి మేడిగడ్డకు తరలించి 50-60మీ. క్రిందికి, 125 కి.మీ. దిగువన ప్రాజెక్టు నిర్మాణాన్ని తలపెట్టడాన్ని ఏమనాలి? తెలంగాణ ఆర్థికవ్యవస్థను శాశ్వతంగా నాశనం చెయ్యడం కాదా? భవిష్యత్తరాల వేలకోట్ల నిధులకు నీళ్లు వదలడం కాదా? నిర్వహణా ఖర్చును మోయలేనంతగా పెంచి, ఏదోరోజు ఆగిపోయేట్టుచేసి, ప్రజలకు నీళ్లివ్వకుండా చేయడమే కదా!

5. తుమ్మిడిహెట్టి 152 మీ.వద్ద గ్రావిటీతో పైసా ఖర్చులేకుండా 120-160 టి.యం.సి.ల నీటిని 80 కి.మీ. తరలించవచ్చు. మేడిగడ్డ 3 బారేజీలలో ఒక్కఅడుగైనా నీరు పల్లమెరుగుతుందా? దిగువున మిగిలే నీటిని మరో అనువైన చోటునుండి ఎత్తిపోతలతో తరలించుకోవచ్చు. ఇంత విలువైన తుమ్మిడిహెట్టిని అప్రధానంగా ఎందుకు మారుస్తున్నారు. మొత్తం 70-80 మీటర్ల ఎత్తిపోతలపైనే ఆధారపడిన, గ్రావిటీ ఏమాత్రమూ లేని మేడిగడ్డను ఎందుకు తెలంగాణ జనుల నెత్తిపైఎత్తుతున్నారు? తెలంగాణ ప్రజాధనాన్ని ఏటా ఎందుకు నీళ్లపాలు చేస్తున్నారు?

తుమ్మిడిహెట్టిలో నీటిలభ్యత లేక మేడిగడ్డకు మార్చుతున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తోంది. సి.ఎం. అసెంబ్లీలో సమాధానమిస్తూ ప్రాణహిత నుండి తీవ్ర కరవులో 2015-16లో 1470 టియంసిల నీరు కాళేశ్వరం గోదావరి నుండి సముద్రంలో కలిసిందన్నారు. మార్చి 22న నమస్తే తెలంగాణ పత్రికలో ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుండి 1400 టిఎంసిల నీరు సముద్రంలో కలిసినట్లు ప్రకటించింది. లభ్యత లేకపోవడమేమిటి? కరవులో సముద్రంలో కలవడమేమిటి? విచిత్రంగా ఉన్నాయి కదా సిఎం విరుద్ధ, వింత ప్రకటనలు. ప్రభుత్వం చెబుతున్నట్లు తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేనిది నిజమేనా? మరి ఇన్ని నీళ్లు కాళేశ్వరంకు ఎక్కడి నుంచి వచ్చాయి? ప్రాణహిత పొడవు 113 కి.మీ. పెనుగంగతో కూడిన వార్ధ నది, వైన్‌గంగల సంగమంతో ప్రాణహిత తుమ్మిడిహెట్టి వద్ద ఏర్పడుతుంది. ఈ నదులు మధ్యప్రదేశ్, మహారాష్ట్రల నుండి తెలంగాణ గుండా ప్రవహిస్తున్నాయి. ఏఏ ఉపనదులూ, నదులూ ప్రాణహిత నదికి ఎంతెంత నీరు అందిస్తునాయి అనేది అత్యంత కీలకమైనది. సిఎం ఏనాడూ ఆ వివరాలు ప్రజల ముందుంచలేదు. ప్రాణహిత, ఇంద్రావతి నదులు తప్ప తెలంగాణకు వేరే దిక్కులేదు అని కూడా అన్నారు.

కాళేశ్వరం వద్ద కలిసే ఈ భారీ నీరు ఆకాశంలోంచి వచ్చి పడిందా? కాళేశ్వరం భూగర్భంలోంచి ఉబికి వచ్చిందా?ఈ భారీ నీటిలో ఏఏ నదుల నీరు ఎంతెంత కలిశాయో ప్రజలకు ఎందుకు చెప్పడం లేదు? నీటి లభ్యత ఎంత అనేది మాత్రమే ప్రధానం కాదు. 'లభించిన ప్రతి చుక్క పైసా ఖర్చు లేకుండా ఎంత భారీగా గ్రావిటీతో తరలిస్తున్నాం అనేది, ప్రజలపై ఎంతభారీ భారాన్ని తగ్గిస్తున్నామనేదే కీలకం.' తుమ్మిడిహెట్టి ఎగువ నుంచి వచ్చే మహావరదతో పోలిస్తే దిగువది అతి స్వల్పం మాత్రమే. ప్రాణహిత ఆది-తుది ఇరువైపుల వరదను నిశితంగా పరిశీలిస్తే తుమ్మిడిహెట్టి వద్ద వచ్చే వరదే, ప్రధానంగా కాళేశ్వరంలో కనిపించేదని తెలుస్తోంది. తుమ్మిడిహెట్టి నుండి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని భారీ ప్రవాహాలు, వాగులపై ప్రాజెక్టులు నిర్మించడమో, పెండింగులో ఉండడమో ప్రతి ప్రవాహంపై జరిగింది. ఆయకట్టు పునరుద్దరణ మాత్రం జరగలేదు. ఇది జరిగితే కాశేశ్వరంకు వచ్చే నీరు పెద్దగావుండనేఉండదు. 2004లో 'గోదావరి వాటర్ స్టడీస్' పేరిట వాప్‌కోస్ చేసిన సర్వే ప్రకారం తుమ్మిడిహెట్టి వద్ద 273 టిఎంసిల నీరు లభిస్తుంది. తెలంగాణ పాలకుల కొత్త ప్రాజెక్టులు-భారీబడ్జెట్ పథకాల కుట్రలకు తలొగ్గి నివేదికలు తలక్రిందులు చేసి మేడిగడ్డకు ఓకే చెప్పేసింది అదే వాప్‌కోస్. ఇలా వచ్చినోళ్లల్లా కొత్త ప్రాజెక్టులే. పెండింగువి కలకాలం పెండింగే.

కెసిఆర్ బొగ్గు గనులు అడ్డువస్తున్నాయనేది గతంలో ఎన్నడూ ప్రస్తావించనేలేదు. బొగ్గు గనుల ఆటంకం గురించి సరికొత్త బాణం వదిలారు. తుమ్మిడిహెట్టి నుండి ఎల్లంపెల్లి వరకు ప్రాణహిత కాలువ తొలి పొడవు 116 కి.మీ. మందమర్రి మండలంలోని కొన్ని గ్రామాలలో పాత కాలువ నమూనాలో బొగ్గు ఉన్నమాట నిజమే. అనాడే సింగరేణి విజ్ఞప్తి మేరకు బొగ్గును తప్పించి, మరో 10 కి.మీ. కాలువ పొడవును పెంచి కొత్త అలైన్‌మెంటు రూపొందించడమూ, నాటి నీటిపారుదల మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆ పనికి అనుమతులు ఇవ్వడమూ జరిగిపోయింది. వాస్తవం ఇలా ఉండగా సి.ఎం.సభను దారిమళ్లించడం సబబుగా ఉందా?

తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకి బదులు మేడిగడ్డ ప్రాజెక్టును రీ డిజైన్ చేయడానికి ముందు కెసిఆర్ మరో డిజైన్ ఆలోచించారు. అది సిఎం మొదటి రీడీజైన్. గోదావరిఖని గనుల గుండా గోదావరి జలాలను టన్నెల్ - కాలువ ద్వారా తరలించే పథకం. దానికి 150 ఆటంకాలొచ్చాయి. లైడార్ సర్వేతో పదుల కోట్లు ఖర్చు చేసి ఆపథకాన్ని రద్దుచేశారు. తుమ్మిడిహెట్టికి అన్ని ఆటంకాలూ ఎదురేరావు. ఆసంక్లిష్టత ఇక్కడ అసలేలేవు.

'తుమ్మిడిహెట్టి వద్ద ధవలేశ్వరంకు వెళ్లే నీళ్ల కొరకే అంతరాష్ట్ర వివాదాల పీటముడులు వేసారని, అసెంబ్లీలో సిఎం మరో విసురు విసిరారు.' గోదావరిపై తెలంగాణలోనూ, ఎపి లోనూ ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ధవలేశ్వరానికి పోయే నీళ్లను ఎవరూ ఆపలేరు. ఎందుకంటే తెలంగాణ ఎత్తుప్రాంతం. ఎత్తిపోతల అవసరం ఇక్కడో గుదిబండహద్దు. ప్రాణహిత తీరంలో తుమ్మిడి వద్ద మాత్రమే ఏకైక గ్రావిటీ సాధ్యం. తుమ్మిడిహెట్టికి, ధవలేశ్వరానికి ముడిపెట్టడం అంటే ఏటా సముద్రంలో కలిసే 3-4 వేల టియంసిల నీరు చెబుతున్న సత్యాన్ని దాచేయడమే. పోలవరం ప్రాజెక్టు వల్ల 270 గ్రామాలు అనేక మండలాలు మునుగుతున్నాయి. లక్షకు పైగా ప్రజలు నిర్వాసితులు అవుతున్నారు. లక్ష ఎకరాలకు పైగా అడవి మునుగుతోంది. దాని ముందు తుమ్మిడి వద్ద వుపయోగంలో లేని 1852 ఎకరాల ముంపు ఏపాటిది? ఒక్క ఇల్లు కూడా మునగదు. తెలంగాణ అంతటికీ ఎంతో మేలుచేసే ఈ ప్రాజెక్టును సమైక్యంగా పోరాడి సాధించుకోవచ్చు. తెలంగాణ ప్రత్యేకరాష్ట్రం సాధించుకోవడం కంటే ఇది అసాధ్యమా? ఏమాత్రం కాదు. ప్రాణహిత తుమ్మిడిహెట్టికి కేంద్రం నుంచి ఇప్పటికే చాలా అనుమతులొచ్చాయి. మేడిగడ్డ మళ్లీ పూర్తి కొత్త ప్రాజెక్టే అవుతుంది. తుమ్మిడిహెట్టి నుండి ఎల్లంపెల్లి వరకు 5 పాకేజీలు కలిపి 5 వేలకోట్ల ఖర్చు అనేది అతి ముఖ్య విషయం.

ఈ ప్రాజెక్టు మొత్తం ఖర్చు 38,500 కోట్లు. మేడిగడ్డ ఆధారిత ప్రాజెక్టు 75 వేల కోట్లు. నిపుణులు 83 వేలు కోట్లంటున్నారు. ప్రాజెక్టు మార్చడంతో 3 బ్యారేజీల నిర్మాణానికి, భారీ రివర్సబుల్ పంప్‌సెట్స్ పేర వేల మె.వా. కరెంటు, 8 వేలకోట్ల ప్రజాధనమూ, వృధా అవుతాయి. ఇక్కడ ఖర్చు చేయదలుచుకొన్న ప్రతి పైసా తెలంగాణ జనుల జీవితాల ఉన్నతికి ఉపయోగపడాలి. ఇన్ని వేలకోట్లు వెచ్చించినా, ఒక్క ఎకరం గతం కంటె ఎక్కువ సాగవుతుందా అంటే, అదీలేదు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీ.సాధించుకునే లక్ష్యంతో మహారాష్ట్రతో మనం ముందుకు వెళ్లాలి. 1852 ఎకరాల ముంపుకు గురయ్యే జనులకు ప్రపంచం మెచ్చే ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వవచ్చు.

(రచయిత తెలంగాణ జల సాధన సమితి నాయకులు) వీ

పెట్టుబడి అక్రమాల సహజ దుష్ఫలితం పనామా

పనామా పేపర్స్ వెల్లడితో బైటపడిన అక్రమ నిధుల, విదేశీ వ్యాపార సంస్థల కుంభకోణానికి మూలాలు పెట్టుబడిదారీ దోపిడీలోనే ఉన్నాయంటున్నారు ఎన్. వేణుగోపాల్

వేరువేరు దేశాల ధనికులు పనామాలోని ఒక న్యాయసలహా సంస్థ ద్వారా దాచుకున్న, లావాదేవీలు జరుపుతున్న అక్రమ నిధుల కుంభకోణానికి సంబంధించి అమెరికాలోని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే ఇంటర్నేషనల్ కన్సార్షియం ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్స్ (ఐసిఐజె) అనే అంతర్జాతీయ సంస్థ ఏప్రిల్ 3న విడుదల చేసిన పరిశోధనాంశాలు ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపాయి. ఎందరో రాజకీయ నాయకులు, అధికారులు, క్రీడా, సినిమా, వినోద రంగాల ప్రముఖులు, వ్యాపారవేత్తలు, మాదక ద్రవ్యాల వ్యాపారులు, ఆయుధ వ్యాపారులు, ఘరానా మోసగాళ్లు, మనుషుల ఎగుమతిదారులు తమ అక్రమ నిధులను చలామణీ లోకి తేవడానికి ఏయే అక్రమాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారో ఈ పరిశోధనలో తేలింది.

ఐసిఐజె, జర్మన్ వార్తాపత్రిక జూయ్‌డాటిచ్ జైటుంగ్, వివిధ దేశాల లోని వందకు పైగా వార్తా సంస్థలు సమష్టిగా ఎనిమిది నెలల పాటు సాగించిన పరిశోధన ఫలితంగా బైటపడిన ఈ కుంభకోణం ప్రధానంగా పనామా కేంద్రంగా సాగిన గూడుపుఠానీని బైటపెట్టింది గనుక దాన్ని పనామా పేపర్స్ అని పిలుస్తున్నారు. మొదట జర్మన్ వార్తాపత్రికకు ఒక అజ్ఞాత వ్యక్తి నుంచి అందిన పత్రాలను ధ్రువీకరించడానికి, విశ్లేషించడానికి ఆ పత్రిక ఐసిఐజె సహాయం కోరింది. పనామా లోని మొసాక్ ఫొన్సెకా అనే న్యాయసలహా సంస్థలో దొరికిన ఆ పత్రాలను 76 దేశాలకు చెందిన 370 మంది జర్నలిస్టులు పరిశీలించారు.

మొసాక్ ఫొన్సెకా కు హాంగ్ కాంగ్, మియామి, జూరిచ్ లతో సహా 35 చోట్ల శాఖలున్నాయి. అక్రమాలకు ముసుగుగా పనిచేసే బినామీ సంస్థలను సృష్టించడం, వాటి ద్వారా ఆస్తులను, కంపెనీల యాజమాన్యాలను ఒకరి నుంచి ఒకరికి బదిలీ చేయడం, వాస్తవ యజమానులెవరో దాచి ఉంచే మార్గాలు చెప్పడం ఈ సంస్థ పని. ఏ వ్యక్తి అయినా, సంస్థ అయినా విదేశాల్లో కంపెనీ ఏర్పాటు చేయడం దానికదిగా చట్టవ్యతిరేకం కాదు గాని, అలా ఏర్పాటు చేయడానికి పాటించవలసిన నిబంధనలు ఎన్నో ఉంటాయి. ఆ కంపెనీ ఎన్ని నిధులతో ఏర్పాటవుతున్నది, ఆ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి, ఆ కంపెనీ ఏ వ్యాపారం చేయబోతున్నది వంటి వివరాలు పారదర్శకంగా ఉండాలి. కాని పనామా పన్నురహిత స్వర్గం గనుక అక్కడ ఈ వివరాలేమీ అవసరం లేదు. ఉన్న కొద్దిపాటి నిబంధనలను కూడ ఎట్లా అధిగమించ వచ్చునో తన కక్షిదారులయిన అక్రమ సంపన్నులకు సలహాలు ఇవ్వడమే మొసాక్ ఫొన్సెకా పని. నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పకుండా, కంపెనీ డైరెక్టర్లుగా దొంగ పేర్లు నమోదు చేయించి, ఏ ఉత్పత్తీ, వ్యాపారమూ చేయకుండానే కోట్లాది డాలర్ల లావాదేవీలు నడిపే కంపెనీలను తయారు చేయడం మొసాక్ ఫొన్సెకా పని. వాటిని ముసుగు కంపెనీలు అంటారు. అక్రమ ధనాన్ని చలామణీలోకి తేవడం మినహా ఈ కంపెనీలు చేసే ఉత్పత్తులు గాని, వ్యాపారాలు గాని ఏమీ లేవు గనుక, ఈ కంపెనీల జీవితకాలం కూడ ఎక్కువగా ఉండదు. కొన్ని రోజులో, వారాలో, నెలలో బతికి, చేయదలచుకున్న పని చేసి, కనబడకుండా పోతాయి. కొనుక్కుంటామని వచ్చినవాళ్లకు కంపెనీలు తయారుచేసి అమ్మడమే తప్ప, ఆ కంపెనీలతో వారు ఏమి చేసుకుంటారో తమకు సంబంధం లేదని మొసాక్ ఫొన్సెకా స్థాపక యజమానులలో ఒకరైన రామోన్ ఫొన్సెకా బహిరంగంగానే చెప్పాడు. “కార్ల కర్మాగారం కార్లు అమ్మినట్టే మేం కంపెనీలు అమ్ముతాం. ఆ కారును దొంగతనానికి వాడితే కార్ల కంపెనీకి నేరం అంటగడతారా” అని కూడ ప్రశ్నించాడు.

మొసాక్ ఫొన్సెకా కేవలం న్యాయ సలహా సంస్థ మాత్రమేనని, అంతకు మించి తన కక్షిదార్ల అక్రమవ్యాపారాలతో దానికి సంబంధం లేదని చూపడానికి ఒక ఆధారంగా ఈ కంపెనీ సెషెల్స్‌లో తెరిచిన 14,086 ముసుగు కంపెనీలలో కేవలం 204 విషయంలో మాత్రమే ఆ కంపెనీల నిజమైన యజమానులెవరో మొసాక్ ఫొన్సెకా తెలుసుకుందని పత్రాలు చెపుతున్నాయి. కాని, మరొకవైపు 1983లో లండన్‌లో జరిగిన ఒక భారీ దొంగతనంలో దొంగలు ఎత్తుకుపోయిన 7,000 బంగారు కడ్డీల డబ్బు మొసాక్ ఫొన్సెకా ఏర్పరచిన కంపెనీ ద్వారానే చలామణీలోకి వచ్చిందని, ఆ కంపెనీకి ఒక డైరెక్టర్‌గా మొసాక్ ఫొన్సెకా స్థాపకుడు కూడ ఉన్నాడని, ఈ అక్రమ లావాదేవీ అంతా మొసాక్ ఫొన్సెకాకు తెలిసే జరిగిందని కూడ ప్రస్తుతం బైటపడిన పత్రాలు రుజువు చేస్తున్నాయి. అలాగే బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా వంటి ఎన్నో దేశాలలో బైటపడిన భారీ కుంభకోణాల నిందితులు మొసాక్ ఫొన్సెకా సహాయంతోనే విదేశీ కంపెనీలు తెరిచి, తమ అక్రమ నిధులను సక్రమ నిధులుగా మార్చుకున్నారు.

పన్నులు చెల్లించకుండా, వనరులు చూపకుండా పోగుచేసే అక్రమ నిధులను దాచుకోవడానికీ, చలామణీలోకి తేవడానికీ సలహాలు ఇచ్చే ఈ బడా అంతర్జాతీయ న్యాయ సలహా సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి ఐసిఐజెకు ఒక కోటీ పదిహేను లక్షల రహస్య పత్రాలు దొరికాయి. దొరికిన పత్రాలలో ఇ మెయిల్ సందేశాలు, ఆర్థిక ఖాతాల, లావాదేవీల పత్రాలు, గణాంకాలు, పాస్ పోర్టులు, కార్పొరేట్ పత్రాలు వంటివెన్నో ఉన్నాయి. ఆ పత్రాలన్నిటినీ సంపూర్ణంగా విశ్లేషించిన తర్వాత అక్రమ నిలువదార్ల పూర్తి జాబితా మే 9న విడుదల చేస్తామని చెప్పిన ఐసిఐజె ఏప్రిల్ 3న తొలివిడతగా ప్రధాన, సంచలనాత్మక అంశాలను మాత్రం వెల్లడించింది. ఆ పత్రాల ప్రకారం మొసాక్ ఫొన్సెకా 200 దేశాలకు చెందిన ధనికుల కోసం 2,14,488 ముసుగు కంపెనీలను ఏర్పాటు చేసింది. ఈ కంపెనీలు పనామాలో మాత్రమే కాక నెవాడా, సింగపూర్, బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్ లతో సహా 21 విదేశీ స్థావరాలలో ఏర్పాటయ్యాయి. బైటపడిన పత్రాలు 1977 నుంచి 2015 వరకు నలభై సంవత్సరాలలో 500 బ్యాంకుల ద్వారా, 14,000 మధ్యవర్తి, ద్రవ్య, న్యాయసలహా సంస్థలతో సంబంధాల ద్వారా జరిగిన ఎన్నో

రకాల లావాదేవీలను వెల్లడిస్తున్నాయి. కనీవినీ ఎరగని విధంగా ప్రతి రోజూ అక్రమ నిధుల ప్రవాహాలు, కంపెనీల ఏర్పాటు, కంపెనీల విలీనం, కొనుగోళ్లు, అమ్మకాలు ఎలా జరిగాయో తెలియజేస్తున్నాయి.

తొలి విడత జాబితాలో ప్రస్తుతం పదవిలో ఉన్న, లేదా పదవీ విరమణ చేసిన 12 మంది అగ్రశ్రేణి ప్రపంచ నాయకులతో పాటు 128 మంది రాజకీయ నాయకుల, ప్రజాజీవిత ప్రముఖుల అక్రమ సంపదల లావాదేవీల వివరాలున్నాయి. ఈ తొలి జాబితాలో రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్, అర్జెంటీనా అధ్యక్షుడు మారిసియో మాక్రి, ఐస్ లాండ్ ప్రధానమంత్రి సిగ్మండర్ డేవిడ్ గన్లాగ్సన్, సౌదీ అరేబియా రాజు సల్మాన్ బిన్ అబ్దులజీజ్ బిన్ అబ్దుల్ రహమాన్ సౌద్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు ఖలీఫా బిన్ జావేద్ అల్ నహ్యాన్, చైనా అత్యున్నత నాయకుడు క్సి జిన్ పింగ్, యుక్రెయిన్ అధ్యక్షుడు పెట్రో పొరొషెంకో, ఇరాక్ మాజీ ప్రధాని అయాద్ అల్లావి, ఖతార్ మాజీ ఎమిర్ హమద్ బిన్ ఖలీఫా అల్ థాని, సూడాన్ మాజీ అధ్యక్షుడు అహ్మద్ అల్ మిర్ఘాని, జార్జియా మాజీ ప్రధాని బిడ్జినా ఇవానిష్విలి, ఇటలీ మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోని, జోర్డాన్ మాజీ ప్రధాని అలీ అబు అల్ రఘెబ్, పాకిస్తాన్ మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో, యుక్రెయిన్ మాజీ ప్రధాని పావ్లో లాజరెంకో, మాల్డోవా మాజీ ప్రధాని ఇవాన్ స్టుర్జా లతో పాటు బ్రిటన్ ప్రధాన మంత్రి డేవిడ్ కామెరూన్, అజర్ బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలీయెవ్, పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్, సిరియా అధినేత బషార్ అల్ అసద్, ఐక్యరాజ్య సమితి మాజీ ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ ల కుటుంబ సభ్యులు కూడ ఉన్నారు.

దాదాపు వెయ్యి మంది భారతీయుల పేర్లు కూడ తొలి విడత పనామా పేపర్స్ లో ఉన్నాయి. వాటిలో ఢిల్లీ లోక్ సత్తా నాయకుడు అనురాగ్ కేజ్రీవాల్, గోవా మాజీ శాసనసభ్యుడు అనిల్ వాసుదేవ్ సల్గావ్ కర్, కర్నాటకకు చెందిన మాజీ మంత్రి అల్లుడు, వ్యాపారవేత్త రాజేంద్ర పాటిల్, మాజీ అటార్నీ జనరల్ సోలి సోరాబ్జీ కొడుకు, బొంబాయి హాస్పిటల్ వైద్యుడు జహంగీర్ సోలి సోరాబ్జీ, కాంగ్రెస్ నాయకుడు ఎన్ కె పి సాల్వే కొడుకు, మాజీ సొలిసిటర్ జనరల్ హరీష్ సాల్వే, ప్రఖ్యాత సినీ నటుడు అమితాబ్ బచ్చన్, ఆయన కోడలు, నటి ఐశ్వర్యా రాయ్ బచ్చన్, వ్యాపారవేత్తలు వినోద్ అదాని, శిశిర్ బజోరియా, రతన్ చద్దా, ఆబాసాహెబ్ గర్వారే కుటుంబం, ఓంకార్ కన్వర్, మోహన్‌లాల్ లోహియా, అబ్దుల్ రషీద్ మీర్, జవారే పూనావాలా, కెపి సింగ్, మల్లికా శ్రీనివాసన్‌లతో పాటు మోటూరి శ్రీనివాస్, భావనాశి జయకుమార్, భాస్కర్ రావు అనే తెలుగు వ్యాపారవేత్తల పేర్లు కూడ ఉన్నాయి. ఇక మిగిలిన పేర్లు ప్రముఖులవి కావు గనుక బైటికి రాలేదు గాని, అవి నిజానికి ప్రముఖుల బేనామీ పేర్లు కావచ్చు. ఉదాహరణకు ముందు కొంతకాలం ఐశ్వర్య రాయ్ పేరుతో నడిపిన లావాదేవీలను, "భద్రతా కారణాల దృష్ట్యా" ఇకముందునుంచి "ఎ. రాయ్" పేరుతో నడపాలనే పత్రం కూడ దొరికింది. ఈ పత్రం లేకపోతే "ఎ. రాయ్" ఎవరో ఎవరికీ ఊహకు కూడ అందేది కాదు. అలా పొడిపేర్లతో, మారుపేర్లతో, తమ బంధువుల, ఆశ్రితుల, నమ్మకస్తుల పేర్లతో ఎన్నెన్ని లావాదేవీలు జరిగాయో కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. ఇలా కచ్చితమైన సమాచారం లేనప్పుడు సహజంగానే ఊహాగానాలకు ఎక్కువ అవకాశం ఉంటుంది.

ఈ అక్రమ సంపద నిలువదారులందరూ తమ తమ దేశాల్లో పన్నులు ఎగగొట్టి, చట్టవ్యతిరేకమైన పద్ధతుల్లో సంపద పోగు చేసుకుని, రాజకీయాధికారాన్ని ఉపయోగించి ముడుపులు సంపాదించి, అలా పోగుపడిన అక్రమ సంపదను చలామణీలోకి తేవడం కోసం పనామాలో ఊరూపేరూ లేని వ్యాపార సంస్థలను సృష్టించారు. పనామా మధ్య అమెరికాలోని 75,000 చ.కి.మీ. విస్తీర్ణం గల, నలభై లక్షల జనాభాగల, అమెరికా ఛత్రఛాయలోని అతి చిన్న దేశం. స్విట్జర్లాండ్, లక్జెంబర్గ్, నెదర్లాండ్స్, ఐసిల్ ఆఫ్ మాన్, బెర్ముడా, బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్, కేమాన్ ఐలాండ్స్, బహామా, మారిషస్ వంటి ఎన్నో దేశాల ప్రభుత్వాలు, అక్కడి బ్యాంకులు ఇటువంటి అక్రమ సంపద దాచుకోవడానికి, దాన్ని మళ్లీ చలామణీలోకి తేవడానికి సహకరిస్తున్నాయి. అక్రమ నిధుల తరలింపు జరుపుతున్న వారికీ, ఈ దేశాల బ్యాంకులకూ మధ్య అనుసంధానం కుదిర్చే పనిని పనామా చేస్తుంది. పనామాలో 15,600 దొంగ కంపెనీల పేర్లు నమోదు చేసి ఈ అక్రమ సంపద నిలువ చేయడానికీ, చేతులు మార్చి, చలామణీలోకి తేవడానికీ బ్యాంకులు వీలు కల్పించాయని, ఆ బ్యాంకులతో ఆ కంపెనీల తరఫున మొసాక్ ఫోన్సెకా వ్యవహరించిందనీ ప్రస్తుత పరిశోధనలో బైటపడిన పత్రాలు చూపుతున్నాయి. ఈ అక్రమాలన్నీ సజావుగా సాగిపోవడానికి స్థానిక బ్యాంకులు మాత్రమే కాక స్విట్జర్లాండ్ కు చెందిన ద్రవ్యసంస్థ యుబిఎస్, హాంగ్‌కాంగ్ అండ్ షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎచ్ఎస్‌బిసి) వంటి పేరున్న బ్యాంకులు కూడ సహకరించాయని పత్రాల్లో బైటపడింది.

ఐసిఐజె తొలి ప్రకటన వెలువడగానే ప్రపంచమంతా గగ్గోలు మొదలయింది. ఎన్నో దేశాల ప్రభుత్వాలు తమ తప్పేమీ లేదని ఖండన ప్రకటనలు చేశాయి. జాబితాలో పేర్లున్నవారు తమకు అసలు పనామాతో, పనామాలో నమోదైన కంపెనీతో సంబంధమే లేదని ప్రకటించారు. ఐస్‌లాండ్ ప్రధాని రాజీనామా చేశాడు. కొన్ని దేశాల ప్రభుత్వాలు విచారణకు ఆదేశించాయి. ఆయా దేశాల పత్రికలలో, ప్రచార సాధనాల్లో కొద్ది రోజుల పాటు గగ్గోలు జరిగింది. కాని ఈ చర్యలన్నీ కూడ పైపై పూతలే తప్ప అసలు కారణాలను అన్వేషించి వాటిని రూపుమాపడానికి ప్రయత్నాలు కావు. ఇంతకీ సమస్య ఒక్క మొసాక్ ఫోన్సెకా ద్వారా జరిగిన లావాదేవీలో, ఒక్క పనామాలో బైటపడిన పత్రాలో కావు.

మొసాక్ ఫోన్సెకా ఇటువంటి అక్రమాలను నిర్వహించే వేలాది ద్రవ్య వ్యాపార, న్యాయసలహా సంస్థలలో ఒకానొకటి మాత్రమే. పనామా ఇటువంటి అక్రమాలకు సౌకర్యాలు, వెసులుబాటు కల్పించే డజన్ల కొద్దీ పన్నురహిత స్థావరాలలో, అక్రమ సంపద ఆశ్రయాలలో ఒకానొకటి మాత్రమే. ఒక ఆర్థికవేత్త అంచనా ప్రకారం కేమాన్ ఐలాండ్స్ అనే అతి చిన్న పన్నురహిత స్థావరం ఒక్క చోటనే బ్రిటన్ సంపదతో సమానమైన సంపద పోగుపడి ఉంది. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్నీ శాసించగల, అతలాకుతలం చేయగల శక్తి ఈ అత్యల్ప సంఖ్యాక పన్నురహిత దేశాల పరాన్నభుక్కు నేరప్రపంచ నేతల చేతుల్లో పోగు పడుతోందనీ, అది ప్రపంచ మానవాళి మనుగడకే ప్రమాదకరమనీ ఆయన అన్నారు.

ఈ పనామా పత్రాలలో గుర్తించవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి. వాటిలో మొట్టమొదటిదీ, కొట్టవచ్చేటట్టు కనబడుతున్నదీ ఈ పత్రాలలో అమెరికా లేదు, అమెరికాకు చెందిన సంపన్నులెవరూ కూడ మొసాక్ ఫోన్సెకా ద్వారా ముసుగు కంపెనీలను ఏర్పాటు చేసి తమ అక్రమ ధనాన్ని చలామణీ చేయాలని అనుకున్నట్టు లేరు. ఇది ఆశ్చర్యకరమైన విషయం. కొన్ని అమెరికా అనుకూల దేశాల నాయకుల ప్రస్తావనలు ఉన్నప్పటికీ, ప్రధానంగా ఈ పత్రాలన్నీ అమెరికా వ్యతిరేక ప్రముఖుల మీద, దేశాల మీద మాత్రమే కేంద్రీకరించాయి. ఇది ఆయాదేశాల నుంచి అనుమానాలనూ, ప్రశ్నలనూ రేకెత్తించింది. అమెరికా, అమెరికన్ అక్రమ సంపన్నులు లేకపోవడం దానికదిగా అనుమానాస్పదమే గాని, అందువల్ల పత్రాలలో వెల్లడవుతున్న విషయాలు అబద్ధాలైపోవు.

రెండు, ఈ వార్త వెల్లడి పరిశోధనాత్మక జర్నలిజానికీ, సమన్వయ, సహకార జర్నలిజానికీ కాలం చెల్లిపోతున్న రోజుల్లో ఒక విశిష్ట ప్రయోగం. సాధారణంగా జర్నలిజంలో పరిశోధనాత్మకత తగ్గిపోతున్నప్పుడు, అధికార, సంపన్న వర్గాలు ఇచ్చిన వార్తలే, వారి ప్రయోజనాలకు దెబ్బతగలని వార్తలే వార్తలుగా చలామణీ అవుతున్నప్పుడు, ఇంత పెద్ద ఎత్తున సంపన్నుల ప్రయోజనాలను దెబ్బతీసే వార్తల పరిశోధన జరగడం, అది కూడ ఎనిమిది నెలలపాటు నిరాటంకంగా జరగడం అభినందనీయ మైన విషయం. అలాగే, ఆధునిక జర్నలిజంలోని కుత్తుకలు కత్తిరించుకునే పోటీ వల్ల, తమకు మాత్రమే ఆ కీర్తి దక్కాలనే కండూతి వల్ల ఏ ఇద్దరు జర్నలిస్టులూ, ఏ రెండు పత్రికా సంస్థలూ కలిసి సమన్వయంతో, సహకారంతో పనిచేయడం సాధ్యం కాని స్థితిలో 76 దేశాల, వంద వార్తా సంస్థలకు చెందిన 370 మంది జర్నలిస్టులు కలిసి చేసిన ఉమ్మడి కృషిగా ఈ పనామా పేపర్స్ వెల్లడికి చాల ప్రాధాన్యత ఉంది.

మూడోదీ, అన్నిటికన్న ముఖ్యమైనదీ పనామా పేపర్స్ ఉదంతం ద్వారా పెట్టుబడిదారీ విధానం స్వాభావికంగానే ఎంత మోసపూరిత మైనదో మరొకసారి బైటపడింది. ఇది ఏదో కొందరు సంపన్నులు తమ దేశంలో పన్ను ఎగగొట్టడం, పన్నులు లేనిచోట దాచుకోవడం, మళ్లీ చలామణీలోకి తేవడం అనే నీతి–అవినీతి, చట్టబద్ధత–చట్టవ్యతిరేకత సమస్య కాదు. ఇది పెట్టుబడిదారీ విధానానికీ, సామ్రాజ్యవాదానికీ, ప్రపంచీకరణకూ, బహుళ జాతి సంస్థల ఆధిపత్యానికీ ప్రత్యక్ష పర్యవసానం. ఉత్పత్తి సాధనాల మీద వ్యక్తిగత యాజమాన్యం, అందువల్ల శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వకుండా శ్రమశక్తిని దోచుకునే అవకాశం, అలా సొంతం చేసుకున్న అదనపు విలువను సొంత సంపదగా విలాసా లకు ఖర్చు పెట్టుకోవడం, ఆ సంపదపై చట్టబద్ధంగా చెల్లించవలసిన పన్ను తక్కువగానే ఉన్నప్పటికీ దాన్ని కూడ చెల్లించడానికి నిరాకరించడం, పన్ను చెల్లింపులో చూపకపోవడం వల్ల ఆ సంపద అక్రమ సంపదగా మారిపోవడం, దాన్ని సక్రమ సంపదగా మార్చుకోవడానికి విదేశీ ఖాతాల్లో దాచుకోవడం, దొడ్డిదారిన చలామణీలోకి తేవడం వంటి పరిణామాలన్నీ పెట్టుబడిదారీ సాంఘిక వ్యవస్థలో అనివార్యమైన నియమాలు.

కనుక ప్రస్తుతం కొనసాగుతున్న ఉత్పత్తి విధానంలో పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపారవేత్తలుగా చలామణీ అవుతున్న వాళ్లందరూ ఇవాళ పనామా పేపర్స్ లో బైటపడినా, పడకున్నా అక్రమ సంపాదన పోగు చేస్తూనే ఉంటారు. ఎక్కడో ఒకచోట తమ అక్రమ సంపాదనను నిలువ చేస్తూనే ఉంటారు. బంగారం, స్థిరాస్తులు, వాహనాలు, విలాసవంతమైన, ఆడంబరమైన జీవితం మొదలైనవాటిలో ఆ అక్రమ సంపాదనను కొంత కరిగించినా ఇంకా మిగిలిపోయేది ఇలా విదేశాలకు వెళుతూనే ఉంటుంది.

క్రమానుగత పన్నుల విధానంతో ఎక్కువ సంపాదనాపరుల మీద ఎక్కువ పన్నులు విధించవలసిన ప్రభుత్వాలు అలా ఎక్కువ పన్నులు విధించడం లేదు సరిగదా, మరొకవైపు ఉన్న పన్నులనైనా సక్రమంగా వసూలు చేయడం లేదు. పేద, మధ్యతరగతి వర్గాల మీద ప్రత్యక్ష, పరోక్ష పన్నులను గోళ్లూడగొట్టి వసూలు చేస్తూ, ధనిక వర్గాల పన్నుల ఎగవేతను చూసీ చూడనట్టు ప్రవర్తిస్తున్నారు. కళ్లముందు విపరీతమైన సంపద పోగుపడుతున్నా, విలాసవంతమైన ఖర్చులు జరుగుతున్నా, చూపుతున్న ఆదాయానికి మించిన ఆస్తులూ ఖర్చులూ కనబడుతున్నా కళ్లు మూసుకుంటున్నారు. ఆ ఎగవేతదారులు ఎగవేసిన పన్నులు వందల, వేల కోట్ల రూపాయలకు చేరిన తర్వాత, వారిని ఎంతో కొంత చెల్లించమని బతిమిలాడుతూ దేబిరింపు ప్రకటనలు చేస్తున్నారు. స్పష్టంగా పన్నుల ఎగవేత కనబడుతున్నా వారి మీద ఎటువంటి కఠిన చర్యలూ తీసుకోవడం లేదు. ఇలా వసూలు చేయగలిగీ ప్రభుత్వం వదులుకుంటున్న పన్నులు మన దేశంలోనే ప్రతి ఏటా కొన్ని లక్షల కోట్ల రూపాయలుగా ఉంటున్నాయి. దానిలో అత్యధిక భాగం విదేశాలకు తరలిపోతున్నది.

భారత ప్రభుత్వం ఇటువంటి అక్రమ నిధుల తరలింపు మీద తన విధానాన్ని ఇటీవలి కాలంలో విపరీతంగా మారుస్తూ వచ్చింది. 2004 వరకూ దేశంలో పోగు చేసిన సంపదను విదేశీ మారక ద్రవ్యంలోకి మార్చుకుని విదేశాలకు తీసుకుపోవడానికి చట్టం అంగీకరించేది కాదు. 2004 ఫిబ్రవరిలో ఎవరైనా ఒక సంవత్సరంలో 25,000 డాలర్ల వరకు బైటికి తీసుకుపోవచ్చునని అనుమతించారు. అది క్రమక్రమంగా పెంచుతూ వచ్చి, ప్రస్తుతం 2,50,000 డాలర్లు (ప్రస్తుత మారకం రేటు ప్రకారం ఒక కోటీ అరవై ఐదు లక్షల రూపాయలు) తీసుకు పోవడానికి అనుమతిస్తున్నారు. ఇలా తీసుకుపోయిన డబ్బుతో విదేశాల్లో వ్యాపార సంస్థలు, కంపెనీలు పెట్టగూడదనే నిబంధన మొదట్లో ఉండేది గాని, ఆ డబ్బుతో విదేశీ కంపెనీలలో వాటాలు కొనడానికి అనుమతి ఉంది గనుక ఆ లొసుగును ఉపయోగించుకుని వ్యాపార సంస్థలలోకి ఈ డబ్బు ప్రవేశించేది. కొద్ది కాలం తర్వాత తమ నిబంధన కొత్త కంపెనీల ఏర్పాటుపై ఆంక్షలు విధిస్తుంది గాని, అప్పటికే ఉన్న కంపెనీలను కొనుగోలు చేయడం, స్వాధీనం చేసుకోవడం దాని పరిధిలోకి రావని రిజర్వ్ బ్యాంక్ ఈ అక్రమానికి దారులు తెరిచింది. దానితో అప్పటివరకూ విదేశీ మారకద్రవ్య నిర్వహణా చట్టం విధిస్తుండిన నిబంధనలకూ, ఆంక్షలకూ, పరిమితులకూ తూట్లు పొడిచినట్టయింది. ఇలా అక్రమ సంపదను ప్రభుత్వానికి తెలిసిన పద్ధతులలోనే విదేశాలకు తరలించడానికి మార్గం సుగమమయింది.

కోట్లాది ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ రంగాల మీద కేటాయింపులు పెంచమంటే 'తగిన నిధులు లేవు' అనే సాకు చూపే పాలకులే ఈ సంపన్నుల పన్నుల ఎగవేతను విస్మరించారు. విదేశాలకు తరలింపును ప్రోత్సహిస్తూ వచ్చారు. నిజానికి ప్రభుత్వాలకు, పన్నుల శాఖలకు ఈ అక్రమ సంపద పోగుపడుతున్న వ్యవహారాలన్నీ తెలుసు. కాని వాటిని ఆపడానికి, ప్రభుత్వాదాయాన్ని, ప్రజా ఖజానాను పెంచడానికి చిన్నమెత్తు ప్రయత్నం కూడ చేయడం లేదు. అసలు అటువంటి ఉద్దేశం ఉన్నట్టు సూచనలు కూడ లేవు.

పనామా పేపర్స్ లో బైటపడిన విషయాలే చూస్తే, భారత ప్రభుత్వానికి పూర్తిగా తెలిసే ఆ వెయ్యి మంది మొసాక్ ఫోన్సెకా ఖాతాదార్లు పనామాకు వెళ్లి ఉంటారు. వారి దగ్గర అంతకు కొన్ని సంవత్సరాల ముందు నుంచే ఆ అక్రమ సంపద పోగుపడుతూ ఉంటుంది. అది పనామాలో నమోదైన ముసుగు కంపెనీల ద్వారా సక్రమ ధనంగా మారి మళ్లీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా భారతదేశంలోనే ప్రవేశించి మరిన్ని లాభాలు చేసుకుని ఉంటుంది. ప్రభుత్వం, వాణిజ్య మంత్రిత్వ శాఖ, ఆదాయ పన్ను శాఖ, పరిశ్రమల శాఖ, వ్యాపారాల నియంత్రణ యంత్రాంగం, రిజర్వ్ బ్యాంకు, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా వంటి డజనుకు పైగా శాఖలు, కార్యాలయాలు, వందలాది అధికారులు ఈ అన్ని లావాదేవీలనూ పరిశీలించి ఉంటారు. ఇదంతా ఒక్క పనామా సంగతి. అటువంటి డజన్ల కొద్దీ చోట్లకు, వేలాది మంది భారత అక్రమ సంపన్నులు తమ సంపదను తరలిస్తుంటే ఈ శాఖలన్నీ గుడ్లప్పగించి చూస్తూ ఉంటాయి. మరో మాటల్లో చెప్పాలంటే, రాజకీయ నాయకులుగా, పారిశ్రామిక వ్యాపారవేత్తలుగా, క్రీడాకారులుగా, కళాకారులుగా చెప్పుకునే ఈ భారీ పెద్దమనుషులు ఇంత పెద్ద ఎత్తున దేశద్రోహానికి పాల్పడుతుంటె వారిని ఆపినవారు లేరు, ఆ వివరాలు బైటపెట్టిన వారు లేరు. ఆ చట్టవ్యతిరేక, దేశద్రోహకర చర్యలకు వారిని విచారించినవారు, శిక్షించినవారు లేరు. ఇదీ ఈ దేశంలో సాగుతున్న ప్రజాస్వామ్యం,

యూరప్‌ను వణికిస్తున్న ఐసిస్

చమురు, సహజ వనరులపై ఆధిపత్యం, మధ్య ఆసియా దేశాలపై పట్టు కోసం తిరుగుబాటుదారులను ప్రోత్సహించి వాడుకున్న సామ్రాజ్యవాద దేశాలు, అవే బలగాలన ఇప్పుడు మిలిటెంట్లుగా చిత్రీకరిస్తున్నాయని అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌పై మార్చి 22న ఉదయం ఐసిస్ మిలిటెంట్లు తమ పంజా విసిరారు. విమానాశ్రయం, మెట్రోరైల్వే స్టేషన్‌లో మిలిటెంట్లు బాంబులు పేల్చడంతో కనీసం 35 మంది చనిపోయారు. వందకు పైగా క్షతగాత్రులయ్యారు. ఈ దాడిలో భారత దేశానికి చెందిన ఇద్దరు జెట్‌ఎయిర్‌వేస్ సిబ్బంది కూడా గాయపడ్డారు. ఐరోపా దేశాలను లక్ష్యంగా పెట్టుకుని ఐసిస్ మిలిటెంట్లు ఇటీవలి కాలంలో పలుచోట్ల బాంబుదాడులు చేస్తున్నారు. బాంబు పేలుళ్లతో విమానాశ్రయం, రైల్వేస్టేషన్ దద్దరిల్లాయి. ప్రయాణికులు భీతావహులై పరుగులు తీశారు. బాంబు పేలుళ్లలో గాయపడిన పలువురు అవయవా లను కోల్పోయారు. గత నవంబర్ 13న పారిస్‌పై దాడి జరిపిన ఉగ్రవాదుల్లో ఒకరిని బెల్జియం ప్రభుత్వం మార్చి 18న నిర్బంధంలోకి తీసుకుంది. దానికి ప్రతీకారంగానే ముగ్గురు మిలిటెంట్లు బ్రస్సెల్స్ పేలుళ్లకు పాల్పడినట్లు తేలింది. దాడుల అనంతరం నగరంలో రవాణా వ్యవస్థ స్తంభించి పోయింది. ఖలీద్, ఇబ్రహీం ఎల్ బాక్రోయి అనే ఇద్దరు అన్నదమ్ములు బ్రస్సెల్స్ ఎయిర్‌పోర్టులో ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నజీమ్ లాచ్రోయి అనే మూడో వ్యక్తి, బాంబు తయారీ చేయొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంట్లో ఉన్న వస్తువులతోనే లాచ్రోయి పేలుడు పదార్థాలు తయారుచేశాడని విచారణ బృందాలు ఘటన జరిగిన రెండో రోజునే తెలుసుకున్నాయి. మాల్‌బీక్‌లో జరిగిన ఆత్మాహుతిదాడిలో లాచ్రోయి చనిపోయాడు.

బ్రస్సెల్స్ పేలుళ్లను బెల్జియం ప్రధాని ఛార్లెస్ మైఖేల్ గుడ్డిగా, ద్వేషం, పిరికితనంతో చేసిన దాడిగా పేర్కొన్నారు. ఇది విషాదకర దుర్దినం అని మైఖేల్ జాతీయ టెలివిజన్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ అన్నారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో జరిగిన రెండు బాంబు పేలుళ్లలో జవెంటమ్ విమానాశ్రయంలోని ప్రధాన హాలు దెబ్బతింది. యూరోపియన్ యూనియన్ ప్రధానకార్యాలయం సమీపంలోని మాల్బీక్ మెట్రో రైల్వేస్టేషన్‌లో మూడవబాంబును పేల్చారు. ప్రయాణికులంతా హడావుడిగా రైలు కోసం వెళుతున్న సమయంలో ఈ బాంబు పేలింది. రైల్వేస్టేషన్‌లో పేలిన బాంబువల్ల 20 మంది చనిపోగా 55 మంది గాయపడ్డారు. విమానాశ్రయ బాంబు దాడిలో 15 మంది చనిపోగా 150 మంది గాయపడ్డారు. విమానాశ్రయమంతా రక్తపు మడుగులతో నిండిపోయిందని అనేకమంది అవయవాలు తెగిపోయాయని ప్రత్యేక సాక్షుల కథనాలు చెబుతున్నాయి. ఒక వ్యక్తి అరబిక్‌లో మాట్లాడిన కొద్దిసేపటికే భారీ విస్ఫోటనం జరిగిందని విమానాశ్రయంలో బ్యాగేజి సెక్యూరిటీ అధికారి ఎఎఫ్‌పి వార్తాసంస్థకి తెలిపారు.

గత నవంబర్‌లో పారిస్‌పై జరిగిన దాడులకు కారకుడని అనుమానిస్తున్న సలాహ్ అబ్దిస్లామ్‌ను మార్చి 18న అరెస్టుచేసిన తర్వాతనే ఈ బాంబుపేలుడు జరగడం వల్ల బహుశా పారిస్‌పై దాడిచేసిన వారే ఈ దాడికి కూడా పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. నిత్యం రెప్పవాల్చని నిఘా ఉంటుందనుకున్నచోటే ఇంతటి ఘాతుకానికి పాల్పడడం ద్వారా ప్రపంచంలో ఎక్కడైనా ఏమైనా చేయగలమని మిలిటెంట్లు నిరూపించ దల్చుకున్నట్లు కనిపిస్తోంది. బ్రస్సెల్స్ సంఘటనతో యూరోపియన్ యూనియన్ నాయకులు అనేక మంది విభ్రాంతికిలోనై బెల్జియం ప్రజలకు సంఘీభావం తెలిపారు. ఎప్పటిలాగే మిలిటెన్సీపై పోరాటాన్ని కొనసాగి స్తామని వారు అన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హోలాండ్, భారత ప్రధాని నరేంద్ర మోడీ తదితర ప్రపంచనేతలు ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. దాడి అనంతరం బ్రస్సెల్స్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. ఈ ఉద్రిక్తత పరిస్థితుల్లోనే మోడీ మార్చి 30న బెల్జియంలో జరిగిన భారత్– యురోపియన్ యూనియన్ సమ్మిట్‌కి హాజరయ్యారు.

బ్రస్సెల్స్ దాడితో ఐరోపా దేశాలన్నీ ఉలిక్కి పడుతున్నాయి. ప్రపంచ దేశాలన్నీ మిలిటెంట్ దాడి ముప్పుతో వణికిపోతున్నాయి. భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేశాయి. లండన్, పారిస్, ఫ్రాంక్ ఫర్డ్, ఆమ్‌స్టర్‌డామ్, కోపెన్‌హగెన్, ప్రేగ్.. యూరప్ అంతటా భద్రత కట్టుదిట్టం చేశారు. ఐరోపా అంతటికీ కేంద్రబిందువుగా పరిగణించబడుతున్న బ్రస్సెల్స్‌ను ఐఎస్ఐఎస్ లక్ష్యంగా చేసుకోవడానికి కారణం ఉన్నది. గత నవంబర్‌లో పారిస్‌పై దాడి చేసి 130 మందిని బలిగొన్న తర్వాత.. ఐఎస్ఐఎస్‌ని కట్టడి చేసే చర్యలకు పశ్చిమ యూరప్ దేశాలన్నీ సంయుక్త భద్రతా చర్యలు చేపట్టాయి. బ్రస్సెల్స్ కేంద్రంగా యూరప్ దేశాలన్నీ పారిస్ దోషులను పట్టుకునేందుకు వ్యూహారచన చేస్తూ కలిసి సాగుతున్నాయి. ఐసిస్‌పై పోరాటం చేస్తున్న మిత్ర రాజ్య కూటమిలో బెల్జియం కూడ సభ్యురాలు. దీంతో బెల్జియంపై కత్తిగట్టిన ఐసిస్ మిలిటెంట్లు ఐరోపా ఖండానికే రాజధానిగా భాసిల్లే బ్రస్సెల్స్‌ను టార్గెట్ చేశారు. ప్రశాంతతకు నవనాగరికతకు మారుపేరుగా నిలిచి... చాక్లెట్ నగరంగా పేరుగాంచిన బ్రస్సెల్స్‌ను నెత్తురు మడుగు చేశారు. అలాగే ప్రపంచంలోని 226 దేశాలతో రాకపోకలు నిర్వహించే జవెంతెన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకున్నారు.

ప్రజల పాలన, దేశభక్తి. పనామా పేపర్స్ వెల్లడి వంటి ఏ ఒక్క ఉదంతమైనా వెయ్యినోళ్ల పునరుద్ఘాటిస్తున్న విషయమేమంటే ఇది ధనికుల కోసం, ధనికుల వల్ల, ధనికుల చేత నడుస్తున్న ప్రభుత్వం మాత్రమే గాని ఎంతమాత్రమూ ప్రజాస్వామ్యం కాదు.

(ఈ వ్యాసమంతా అక్రమ నిధులు అని వాడిన మాటను సాధారణ, ప్రధాన స్రవంతి పత్రికలు “నల్లధనం”, “నల్లడబ్బు” అని వాడుతున్నాయి. నలుపు చెడుకూ, తెలుపు మంచికీ చిహ్నమనే వర్ణవివక్షా దృక్పథమే ఈ మాటకు పునాది. ఆ మాట వాడేవాళ్లందరికీ ఉద్దేశపూర్వకంగా ఆ దృక్పథం లేకపోవచ్చు గాని, ఆ మాటను వాడడం అంటే ఆ దృక్పథాన్ని బలోపేతం చేయడమేననే అవగాహనతో ఉద్దేశపూర్వకంగా ఆ మాటను పక్కనపెట్టి అక్రమ నిధులు అని వాడడం జరిగింది)

(రచయిత వీక్షణం సంపాదకుడు)

బ్రస్సెల్స్‌ను లక్ష్యంగా చేసుకోవడానికి మరో కారణం కూడా ఉన్నది. ఈ నగరంలోనే యూరోపియన్ యూనియన్ ప్రధాన కార్యాలయంతో పాటు, నాటో కేంద్ర కార్యాలయం, పలు ప్రపంచ దేశాలకు చెందిన సంస్థల కార్యాలయాలున్నాయి. ఇలా ఐరోపా ఖండానికే కాదు, మొత్తం ప్రపంచానికే కేంద్ర బిందువుగా ఉన్న బ్రస్సెల్స్‌లో రక్తపాతం సృష్టించి ఐసిస్ ప్రపంచానికి సవాలు విసిరింది. యూరప్‌లో దాడుల ద్వారా ఐసిస్ తన ఉనికిని ప్రపంచానికి చాటుకుంటోంది. కొన్ని దేశాల్లో దాని మతోన్మాద విషప్రచారానికి లోనైన స్థానికులు కొందరు సహకరిస్తున్నారు. పశ్చిమ యూరప్ దేశాలన్నింటా పాగా వేసిన ఐఎస్ఐఎస్ గ్లోబల్ దాడులకు పాల్పడుతున్నది. ఫ్రాన్స్, ఇంగ్లండ్, బెల్జియం, జర్మనీ, హాలండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, అమెరికాతో సహా ఇప్పటికే 20 దేశాల్లో 75 దాడులు చేసి వేలాదిమందిని పొట్టన పెట్టుకున్నది.

2010లో ఉనికిలోకి వచ్చిన నాటి నుంచి ఐఎస్ఐఎస్ తన పాశవిక చర్యలతో ప్రపంచానికి హెచ్చరికలు పంపుతూనే ఉన్నది. ఇరాక్, సిరియా సరిహద్దుల్లో తిష్టవేసిన ఇస్లామిక్ స్టేట్ మిలిటెంట్లు ఖలీఫా రాజ్య స్థాపన లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నాయనడానికి గత కొన్నాళ్లుగా జరుగుతున్న ఘటనలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. నిజానికి రష్యాకు వ్యతిరేకంగా ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లను, ఒసామా బిన్‌లాడెన్‌ను సృష్టించిందీ అమెరికా దాని మిత్రదేశాలే. ప్రపంచంలో తమ దోపిడీ ఆధిపత్యం కోసం నేటికీ మిలిటెన్సీని పెంచిపోషిస్తున్నదీ సామ్రాజ్యవాద దేశాలే. 2001 సెప్టెంబరు 11న న్యూయార్క్‌లోని జంట టవర్లపై జరిగిన దాడిలో 3000 మంది మరణించారు. ఆ దాడి తర్వాత అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్, బ్రిటన్ ప్రధాని టోనీ బ్లెయిర్‌లు చేపట్టిన ప్రతీకార దురాగతాల వల్లే ఈ ఐఎస్ఐఎస్ పుట్టుకొచ్చింది.

ఒసామా బిన్‌లాడెన్ స్థావరంగా ఉందన్న పేరుతో ఆఫ్ఘనిస్తాన్‌పై దాడిని సమర్థించుకొన్నా, సంబంధమేలేని ఇరాక్, లిబియాపై రసాయన ఆయుధాలు ఉన్నాయన్న తప్పుడు నివేదికలను సృష్టించి చేసిన దాడులు, విధ్వంసానికి అమెరికా, బ్రిటన్ దేశాల నేతలు ఏం సమాధానం ఇస్తారు? రసాయన ఆయుధాలు ఉన్నాయన్న నెపంతో సద్దాం హుస్సేన్‌తోపాటు, లిబియా అధ్యక్షుడు కల్నల్ గడ్డాఫీని హత్య చేశారు. ఇవాళ ప్రపంచ దేశాలను కలవర పెడుతున్న ఐసిస్ మిలిటెంట్ సంస్థ 2003లో ఇరాక్‌పై అమెరికా ఆక్రమణ నేపథ్యంలో పుట్టింది. లిబియా, సిరియాల్లో అంతర్యుద్ధాల సందర్భంగా మరింత పెరిగి విస్తరిస్తూ వచ్చింది. అంతకు ముందు ఆఫ్ఘన్‌లో 1998లో రష్యాపై అమెరికా యుద్ధం చేసిన సందర్భంగా తాలిబన్లు పుట్టుకొచ్చారు. ఆ తర్వాత అల్‌కాయిదా అభివృద్ధి చెంది విస్తరించింది. దీనిలో నుండే ఐసిస్ పుట్టుకొచ్చింది. అందువల్ల ప్రపంచంలో మిలిటెన్సీ పుట్టుకకూ, సామ్రాజ్యవాద యుద్ధ కాంక్షకూ అవినాభావ సంబంధం ఉన్నదన్న వాస్తవం గత రెండు దశాబ్దాల ప్రపంచ పరిణామాలు గమనిస్తే స్పష్టమవుతుంది. మధ్య ప్రాచ్యంలో చమురు మీద గుత్తాధిపత్యం కోసం అక్కడి లౌకిక పాలకులపై కత్తికట్టిన సామ్రాజ్యవాద దేశాల సృష్టే మిలిటెన్సీ. మిలిటెంట్లకు ఆయుధాలు, డబ్బు అందిస్తూ అరబ్బు దేశాలలో అంతర్గత సంక్షోభాలను సృష్టించి నెత్తురు పారిస్తున్న పశ్చిమ దేశాలకు మిలిటెంట్లపై మాట్లాడే నైతిక హక్కుందని ఎవరైనా అనుకుంటారా?

ఇరాక్‌లో సద్దాం హత్య అనంతరం దిక్కుమొక్కులేని అనాథను చేసి ఇరాక్‌ను అంతులేని సంక్షోభంలోకి నెట్టింది. ఈ క్రమంలోనే ఐఎస్ఐఎస్ విజృంభించటం ఆరంభించింది. మొదట్లో బిన్‌లాడెన్ ప్రోద్బలంతో 'అల్ కాయిదా ఇన్ ఇరాక్'గా ఆరంభమైన ఈ సంస్థ 2006 తర్వాత అల్ కాయిదా నుంచి విడిపోయి 'ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఇరాక్ (ఐఎస్ఐ)'గా స్వతంత్రంగా అవతరించింది. అబు బాకర్ అల్–బాగ్దాదీ ఐఎస్ఐ పగ్గాలు చేపట్టిన తర్వాత మరింత దూకుడు పెంచింది. ఇరాక్, సిరియాల్లోని స్థానిక మిలిటెంట్ సంస్థలను విలీనం చేసుకొని 'ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా' (ఐఎస్ఐఎస్)గా అవతరించింది. ప్రపంచవ్యాప్తంగా విస్తరించే లక్ష్యంతో ఏకంగా 'ఇస్లామిక్ స్టేట్'గానే ఉనికి చాటుకుంటోంది. ఇస్లామిక్ ఖలీఫా రాజ్య స్థాపన వీరి లక్ష్యం. ఇరాక్, సిరియా ఆ తర్వాత జోర్డాన్, లెబనాన్‌లకు విస్తరించి, పాలస్తీనాను విముక్తం చేసి, ఆ తర్వాత ప్రపంచమంతా విస్తరించి ఖలీఫా రాజ్య స్థాపన జరగాలన్నది వీరి విస్తృత ఎజెండా.

నిజానికి యూరప్ దేశాల ఉదాసీనతే ఐసిస్‌కు నారుపోసి నీరు పెట్టింది. ఈ దేశాల నుంచే ఐసిస్‌లో చేరుతున్న మిలిటెంట్ల సంఖ్య ఎక్కువగా ఉన్నది. కోటి జనాభా ఉన్న బెల్జియం నుంచే ఆరువందల యాభై మంది దాకా ఐసిస్‌లో చేరారు. అలాగే ఫ్రాన్స్, బ్రిటన్, బోస్నియా, జర్మనీ, స్వీడన్, ఇటలీ, సెర్బియా దేశాల నుంచి వందలాది మంది ఐఎస్‌లో చేరారు. ఆయా దేశాల్లో ఐసిస్ స్లీపర్ సెల్స్‌గా, సానుభూతి పరులుగా ఉన్నారు. ఇక బహుళజాతి భాషలతో ఉన్న బెల్జియంలోని మొలెన్‌బేక్ ప్రాంతం ఐఎస్ మిలిటెంట్లకు స్వర్గధామంగా మారిపోయింది. అంతర్జాతీయ మిలిటెన్సీకి పాశ్చాత్య దేశాల నుంచి అధికశాతం జిహాదీలను అందిస్తున్న అతిచిన్న బెల్జియం భౌగోళికంగా అత్యంత కీలకమైన చోట ఉండడం మిలిటెంట్లను అమితంగా ఆకర్షిస్తున్నది. ఇక్కడ నుంచి హైస్పీడ్ బుల్లెట్ రైళ్లలో గంటన్నరలో పారిస్‌కు, రెండు గంటల్లో లండన్‌కు చేరుకోవచ్చు. పారిస్ దాడి సూత్రధారి సలేహ్ అబ్దెస్లామ్ కూడా ఆ ప్రాంతానికి చెందినవాడే. బ్రస్సెల్స్ దాడి తమ పనేనని "పారిస్ దాడుల ప్రధాన నిందితుడు అబ్దెస్లామ్ అరెస్టు అయితే ఏంటి? మమ్మల్ని ఎవరూ ఆపలేరు. ఆ విషయాన్ని బ్రస్సెల్స్ దాడుల ద్వారా నిరూపించాం" అని ఇస్లామిక్ స్టేట్ అనుబంధ మీడియా సంస్థ అమాఖ్ ప్రకటించింది.

యూరప్‌లోని వివిధ దేశాల్లో భారీ విధ్వంసం సృష్టించేందుకు దాదాపు 400 మంది మిలిటెంట్లు సిద్ధంగా ఉన్నారని నిఘా వర్గాలకు చెందిన వివిధ ఏజెన్సీలు వెల్లడించాయి. సిరియాలోని ఐసిస్ స్వాధీన ప్రాంతాల్లో శిక్షణ పొందిన వీరు యూరప్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్నట్టు సమాచారం, పాశ్చాత్య దేశాలపై దాడులు జరిపేందుకు మాత్రమే వీరికి శిక్షణ ఇచ్చినట్టు తెలుస్తోంది. తమ సీనియర్ల నుంచి ఆదేశాలు అందిన వెంటనే వీరు దాడులు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. వివిధ నిఘా ఏజెన్సీల నుంచి వచ్చిన సమాచారాన్ని యూరోపియన్ పోలీస్ ఏజెన్సీ 'యూరోపోల్' ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ '2014 నాటికి ఇప్పటికి ఐసిస్ తీరులో చాలా తేడా వచ్చింది. కొన్నివారాల శిక్షణతో మిలిటెంట్లను తయారు చేస్తున్నారు. వ్యూహాన్ని పూర్తిగా మార్చుకున్నారు. మిలిటెంట్ల గ్రూపుల్ని వివిధ యూనిట్స్‌గా విడగొట్టారు. కొంతమందికి సుదీర్ఘకాలం పాటు శిక్షణ ఇస్తున్నారు. భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోవాలన్నది ఇంతవరకు ఐసిస్ లక్ష్యంగా ఉండేది. అది ఇప్పుడు మారింది. సాధ్యమైనన్ని మిలిటెంట్ దాడుల్ని విజయవంతంగా అమలు చేయటమే ప్రస్తుత లక్ష్యంగా మారింది. దీనివల్ల తమ శత్రువు (పాశ్చాత్య దేశాలు) భారీ సంఖ్యలో భద్రతా బలగాల్ని వినియోగించాల్సిన, నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి కల్పించాలని ఐసిస్ కోరుకుంటోంది' అని అన్నారు.

జిహాదీ నెట్‌వర్క్‌పై ఏర్పాటైన కమిషన్‌కు ఉప – ఉన్నతాధికారి, ఫ్రెంచ్ సెనేటర్ నటాలి గౌలెట్ మాట్లాడుతూ 'విదేశాల్లో ఉగ్రదాడుల నిమిత్తం శిక్షణ పొందిన ఐసిస్ మిలిటెంట్లు 400 నుంచి 600 వరకు ఉండొచ్చు. యూరప్ ఖండాన్ని విడిచి సిరియాకు ఐసిస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందినవారు 5 వేల వరకు ఉండొచ్చు' అని చెప్పారు. అమెరికా ఇంటిలిజెన్స్ అధికారుల అంచనా ప్రకారం, యూరప్‌లో 100కు పైగా

ఇస్లామిక్ స్టేట్ స్వతంత్ర మిలిటెంట్స్ ప్రత్యేక బృందాలున్నాయి. విస్తృతమైన మిలిటెంట్ల నెట్‌వర్క్‌ను తెలుసుకోవడానికి బెల్జియం భద్రతా అధికారులతో ఎఫ్‌బిఐ అధికారులు కలిసి పనిచేస్తున్నారు. అమెరికా నిఘా అధికారులు అందుకున్న సమాచారం మేరకు, సాధ్యమైన చోట బాంబు దాడులు జరపాలని 450 మంది బాంబు తయారీ, ఇతర నిపుణులకు ఐఎస్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఒక గ్రూప్‌నకు, మరో గ్రూప్‌నకు మధ్య సమన్వయం ఉన్నది. అయితే సమయం, ప్రదేశం ఎవరికి వీలైంది వారు నిర్ణయిస్తున్నారు.

రెండున్నర దశాబ్దాలుగా ఈ దారుణ సైనిక దురాక్రమణలు జరుగుతున్న కాలమంతా అమెరికా, నాటో దేశాలు ఐసిస్ వంటి ఉగ్రవాద సంస్థలను ప్రోత్సహించాయి. తమ అవసరాలకు అనుగుణంగా వాడుకున్నాయి. అయితే 2014 మార్చి నుంచి ఐసిస్ అమెరికా మద్దతుగల ఇరాక్ ప్రభుత్వంపై దాడులు చేయడం మొదలెట్టిన తరువాత అమెరికా ఐసిస్‌ను వ్యతిరేకించడం ప్రారంభించింది. ఇరాక్‌లో ఐసిస్‌పై దాడులు చేస్తున్న ఫ్రాన్స్ సిరియాలో ఐసిస్ ఎదుగుదలను చూసీ చూడనట్టుగా నటించింది. ఎందుకంటే సిరియాలో ఐసిస్‌పై దాడిచేస్తే అసద్ వ్యతిరేక శక్తులు బలహీనమవుతాయి గనుక. 2015 జనవరిలో పారిస్‌లో చార్లీ హెబ్డోపై దాడి జరిగిన తరువాతనే ఫ్రాన్స్ సిరియాలో ఐసిస్‌పై దాడులు చేయటం మొదలెట్టింది. ఈ యుద్ధాలు ఐరోపా విదేశాంగ విధానంతోను, పోలీసు వ్యవస్థతోను అనుబంధం గల ఒక ఇస్లామిస్ట్ యోధుల నెట్‌వర్క్ సృష్టించాయి. చార్లీ హెబ్డోపై దాడిచేసిన కొవాచీ సోదరులు, నవంబరు 13వ తేదీనాడు పారిస్‌లో కాల్పులు జరిపిన అబ్దెల్‌హమీద్ అబావౌద్‌లు సిరియాలో యుద్ధం చేయటానికి ఐరోపాలో జరుగుతున్న ఇస్లామిస్టుల ఎంపిక ప్రక్రియతో సంబంధం ఉన్నవారే. వీరందరూ నిఘావర్గాలకు తెలిసినవారే.

బ్రస్సెల్స్‌పై దాడి పారిస్ దాడులకు ప్రతీకారం మాత్రమే కాదు, యూరప్‌లోని మిగతాదేశాలకు ముప్పు తప్పదన్న హెచ్చరిక కూడా. అయితే, పారిస్ దాడుల తరువాత ఐరోపాదేశాల ఒత్తిడితో బెల్జియంలో భద్రత పేరిట ప్రభుత్వం కొనసాగించిన వేట శృతిమించి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత తెచ్చిపెట్టిందే తప్ప దాడులను నివారించలేకపోయిన మాట వాస్తవం. బ్రస్సెల్స్‌నూ, ముఖ్యంగా మొలాంబిక్‌ను 'జిహాదీ రాజధాని' అంటూ పాశ్చాత్యమీడియా అభివర్ణిస్తుండడం, 'ప్రక్షాళన తప్పదు' అంటూ హోంమంత్రి సహా దేశ నాయకులంతా వ్యాఖ్యానిస్తూ ఈ ఒక్కప్రాంతమే అంతర్జాతీయ మిలిటెన్సీకి కీలక స్థావరంగా చిత్రించడం స్థానిక ముస్లింలకు ఆగ్రహమూ, ఆవేదన కలిగిస్తున్నాయి. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా మిలిటెన్సీని నియంత్రించే పేరుతో పుట్టుకొచ్చే కొత్త చట్టాలు, నాయకులు చేసే ప్రసంగాలు, దేశాలను, సమాజాలను నిట్టనిలువునా చీల్చడం ఒక విషాదం. అమాయకులను అనుమానితులుగా చూడడం, మతాల వారిగా, జాతుల వారిగా సమాజాలు చీలిపోవడాన్ని మిలిటెంట్ సంస్థలు ఆహ్వానిస్తున్నాయి. ఈ విషపు విత్తులు మహా మానులుగా ఎదగాలని అవి కోరుకుంటున్నాయి.

మన దేశంలో దేశభక్తి, జాతీయత పేరుతో జరుగుతున్న దూకుడుగానీ, భిన్నాభిప్రాయాలున్న వారిని హత్య చేయడంగానీ, ఆహారపు అలవాట్ల మీద నిషేధంగానీ, భావస్వేచ్ఛ మీద ఆంక్షలు గానీ, ఇటీవలి ఎచ్‌సియు, జెఎన్‌యూ అలహాబాద్ ఘటనలు సిఆర్‌పిపి జాతీయ అధ్యక్షులు ప్రొ. గిలానీపైన, నడుస్తున్న తెలంగాణ ఎడిటర్ డా. కాశీంపై మోపిన దేశద్రోహం కేసువంటి సంఘటనలు గమనించినప్పుడు ఆందోళన కలుగక మానదు. దీనికి తోడు ప్రతిరోజు ఏదో ఒకచోట మైనారిటీలు లక్ష్యంగా చేస్తున్న వ్యాఖ్యలు, రెచ్చగొట్టే ప్రసంగాలు ప్రమాదాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి ఉదంతాలు సమాజాన్ని రెచ్చగొడుతాయి. సాధారణ పౌరులు సైతం విచక్షణాశక్తిని కోల్పోయేలా చేస్తాయి. మానవ సహజాతాలైన ప్రేమ, కరుణ, సహకారం వంటి భావనలు కొడిగట్టడం మొదలవుతుంది. సమాజంలో భయాందోళనలు ఆవరించి ఉన్నచోట హేతుబద్ధత కరువవుతుంది.

ఉన్మాద ఘటనలు చోటుచేసుకున్న ప్రాంతంలో, దేశంలో అపరిచితులను అనుమానించడం మాట అటుంచి... నిన్నటివరకూ కలివిడిగా ఉన్నవారే అయినా మిలిటెంట్లు అనుసరిస్తున్న వికృత చర్యల పర్యవసానంగా ఆ మతానికే చెందినవారన్న కారణంతో తెలియని శత్రుత్వాన్ని పెంచుకునే ధోరణులు ప్రబలుతాయి. ఇలాంటి దాడులకు పాల్పడే మిలిటెంట్లు కోరుకునేది కూడా అదే. చీలిన సమాజాలు వారికి ప్రాణధాతువులవుతాయి. అలాంటిచోట విద్వేషాలు నూరిపోయడం, ఎదుటి వర్గంపై అనుమానాలు రేకెత్తించడం, పరస్పరం కలహించుకునే వాతావరణాన్ని సృష్టించడం చాలా తేలికవుతుంది. అలాగే, ప్రశాంతంగా ఉండవలసిన యూరప్ రెండు దశాబ్దాలకు పైగా మిలిటెన్సీపై పోరులో అమెరికాతో చేతులు కలిపిన కారణంగానే దాడులను చవిచూస్తున్న నేపథ్యంలో, భారత్ అమెరికాతో జతకట్టడం పాత్రను పునర్ నిర్వచించు కోవలసిన అవసరం కూడా ఉన్నది.

అమెరికా, నాటో దేశాలు అరబ్బు రాజ్యాలపై దాడులు సాగిస్తున్నందు వల్లనే అందుకు ప్రతీకారంగానే ఉగ్రవాదానికి ప్రజల మద్దతు ఉందన్న వాదన బలంగానే ఉంది. ఈ ఉగ్రవాదానికి అసలు మూలాలు అమెరికా సామ్రాజ్యవాద భౌగోళిక రాజకీయార్థిక విధానాలలోనే ఉన్నాయి. పశ్చిమ దేశాలు అనుసరిస్తున్న దోపిడీ, దురాక్రమణ విధానాలకు ప్రతీకారంగా, ప్రతిఘటనగా కూడ చూడవల్సి ఉంది. అయితే యూరప్‌లో పుట్టి పెరిగిన వారు ఐసిస్ ప్రభావంలోకి వెళ్తుండడం పాశ్చాత్య ప్రపంచానికి ఇప్పుడు పెద్ద బెడదగా మారింది. యాంత్రిక జీవనం, కొరవడుతున్న సామాజిక సంబంధాలు, నిరుద్యోగం, భవిష్యత్తును గురించిన బెంగ వంటివి మిలిటెన్సీ పట్ల యువత ఆకర్షితులు కావడానికి తోడ్పడుతున్నాయని మనో విశ్లేషకులు చెబుతున్నారు. మిలిటెన్సీపై యుద్ధం పేరిట ఇరాక్, సిరియా, లిబియా, సోమాలియా తదితర దేశాల్లో అమెరికా, యూరప్ దేశాలు సాగిస్తున్న నరమేథం వల్ల అల్‌కాయిదా, ఐఎస్‌ఐఎస్ లాంటి మిలిటెంట్ సంస్థలకు పశ్చిమాసియాలో ముస్లింల నుండి ఆదరణ లభిస్తున్నది. మరోపక్క ఉన్న వనరులన్నింటినీ ఈ నిరర్థక యుద్ధానికే ఖర్చు చేసే స్థితి ఉండటంవల్ల ప్రజల అభివృద్ధిపై పూర్తిగా కేంద్రీకరించే అవకాశం యూరప్ కోల్పోయింది. అంతేగాక నిఘా, భద్రతా చర్యలు మిలిటెంట్ చర్యలను నిలువరించడం సాధ్యం కాదన్నది కూడ రుజువైంది.

రెండు ప్రపంచ యుద్ధాలు సృష్టించిన ఉత్పాతాలను చూశాక మానవాళి మరోసారి అలాంటి విషమ పరిస్థితుల్లో చిక్కుకోకూడదన్న మహదాశయంతో దేశాలమధ్య ఏర్పడే ఎంతటి క్లిష్ట సమస్యలైనా అంతర్జాతీయ వేదికైన ఐక్యరాజ్య సమితి వంటి వేదికలపైనే పరిష్కారం చేసుకోవాలని భావించారు. కానీ అగ్రరాజ్యాలు తమ వెనకటి గుణాన్ని విడనాడలేదు. ఫలితంగానే మిలిటెన్సీ వేళ్లూనుకుంటోంది. ఇవ్వాళ మధ్య ప్రాచ్యంలో అమెరికా, దాని మిత్ర దేశాలు సృష్టిస్తున్న రక్తపాతం ఐరోపా తీరాలను చేరింది. అది ఆగాలంటే ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల అంతర్గత విషయాల్లో అగ్ర రాజ్యాలు జోక్యం చేసుకోవడం విడనాడాలి. అలాగే అన్ని దేశాలలోని పౌరులందరికీ మెరుగైన అవకాశాలు సాధించే ప్రజాస్వామిక వ్యవస్థను రూపొందించి ఆచరించగలిగితే మిలిటెన్సీ బెడదను మానవాళి సమర్థంగా ఎదుర్కొనగలదు. ఆ దిశగా బెల్జియం మాత్రమే కాదు, భారత్‌తో సహా పాశ్చాత్య ప్రపంచమంతా ఆలోచించాలి. అప్పుడు మిలిటెన్సీ ఎదుర్కొనడం తేలికవుతుంది.

(రచయిత ఉపాధ్యాయ నాయకులు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

'భారత మాతాకీ జై' అంటే సరిపోతుందా?

దేశ సంపదను విదేశీ సంస్థలకు కట్టబెడుతున్న ఈ కుహనా 'దేశభక్తుల' నుంచి దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రత్యామ్నాయం కోసం ఆలోచిస్తున్న యువత మీదే ఉందని అంటున్నారు **షేక్ కరిముల్లా**

'మనిషికి సత్యనిష్టత చాలా అవసరం. సత్యం మాట్లాడేవాడు ఎప్పుడూ స్వచ్ఛమైన మనస్సుతో ప్రశాంతంగా ఉంటాడు. వాడే అసలైన నీతిపరుడు. సత్య సంధత లేనివాడు పరమనీచుడు.'

– మహాకవి వేమన.

పార్లమెంటరీ వ్యవస్థలోని లోపాల కారణంగా 69 శాతం మంది బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేసినా, కేవలం 31 శాతం మంది ఓట్లతో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ ఈ 22 నెలల పాలనా కాలంలో దేశంలో భావ వాతావరణాన్ని అతలాకుతలం చేస్తున్న పరిణామాలు, అత్యంత ప్రమాదకరమైన సంఘటనలు ఆఫ్ఘనిస్తాన్ తాలీబన్లను మరిపిస్తున్నాయి. ఆలోచించే ప్రతి భారతీయుని మదిలో మనది లౌకిక భారతమేనా? అన్న ప్రశ్న ఉదయించక మానదు. నేటి సమాజంలో ప్రశ్నించేవారిని కర్కశంగా హిందుత్వ వాదులు చంపేస్తున్నారు. కల్బుర్గీ, గోవింద పన్సారే లాంటి హేతువాద మేధావులను చంపేశారు. జెఎన్‌యు విద్యార్థి నాయకుడు కన్హయ్య కుమార్‌ను చంపితే నజరానాలు ఇస్తామని ప్రకటించారు. హిందూ మతాన్ని ఇతర మతాలకు వ్యతిరేకంగా రాజకీయ ఆయుధంగా వాడి లబ్ధి పొందేందుకు హిందుత్వ శక్తులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. దేశభక్తి, జాతీయత చివరకు జాతీయ పతాకాన్ని కూడా వదలకుండా మతతత్వ రాజకీయాలు చేస్తున్నారు. మనువాద భావజాలాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీరి చర్యలను వ్యతిరేకిస్తున్న ప్రజాస్వామిక వాదులను అధికార బలంతో హిందుత్వ శక్తులు దేశ ద్రోహులుగా ముద్ర వేస్తున్నారు. 'దేశభక్తి'పై వీరికే పేటెంట్ హక్కు ఉన్నట్లు మాట్లాడుతున్నారు. ఇప్పుడు తాజాగా దేశంలో పుట్టిన వారంతా 'భారత మాతాకీ జై' అని నినదించాలని సంఘ్‌పరివార్ శక్తులు మాట్లాడుతున్నాయి. అదే దేశభక్తికి, జాతీయతకు చిహ్నంగా నాజీ హిట్లర్ నుండి స్ఫూర్తి పొందిన ఈ నయా భారత నాజీలు మాట్లాడుతున్నారు. ఈ నినాదాన్ని ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసి, ఆ పార్టీ మహారాష్ట్ర ఎంఎల్ఎ ఒకరు 'మేము అలా అనం' అని వ్యతిరేకించారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిన 'దారుల్ ఉలూమ్' సంస్థ కూడా అలా నినదించడం విగ్రహారాధన కిందకు వస్తుందని, ఇది ఇస్లాం సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ, తామంతా దేశాన్ని ఎంతో ప్రేమిస్తామని, 'హిందుస్తాన్ జిందాబాద్, మద్రేవతని' అంటూ నినదిస్తామన్నారు. దేశాన్ని దేవతల మాదిరిగా పేర్కొంటూ ఎలా నినాదాలిస్తారని ప్రశ్నించారు. అలాగే సిక్కుమత పెద్దలు కూడా ఆ నినాదంను తాము ఆమోదించేది లేదని చెప్పారు. దీనిని హిందుత్వ శక్తులు తీవ్రంగా తప్పుపడుతూ అవాకులు, చవాకులు పేలుతున్నాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ 'భారత మాతాకీ జై అనని వాళ్లు దేశంలో ఉండొద్దు' అన్నారు. ఇక రాందేవ్ బాబా 'తలలు తీయగలం' అని అనుచిత వ్యాఖ్యలు చేశాడు. దేశం వీరి సొంత జాగీరైనట్లు ఈ అపర దేశభక్తులు మాట్లాడుతున్నారు. సరే ఈ నినాదం వెనుకగల చరిత్రను ఇప్పుడు పరిశీలిద్దాం.

సంఘ్‌పరివార్ చెప్పే భారతమాతకు, భారత ప్రజలు విశ్వసించే భారత భూభాగంకు (జన్మభూమి) మధ్య చాలా తేడా ఉంది. ఈ విషయాన్ని ప్రముఖ మేధావి, సామాజిక శాస్త్రవేత్త కంచ ఐలయ్య విపులంగా వివరించారు. ఈనాడు ఆర్ఎస్ఎస్ వారు ఇచ్చిన భారత మాతాకీ జై నినాదం మతతత్వ రాజకీయాలకు, మనుధర్మంకు అతీతమైనది కాదు. దళిత, బహుజనులను మళ్లీ మనుధర్మంలోకి నెట్టే రాజకీయ కుట్రలో భాగం. జాతీయోద్యమంలో మొదటి నినాదం 'వందేమాతరం' ఈ నినాదం 1905లో లార్డ్ కర్జన్ చేసిన బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా బెంగాలీ బ్రాహ్మణీయ వర్గం ప్రతిపాదించిన నినాదం. ఈ వందేమాతర గీతాన్ని బంకిమ్ చంద్ర చటర్జీ రాశాడు. ఆ రోజుల్లో బెంగాలీ బ్రాహ్మణులకు, మరాఠీ బ్రాహ్మణులకు చాలా సంఘర్షణ ఉండేది. మరాఠీ బ్రాహ్మణులు దుర్గా దేవిని పూజించేవారు కాదు. వీరు సరస్వతి, లక్ష్మీదేవిని తప్ప ఇతర ఆడ దేవతలను గుర్తించేవారు కాదు. ఈ మరాఠీ బ్రాహ్మణుల నుంచే ఆర్ఎస్ఎస్ 1925లో పుట్టింది. ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయం కూడా నాగపూర్‌లోనే ఉంది. ఈ వైరుధ్యంలో భాగంగానే వందేమాతర నినాదంకు ప్రత్యామ్నాయంగా 'భారత మాతాకీ జై' నినాదం మరాఠీ బ్రాహ్మణ వర్గం నుంచి మహారాష్ట్ర నుండి పుట్టింది. దీన్నే తరువాత ఆర్ఎస్ఎస్ తన జాతీయ నినాదంగా ముందుకు తెచ్చింది. వీరి అవగాహనలో ఇందులోని 'మాతా' సరస్వతి దేవి, వీరి చదువుల దేవత. ఎవరైన భారతమాత చిత్రపటంను పరిశీలిస్తే అచ్చం సరస్వతి, లక్ష్మీదేవిలనే పోలి ఉండి, చేతిలో కాషాయ జెండా ఉంటుంది. కాబట్టి ఈ నినాదంలోని మాతా భారత భూమికి ప్రతిరూపమనడానికి ఆస్కారమే లేదు. అయితే సరస్వతి దళిత, బహుజనులకు చదువును, విద్యను, జ్ఞానంను ఏ దశలోనైనా ప్రతిబింబించిందా? ఈ బ్రాహ్మణీయ శక్తులు దళిత, బహుజనులను ఏనాడైనా చదువుకోనిచ్చాయా? బ్రాహ్మణ క్షత్రియ వర్గాలు విద్య, మత విషయాల్లో మానవతా రీత్యా కనీసం వాళ్లను మానవులుగా చూశారా? వీరి భారత మాత ఈ వర్గాలకు ఎలా భారతమాత అవుతుంది? భిన్న మతాచారాలు గల భారతీయులందరికీ దీన్ని ఆపాదించి, బలవంతంగా రుద్దాలనుకోవడం న్యాయమా? వీరి భారత మాతాకీ జై కొట్టనన్న వారిపై ఉగ్రవాద, దేశ ద్రోహ ముద్ర వేయడం ధర్మమా? మహాత్మాపూలే దంపతులు, సాహుమహరాజ్, నారాయణ గురుల కృషితో 1840వ

దశకం తరువాతే బ్రిటిష్ వలసవాద కాలంలోనే నిమ్న కులాల వారికి చదువు ప్రారంభమైనది. అప్పటిదాకా ఈ వర్గాల ప్రజలకు చదువు లేకపోగా, కనీసం గౌరవం కూడా లేకుండా కటిక దారిద్ర్యంలో జీవించాల్సి వచ్చింది. తదుపరి అంబేద్కర్ కృషితో 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చాక విశాల రూపంలో నిమ్న కులాల వారికి విద్యా హక్కు దక్కింది. అందుకే నిమ్న కులాల ప్రజలు తమ జాతీయ నినాదంగా 'భీమ్ భూమికి జై' అనే నినాదాన్ని దేశమంతటా ప్రచారం చేయాల్సి ఉందంటారు కంచ ఐలయ్య.

వందేమాతరం నినాదాన్ని బెంగాలీ బ్రాహ్మణులు బలపరిస్తే, మరాఠీ బ్రాహ్మణులు భారత్ మాతాకీ జై నినాదాన్ని బలపరిచారు. ఈ రెండింటినీ వ్యతిరేకించి కాయస్తు సామాజిక వర్గం నుంచి వచ్చిన సుభాష్ చంద్రబోస్ 'జై హింద్' నినాదమిచ్చాడు. ఈ నినాదాన్ని మౌలానా అజాద్ నాయకత్వంలోని ముస్లింలంతా సపోర్టు చేశారు. ఈ దేశానికి హిందుస్థాన్ అనే పేరు కూడా ఉంది కాబట్టి జాతీయ కాంగ్రెస్ కూడా చాలా చర్చ తర్వాత ఈ నినాదాన్ని ఆమోదించింది. అందుకే ఆగస్టు 15 ఎర్రకోటపై ఉపన్యాసం ముగింపులో ప్రతి ప్రధాన మంత్రి 'జై హింద్' నినాదంతో ముగింపునివ్వడం ఆనవాయితీగా వస్తుంది. రాజ్యాంగంలో ఈ దేశాన్ని 'ఇండియా', 'ది భారత్' అని రాసుకున్నాము.

జాతీయోద్యమ నాయకులలో గొప్ప దార్శనికుడైన మేధావి భగత్‌సింగ్ అతి చిన్న వయస్సులోనే మార్క్సిజంను అధ్యయనం చేసి, ఈ గొప్ప మానవీయ శాస్త్రంకు ప్రత్యామ్నాయం లేదని గ్రహించి, రష్యాలో నిర్మించబడుతున్న సోషలిస్టు సమాజంతో స్ఫూర్తి పొంది, సోషలిస్టు స్థాపనయే మానవ జాతికి విముక్తి మార్గమని, అది విప్లవం ద్వారా మాత్రమే సాధ్యమని తేల్చి 'ఇంక్విలాబ్' జిందాబాద్ (విప్లవం వర్ధిల్లాలి) అనే నినాదం ఇచ్చాడు. ఆనాటి యువతలో ఉత్తేజం నింపాడు. ఈ నినాదాన్ని అప్పటి శ్రామిక ప్రజలు, కమ్యూనిస్టులు ఎత్తిపట్టి నినదించారు దేశభక్తికి, త్యాగానికి, నిలువెత్తు సాక్ష్యం భారతదేశ ముద్దు బిడ్డ భగత్‌సింగ్ సంఘ్‌పరివార్‌కి కనపడదు. ఎందుకంటే భగత్‌సింగ్ కమ్యూనిస్టు కాబట్టి. కమ్యూనిస్టులు ఎల్లలులేని దేశభక్తులు, దోపిడీకి సాధనమైన మతాన్ని, దేవుళ్లను వీరు అంగీకరించరు. దీనికి ఉదాహరణ లాటిన్ అమెరికా విప్లవ వీరుడు 'చేగువేరా' జీవితమే మనకు సాక్ష్యం. కాబట్టి మతతత్వ వాదులైన సంఘ్‌పరివార్ శక్తులకు కమ్యూనిస్టులు, కన్హయ్య కుమార్ లాంటి ప్రశ్నించే యువత, మేధావులు, హేతువాదులు దేశ ద్రోహులుగా కనబడడంలో ఆశ్చర్యమేముంది. స్వాతంత్ర్యానంతరం ఈ బ్రాహ్మణ వర్గాలు తమ తిరోగమన సిద్ధాంతాలను, నినాదాలను జాతీయ సిద్ధాంతాలుగా, అదే దేశభక్తిగా అభివర్ణిస్తూ, మిగతా వర్గాల ప్రజలపై బలవంతంగా రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణను మరింత వేగవంతం చేయడానికి కార్పొరేట్ పెట్టుబడి దారులకు మన్మోహన్ సింగ్ చాలలేదు. గుజరాత్‌లో ముస్లిం ప్రజల శవాల మీదుగా నడిచి తన ముఖ్యమంత్రి పదవిని సుస్థిరం చేసుకున్న నియంత నరేంద్రమోడీ కనబడ్డాడు. ఇంకేముంది కార్పొరేట్ మీడియా శక్తుల సహాయంతో 2014లో బిజెపి పూర్తిగా అధికారంలోకి రావడంతో వీరి ఆగడాలకు అంతే లేకుండా పోయింది. అది నుండి ఈ శక్తులు చాలా దూకుడుగా హింసాత్మక పద్ధతులనే పాటించాయి. అందుకు గాంధీజీ హత్యే ఉదాహరణ. భిన్నత్వంలో ఏకత్వం గల భారత సమాజంలో మత కల్లోలాలు సృష్టించి, వదంతులు వ్యాపింపచేసి, శాంతియుతంగా కలిసి జీవిస్తున్న ప్రజలలో అశాంతి రేకెత్తిస్తూ, సుసంపన్న భారత సంస్కృతిపై దాడి చేయడం వీరి నైజం. కనుక భారత ప్రజలు వీరి సంకుచిత తత్వాన్ని అర్థం చేసుకుని వీరిని అడ్డుకోవాలి. ఈ దేశ సుసంపన్న సంస్కృతిని పరిరక్షించుకోవాలి.

ఇక భారత మాతాకీ జై నినాదంలో బుద్ధుడు, పూలే దంపతుల, అంబేద్కర్ లాంటి తాత్వికుల ఆలోచనలకు చరమగీతం పాడే ఆలోచన దాగి ఉంది. ఇప్పుడిప్పుడే ఉన్నత దశకు చేరుకుంటున్న దళిత, బహుజనులు ఈ మనువాద సంస్కృతిని, అహంను, దోపిడీని ప్రశ్నిస్తున్నారు. వారి వారి అస్థిత్వ ఉద్యమాలు బలోపేతమవ్వడాన్ని సహించలేని వీరు దళిత, బహుజనులకు విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే ఎచ్‌సియు, జెఎన్‌యుల పరిణామాలు. గొప్ప దార్శనికులను, మేధావులను తయారు చేసే ఈ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యపరచి, విదేశీ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు తలుపులు బార్లా తెరచి, దళిత బహుజనులకు విద్యను దూరం చేసే కుట్రను నిమ్న వర్గాలు అర్థం చేసుకోవాలి. చివరగా దేశభక్తి గురించి చెప్పాల్సి వస్తే సంఘ్‌పరివార్ కుటుంబానికి కనీస నైతిక హక్కులేదు. 1925లో పుట్టినప్పటికీ జాతీయోద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాల్గొనలేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆర్థిక దోపిడీని, పీడనను ఈ అపర దేశభక్తులు ఎక్కడా వ్యతిరేకించలేదు. పైగా సహాయపడ్డారు. ఈ పరంపర నేటికీ కొనసాగిస్తున్నది. ఇక్కడ ఈ హిందూ ఫాసిజం జాతీయత, దేశభక్తి పేరిట సామ్రాజ్యవాదుల అవసరాలు సంరక్షిస్తుంది. సామ్రాజ్యవాదానికి కావల్సింది కూడా అదే. కాబట్టి సంఘ్‌పరివార్ కుటుంబం ఈ దేశ సంపద, వనరులు, మొత్తం సమస్తం దేశ, విదేశీ బహుళజాతి సంస్థలు దోచుకుంటుంటే దీనిని నిలవరించమని ప్రభుత్వంపై దండెత్తరు. పైపెచ్చు ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకుడైన నరేంద్రమోడీ ఈ దేశంలోని లక్షల కోట్ల రూపాయలు, వనరులు విదేశీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతూ, ఈ దేశ సార్వభౌమాధికారాన్ని విదేశీ శక్తులకు తాకట్టు పెడుతుంటే పల్లెత్తుమాట అనరు. మోడీ దేశీయ పరిశ్రమలను, ఉపాధిని నాశనం చేస్తూ, విదేశీ పెట్టుబడిదారులకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాడు. అంటే స్వావలంబనకు సలాం చెప్పి విదేశీయతకు గులాంగిరి చేయడం వీరి దేశభక్తి. దీనినిబట్టి నిజమైన దేశభక్తులెవరో...! దేశ ద్రోహులెవరో...!! ప్రజలు అర్థం చేసుకోవచ్చు. లక్షల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వీరికి చీమ కుట్టినట్లుగా కూడా లేదు. ఇటు రైతులు అటు విద్యార్థులు, స్త్రీలు, అణగారిన ప్రజల బాధలు వీరికి కనబడవు. వంద రోజుల్లో నల్లధనం తెప్పిస్తామని ఊదరగొట్టిన మోడీ ఇప్పుడు ప్రజలకు ఏమి సమాధానం చెప్తాడు? విజయ్‌మాల్యా లాంటి కార్పొరేట్ దోపిడీ దారులు ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్న సొమ్ము దోచుకుని, విదేశాలకు పారిపోయి జల్సాలు చేస్తున్నా పల్లెత్తు మాట అనరు. చరిత్ర గల భారతీయ రైల్వేలలో కూడా ప్రైవేట్ పెట్టుబడులు అనుమతించి ఆ సంస్థను సామాన్య ప్రజలకు దూరం చేయనున్న ఘనత వీరిది. చివరకు ఈ దేశ సార్వభౌమత్వంతో ముడిపడి ఉన్న రక్షణ రంగంలో కూడా విదేశీ పెట్టుబడులను ఆహ్వానించిన ఘనులు వీరు. ఈ విధంగా దేశాన్ని హోల్‌సేల్‌గా అమ్మేస్తూ 'భారత మాతాకీ జై' అంటే సరిపోతుందా? ఈ వేళ జెఎన్‌యు యువత, కన్హయ్య కుమార్ మాకు స్వేచ్ఛ కావాలి! ఆకలి, పేదరికం, మత, కుల దురహంకారం నుండి...! అని నినదించడం ఒక కొత్త సూర్యోదయానికి నాంది. రాజకీయంగా ఎంతో ప్రాధాన్యత గల నినాదాలు మరికొన్ని కన్హయ్య చేశాడు. 'లాల్ సలామ్, జై భీమ్, ఇంక్విలాబ్ జిందాబాద్' అన్న నినాదాలు అతడు పదేపదే ఇచ్చాడు. మర్క్సిజాన్ని మాట్లాడాడు,

నినాదోన్మాదాలకు శ్రామిక పోరాటాలే అడ్డుకట్ట

***దేశంలో ప్రజలకు ఎన్ని రకాలుగా అన్యాయం జరిగినా పట్టించుకోకుండా, దేశభక్తి ముసుగులో ఊహాజనితమైన ఆధిపత్య నినాదాల చుట్టూనే పరిభ్రమించేటట్లు ఆధిపత్య వర్గాలు ప్రయత్నాలు చేస్తున్నాయని అంటున్నారు* బైరెడ్డి సతీష్**

ఈ దేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందే అని దేశ మైనారిటీలను ఉద్దేశించి, ప్రత్యేకించి ముస్లింలను బెదిరించే ధోరణితో ఉన్మాద పూరిత నినాదాలను సంఘ్‌పరివార్ శక్తులు తరచుగా ఇస్తుంటాయి. దేశభక్తి, జాతీయ భావన వ్యక్తీకరణ అంతా నినాదాల్లోనే దాగి ఉన్నట్లు, సరిహద్దుల్ని ప్రేమించడమే దేశభక్తి అయినట్టు ఈ శక్తులు ఊగిపోతుంటాయి. దేశంలోపల మనుషులు ఎన్ని అంతరాలకు, అసమానతలకు, పీడనకు, దోపిడీకి గురైనా, కుల వ్యవస్థ కుంపటిని మోస్తూ మగ్గిపోతున్న మట్టి జీవుల ఆక్రందనలు మాత్రం వీరికి పట్టవు. భారతదేశం ఒక జాతుల బందీఖానా, ఒకే జాతిగా జీవించిన దాఖాలాలు ఏమీ లేవు. రాజులు తమ రాజ్య విస్తరణలో సామాన్యులను సంహరించి సరిహద్దుల్ని ఏర్పరిచారే కానీ, ప్రజలంతా భారత జాతిగా, 'భరతమాత' బిడ్డలుగా లేరు. దేశాన్ని జాతికి సమానార్థంలో వాడుతూ భిన్నమైన అస్థిత్వాలు, వైవిధ్యభరితమైన సంస్కృతులు, చారిత్రక నేపథ్యాలు, భాషలు, భౌగోళిక విశిష్టతలు ఈ దేశ ప్రత్యేకం. కాని, ఈ దేశమే ఒక జాతి అని అస్సలు చెప్పలేము. అది ఒక ఊహాజనితమైన మనోభావన మాత్రమే. ఈ ఊహాజనితమైన భావనను ఒక భౌతిక వాస్తవంగా, భారతదేశం ఏకశిలా సదృశ్యమైనదిగా నమ్మించే పనికి ఈ వీర భక్తులు పూనుకున్నారు. అందుకే భారత్‌మాతాకీ జై అని అనకుంటే దేశద్రోహులని, విచ్ఛిన్నకర శక్తులని ముద్రలు వేసే చర్యలకు పాల్పడుతున్నారు.

వందేమాతరం, భారత్‌మాతాకీ జై నినాదాలు పైకి దేశభక్తిని ధ్వనించేలా ఉన్నప్పటికీ వాటి పునాదుల్లో మెజారిటీ మత స్వభావమే దాగి ఉన్నది. నిజమే 'జాతీయోద్యమ' కాలంలో ప్రజలలో బ్రిటిష్ వారి పట్ల వ్యతిరేకతను ప్రేరేపించగలిగిన 1947 తర్వాత ఈ నినాదాలే ప్రజల్లో తామంతా సమానులమనే ఐక్యతా భావనను ఎందుకు సాధించలేక పోయినవి అనే ప్రశ్న ఉదయిస్తుంది. బ్రాహ్మణీయ ఆధిపత్య స్వభావం కలిగిన అగ్రకుల నినాదాలు కాబట్టే ఐక్యతను సాధించలేకపోయినవి. ఈ నినాదాలు అమానుషమైన అంటరానితనానికి గురైన వాళ్లను, అణగారిన వర్గాలను ఆకర్షించలేకపోవడం వెనకాల ఆ అంటరానితనానికి గురిచేసింది, ఈ నినాదాలను ఇస్తున్నవారి ఆధిపత్య భావజాలమనే ఎరుక.

అంబేద్కర్ మేధో పోరాట ఫలితంగా వారికి కలగడమే 'నేను – నాదేశం' అనే వాటిల్లో నా దేశమే నాకు ముఖ్యం అన్న అంబేద్కర్ మాటల్ని వాడుకుంటున్న 'సంఘ్' సంఘాలు నా దేశం – నా జాతి అన్నప్పుడు నా జాతే ప్రధానం అన్నాడన్న విషయాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు. పిడికెడు మంది స్వాతంత్ర్యోద్యమం పేరుతో ఇచ్చిన ఈ నినాదాలు రాజకీయాధికారాన్ని వాళ్ల చేతుల్లో పెడతాయే తప్ప బహుజనులను కుల సంకెళ్ల నుండి, అంటరాని మంటల నుండి విముక్తి చేయలేవని తనకు రాజకీయ స్వాతంత్ర్యం కంటే సామాజిక సమానత్వం, స్వాతంత్ర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం, సమానత్వం ముఖ్యమని అణగారిన తన జాతివైపే నిబ్బరంగా నిలబడ్డాడు అంబేద్కర్. సరిగ్గా ఆ జ్ఞానమే ఇవాళ దళితులకు విశ్వాసాన్నీ, ప్రశ్నించే తత్వాన్నీ, ధిక్కార స్వరాన్నీ ఇచ్చినందుకు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నందుకు దేశద్రోహ ముద్రలను, జ్ఞానాలయాలుగా పేరుబడ్డ విశ్వవిద్యాలయాల్లో వెలివాడల్లో విసిరేసి 'ఉరిని' బిగిస్తున్నారు.

'మాతా'కీ జై అన్నవాళ్లు మాతలను (స్త్రీలను) అన్నా సమాన గౌరంతో వ్యక్తులుగా వారికుండే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, సమాన హక్కుల్ని అనుభవించే స్థితి లేకుండా ఎందుకు చేస్తున్నారు. 'సంఘ్' సాదులు స్త్రీలు పిల్లలు కనడం వరకు, ఇంటి పనుల వరకే పరిమితం కావాలని, గుళ్లల్లోకి ప్రవేశించరాదని, ప్రవేశిస్తే అవి అపవిత్రమవుతాయని, అత్యాచారాలు జరుగుతాయని బాహాటంగానే మాట్లాడుతున్నారు కాబట్టి ఈ నినాదాలిచ్చే వాళ్ల భావజాలంలో అత్యంత సహజమైన స్త్రీ – పురుష సమానత్వ భావన అస్సలే లేదని అర్థమవుతుంది. ఒకవైపు ఆచారాలు, సంప్రదాయం పేరుతో స్త్రీలు గుడి ప్రవేశం చేయడం మత గ్రంథాలు ఒప్పుకోవని వాదిస్తున్నప్పుడు అదే వారి విశ్వాసాలకు అనుగుణంగా వందేమాతరం, భారత్‌మాతాకీ జై అనడానికి తిరస్కరిస్తున్న ముస్లింలను దేశభక్తులు కారని, వారస్సలు ఈ దేశవాసులే కారనే ప్రచారాన్ని పనిగట్టుకుని చేస్తున్నవి ఈ శక్తులు.

మహారాష్ట్రలోని ముంబైకి పొట్ట కూటికోసం వచ్చే మరో రాష్ట్రం వారిని కూడా సహించని, భౌతిక దాడులు చేసే వీర జాతీయవాద పార్టీ శివసేన మాతాకీ జై అనకపోతే పౌరసత్వాన్ని రద్దు చేయాలని, వారందరినీ పాకిస్తాన్ పంపివేయాలనే డిమాండ్ వెనకాల ముస్లింలే వారి టార్గెట్ అని స్పష్టమవుతుంది. యోగా బాబా రాందేవ్ (బిజినెస్ బాబా) జై అనకపోతే తలలు నరికివేసే వాడినని శూద్రుల తలలు నరికిన బ్రాహ్మణీయ భావాజాలాన్ని బయటపెట్టాడు. మెజారిటీ మతస్తులను రెచ్చగొట్టడానికి, ఓట్లు రాల్చుకోవడానికి, బిజెపికి రాజకీయంగా లబ్ధి చేకూర్చడానికి సంఘ్‌పరివార్ శక్తులు రాజకీయ సాధనంగా ఈ నినాదాల అస్త్రాలను ప్రయోగిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా వందేమాతరం, అంబేద్కర్ తాత్వికతను పదేపదే ఉటంకించాడు. రోహిత్ వేముల కూడా ఇవే భావాలు కలిగినవాడు. ఈ దేశపు అట్టడుగు పొరల నుంచి వచ్చి ఉన్నత విద్యా సంస్థలకు చేరి, ఈ సమాజం గురించి, మార్పు గురించి ఆలోచిస్తున్న కొత్తతరం యువకులు ప్రతిపాదిస్తున్న ఈ ప్రత్యామ్నాయ రాజకీయాల ఆచరణ గురించి ఆలోచించాల్సిన సమయమిది. రాజ్యాంగాన్ని అమలు చేయమని ఈ దేశ పాలకులకు సవాల్ చేస్తూ ఒక కొత్త భవితవ్యాన్ని ప్రతిపాదిస్తున్న యువతకు లాల్ సలాం!

(రచయిత సామాజిక విశ్లేషకులు)

వీ

భారత్‌మాతాకీ జై అనడం లాంటి వాటిని బలవంతంగా రుద్దాలని, గతంలో భగవద్గీత, సూర్య నమస్కారాలను బిజెపి పాలిత రాష్ట్రాల్లో తప్పనిసరి చేసినట్లు దేశమంతటా చేయాలనే ఉన్మాద తలంపునే కొనసాగిస్తున్నది. దేశాన్ని హైందవీకరించాలనే, అఖండ భారత్‌ను నిర్మించాలనే కలలే ఈ నినాదాలను ముందుకు తోస్తున్నాయి.

1882లో బంకించంద్ర చటర్జీ రాసిన ఆనంద్ మఠ్ నవల నుండి తీసుకోబడిన వందేమాతరంను 'జాతీయ' గీతంగా చేయాలన్న ప్రతిపాదనను ముస్లింలీగ్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇండియాను దుర్గా దేవిగా పోల్చడం పట్ల తీవ్రమైన అభ్యంతరం చెప్పింది. ఆనాటి నుండి ఈనాటి వరకు ఈ అంశం తెరపైకి వచ్చినప్పుడల్లా తీవ్రమైన చర్చనే జరుగుతూ ఉన్నది. మత విశ్వాసాల కారణంగా ఈ పాటను పాడక పోవడం రాజ్యాంగ విరుద్ధమేమీ కాదని సుప్రీంకోర్టు కూడా విస్పష్టంగానే పేర్కొన్నది. వందేమాతరం గీతం అయినా, భారత్‌మాతా నినాదం అయినా బలవంతంగా రుద్దడం అంటే రాజ్యాంగం పూచీపడిన భావ ప్రకటనా స్వేచ్ఛ, మత స్వాతంత్ర్యపు హక్కును ఉల్లంఘించడమే. నిజానికి ఈ నినాదాలేవి ఈ నేల సామాజిక వాస్తవికతను, వైవిధ్య భరితమైన సాంస్కృతిక అస్థిత్వంను, శ్రమజీవుల ఉత్పత్తి కులాలకు ప్రాతినిధ్యం వహించే లేదా వారి సమిష్టి జీవన విలువల్ని ప్రతిబింబించే, ప్రతిధ్వనించే నినాదాలయితే అస్సలు కావు. అంతరాలు, అసమానతలు, దోపిడీ పీడనలు, కుల సంకెళ్ల నుండి ఆధిపత్య శక్తుల నుండి బహుజనులను విముక్తి చేయకుండా సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించకుండా భారతదేశం ఒకే జాతిగా రూపొందబడే అవకాశాలు లేవుకదా. అలాంటివి ఈ దేశంలో మరింతగా వైరుధ్యాలను పెంచి అంతర్యుద్ధ ప్రమాదంలోకి నెట్టివేస్తాయి. భారతదేశ సార్వభౌమాధికారాన్ని గుర్తించని కశ్మీరీ స్వయం పాలనా పోరాటాన్ని, ఈశాన్య రాష్ట్రాల జాతి విముక్తి పోరాటాలను అణచివేసే ఎజెండా కూడా ఈ నినాదాల మాటున దాగి ఉన్నది.

కశ్మీరీలు, ఈశాన్య రాష్ట్రాల ప్రజలు భారత్‌ను వారి ప్రాంతాలను ఆక్రమించుకున్న ఆధిపత్య రాజ్యంగా నిరంతరం హింసను అనుభవిస్తూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను భారత సైన్యం చేతిలో కోల్పోతున్న నేపథ్యంలో భారత్‌మాతాకీ జై అని మనస్ఫూర్తిగా అనగలరా? అసలు ఇలాంటి నినాదాల మూలాలు ఫాసిజంలో దాగి ఉన్నవి. ఇవాళ ఈ దేశాన్ని హిందూ ఫాసిస్టు రాజ్యంగా మార్చాలనే మతోన్మాద శక్తులకు జాతుల అస్థిత్వాలు, వ్యక్తుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు కనీస గౌరవం, గుర్తింపు ఇవ్వని ఫాసిజమే ఆదర్శం అవుతుంది. రాజ్యాన్ని విమర్శించినా, స్వేచ్ఛకై పోరాడినా, హక్కుల్ని అనుభవించే ప్రయత్నం పౌరులు చేసినా అది రాజద్రోహమే అవుతుంది.

దేశంలోని మనుషులకు ఎన్ని రూపాల్లో అన్యాయం జరిగినా పట్టని శక్తులు ఊహాజనితమైన ఆధిపత్య నినాదాల చుట్టూ పరిభ్రమిస్తూ ఉత్పత్తి శక్తులను నిర్వీర్యం చేసే దేశభక్తి ముసుగు వేసుకున్న కుట్రతప్ప మరేమి కాదు. బహుళత్వం, లౌకికతత్వం, వ్యక్తుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, జాతుల స్వయం నిర్ణయాధికారం, విభిన్న భావజాలాలు అస్థిత్వంలో లేకుండా చేసి విశ్వాసాలను పునాదులుగా, అసమానతలను సహజమైనవిగా, ప్రకృతి ధర్మంగా నమ్మించే మత రాజ్యపు నిర్మాణమే భారత్‌మాతాకీ జై అనే నినాదపు అసలైన లక్ష్యం. గొంతులు చించుకుని ఇస్తున్న ఈ నినాదపు భావన అయిన భారత్‌మాతా ప్రాచీన ఇండియాలో, మధ్యయుగ ఇండియాలో కాని ఉందని చెప్పే చారిత్రక ఆధారాలు ఏమీలేవు. యూరప్ నుండి దిగుమతి అయినటువంటి భావన మాత్రమే. మాతృభూమి పితృభూమి అనే భావనలు యూరప్‌లో రూపుదిద్దుకున్నాయి. యూరప్‌లో జనించి అభివృద్ధి చెందిన జాతీయ భావన అనంతరం ఇతర దేశాలు మానవరూపాల్లో ప్రాతినిధ్యీకరించడం మొదలైంది. ప్రాచీన మధ్యయుగాల నాటి ఇండియాను తల్లిగానూ, తండ్రిగానూ గుర్తించిన దాఖలాలు మచ్చుకైనా కనిపించవు. ఇక్కడి బ్రాహ్మణీయ ఆధిపత్య శక్తులు భారతదేశం ఒక జాతి అని దాని భిన్నత్వాన్ని విస్మరించి ఈ నినాదాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ఏ చారిత్రక ఆధారం లేని భారత్‌మాతా అనే భావన కేవలం ఆంగ్లేయ పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో మాత్రమే ఒక నిర్దిష్టమైన రూపు తీసుకున్నది. అదీ ప్రత్యేక సందర్భంలో మాత్రమే రూపొందుతూ వచ్చింది తప్ప భారత్ ఒక జాతిగా మనుగడలో ఉండి, ప్రజా జీవితపు పునాదుల్లోంచి వచ్చిన ఒక తాత్విక భావన అయితే కాదు. దీనిని ఒక మెజారిటీ మతాధిపత్యాన్ని స్థిరీకరించే, ఆమోదం పొందించుకునే ప్రయత్నానికి దేశ సమైఖ్యత సమగ్రతల ముసుగులు తొడిగి ముందుకు తోస్తున్నారు. తామంతా ఒకే జాతి అని వారి జీవితానుభవాల ఆధారంగా చారిత్రక నేపథ్యంలో నుంచి సమిష్టి జీవితంలో నుండి రావాలే తప్పా, బయటి నుండి రుద్దబడితే అది మనుషుల హక్కుల్ని, స్వేచ్ఛను తీవ్రంగా ఉల్లంఘించే అంశమే అవుతుంది.

భారత రాజ్యాంగంలో కూడా వందేమాతరం పాడమనో, జనగణమనను ఆలాపించమనో, భారత్‌మాతాకీ జై, జై హింద్ అనమని నిర్దేశించలేదు. అవి పాడడం, పాడకపోవడం, నినదించడం ఐచ్ఛికం మాత్రమే. త్రివర్ణ పతాకానికి వందనం చేయడం, చేయకపోవడం వ్యక్తి ఇష్టా ఇష్టాల మీద ఆధారపడి ఉంటుంది. కాకపోతే వాటిని అగౌరవ పరచకూడదని మాత్రమే నిర్దిష్టంగా పేర్కొన్నది. ఈ దేశభక్తి సమూహం కేవలం ప్రతీకాత్మకమైన వాటిని మాత్రమే దేశభక్తికి అసలైన గుర్తని, మిగతా విషయాల్లో ఎంత ప్రజాద్రోహ పనులైనా లెక్కలోకి రానట్లు వ్యవహరిస్తున్నారు. గొప్పగా కీర్తించుకునే మన జాతీయ గీతం జనగణమనలో 'అధినాయక్', 'భారత్ భాగ్యవిధాత' ఎవరు అనే అంశం మీద తీవ్రమైన చర్చనే జరిగింది.

1911లో భారతదేశ సందర్శనకు వచ్చిన ఆనాటి ఇంగ్లాండ్ రాజు కింగ్ జార్జ్ - 5, రాణి గార్ల గౌరవార్థం రాయబడిందని అనుకుంటున్న గీతం 'జాతీయ గీతం' ఎలా అవుతుంది? ఆంగ్లేయ పాలకులు ఎప్పటికీ భారత భాగ్య విధాతలు కాలేరనీ రవీంద్రనాథ్ ఠాగూర్ వీటిని ఖండించి నప్పటికీ ఇంతకు ఆ భాగ్యాన్ని ప్రసాదించే విధాత ఎవరన్నది తేలనేలేదు. ఇంతకు ఎవరికి విజయం కలగాలి? ఈ దేశపు ఉత్థాన పతనాల్లో, కీలక మలుపుల్లో ముందుండి నడిపించే ఆ శక్తి ఎవరు? ఒకవేళ అది 'దేవుడు' అనుకున్నా సెక్యులర్ రాజ్యాంగం దానిని అంగీకరించే అవకాశమే లేదు. రాజ్యాంగంలో దైవ భావనకు ఏమాత్రం చోటు లేదు. అది వ్యక్తిగత అంశంగా మాత్రమే పరిగణించింది! ఈ గీతంలో కూడా అప్పటి బ్రిటిష్ పాలిత ప్రాంతాలను, భిన్నత్వాన్ని గుర్తిస్తూ రాయబడ్డప్పటికీ ఉత్పత్తి కులాల శ్రమైక జీవన సౌందర్యం, ఈ దేశ మూలవాసుల జీవన దృశ్యం ప్రతిబింబించేలా లేదన్నది వాస్తవం.

దేశ సామాజిక వాస్తవాలను కళ్లకు కట్టిందనలేము. ఈ దేశ భాగ్య విధాతలు ఈ దేశ ఉత్పత్తి కులాలు, శ్రమజీవులు మాత్రమే. శ్రమకు దూరంగా ఉన్న కులాలు, వ్యక్తులు, శక్తులు దోపిడీ వ్యవస్థలో భాగమైనారు. దోపిడీని సుస్థిరం చేసేందుకు దళిత, అణగారిన కులాలు, శ్రమజీవులు విముక్తి కాకుండా ఉండేందుకే దేశభక్తి ముసుగులో నినాదోన్మాదాలు చేస్తున్నారు. శ్రమజీవుల తిరుగుబాటే ఈ ఉన్మాదానికి శాశ్వతమైన విరుగుడు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

నిజమైన దేశద్రోహులెవరు?

***పాలకులు విదేశీ కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను తాకట్టుపెట్టి, వారిచ్చే అక్రమ సంపాదనతో విలాసవంతమైన జీవితాలను అనుభవిస్తూ, ప్రజా జీవన రంగాలను ఎట్లా ఛిద్రం చేస్తున్నారో విశ్లేషిస్తున్నారు* కోబడ్ గాంధీ**

నిజమైన జాతీయవాదం/దేశభక్తి అంటే ఏమిటి? చాల సహజంగా ఒక వ్యక్తికి తన జాతి/దేశం పట్ల ఉండే ప్రేమ అని అర్థం చెప్పుకోవచ్చు. కాని ఇదేమీ నిరపేక్షమైన, అమూర్తమైన భావన కాదు. జాతి అంటే భూమీ ఉంటుంది, ప్రజలూ ఉంటారు. కనుక మన భూమి పట్లా, ఆ భూమి మీద నివసించే ప్రజాసమూహం పట్లా ప్రేమ ఉండడమే నిజమైన జాతీయవాదానికి తొలి అడుగు అవుతుంది. మన భూమీ, ప్రజలూ వికసించాలని కోరుకోవడం వాస్తవ జాతీయవాదపు సారాంశం అవుతుంది.

నేను నా చార్టర్డ్ అకౌంటెన్సీ కోర్సు చదవడానికి 1960ల చివరిలో బ్రిటన్ వెళ్లినప్పుడే నేను ఈ అవగాహనను గుర్తించగలిగాను. అక్కడ మన భారతీయులందరినీ తెల్లవాళ్లు వర్ణవివక్షా దృష్టితో చూస్తున్నారని నేను కళ్లారా చూశాను. దానికి కారణాలేమిటో వెతకడం మొదలు పెట్టాను. వాళ్ల వలసవాద మనస్తత్వంలో దాని బీజాలున్నాయని నేను గుర్తించాను. అలా వలసవాదం గురించీ, సామ్రాజ్యవాదం గురించీ, మన స్వాతంత్ర్యోద్యమం గురించీ చదవడం మొదలుపెట్టాను.

సంపన్నమైన భారతదేశాన్ని రెండు శతాబ్దాల వలసవాద లూటీ ఎట్లా శిథిలం చేసిందో దాదాభాయి నౌరోజీ ఉద్గ్రంథం వివరంగా చెప్పింది. మన స్వాతంత్ర్యం కోసం పోరాడిన వేలాది మంది యోధులు చేసిన త్యాగం గురించీ, ప్రజా ఆకాంక్షలను అణచివేయడానికి బ్రిటిష్ వలసవాదులు అమలు చేసిన పాశవికత్వం గురించీ, ప్రజలను చీలదీయడానికి అమలు చేసిన 'విభజించి పాలించు విధానం గురించీ రజనీ పామీ దత్ రాసిన ఇండియా టుడే అవగాహన కలిగించింది. ప్రజల ఆగ్రహాన్ని బ్రిటిష్ పాలకుల మీది నుంచి మరొకవైపు మళ్లించడానికి రూపొందిన వలసవాద విధానంలోనే ప్రస్తుత హిందూ - ముస్లిం విభజన మూలాలను గుర్తించవచ్చు.

చివరికి, నాలుగు సంవత్సరాలు చార్టర్డ్ అకౌంటెన్సీ చదువుకుని, సంపన్నమైన ఉద్యోగం సంపాదించే అవకాశం తెచ్చుకుని, నేను నా చదువు వదిలేశాను. ఈ దేశానికి సేవ చేయాలనే ఉద్దేశంతో భారతదేశానికి తిరిగివచ్చాను. అప్పుడు నాముందు ఒక సవాల్ ఉండింది. ఒకవైపు సంపన్నుడిగా, అధికారశక్తి ఉన్నవాడిగా మారడం. మరొకవైపు దేశానికి సేవచేయడం, ముఖ్యంగా దేశంలోని పీడిత ప్రజలకు సేవచేయడం. బహుశా నాలోలోపల పొంగి పొర్లుతున్న జాతీయవాద ప్రేరణ వల్ల కావచ్చు నేను రెండో దాన్నే ఎంచుకున్నాను.

అది కష్టతరమైన నిర్ణయమే. కాని నేనెన్నడూ ఆ నిర్ణయానికి చింతించలేదు. ఆ నిర్ణయం వల్ల ఒక చార్టర్డ్ అకౌంటెంట్ గా పొందగలిగిన విలాసాలు వదులుకోవలసి వచ్చినా, నిస్సహాయులకు సేవచేయడంలో నేను అపారమైన వ్యక్తిగత సంతృప్తిని అనుభవించాను. దురదృష్టవశాత్తూ, నా జీవిత చరమాంకంలో నేను మొట్టమొదటిసారి వలసవాద చట్టాల వంటి చట్టాల కింద అరెస్టయ్యాను. 68 సంవత్సరాల వృద్ధుడినీ, అనేక అనారోగ్య సమస్యలు ఉన్నవాడినీ అయినా విడుదల ఆశ కనుచూపుమేరలో లేకుండా ఆరున్నర సంవత్సరాలుగా జైలులో ఉన్నాను.

నేను నా చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తిలో కొనసాగితే ఐదు నక్షత్రాల విలాస జీవితం అనుభవించగలిగేవాడిని. కాని మన నేలకూ, మన ప్రజలకూ ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న విధ్వంసాన్ని చూసి భరించలేకపోవడం, ఆ విధ్వంసాన్ని ఆపడానికి ప్రయత్నించడం వలసవాద పాలనను గుర్తుకు తెచ్చే ఈ క్రూర నిర్బంధానికి దారి తీసింది.

కాని భారత మాత మీద ప్రతిరోజూ జరుగుతున్న అత్యాచారాన్ని చూస్తూ చలించకుండా ఉండడం అసాధ్యమై పోయింది. స్వాతంత్ర్యం తర్వాత ఏడు దశాబ్దాలకు కూడ మన స్వాతంత్ర్య సమరయోధుల కలలు అణచివేతకు గురవుతుంటే చూస్తున్న ఎవరికైనా కన్నీళ్లు రాకమానవు.

మన భూమి మీదా, మన ప్రజల మీదా అమలవుతున్న విధ్వంస దృశ్యాన్ని, దానితోపాటే ఆర్థికాభివృద్ధి దిశను ఏమాత్రం చూసినా, మన జాతీయ వాదం దేని మీద దృష్టి పెట్టవలసి ఉంటుందో తెలుస్తుంది. మొదట మన భూమి సంగతీ, ఆ తర్వాత మన ప్రజల స్థితీ, చివరిగా ఆర్థిక వ్యవస్థ స్థితీ చూద్దాం.

విధ్వంసం ఎంత పెద్ద ఎత్తున జరుగుతున్నదో చూడండి. రసాయనాల వాడకం వల్ల మన భూమిలో పై నేల పొరలన్నీ ధ్వంసమైపోయాయి. అందువల్ల నీటిని నిలిపి ఉంచుకునే శక్తి తరిగిపోయి, వరదలు, కరవులు, నీరు తక్కువగా ఇంకడం, భూగర్భ జలవనరులు ఎండిపోవడం, ఉప్పుబారిపోవడం జరిగింది. దీనికి తోడుగా, కేవలం 15 సంవత్సరాలలో, 1999 నుంచి 2013 వరకు, మన మొత్తం అటవీ విస్తీర్ణంలో 15 శాతం ధ్వంసమైపోయింది. ఆతర్వాత రెండు సంవత్సరాలలో (2013-15) అదనంగా 2500 చ.కి.మీ ప్రధాన అటవీ భూమి ధ్వంసమైపోయింది. దేశంలో వర్షపాతం తగ్గిపోవడానికీ, గందరగోళంగా మారడానికీ ప్రధాన కారణం ఇది. అందువల్ల వరుసగా కరవులూ, కాలంగాని కాలంలో వర్షాలూ వస్తూ మన పంటలను అతలాకుతలం చేస్తున్నాయి. చివరికి, స్వచ్ఛ భారత్ అని ఎంత గగ్గోలు పెట్టినప్పటికీ, భారతదేశం ప్రతిరోజూ 3687 కోట్ల లీటర్ల మురికినీ, చెత్తనూ పోగేసి, దాన్నంతా జీవనదీ వ్యవస్థలో కలుపుతున్నది. అందువల్ల మన స్వచ్ఛమైన నదులన్నీ, సముద్రతీరాలన్నీ మురికి కాలువలై పోయాయి. దానితో విపరీతంగా మత్స్యసంపద చనిపోతున్నది. నీటి సంబంధమైన వ్యాధుల వల్ల దేశంలో సాలీనా అదు లక్షల మంది చనిపోతున్నారు.

ఇక ప్రజల సంగతి చూద్దాం. గ్రామీణ ప్రజానీకంలో 45 కోట్ల మంది వ్యవసాయ కూలీలుగా, మరొక ఇరవై కోట్ల మంది సన్నకారు రైతులుగా (రెండున్నర ఎకరాల కన్న తక్కువ భూమితో) ఉన్నారు. వీరిలో

అత్యధికులు రెండు పూటలా తిండి తినలేరు. ఇక ఇప్పుడు పప్పులు, ఉల్లిపాయలు వగైరా అన్ని మౌలిక ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని అంటడంతో ఇంతకు ముందు వారి నోటి దగ్గరికి చేరిన ముద్ద కూడ ఇప్పుడు అందకుండా ఉంది. కాని అక్కడితో సమస్య అయిపోలేదు. సాపేక్షికంగా బాగున్నారనుకునే రైతులు కూడ సంక్షోభంలో మునిగి ఉన్నారు. రైతుల ఆత్మహత్యలు ఈ సంవత్సరం పదివేల అంకెకు చేరాయి. అంటే ప్రతిరోజూ 28 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్న మాట. చివరికి పట్టణ ప్రజానీకంలో కూడ సగం మంది, లేదా 15 కోట్ల మంది, అత్యంత అనారోగ్యకరమైన మురికివాడల్లో, చాలీచాలని జీతాల ఉద్యోగాలతో బతుకులీడుస్తున్నారు.

అంటే, స్వాతంత్ర్యం తర్వాత డెబ్బై సంవత్సరాలకు కూడ మన జనాభాలో 65 శాతం - 80 కోట్ల మంది - మనుషులలా జీవించే పరిస్థితి లేదు. ఇక ముప్పై కోట్ల పైచిలుకు మధ్యతరగతి కూడ నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆరోగ్య వ్యయం విపరీతంగా పెరిగిపోవడం అనే సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇలా పరిస్థితులు దిగజారుతున్న వారికి ఇచ్చే సబ్సిడీలను తగ్గించడం ద్వారా లక్ష కోట్ల రూపాయలు సంపాదించాలని తాజా ఎకనమిక్ సర్వే చెపుతున్నది. మరొకవైపు బడా కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే ఐదు లక్షల కోట్ల రూపాయలను ముట్టుకోకుండా యథాతథంగా ఉంచుతున్నది. ఇవాళ దేశంలో కేవలం రెండు నుంచి ఐదు శాతం ప్రజలు మాత్రమే సౌభాగ్యాన్ని అనుభవిస్తున్నారు. వారే అధికారాన్నీ, ప్రచార సాధనాలనూ చేతుల్లో పెట్టుకుని ఉన్నారు.

దీనంతటికీ తోడు ఇవాళ మన దేశం ఒక అనారోగ్యపీడిత దేశంగా ఉన్నది. అంటువ్యాధులలా ప్రబలుతున్న అనారోగ్యాలు పేద, మధ్యతరగతి వర్గాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రభుత్వ నివేదికల ప్రకారమే దేశంలోని మొత్తం కుటుంబాలలో 52 శాతం పోషకాహార లోపంతో బాధపడుతున్నాయి. నిజం చెప్పాలంటే దేశంలో గత రెండు దశాబ్దాలలో మాంసకృత్తుల వినియోగం పది శాతం తగ్గింది. ప్రతి సంవత్సరం పదహారు లక్షల మంది పిల్లలు ఐదు సంవత్సరాల లోపు చనిపోతున్నారు. ప్రతి రోజూ క్షయ వ్యాధితో వెయ్యి మరణాలు సంభవిస్తున్నాయి. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు మృత్యుతాండవం చేస్తున్నాయి. కాన్సర్, హృద్రోగం, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి కొత్తరకం వ్యాధులు ఈ అంటువ్యాధులకు కలుస్తున్నాయి.

ఆరోగ్య సేవల వ్యయం వల్ల ప్రతి సంవత్సరం కొత్తగా ఆరున్నర కోట్ల మంది పేదరికం బారిన పడుతున్నారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ చెపుతున్నది. 2011-12 ఒక్క సంవత్సరమే నాలుగు కోట్ల ముప్పై లక్షల మంది "ఆరోగ్య సంబంధమైన వ్యయాల ఉత్పాతానికి" గురయ్యారు. అయినా ఆరోగ్య రంగం మీద మన ప్రభుత్వ వ్యయం ప్రపంచం లోని అన్ని దేశాల కన్న తక్కువ. జాతీయాదాయంలో ఒక్క శాతం మాత్రమే. అది చైనాలో మూడు శాతం. ఇది ఊచకోత హత్యలకు, ఆమాటకొస్తే జాతి హననం అనే మాటకు మరొక వ్యక్తీకరణ కాదా? ఆరోగ్యసేవల మీద, పారిశుధ్యం మీద, ప్రభుత్వ వ్యయం పెరిగితే, కాలుష్యాన్ని తగ్గించడం జరిగితే ప్రతి సంవత్సరం కొన్ని వేల ప్రాణాలయినా దక్కవా?

భూమి మీదా, ప్రజల మీదా సాగుతున్న ఈ విధ్వంసకాండకూ మన ఆర్థిక వ్యవస్థ స్వభావానికీ సంబంధం ఉంది. మన ఆర్థిక వ్యవస్థ ఎప్పటికప్పుడు దిగజారుతూ ఉన్నప్పటికీ అపారమైన అక్రమధనాన్ని రూపొందిస్తూనే ఉన్నది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కునారిల్లిపోతున్నది. ఉత్పాదక పారిశ్రామిక రంగం ఒడిదుడుకుల్లో ఉన్నది. బ్యాంకులన్నీ దివాళా తీసి ఉన్నాయి. రూపాయి విలువ నానాటికీ దిగజారుతున్నది. ఎగుమతులు ఇదివరకెన్నడూ లేనంతగా కుంచించుకుపోతున్నాయి. ఆకాశాన్నంటుతున్న ద్రవ్యోల్బణం వల్ల నిజవేతనాలు తరిగిపోతున్నాయి. అందువల్ల ఈ ఆర్థిక వ్యవస్థవైపు ఒకసారి చూద్దాం.

వ్యవసాయరంగ వృద్ధిరేటు ఇప్పుడు ఒక్కశాతానికి పడిపోయింది. పారిశ్రామిక ఉత్పత్తి క్రమక్రమంగా తగ్గుతూ వచ్చి, దాని 'వృద్ధి' రేటు నవంబర్ 2015 లో మైనస్ 3.2 శాతం నమోదు చేసి గత నాలుగు సంవత్సరాలలోకెల్లా అత్యంత కనిష్టంగా ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి రంగంలో అదనంగా చేరిన విలువ 1990లలో 25 శాతం ఉన్నదల్లా ప్రస్తుతం 18 శాతానికి పడిపోయింది.

మొత్తం శ్రామిక ఉత్పాదకతా పెరుగుదలలో పారిశ్రామిక సంస్థల వాటా కేవలం ఆరు శాతంగా ఉంది. చైనాలో అది 32 శాతం. కార్పొరేట్ సంస్థలు రుణాలు ఎగ్గొడుతున్నందువల్ల బ్యాంకులన్నీ దివాళా అంచున ఉండి, కేవలం ప్రభుత్వాలు సమకూరుస్తున్న భారీ నిధులతో బతుకుతున్నాయి. బడా కార్పొరేట్ సంస్థలు తమ ఏడు నక్షత్రాల జీవనశైలిని యథాతథంగా వెలగబెడుతూనే తాము తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించడానికి నిరాకరిస్తున్నాయి. ప్రభుత్వం వారికి సహాయం అందించడానికి ముందుకొస్తున్నది. చివరికి రూపాయి పతనం నిరంతరంగా కొనసాగుతూ, 28 నెలల్లో అత్యంత కనిష్ఠానికి చేరింది. ఎగుమతులు 2015లో 18.5 శాతం తగ్గిపోయాయి. అది 1952-53 నుంచి కనీవినీ ఎరగని దుస్థితి.

ఆర్థిక వ్యవస్థ ఇంతకన్న దారుణంగా ఉండడానికి అవకాశం లేదు. మరొకవైపు అక్రమ ఆర్థిక వ్యవస్థ విలసిల్లుతున్నది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ 2013 డిసెంబర్ లో ఆర్థిక మంత్రిత్వ శాఖకు సమర్పించిన ఒక నివేదిక ప్రకారం మన జాతీయాదాయంలో అక్రమ ఆర్థిక వ్యవస్థ వాటా 75 శాతంగా ఉంది. మరో మాటల్లో చెప్పాలంటే ప్రతి సంవత్సరం 120 లక్షల కోట్ల రూపాయలు అక్రమ ఆర్థిక వ్యవస్థలోకి ప్రవహిస్తున్నాయి. దీనిమీద 25 శాతం పన్ను విధించి వసూలు చేయగలిగినా ప్రభుత్వం ప్రతి సంవత్సరం ముప్పై లక్షల కోట్ల రూపాయలు సంపాదించగలుతుంది. ఈ భారీ నిధులు వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి, పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు పెట్టడానికి, ఆరోగ్య, విద్యారంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి కావలసినదానికన్న ఎక్కువ.

అంటే మన భూమినీ, ప్రజలనూ అభివృద్ధి చేయకుండా అడ్డుకుంటున్నది ఈ అక్రమ ఆర్థిక వ్యవస్థ. అంత మాత్రమే కాదు, ఆ అక్రమ ఆర్థిక వ్యవస్థే ఏటేటా లక్షలాది మంది మరణించడానికి కారణమవుతున్నది. మొత్తంగా దేశపు నైతిక జీవన విధానాన్నే అవినీతి మయం చేస్తున్నది. అటువంటి అవినీతిలో కూరుకుపోయిన తర్వాత ఎటువంటి సామాజిక పురోభివృద్ధి సాధించడంలోనైనా విజయం ఉండదు.

మనకు జాతీయ ఆకాంక్షలేమైనా ఉంటే మొట్టమొదట ఈ దిశలో వాటిని వెచ్చించవలసి ఉంది. అవినీతిపరులైన అధికారులను బహిరంగంగా ఎండగట్టవలసి ఉంది. వారిలో బడా నేరస్తులను శిక్షించవలసి ఉంది. వారు లూటీ చేసిన అపార నిధులను కక్కించవలసి ఉంది. అంటే ఉదాహరణకు, దేశ సమస్యల పట్ల సానుభూతి చూపే సినిమాలూ టెలివిజన్ కార్యక్రమాలూ చూపుతున్న ఆమిర్ ఖాన్ మీద విరుచుకుపడే బదులు, మన దేశ సంపదలో వేల కోట్ల రూపాయలు పీల్చివేసిన విజయ్ మాల్యా, లలిత్ మోడీ వంటి వారి మీద ఎక్కుపెట్టవలసి ఉంది. ఆమిర్ ఖాన్ దేశం వదిలివెళ్తే ఎలా ఉంటుందని 'ఆలోచన' మాత్రమే చేశాడు. కాని విజయ్ మాల్యా, లలిత్ మోడీ వగైరా ఇప్పటికే బ్రిటన్‌కు

‘ఆదివాసుల కోసం మాట్లాడడం ఆపను’

రెండోసారి అరెస్టయి మూడున్నర నెలలు జైలులో గడిపి, సుప్రీం కోర్టు ఇచ్చిన బెయిల్‌పై విడుదల అయిన

ప్రొ. జి.ఎన్. సాయిబాబాతో *ప్రఖ్యాత జర్నలిస్టు* **జ్యోతి పున్వాని** *ఇంటర్వ్యూ*

మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణతో అపఖ్యాతి యుతమైన చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద నిర్బంధంలో ఉండి, నాగపూర్ లోని అత్యున్నత భద్రతా జైలు నుంచి తొమ్మిది నెలల్లో రెండోసారి విడుదలైన ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జి ఎన్ సాయిబాబా తన జైలు అనుభవాల గురించి జ్యోతి పున్వాని తో మాట్లాడారు. ఎప్పుడూ చక్రాల కుర్చీలోనే ఉండవలసిన సాయిబాబా వైద్యశాస్త్ర పరిభాషలో 90 శాతం అంగవైకల్య పీడితుడు. ఆదివాసుల పట్ల కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు తాను ఎంత దుర్భరమైన మూల్యం చెల్లించవలసి వచ్చిందో ఆయన ఈ ఇంటర్వ్యూలో వివరించారు.

ఇంత త్వరలో మళ్లీ జైలుకు వెళ్లవలసి వస్తుందని మీరు ఊహించారా?

ఉహు. లేదు. నాకు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ ను రద్దు చేస్తూ, నన్ను 48 గంటల లోపల అరెస్టు చేయవలసిందిగా న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వు చూసి నేనుగ్ర్భాంతి చెందాను. ఆ ఉత్తర్వు వెలువడిన సమయం ఎటువంటిదంటే, దాని గురించి నేనేమీ చేయడానికి అవకాశం లేదు. ఆ ఉత్తర్వు మాచేతికి సాయంత్రం 5.30కి అందింది. క్రిస్మస్ సెలవులకు ముందు ఆరోజే హైకోర్టుకు ఆఖరి పనిదినం. సెలవుల్లో వ్యాజ్యాలు వినే బెంచికి దరఖాస్తు చేయదలచుకున్నప్పటికీ, దరఖాస్తులు ఇవ్వవలసిన ఆఖరి రోజు కూడ అదే.

మొదటిసారి మీ జైలు జీవితం దుర్భరంగా గడిచింది. రెండోసారి ఏమన్నా మెరుగుపడిందా?

ఈసారి మరింత ఘోరం. గతంలో కనీసం వాళ్లు నా మందులు ఇవ్వడానికి నిరాకరించలేదు. బైటి నుంచి కొనుక్కొచ్చిన మందులు కూడ ఇచ్చారు. ఈసారి మాత్రం నా సొంత ఖర్చుతో నేను బైట కొనుక్కున్న మందులు కూడ నాకు ఇవ్వలేదు. గతంలో నన్ను ఆసుపత్రికి తీసుకువెళ్లమని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని గౌరవించారు. ఈసారి మాత్రం, వాళ్లు నన్ను ఆసుపత్రికి తీసుకువెళ్లనప్పుడు, జనవరిలో నేను సెషన్స్ కోర్టులో ఫిర్యాదు చేసి, తాజా ఆదేశాలు పొందాను. కాని ఈ ఆదేశాలను అధికారులు ఖాతరు చేయలేదు. ఇలా వాళ్లు కోర్టు ఆదేశాలను ఖాతరు చేయడంలేదని కోర్టుకు మళ్లీ తెలియజేసినప్పుడు న్యాయమూర్తి స్వయంగా జైలుకు వచ్చి నన్ను నా సెల్ లో కలుసుకున్నారు. నన్ను ఆసుపత్రికి తీసుకువెళ్లాలని మళ్లీ ఆదేశించారు. అయినా ఆ ఆదేశాలకు దిక్కులేకపోయింది. ఈ సంగతి మళ్లీ న్యాయమూర్తి దృష్టికి తెచ్చాం. ఆయన వీడియో కాన్ఫరెన్సింగ్ ఏర్పాటు చేసి జైలు అధికారులను హాజరు కమ్మన్నాడు. నన్ను వెంటనే ఆసుపత్రికి మార్చమని ఆదేశించాడు. మళ్లీ కూడ ఆ ఆదేశాలను లెక్కపెట్టేవాళ్లే లేకపోయారు. అప్పుడిక ఆ సెషన్స్ జడ్జి తాను తన చేయగలిగినంతా చేశానని, ఇక నేను హైకోర్టులో అభ్యర్థించడం తప్పదని సలహా ఇచ్చాడు. చివరికి ఆహారం విషయంలో కూడ నాతో ప్రవర్తించిన తీరు దారుణంగా ఉండింది. గతంలో నాకు జైలు ఆహారం జీర్ణం కావడం లేదని గుర్తించి, నాకు ఉప్పూకారం వేయని పప్పు ఇచ్చేవారు. ఈసారి మాత్రం అటువంటి దయ కూడ చూపలేదు. నా ఆరోగ్యం క్షీణిస్తున్నదనీ, రోజురోజుకూ నిస్త్రాణగా ఉంటున్నాననీ గుర్తించాక మాత్రమే ఈసారి రోజులు 100 మి.లీ. పాలు ఇవ్వడం మొదలుపెట్టారు. గతంలో జైలులో ఉన్నప్పుడు ఆసుపత్రి నిర్దేశించిన ప్రకారం ప్రతి రోజూ 400 మి.లీ. పాలు ఇచ్చేవారు. ఇంకా ఎక్కువ ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈసారి నన్ను జైలు ఆసుపత్రికి తీసుకుపోవడానికి కూడ వాళ్లు నిరాకరించారు. ఒకవైపు ఇలా ప్రవర్తిస్తూనే, నేను బెయిల్ కోసం సుప్రీం కోర్టుకు వెళ్లినప్పుడు, ఒక కార్పొరేట్ ఆసుపత్రితో సహా మూడు ఆసుపత్రులలో నాకు చికిత్స చేయిస్తున్నామనీ, చాల ఎక్కువ డబ్బు ఖర్చుపెడుతున్నామనీ ఒక ప్రమాణపత్రం దాఖలు చేశారు. నన్ను బెయిల్ మీద విడుదల చేస్తే, నేను అజ్ఞాతవాసానికి వెళతానని అన్నారు. గత 25 సంవత్సరాలలో నేను ఒక్కరోజు కూడ నా విధినిర్వహణను, పాఠాలు చెప్పడాన్ని మానలేదు.

ఈసారి మిమ్మల్ని డిసెంబర్ లో అరెస్టు చేశారు గదా. ఆ సమయంలో నాగపూర్ లో చాల చలి ఉంటుంది. ఎలా భరించారు?

నిజమే. నన్ను అరెస్టు చేసి తీసుకుపోయినప్పుడు నాగపూర్‌లో చలి చాల ఎక్కువగా ఉంది. అయినా అధికారులు నాకు ఒక కంబళి ఇవ్వడానికి కూడ నిరాకరించారు.

పారిపోయారు. బహుశా వారి హవాలా నిధుల అసహ్యకరమైన విలాసాలలో మునిగి తేలుతున్నారు కాబోలు.

అదే సమయంలో 80 మంది మరాఠ్వాడా రైతులు ఈ ఒక్క ఫిబ్రవరి నెలలోనే ఆత్మహత్య చేసుకున్నారు. మాల్యాలు, మోడీలు తమ ఐదు నక్షత్రాల విలాసనౌకల మీద పెడుతున్న ఖర్చులో ఒక్కరోజు ఖర్చును తరలించినా ఈ రైతుల ప్రాణాలు రక్షించగలిగి ఉండేవాళ్లం. నిజానికి ఆ నిధులు ఆ ప్రజలవే.

మరి, ఇటువంటి స్థితిలో నిజమైన దేశ ద్రోహులెవరు?

(ప్రస్తుతం ఢిల్లీలోని తీహార్ అత్యున్నత భద్రతా జైలు-3 లో ఖైదీగా ఉన్న మావోయిస్టు నాయకుడు కోబడ్ గాంధీ ఈ వ్యాసాన్ని ఈ వివాదం మొదలైన కొద్దిరోజులకే ఫిబ్రవరి 29న రాసి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు పంపారు. నెల గడిచినా ఆ పత్రిక అచ్చువేయకపోవడంతో న్యూఢిల్లీ నుంచి వెలువడే మెయిన్‌స్ట్రీమ్ వారపత్రిక మార్చ్ 26 సంచికలో http://mainstreamweekly.net/article6306.html ప్రచురించింది.) వీ

ఇదంతా చూస్తుంటే మీకు నిస్పృహ కలగలేదా?

నాకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేస్తుందని ఆశ ఉండింది.

జైలులో ఎట్లా గడిపారు?

నేను గతంలో అండా సెల్ లో ఉన్నప్పుడు నాతో ఉండిన ఇద్దరు ఆదివాసి యువకులను ఆ తర్వాత సాధారణ బారక్ లకు మార్చారు. వాళ్లిద్దరూ ఈసారి నాకు సహాయం చేయడానికి ముందుకొచ్చారు. ఈ మూడు నెలలూ వాళ్లే నన్ను చూసుకున్నారు. నేను అరెస్టయినాక ఒక నెలకు ఆ ఇద్దరిలో ఒకరి మీద అన్ని కేసులూ కొట్టుడు పోయి విడుదల అయ్యాడు. కాని అప్పుడే అరెస్టయి వచ్చిన మరొక ఆదివాసి యువకుడు అతని స్థానాన్ని తీసుకున్నాడు. ఆ ఇద్దరిలో మరొకరు కూడ ఇప్పుడు విడుదల కాబోతున్నాడు. గడ్చిరోలికి చెందిన ఈ ఆదివాసులు ఒక్కొక్కరి మీద 15 కేసులు ఉన్నాయి. అన్ని కేసుల్లోనూ నిరపరాధులుగా రుజువై కేసులు కొట్టివేసి విడుదలయ్యే సమయానికి వాళ్లలో ప్రతి ఒక్కరూ కనీసం నాలుగు సంవత్సరాలు జైలులో గడిపారు.

ఇదివరకు జైలులో ఉన్నప్పుడు ఆదివాసులకు ఇంగ్లిష్ నేర్పాననీ, జైలులో ఉర్దూ నేర్చుకున్నాననీ మీరన్నారు. ఈసారి అలా ఏమైనా చేయగలిగారా?

ఔను, గతంలో నేను విడుదల అయ్యేనాటికి ఒక ఆదివాసి వార్తాపత్రికలు చదవగలిగినంత ఇంగ్లిష్ నేర్చుకున్నాడు. ఈసారి మాత్రం నేను అటువంటి పని ఎక్కువ చేయలేకపోయాను. నా శారీరక సమస్యలతో ఉండిపోయాను. సరిగ్గా నా వైద్య చికిత్స మధ్యలో ఉండగా నన్ను అరెస్టు చేశారు. ఆ చికిత్స ఆగిపోవడంతో ఒక్కొక్క అవయవంలోనూ నొప్పి మళ్లీ మొదలయింది. ఈ మూడున్నర నెలల్లో నన్ను 400 కి.మీ. దూరంలోని గడ్చిరోలి కి 19 సార్లు తీసుకుపోయి తీసుకువచ్చారు.

మీ కుటుంబ సభ్యులు మిమ్మల్ని కలిసేవారా?

ఈసారి నన్ను మరింత ఎక్కువ ఒంటరితనంలో ఉంచారు. చివరికి నా న్యాయవాదులను కూడ నన్ను కలవడానికి అనుమతించలేదు. ఇక నా సహచరితో ములాఖాత్ ల విషయంలో, గతంలో ఒక జవాను గదిలో కాస్త దూరంగా కూచుని ఉండేవాడు. కాని ఈసారి మాత్రం తాను కూచున్న కుర్చీకీ, నా చక్రాల కుర్చీకీ మధ్య ఇద్దరు అధికారులు నిలబడి ఉండేవారు. ఆ ఇద్దరు అధికారుల మధ్య ఖాళీలోంచి మేమిద్దరం ఒకరినొకరం పూర్తిగా చూసుకోవడం కూడ వీలయ్యేది కాదు. అది ఒక దుర్భర స్థితి. తాను అక్కడ ఉండడానికి 20 నిమిషాలు మాత్రమే అనుమతించేవారు. ఆ ఒత్తిడిలో ఏమీ మాట్లాడుకోవడం కూడ సాధ్యమయ్యేది కాదు. అంతేకాదు, మేం హిందీలోనే మాట్లాడుకోవాలని ఆ అధికారులు ఆదేశించేవారు. మేం అది నిరాకరించామనుకోండి. అందువల్ల ఈసారి మూడున్నర నెలల్లో ఆమె ఒకేఒక్కసారి వచ్చింది. గతంలో పద్నాలుగు నెలల నిర్బంధ కాలంలో ఆమె పదిసార్ల కన్న ఎక్కువే వచ్చింది.

ఈసారి జైలు అధికారుల ప్రవర్తన ఇంత దారుణంగా ఎందుకు ఉందనుకుంటున్నారు? మీరు బెయిల్ పై బైట ఉన్నప్పుడు చేసిన పని ఇందుకు కారణమై ఉంటుందా?

నేను బెయిల్ మీద ఐదున్నర నెలలు బైట ఉన్నాను. అందులో మూడున్నర నెలలు ఆసుపత్రిలోనే ఉన్నాను. మిగిలిన రెండు నెలలు కూడ నేను పూర్తిగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటూ ఉన్నాను. విద్యార్థులు ఆహ్వానించినప్పటికీ నేను ఏ బహిరంగ సభల్లో కూడ పాల్గొనలేదు. నేనసలు కాలు బైట పెట్టగూడదని డాక్టర్లు ఆదేశించారు. అలాగే నేను పాఠాలు కూడ చెప్పలేకపోయాను. రచన చేయలేకపోయాను. మరి నేను చేసిన ఏ నేరం వాళ్లకు కోపం రావడానికీ, ఇలా ప్రవర్తించడానికీ కారణమై ఉంటుంది?

మిమ్మల్ని వెంటనే తిరిగి అరెస్టు చేయమని ఒక న్యాయమూర్తి తీర్పు, మిమ్మల్ని విడుదల చేయమని మరొక న్యాయమూర్తి తీర్పు. అసలు న్యాయవ్యవస్థను మీరెలా చూస్తారు?

నేను నిస్సహాయుడిని. నేను చెప్పగలిగిందంతా సుప్రీంకోర్టు తీర్పు మీదనే ప్రతి ఒక్కరూ ఆశలు పెట్టుకున్నారని మాత్రమే. మా నమ్మకం నిజమైంది.

మిమ్మల్ని తిరిగి అరెస్టు చేసే సమయానికి మీ వైద్య చికిత్స పూర్తి స్థాయిలో జరుగుతుండింది గదా. ప్రస్తుతం మీ ఆరోగ్య పరిస్థితి ఏమిటి?

దాదాపు ప్రతి శారీరక అసౌకర్యమూ తిరగబెట్టింది. నా ఎడమ చెయ్యిలో దెబ్బతిన్న కండరాలు, నరాల వ్యవస్థ మళ్లీ బాగుపడతాయా లేదా తెలియదు. గతంలో నేను విడుదలయినప్పుడు నా చెయ్యి పరిస్థితి ప్రమాదకరంగా ఉండింది. మూడు ఆసుపత్రులు ఆ ప్రమాదం నుంచి తప్పించడానికి ప్రయత్నించాయి. ఇప్పుడు మాత్రం, నేను ఎడమచెయ్యి కదల్చలేని స్థితిలో ఉన్నాను.

మీ ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది?

సస్పెన్షన్‌లో ఉన్నాను గనుక నాకు సగం జీతమే వస్తుంది. అది నా అప్పులు తీర్చడానికే సరిపోతున్నది. మిత్రులు ఇచ్చిన విరాళాలతో, చేస్తున్న సహాయాలతో నా కుటుంబం గడుస్తున్నది. నా వైద్య చికిత్స ఖర్చులను ఢిల్లీ విశ్వవిద్యాలయం ఇచ్చింది.

మీ కూతురి పైనా, అమ్మ పైనా ఈ నిర్బంధ ప్రభావం ఎలా ఉంది?

వాళ్లు చాల దెబ్బతిన్నారు. నన్ను రెండోసారి అరెస్టు చేయడాన్ని మా అమ్మ అంగీకరించలేకపోయింది. ఆమె ఆరోగ్యం బాగా చెడిపోయింది. ఇక నా కూతురికి కూడ ఇది పెద్ద దెబ్బే. కాని ఆమె ఎప్పుడూ నన్ను సమర్థిస్తుంది. నాకోసం జరిగిన నిరసన కార్యక్రమాలన్నిటిలోనూ పాల్గొంటుంది.

ఇంత జరిగిన తర్వాత, ఇక ఇదంతా ఎందుకు, వదిలేద్దాం అనిపించిందా? మీ అసమ్మతిని ప్రకటించినందుకు మీరు భారీ మూల్యమే చెల్లించారు. బహుశా మీరు మౌనంగా ఉంటే మిమ్మల్ని క్షమించి ఉండేవారేమో. ఏమైనా, మీరు కాకపోయినా పోరాడేవాళ్లు మరెందరో ఉన్నారు కదా...

కాని నన్ను నేను క్షమించుకోగలనా? ఏ ప్రజాస్వామ్య మనస్తత్వం గల వ్యక్తి అయినా ఇవాళ సాగుతున్న ఆదివాసుల హననకాండకు వ్యతిరేకంగా మాట్లాడకుండా ఉండగలరా? మన కళ్లముందర లక్షలాది మంది ఆదివాసులు నిరాశ్రయులవుతుంటే మనం మౌనంగా ఎలా ఉండిపోగలం? మాట్లాడదామా వద్దా అని ఆలోచించుకోవడానికి మనకు అవకాశం ఉందా?

(http://www.rediff.com/news/interview/how-can-any-one-not-speak-out-against-the-genocide-of-adivasis/20160411.htm) వీ

ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదక లేఖ

2004 నుంచి పన్నెండు సంవత్సరాలపాటు ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదకుడిగా పనిచేసి, ఆ పత్రికను వదులుతున్న సమయంలో* సి. రామమనోహర్ రెడ్డి *రాసిన లేఖ

(ముంబైలో 1949లో సచిన్ చౌధురి ప్రారంభించిన ఎకనమిక్ వీక్లీ, 1966లో తన పరిధిని విస్తరించుకుని ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీగా మారి గత యాభై సంవత్సరాలుగా దేశంలోనూ అంతర్జాతీయంగానూ పాఠకులనుంచీ, మేధావుల నుంచీ అపారమైన ఆదరణ చూరగొన్నది. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ప్రధాన సంపాదకుడిగా 2004 సెప్టెంబర్ నుంచి 2016 మార్చ్ వరకు పన్నెండు సంవత్సరాలు పని చేసిన సి రామమనోహర్ రెడ్డి పాఠకులను ఉద్దేశించి రాసిన లేఖలో ప్రధాన భాగాలు వీక్షణం పాఠకులకు కూడ ఉపయోగకరంగా ఉంటాయనే ఉద్దేశంతో ప్రచురిస్తున్నాం – సం.)

సంపాదకుడిగా చేరిన తర్వాత మొదటి సంచికలో (11 సెప్టెంబర్ 2004) నా పేరుతో ఒక రచన చేశాను. నా సంపాదకత్వంలో వెలువడే చివరి సంచికలో మరొక రచన చేయడం సముచితమనుకుంటున్నాను.

ఈ మధ్యలో గడిచిన పన్నెండు సంవత్సరాలు ఇపిడబ్ల్యు చరిత్రలోకెల్లా ఆసక్తికరమైనవి, సంక్షుభితమైనవి. 2016లో ఉన్న ప్రపంచం సెప్టెంబర్ 2004లో ఉన్న ప్రపంచానికన్న చాల భిన్నమైనది. అప్పటికి యునైటెడ్ ప్రొగ్రెసివ్ అలయన్స్ ప్రభుత్వం అధికారం చేపట్టి కొద్ది నెలలు మాత్రమే అయింది. అమెరికాలో జార్జి బుష్ అధికారంలో ఉన్నాడు. ఫేస్ బుక్ అప్పుడప్పుడే పుట్టింది. ట్విట్టర్ ఇంకా పుట్టలేదు. చైనా తన స్థానాన్ని సుస్థిరపరచుకోవడం అప్పుడే మొదలయింది.

గడిచిన డజను సంవత్సరాలలో జరిగిన మార్పులను నమోదు చేయడం, విశ్లేషించడం, చర్చించడం తన పనిగా ఇపిడబ్ల్యు పెట్టుకుంది. అలాగే అభిప్రాయాల ఏకీకరణ ప్రయత్నం పెద్దఎత్తున జరుగుతున్న సమయంలో అసమ్మతికి గొంతునివ్వడం కూడ ఇపిడబ్ల్యు చేసింది.

ఇపిడబ్ల్యు చాల పనులు చేస్తుంది: ఒక భాగం పరిశోధక పత్రిక. ఒక భాగం సమకాలీన వ్యవహారాల మీద వ్యాఖ్యల పత్రిక. ఒక భాగం ప్రభుత్వ విధానాల మీద చర్చావేదిక. ఒక భాగం అంచులలో ఉన్న వాళ్లకు గొంతులనిచ్చే వేదిక. ఒక భాగం యువ పరిశోధకులకు విస్తరించడానికీ, బైటికి అడుగు వేయడానికీ స్థలం. ఒక భాగం విభిన్న సామాజిక శాస్త్రాల నిపుణులు ఒకరినొకరు తెలుసుకునే అవకాశం ఇచ్చే బహుళశాస్త్రాల వేదిక....

నావరకు నాకు ఇపిడబ్ల్యు మొట్టమొదట, అన్నిటికంటే ముఖ్యంగా ఒక అసమ్మతి గళం. ఇపిడబ్ల్యు వ్యక్తీకరణలో అసమ్మతి మాత్రమే లేదు, కాని ఆ అసమ్మతి గళమే దాన్ని దేశంలోని ప్రధానస్రవంతి పత్రికల నుంచి వేరు చేసి నిలుపుతున్నది. అధికార వర్గాలతో సత్యం చెప్పడానికి అది ఎప్పుడూ భయపడలేదు. అమెరికన్ నాటక రచయిత లిలియన్ హెల్మన్ మాటల్లో చెప్పాలంటే, అది ఎప్పుడూ తన విశ్వాసాలను తన కాలపు మోజులకు తగినట్టుగా మార్చుకోలేదు.

ఇపిడబ్ల్యు 1966 నుంచీ నెలకొల్పిన ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, నా కంటే ముందు పనిచేసిన విశిష్ట సంపాదకులు సచిన్ చౌధురి, కృష్ణ రాజ్ ల అడుగుజాడల్లో ఈ పత్రిక పేజీలను మేం ఎల్లవేళలా అధికారానికి వ్యతిరేకంగా సవ్యమైన వాదనలు చేసే వారెవరికైనా తెరిచే ఉంచడానికి ప్రయత్నించాం. ఆధిపత్య శక్తులనూ, ఆధిపత్య విశ్వాసాలనూ, అధిపత్య భావాలనూ ప్రశ్నించే వారెవరయినా వారిపట్ల ఇపిడబ్ల్యు సాదరంగా స్పందిస్తుంది. ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ వాతావరణంలో ప్రశ్నించే హక్కును నిరాకరించడం గాని, ఒకవేళ ప్రశ్నలను వ్యక్తీకరించినా వాటిని 140 అక్షరాల్లోకి కుదించి ట్విట్టర్ మీద పంపించడానికి మాత్రమే పరిమితం చేయడం గాని జరుగుతున్నప్పుడు, ఇపిడబ్ల్యు నిర్వహిస్తున్న పాత్ర గతంలో ఎన్నటికన్నా చాల ముఖ్యమైనది. దాన్ని అత్యంత శ్రద్ధతో పరిరక్షించవలసి ఉంది.

ఈ వారం సంచికలో వెలువడిన రెండు సంపాదకీయాలు – బస్తర్ లో రాజ్య ప్రోత్సాహంతో మళ్లీ ప్రారంభమైన సంఘవ్యతిరేక శక్తుల మీద విమర్శ, అణు విద్యుత్ వ్యవస్థలో అమలవుతున్న రహస్యం మీద విమర్శ – కూడ ఇపిడబ్ల్యు వైఖరికి మంచి ఉదాహరణలు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తన స్వయం సేవకులు నిండు పాంట్లు వేసుకోవచ్చునని చేసిన నిర్ణయం మీద విమర్శ కూడ అటువంటిదే.

ఇపిడబ్ల్యు విశిష్టత ఏమంటే విస్తృత వైవిధ్యం గల పాఠకులకూ, రచయితలకూ ఇపిడబ్ల్యు అంటే భిన్నమైన అభిప్రాయాలున్నాయి. ఈ విభిన్న ఆకాంక్షలను కొద్దో గొప్పో తీర్చడంలో ఇపిడబ్ల్యు విజయం సాధించడం చాల ఆసక్తి దాయకమైన అంశం.

బహుశా ప్రపంచం మొత్తం మీదనే ఎక్కడా ఇటువంటి సామాజిక శాస్త్రాల పత్రిక లేదని గుర్తించడానికి మీరు ఇపిడబ్ల్యు లో భాగమై ఉండనక్కరలేదు. అర్ధ శతాబ్దం పాటు, పరిమితమైన ఆర్థిక, మానవ వనరులతో, చాల తక్కువమంది, కాని అంకితమైన సిబ్బంది, అత్యున్నత ప్రమాణాలు గల ఈ పత్రికను ప్రచురిస్తూ వచ్చారు. అది కూడ క్రమం తప్పకుండా చేశారు.

అరిగిపోయిన పదబంధాన్ని వాడాలంటే, మేం ఒక "అంతర్జాతీయ స్థాయి సంస్థ" గా ఎదిగాం. అది ఎన్నడూ మా లక్ష్యం కానప్పటికీ.

మార్పు – కొనసాగింపు కలగలిసి నడవడమే దశాబ్దాలుగా ఇపిడబ్ల్యు లక్షణం. 2004 నుంచి ఇప్పటివరకు కూడ మేం అది కొనసాగించాం. ఇపిడబ్ల్యు కేవలం "ఆర్థిక" "రాజకీయ" పత్రిక మాత్రమే కాదని, 1980లలో ప్రారంభమైన ప్రక్రియను మేం కొనసాగించాం. పత్రికలో సగభాగం పరిశోధనావ్యాసాలుంటాయి. అక్కడ సామాజిక శాస్త్రాల విశాలక్షేత్రాన్నంతా ఇపిడబ్ల్యు చుట్టివస్తుంది. అప్పుడప్పుడు భౌతిక

శాస్త్రాలలోకి కూడ వెళ్తుంది. వ్యాఖ్యల సగభాగంలో పత్రిక ఇదివరకటి కంటె ఎక్కువగా సమకాలీన అంశాలను పట్టించుకుంటున్నది. పటిష్టంగా వాదించిన ఏ విషయాన్నైనా, చెప్పడానికి ఒక అంశం ఉందనిపించే ఏ విషయాన్నైనా అది అచ్చువేస్తుంది.

ఉదాహరణకు ఈ వారం సంచికలో పరిశోధనావ్యాసాల భాగంలో 1. రైతుల ఆత్మహత్యలు, 2. గేమ్ థియరీ, 3. ఒక ప్రముఖ విస్మృత భారత అర్థశాస్త్రవేత్త, 4. భారతదేశంలో ఫెమినిస్టు ఉద్యమం, 5. భారతదేశంలో ఆరోగ్యరంగంలో ధోరణులు… చివరికి భగవంతుడి అస్తిత్వం మీద కూడ వ్యాసాలున్నాయి. వ్యాఖ్యావిభాగంలో 1. పొదుపు, పన్నుల విధానంపై ఇటీవల సాగుతున్న చర్చ, 2. ఆరోగ్యసేవలపై పార్లమెంటరీ నివేదికను విశాల నేపథ్యంలో చూడడం, 3. అసంఘటిత రంగ ఉత్పత్తిపై ప్రభుత్వ గణాంకాల విశ్లేషణ, 5. వాణిజ్యపరంగా గర్భం అద్దెకు ఇవ్వడం గురించిన నిబంధనలలో ఇటీవలి మార్పులపైన విమర్శ ఉన్నాయి.

మేం గతంలో కన్న ఎక్కువగా చిన్నా పెద్దా ప్రత్యేక సంచికలు కూడ తెస్తున్నాం. నోట్స్ అనే ఒక కొత్త విభాగం ఏర్పాటు చేసి పరిశోధనల తొలి రూపాలను ప్రచురిస్తున్నాం. ఇక నాకు ప్రత్యేక ఆసక్తి ఉన్నదీ, మేం 2013 నుంచి నడుపుతున్నదీ 'తాజాకలం' అనే రెండు వారాలకు ఒకసారి వచ్చే శీర్షిక. పత్రికలో పరిశోధనా విభాగంలోని భారీ మందుగుండు తర్వాత ఈ శీర్షిక ఉపశమనంగా ఉన్నదని రచయిత – పాఠకులలో ఒకరు పరిహాసమాడారు!

ఇపిడబ్ల్యు వాణిజ్య మద్దతు లేని ప్రచురణ, చేయవలసిన పనులతో పోలిస్తే అతి తక్కువ మంది సిబ్బంది, బైట వచ్చే జీతాలతో పోలిస్తే చాల తక్కువకు పనిచేసే సిబ్బంది, ఏపూటకాపూట చూసుకోవలసిన ఆర్థిక స్థితి. అయినా మేం ఎలా నెట్టుకొస్తున్నాం? నా దృష్టిలో ఇది "ఇపిడబ్ల్యు సముదాయం" క్రియాశీలంగా సహకారయుతంగా భాగస్వామ్యం వహించడం వల్ల మాత్రమే సాధ్యమవుతున్నది. ఈ సముదాయం ఇపిడబ్ల్యును తమదిగా భావించడం ఎన్నో సంవత్సరాలుగా, నిజం చెప్పాలంటే దశాబ్దాలుగా, అభివృద్ధి చెందుతూ వచ్చింది. ప్రతి ఒక్కరూ ఈ పత్రిక తమలో ప్రతి ఒక్కరికీ చెందినదనీ, ఏ ఒక్క బృందానికో, ఏ వాణిజ్య ప్రయోజనాలకో చెందినది కాదని గుర్తిస్తూ వచ్చారు. ఇది నిజంగా మనందరి పత్రిక. ఇపిడబ్ల్యు "మాది" అని చెపుకోవడానికి మనందరమూ గర్విస్తున్నాం.

అయితే అకుంఠిత దీక్షతో కాపాడుకుంటూ వచ్చిన ఈ పత్రిక స్వాతంత్ర్యం ఒక ప్రమాదాన్ని కూడ ఎదుర్కొంటున్నది. ఆర్థిక సుస్థిరత ఉంటే బాగుండునని ఒక దశాబ్దంపైగా ఆలోచించిన తర్వాత, నాకు అర్థమైనదేమంటే ప్రధానస్రవంతికి చెందని అన్ని స్వతంత్ర పత్రికలు ఏ స్థితిలో ఉన్నాయో ఇపిడబ్ల్యు కూడ అదే స్థితిలో ఉండక తప్పదు. ఎల్లప్పుడూ అంచులలో జీవిస్తూ ఉండడమే ఆ స్థితి. ప్రస్తుతం ఇపిడబ్ల్యు ఆర్థికస్థితి గతంలో కన్న మెరుగ్గానే ఉంది. కాని చందాల ద్వారా, వ్యాపార ప్రకటనల ద్వారా వచ్చే చిన్నపాటి ఆదాయవనరుల మీద ఆధారపడి ఉండడమంటే ఆ వనరులలో హఠాత్తుగా ఏ మార్పు వచ్చినా పరిస్థితులు తారుమారు కావడమే అవుతుంది. అందుకే మేం పాత సంచికల విలువైన వనరును కూడ ఖరీదుకు అమ్మాలని నిర్ణయించాం. ఈ నిర్ణయం ఇపిడబ్ల్యు స్వభావానికి భిన్నమైనదప్పటికీ తప్పలేదు.

మేం మా మూలనిధిని ఈ పన్నెండు సంవత్సరాలలో గణనీయంగా పెంచుకున్నాం. కాని మాకు అవసరమైనదాని కంటె అది చాల తక్కువ. వదాన్యులైన దాతలనుంచి అందుతున్న విరాళాలు పెద్ద ఎత్తున సహాయపడుతున్నాయి కాని అవి తక్కువగానూ ఉంటున్నాయి, ఎప్పుడో గాని రావడం లేదు.

మేం యాభై సంవత్సరాలుగా కేవలం ఉనికిలో ఉండడం మాత్రమే కాక, ఎదుగుతూ కూడ వచ్చామంటే ఈ పత్రికలోనే ఏదో అంతర్గతమైన, శక్తిమంతమైన స్ఫూర్తి ఉండి ఉండాలి. ఆ స్ఫూర్తి విశాల ఇపిడబ్ల్యు సముదాయానిదే అని నేను భావిస్తాను.

ఇపిడబ్ల్యు సముదాయంలో ఎక్కువమందికి మా ముందున్న సమస్యలన్నీ తెలిసి ఉండకపోవచ్చు. ఇపిడబ్ల్యుకు సాలీనా నాలుగువేలకు పైన, అంటే ప్రతివారం 80 వ్యాసాలు అందుతాయి. అవి అనువర్తిత గణితశాస్త్రం నుంచి సాహిత్య సిద్ధాంతం దాకా విభిన్న అంశాల మీద ఉంటాయి. ఈ వ్యాసాలను చదివి, ప్రచురణ యోగ్యతను నిర్ణయించే క్రమాన్ని మేం క్రమబద్ధం చేసినందువల్ల నిర్ణయాలు తీసుకోవడం సాఫీగా సాగిపోతున్నది. అయినా ఏడెనిమిది మందికి మించని పూర్తికాలపు సంపాదకవర్గానికి వారం తర్వాత వారం నిరాటంకంగా ఈ కొండంత పనిని నిర్వహించడం అసాధ్యమైన విషయం. అందువల్ల ఒక్కొక్కసారి కొన్ని వ్యాసాల మీద నిర్ణయం ఆలస్యమవుతుంది. ప్రతివారమూ మాకు 80 వ్యాసాలు అందుతుండగా, మేం ప్రచురించగలిగినవి 12-15 వ్యాసాలు మాత్రమే. అంటే మాకు అందినవాటిలో 15 నుంచి 20 శాతం మాత్రమే. అంటే మేం అచ్చువేసే ప్రతి ఒక్క వ్యాసానికీ కనీసం ఐదు వ్యాసాలు అచ్చువేయలేకపోతున్నాం.

ఇపిడబ్ల్యు గురించి చాలమందికి తెలియని విషయం మరొకటుంది. ఇపిడబ్ల్యు కచ్చితంగా అందరికీ సమానమైన గళం ఉన్న సముదాయం కానప్పటికీ, వ్యవస్థాగతంగా అది ప్రజాస్వామిక స్ఫూర్తితో సాగుతుంది. బాధ్యతా నిర్వహణలో అంతరాలున్నాయి, సిబ్బంది వేతనాలలో తేడాలు వీలైనంత తక్కువగా ఉండేలా చూసినా ప్రతిఫలంలో అసమానత ఉంది. అయినప్పటికీ ఇపిడబ్ల్యు గత యాభై సంవత్సరాలుగా ఒక బహిరంగ, ప్రజాస్వామిక, అంతరాలు లేని, సన్నిహిత సంబంధాల వేదికగా ఉండే సంప్రదాయాన్ని పాటిస్తున్నది. ఈ సంప్రదాయం కొనసాగుతుండడం వల్లనే సంపాదకీయ, సంపదకేతర రంగాలలోని అన్ని స్థాయిలలో నా సహోద్యోగులూ కలిసి సమష్టిగా వారం వెనుక వారం ఒక అత్యుత్తమ ప్రమాణాల పత్రికను తేగలుగుతున్నారు. ఇపిడబ్ల్యులోని ప్రజాస్వామిక స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ బాధ్యతా స్పృహనూ గర్వాన్నీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నది.

నా సహోద్యోగులందరి సమష్టి నిబద్ధత లేకుండా ఇపిడబ్ల్యును ఇలా క్రమం తప్పకుండా, అంత ప్రామాణికంగా తేవడం సాధ్యం అయ్యేది కాదని నేనిక్కడ గుర్తించవలసి ఉంది. అందువల్ల వారందరికీ ఇక్కడ 'ధన్యవాదాలు' అని చెపుతున్నాను.

ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో ఒక సంస్థను వదిలి వెళ్లవలసిందే. కొన్ని సందర్భాలలో అది సంస్థ బాగు కోసం కావచ్చు, కొన్ని సందర్భాలలో అది "పదవీ విరమణ వయసు" కన్న ముందే కావచ్చు. ఒక సంస్థ పునర్నవీకరణం జరగాలంటే కొత్త దృక్పథాలు ఉన్న కొత్త ముఖాలు, యువరక్తమూ కావలసి ఉంటాయి. నేను నా పని సక్రమంగానే చేశాననే సంతృప్తితో నేను దిగిపోతున్నాను. నన్ను ప్రశంసిస్తూ ఇటీవలి నెలల్లో రాసిన ఎందరో పాఠకులకూ రచయితలకూ కృతజ్ఞుడినై ఉంటాను. ధన్యవాదాలు.

ఇపిడబ్ల్యు సంపాదకవర్గానికి అధినేతగా ఉండడం అది కూడ యాభై సంవత్సరాల చరిత్రలో నాలుగోవాడిని కావడం ఒక గౌరవం. ఇది భారీ సవాళ్లతో కూడిన మహా కష్టతరమైన బాధ్యత. కాని అత్యంత సంతృప్తిదాయకమైన బాధ్యత కూడ. నాకు దీనికన్న మరేదీ ఎక్కువ

సామాజిక తత్వవేత్త డా. బి.ఆర్.అంబేడ్కర్

అంబేడ్కర్‌ను ఒక దేవుడిగా కొలవడం మానుకొని, ఆయన నేర్పిన ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, నైతిక విలువలను ఆచరించవలసిన చారిత్రక సందర్భం సమాజం ముందుందని అంటున్నారు **డా. కత్తి పద్మారావు**

అంబేడ్కర్ ఈ యుగకర్త. యుగకర్తృత్వం సామాన్యంగా రాదు. యుగకర్తలకు ఒక యుగాన్ని నడిపించగలిగిన దార్శనికత కావలసి ఉంది. మేధాసంపత్తితో పాటు నిర్మాణ దక్షత, ఆచరణ అవసరం. అంబేడ్కర్ జ్ఞానతృష్ణ, పుస్తకాభిలాష మహోన్నతమైనది. ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన మూడు యూనివర్శిటీల నుండి ఆయన చరిత్ర, అర్థశాస్త్రం, రాజకీయ శాస్త్రం, రాజ్యాంగాలలో ఉన్నత డిగ్రీలను అందుకున్నారు. ఆయన జీవితాంతం జ్ఞానంకై తపించారు. ఆయన నిరంతర పాఠకుడు, సుమారు ఏడు భాషలలో ఆయన పాండిత్యం సంపాదించారు. తన యాభై సంవత్సరాల ప్రజాజీవిత కాలంలో అంబేడ్కర్ అనేక దశలను అధిగమించారు. 1918-1928 కాలంలో మేధాసంపత్తిని సమకూర్చుకోవడంలో ప్రాథమిక పోరాటం నడపడంలోనూ ఒక దశను పూర్తిచేసిన అంబేడ్కర్ 'మానవ గౌరవం' నిలబెట్టేందుకై నిరంతరం పోరాడారు. 1929 - 1936 కాలంలో రాజ్యాంగబద్ధంగా దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు కావాలని ఆయన పోరాటం చేశారు. అంబేడ్కర్ భారతదేశంలో ఒక అత్యున్నతమైన వ్యక్తిగా శిల్పించబడ్డాడు. సమాజంలో అట్టడుగు భాగం నుండి అత్యున్నత శిఖరం వరకు ఎదిగిన ఆయనను బ్రిటన్, అమెరికా, జర్మనీ తదితర దేశాల మేధావులు ఎంతగానో గౌరవించేవారు. ఆర్థిక శాస్త్రవేత్తగా, న్యాయవాదిగా, విశ్వవిద్యాలయాచార్యునిగా, రచయితగా, పోరాట వీరునిగా, రాజనీతిజ్ఞునిగా, ఆయన సామాజిక వాస్తవికత నుండి అభివృద్ధి చెందడం వలన, ఆయన రూపొందించిన దర్శనం కూడా ఆచరణ యోగ్యంగా రూపొందింది.

అంబేడ్కర్ మానవుడు కేంద్రంగానే ఆయన తన తత్వశాస్త్రాన్ని అభివృద్ధి చేశారు. ప్రతిదానికి మానవుడే కొలమానం కాగా, మనిషిని కొలిచేది మాత్రం 'ప్రతిభే', పుట్టుక కాదు అని అంబేడ్కర్ తేల్చారు. జన్మకారణంగా భారతదేశంలో మానవుణ్ణి నిర్ధారించడం అనే సిద్ధాంతం పూర్తిగా మనిషి విలువను మార్చేసింది. ఎంతటి ప్రతిభావంతుడైనా హీన కులంలో పుట్టినట్లయితే అదే దృష్టితో చూడడం వలన అతని ప్రతిభ వికసించడం లేదు. ఒక మనిషికుండే మానవ విలువ అతని పుట్టుక వలన కుదించబడుతుంది. ఈ విషయాన్ని తాత్విక పునాదుల నుండే గాక తన వైయక్తిక సామాజిక జీవనం నుండి కూడా అంబేడ్కర్ అధ్యయనం చేశారు. ఆయన భారతదేశంలోని ప్రధాన వైరుధ్యం వైపు దృష్టి పెట్టడానికి ఈ అధ్యయనం, ఆయన జీవిత అనుభవం బాగా ఉపకరించాయి. ఒక అస్పృశ్యకులం నుండి పుట్టినవాడు మేధావిగా, నాయకుడిగా ఎదగడానికి ఎన్నెన్ని అడ్డంకులు వస్తాయో ఆయన జీవిత గమనంతో తెలుసుకున్నారు. ఆ విధంగా అర్థం చేసుకోవడం వలన ఆయన సుప్రసిద్ధ ప్రజాస్వామ్యవాదిగా, విశాల మానవతావాదిగా ఎదిగారు. మానవతావాదం, సాంఘిక ప్రయోజనం, సాంఘిక న్యాయం - అంబేడ్కర్ ఈ మూడింటికి ఆధారాలను బుద్ధుని ధర్మం నుండే గ్రహించారు. ఆయన తత్వశాస్త్రానికి 'ధర్మం' పునాది అయ్యింది. ఆయన ధర్మం నైతికతకు మారుపేరుగా ముందుకు వచ్చింది.

అంబేడ్కర్ తత్వశాస్త్రంలో 'నైతికత' ముఖ్యం. ఆయన తత్వశాస్త్రంలో దేవుడికి స్థానం లేదు. ప్రార్థన ఉండదు. తీర్థయాత్రలు ఉండవు. కర్మకాండలు, బలులు ఆయన తత్వశాస్త్రంలో ఉండవు. మానవుని ఆత్మస్థైర్యం, మానవుని వ్యక్తిత్వం ఏ బైట శక్తి మీద ఆధారపడి నడవవు. అవి పూర్తిగా మనిషి మీద ఆధారపడి ఉంటాయి. నైతికత అనే ధర్మం సారాంశం. నైతికత లేకుండా ధర్మం ఉండదు. మనిషికి మనిషికి మధ్య ఉండే ప్రేమభావం నుండే అన్ని దర్శనాలు ఆవిర్భవించాయని అంబేడ్కర్ చెబుతారు. బౌద్ధధర్మాన్ని ఆయన ప్రపంచాన్ని పునర్నిర్మించడానికి సాధనంగా స్వీకరించారు. ధర్మం అనేది సామాజిక నైతిక దర్శనమని, మనస్సును, కార్యకారణ సంబంధాన్ని అది ప్రభావితం చేస్తుందని

కాదు. వివేకవంతుడూ మర్యాదస్తుడూ అయిన కీర్తిశేషులు డా. కె ఎస్ కృష్ణస్వామి అధ్యక్షతన సమీక్షా ట్రస్ట్ ట్రస్టీల బోర్డు సెప్టెంబర్ 2004లో నన్ను సంపాదకుడిగా ఆహ్వానించినందుకు ఈ సందర్భంగా నా కృతజ్ఞతలు.

ఇపిడబ్ల్యులో నేను గడిపిన చివరి ఆరునెలల్లో ప్రస్తుత ట్రస్టీల బోర్డులో అత్యధిక సంఖ్యాకులతో నాకు తీవ్రమైన, ప్రధానమైన భిన్నాభిప్రాయాలు తలెత్తాయనేది రహస్యమేమీ కాదు. కాని అంతకు ముందు మేం చాల బాగా కలిసి పనిచేశాం. ఇటీవలి నెలల్లో జరిగిన ఘటనలు పన్నెండు సంవత్సరాల అనుభవంలో స్వల్పకాలికమైనవే. నా విశాల అనుభవానికి అవి మసిపూయలేవు.

నేను ఇపిడబ్ల్యును పరంజయ్ గుహా ఠాకూర్తా సమర్థమైన చేతుల్లో వదిలిపోతున్నాను. అలాగే నా సహోద్యోగుల సమర్థమైన చేతుల్లోనూ. అంతే ముఖ్యంగా మీ అందరి చేతుల్లో వదిలిపోతున్నాను. దీన్ని పరిరక్షించండి, పెంచి పోషించండి. బలోపేతం చేయండి.

ఒక పాఠక-రచయిత ఈ సంవత్సరం మొదట్లో నాకొక మాట రాశాడు. "అతి తక్కువ మాట్లాడుతూ, అరుదుగా కనబడుతూ, అరుదుగా వినబడుతూ, సరిగ్గా ఇపిడబ్ల్యు సంపాదకుడు ఎలా ఉండాలో" అలా ఉన్నానని అన్నాడు. ఆ మాట నాకు చాల నచ్చింది. సంపాదకుడిగా నా పాత్రను ఎలా నిర్వహించాలని నేననుకున్నానో ఆ మాట సరిగ్గా పట్టుకుంది. కాని, ఈసారి మాత్రం, నేను సంపాదకత్వం వహించే ఇపిడబ్ల్యు ఆఖరి సంచికలో ఈ సుదీర్ఘమైన ఉత్తరం రాయదలచుకున్నాను.

(ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, 2 ఏప్రిల్ 2016, సంపుటం 51, సంచిక 14లో అచ్చయిన ఉత్తరానికి అనువాదం) వీ

అంబేద్కర్ చెప్పారు. బౌద్ధ ఉద్యమాన్ని అంబేద్కర్ బౌద్ధ ఉద్యమ స్వీకారంతో భారతావనిలో మరలా పునరుజ్జీవింపజేశారు. ఏదైనా ఒక చర్య మొత్తం సమాజాన్ని కుదిపి కొత్త పరిణామాలకు దారితీసినప్పుడు అది చారిత్రాత్మక సంఘటన అవుతుంది. అంబేద్కర్ బౌద్ధధర్మ స్వీకారం ఆయన తీసుకువచ్చిన తాత్విక విప్లవంగా గుర్తించబడింది. హిందూ సమాజం ఈ సంఘటనకు కదిలిపోయింది. 'భారతదేశంలో దళితులందరూ బౌద్ధ ధర్మాన్ని స్వీకరిస్తే భారత సామాజిక వ్యవస్థలో పెనుమార్పులు సంభవించి హిందూ వర్గం మైనారిటీలో పడిపోతుంది. వారు ఏ కులం పునాదుల మీద వ్యవస్థను నిర్మించారో ఆ వ్యవస్థలో సమూలమైన మార్పులు ఆవిర్భవిస్తాయి' అని ఆయన విశ్వసించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధ ఆలోచనా క్రమంలో విద్యాలయాల నిర్మాణానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. ఆయన చెప్పింది బౌద్ధమతం కాదు. బౌద్ధ ధర్మం అంటే మానవతా ధర్మమే. ఆయన బుద్ధుణ్ణి హీనయానులు, మహాయానులు చెప్పినట్లు చెప్పక బుద్ధుణ్ణి ఒక తాత్విక విప్లవవాదిగా చెప్పారు. సామాజిక వ్యవస్థ పునర్నిర్మాణానికి ప్రత్యామ్నాయాలన్నింటిని అంబేద్కర్ శక్తివంతంగా ప్రారంభించారు. అంబేద్కర్ బౌద్ధ పునరుజ్జీవన ఉద్యమం సమాజంలో కొన్ని పరిణామాలకు దారితీసింది.

అంబేద్కర్ స్ఫూర్తితో కొత్తగా బౌద్ధ దీక్ష తీసుకున్నవారు బుద్ధ పునరుజ్జీవనోద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళారు. కొత్త బౌద్ధ విహారాలు, కొత్త స్కూళ్ళు, కాలేజీలు నిర్మిస్తూ వెళ్ళారు. అనేక సంస్థలు బౌద్ధ సంస్కృతీ వికాసం కోసం వెలిశాయి. ఈ స్ఫూర్తి కవులను సృజించింది. హిందూ మతంలో వారు జీవించేటప్పుడున్న న్యూనతాభావం వారికిప్పుడు లేదు. భారతదేశంలో జన్మించి భారత వాస్తవికత మీద పోరాడిన బుద్ధుడి వ్యక్తిత్వాన్ని, ఉద్యమాన్ని పునర్నిర్మించడంలో అంబేద్కర్ తన శక్తిని ధారబోశారు. అందుకు ఆయన ఆరోగ్యం కూడా క్షీణించింది. అంబేద్కర్ సామాజిక పునరుజ్జీవన కార్యక్రమానికిచ్చిన విలువ ఆయన ఆరోగ్యానికి ఇవ్వలేదు. భారతదేశంలో ఈ సందర్భంలో మరొక తాత్విక ప్రశ్న ముందుకు వచ్చింది. కార్ల్‌మార్క్స్ వ్రాసిన వర్గపోరాట సిద్ధాంతం, దానికి పునాదైన గతితార్కిక భౌతికవాదం ప్రపంచం మొత్తాన్ని పరిణామానికి గురిచేస్తున్నప్పుడు భారతదేశంలో బౌద్ధ విప్లవం పరిణామాన్ని తేగలుగుతుందా? బౌద్ధంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ విప్లవానికి సంబంధించిన ప్రణాళిక ఉందా? అనే ప్రశ్న వచ్చింది. ఆ ప్రశ్నలకి అంబేద్కర్‌కు సమాధానం చెప్పవలసిన బాధ్యత తాత్విక స్థాయిలోను, ప్రణాళిక స్థాయిలోను వచ్చింది. అందుకే ఆయన ఈ విషయం మీద సమగ్రంగా చర్చించారు. ప్రకృతి తన పరిణామ క్రమంలో ఉత్పత్తి చేసిన జీవరాసుల్లో మనిషి అత్యుత్తమమైనవాడు. ఇతనికి సృజనాత్మక స్పృహ ఉంది. కార్యనిర్వహణ సంబంధాన్ని చెప్పగల శక్తి కూడా ఉంది. ఈ క్రమంలో మనిషి కొన్ని విశ్వజనీనమైన విలువల్ని ఏర్పరచుకొని, నాగరికతా సంస్కృతి సంబంధమైన నూతన కోణాల్ని అన్వేషించే క్రమంలో అవిశ్రాంతంగా పరిభ్రమిస్తున్నాడు. విశ్వంలో నెలకొన్న సంబంధాలు, కారణాలు మనిషిని నియంత్రిస్తున్నాయా లేక మనిషి స్వేచ్ఛగానే ఉన్నాడా అనేది ఎంతో కీలకమైన ప్రశ్నగా ఉత్పన్నమౌతుంది. అంబేద్కర్ మానవ పరిణామ శాస్త్రాన్ని శాస్త్రీయంగా చెప్పారు.

జంతు ప్రవర్తన నుండి మానవుని వేరుచేస్తున్న ప్రధాన అంశం సామాజిక జీవితాచరణ. దీనిని మానవుడు సంఘ జీవనం నుండి నేర్చుకున్నాడు. అంతేకాక అతని జీవిత ఔన్నత్యానికి మూలభూతమైన మరొక ప్రధానాంశం ప్రకృతి అవగాహనలో అతనికున్న నేర్పు. ఈ నేర్పును, అవగాహనను సామాజిక జీవితానికి అన్వయించడం ద్వారా అతడు ఉత్పత్తి శక్తిగా ఆవిర్భవించాడు. ఈ సామాజిక జీవి తనను గురించి విశ్లేషించుకోవడం మానవ శాస్త్రం అయితే ప్రకృతిపై అతని వ్యాఖ్యానం, నిర్ధారణలు ప్రకృతి జీవశాస్త్రాలయితే, అతని ఉత్పత్తి సంబంధాలను విశ్లేషించేది ఆర్థికంగా రూపొందింది.

ఇక్కడ మానవుడు కేంద్రంగా ఆలోచిస్తే బౌద్ధం అవుతుంది. ప్రకృతి కేంద్రంగా ఆలోచిస్తే మార్క్సిజం అవుతుంది. అంబేద్కర్ మనిషి కేంద్రంగా ఆలోచించారు. కాబట్టి బౌద్ధం వైపు వెళ్ళారు. అంబేద్కర్‌ది నిష్పాక్షికమైన దృష్టి. ఆయన ఏ అంశాన్నీ ఒక వర్గాన్నే దృష్టిలో పెట్టుకొని ఎప్పుడూ చెప్పలేదు. ఆయన మేథోసంపన్నతలో సామాజిక, ఆర్థిక సమతుల్యతకు సంబంధించిన తాత్వికత ముఖ్యమైనది. ఆయన ఏమి చెప్పినా రక్తపాతం లేకుండా జరగాలని, దానికి సంబంధించిన ప్రజా ఉద్యమం, వత్తిడి, తర్కం, వాదం, విశ్లేషణలను ఆయన ముందుకు తీసుకెళ్ళారు. గాంధీకి ఈ విధమైన స్పష్టత లేకపోయినందువల్లే ఆయన తత్వవేత్త కాలేక పోయారు. తత్వవేత్త కాలేనివాడు సామ్యవాదానికి సంబంధించిన దిశానిర్దేశం చేయలేదు. గాంధీకి భిన్నంగా అంబేద్కర్ అట్టడుగు ప్రజల సంవేదనల్ని చట్టబద్ధమైన, ధర్మబద్ధమైన వాదనల కింద మలిచారు. అంబేద్కర్ తన ప్రతిభా సంపత్తులను సమస్య మూల కారణాన్ని వెతకడానికి వినియోగించి సఫలీకృతులయ్యారు. ఈ అసమానతలకు మూలం కులమని, అది భౌతికంగా లేదని, భావనలో, విశ్వాసంలో ఉందని, కులానికి మూలమైన మతం, దాని పునాదుల్ని తొలచి వేయకుండా భారతదేశ విముక్తి సాధ్యం కాదని ఆయన స్పష్టంగా చెప్పారు.

అంబేద్కర్ కుల మతాలను అర్థం చేసుకున్నాక ఆయన ఆర్థిక, రాజకీయ శాస్త్రాల మొత్తాన్ని ఈ పునాది నుండే చూశారు. మార్క్సిస్టులు ఈ అవగాహన నుండి ఇంతవరకు ఆర్థికశాస్త్రాన్ని చూడలేకపోయారు. భారతదేశంలో ప్రారంభమైన ఏ విప్లవం అయినా అది కులం ఊబిలోనే సతమతం అవుతుంది. కులానికి పునాది అయిన మతాన్ని విస్మరించి మనం ఉపరితలంలో ఎంత మాట్లాడుకున్నా మూలం ఘనీభవిస్తూనే ఉంటుంది.

మళ్లీ భారతదేశాన్ని పున:నిర్మించాలంటే అంబేద్కర్‌ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఇక్కడే తప్పనిసరి అవుతుంది. అంబేద్కర్ ఇలా అన్నారు- అధికారంలో ఉన్న వ్యక్తులు దేశ ప్రయోజనాల పట్ల నిర్ద్వంద్వమైన నిబద్ధత కలిగి ఉండేటువంటి ప్రభుత్వం మనకు కావాలి. న్యాయాన్ని ఇచ్చే సామాజిక, ఆర్థిక నియమావళిని సవరించేటటు వంటి ప్రభుత్వం మనకు కావాలి. విప్లవం రక్తపాతం లేనిదైనా ఉన్నదైనా, దాని కారణంగా వచ్చే మార్పు మాత్రం అస్థిరం. ఈ ప్రక్రియలో చోటు చేసుకునే అయోమయం, విధ్వంసం భారీగా ఉంటాయి. డా. అంబేద్కర్ దళితుల ఆర్థిక, సాంఘిక హక్కుల కోసమే గాక వారి రాజకీయ హక్కుల కోసం కూడా చారిత్రాత్మకమైన పోరాటాన్ని గావించారు. రాజకీయంగా దళిత జాతులకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని ఆయన ప్రయత్నించారు. ఆయన రాజకీయ పార్టీని ఒక ఉద్యమంగా నడిపాడు. రాజకీయాల్లో వ్యక్తిత్వం, ఆదర్శం, నిజాయితీ, నీతి చాలా అవసరంగా చెప్పి ఆచరించాడు.

అంబేద్కర్ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ, నైతిక విప్లవాలు ఈనాటికీ మరింత అవసరం అయ్యాయి. రాజకీయ పార్టీలు ఆయన్ని దేవుడిగా చేసి కొలవడం వల్ల ప్రయోజనం లేదు. నైతిక రాజకీయ విప్లవం కోసం ఈ యుగకర్తను ఆచరించవలసిన చారిత్రక సందర్భం.

(రచయిత సామాజిక తత్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షులు నవ్యాంధ్రపార్టీ)

వీ

అమెరికా అధ్యక్ష ఎన్నికలలో మరోకోణం

ఈ ఏడాది అమెరికాలో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థులపై అక్కడి ప్రజల మనోభావాలను, వివిధ పార్టీల విధానాలను, అమెరికాలో తనకు ఎదురైన అనుభవాలను వివరిస్తున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

తన నెగెటివ్ వ్యాఖ్యలతో ప్రపంచ మీడియా దృష్టిని ఆకర్షించి, అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస దేశస్థులలో భయాందోళనలు కలిగించిన డొనాల్డ్ ట్రంప్ రిపబ్లికన్ పార్టీ ప్రాథమిక నామినేషన్ స్థాయిలో నెగ్గినా, ఆ తర్వాత అధ్యక్ష పదవికి జరిగే అసలు పోటీలో గెలుస్తాడా? గెలిచే పరిస్థితి ఉందా?

ఓ సాయంత్రం పూట పార్కులో వాకింగ్ చేస్తున్న ఓ వృద్ధ అమెరికా జంటను అడిగాను 'అమెరికా అధ్యక్ష ఎన్నికలను గురించి మీరేమనుకుంటున్నారు?' అని. 'మేము భగవంతున్ని ప్రార్థిస్తున్నాము. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ గెలవకూడదని' – ఇదీ వారి సమాధానం.

ఈ మధ్యే అమెరికా వారసత్వం పొందిన ఒక భారతీయ వనిత ఇదే ప్రశ్నకు సమాధానంగా 'ట్రంప్ పచ్చి స్వార్థపరుడు. ఆయన గెలిస్తే ప్రపంచ యుద్ధం వచ్చినా ఆశ్చర్యపడనక్కర్లేదు. అమెరికా ప్రశాంతంగా ఉండాలంటే ట్రంప్ ఓడిపోవాల్సిందే' అని అన్నారు.

డొనాల్డ్ ట్రంప్ రిపబ్లికన్ పార్టీ ప్రాథమిక స్థాయి ఎన్నికలలో విజయం సాధిస్తూ ఉండడం నిజమే అయినా ఆ పార్టీకి గతంలో ఉన్న ప్రాముఖ్యం ఇప్పుడు లేదు. ఒకప్పుడు అబ్రహం లింకన్ లాంటి ప్రజాస్వామ్య కర్తలను ప్రపంచానికి అందించిన పార్టీ అయినప్పటికీ, ప్రస్తుతం సాంప్రదాయ వాదులతో నిండిన పార్టీ అది. మధ్య వయస్కులైన మగవాళ్లే ఆ పార్టీలో ఎక్కువ మంది సభ్యులు. వ్యక్తిగత స్వేచ్ఛకు బాగా అలవాటుపట్ట యువత, మహిళాలోకం అందులో లేరు.

రిపబ్లికన్ పార్టీలో చాలా కాలంగా వ్యవస్థీకృతమై ఉన్న ఆధిపత్య ధోరణికి నిరసనగా కూడా ట్రంప్ అభ్యర్థిత్వం ముందంజలో ఉండడం కారణమై ఉండవచ్చు. జాత్యహంకార వ్యాఖ్యలతో సభ్యుల మనసు చూరగొని పార్టీ అభ్యర్థిత్వం కోసం జరుగుతున్న పోటీలో ముందుకు దూసుకెళుతున్న ట్రంప్ ఇప్పుడు ఆ పార్టీ అధిష్టానానికి గొంతులో పచ్చి వెలక్కాయలా తయారయ్యాడని భోగట్టా. తన విపరీత వ్యాఖ్యలతో మిత్ర దేశాల ప్రజలలోను, తమ దేశంలోను ద్వేషాన్ని కొనితెచ్చుకున్న ట్రంప్‌కి పార్టీ అభ్యర్థిత్వాన్ని కట్టబెట్టాల్సివస్తే ఎలాగా అని వారు తలపట్టుకుని కూర్చున్నారని వార్త.

అమెరికా ఓటర్లలో ఇస్పానిక్ ఓటర్లను లాంకాన్స్ అంటారు. వారంతా గుండు గుత్తగా ఒకవైపే ఉంటారని, ఫలాన అభ్యర్థిని గెలిపించే సత్తా లేకపోయినా, వారు తలిస్తే ఎవరినైనా ఓడించడం మాత్రం వారికి సాధ్యమని ఇక్కడి విశ్లేషకుల అభిప్రాయం.

అట్లాంటి లాంకాన్స్‌ను ట్రంప్ 'రేపిస్టు'లని నోరు పారేసుకుని తనకు వ్యతిరేకం చేసుకున్నాడు. ఎంతో కాలానికి ఒక మహిళ అమెరికా అధ్యక్షురాలు అయ్యే అవకాశం వచ్చింది కాబట్టి ఎలాగైనా హిల్లారీ క్లింటన్‌ను గెలిపించుకోవాలని అమెరికాలోని మహిళా ఓటర్లు బలంగా ఫీలవుతున్నారు. చాలా వర్గాలలో వ్యతిరేకత ఉన్న ట్రంప్ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి అయితే డెమోక్రటిక్ పార్టీకి అధ్యక్ష ఎన్నికల్లో గెలిచే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని డెమోక్రటిక్ పార్టీ సానుభూతిపరులు కొంత మంది ఆశతో కూడా ఉన్నారు.

రిపబ్లికన్ పార్టీ నియమావళిలో ఒక తిరకాసు ఉంది. పార్టీ ప్రాథమిక స్థాయి ఎన్నికలలో ఒక అభ్యర్థి మెజారిటీ ఓట్లు సాధించినప్పటికి, ఆ అభ్యర్థికి మొత్తం డెలిగేట్లలో సగం మంది అంటే 1267 మంది ప్రతినిధుల మద్దతు లభించినట్లయితే, ఆ అభ్యర్థి దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమని పార్టీ సెంట్రల్ కమిటీ భావిస్తే, ఆ అభ్యర్థిని మార్చి వేరే అభ్యర్థిని అధ్యక్ష పదవికి పోటీలో నిలబెట్టవచ్చు. ఇప్పుడున్న పరిస్థితులలో ట్రంప్‌కు ఆ మ్యాజిక్ ఫిగర్ వచ్చేది ఇంకా సందిగ్ధమే. ట్రంప్‌కు అంతమంది ప్రతినిధుల మద్దతు లేకపోతే ప్రాథమిక స్థాయి ఎన్నికలలో ఆయన మెజారిటీ సాధించినప్పటికీ, ఆయన్ను అభ్యర్థిగా ఖరారు చేయడం అనుమానాస్పదమే. అలా జరిగితే ట్రంప్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయడం ఖాయం. అయితే, అమెరికా ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థులు గెలవడం దాదాపు దుర్లభం.

ప్రపంచంలో ఉన్న సంపద మొత్తంలో సగానికి సగం కేవలం 65 మంది వ్యాపార వేత్తల దగ్గరే కేంద్రీకృతమయిందని, వారిలో 45 మంది అమెరికా సంయుక్త రాష్ట్రాలలోనే ఉన్నారని, ఈ మధ్య అంతర్జాతీయ పరిశోధనా సంస్థ ఒకటి వెల్లడించింది. ఆ 45 మంది మల్టీ బిలియనీర్ల ప్రతినిధిగా డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి ఉద్యుక్తుడవుతున్నాడు.

ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా ప్రపంచ రాజకీయాలలో మార్పు ఏమీ రాదు. దళిత వర్గం నుండి వచ్చిన ఒబామా అధ్యక్షుడుగా రెండుసార్లు ఎన్నికయినందువల్ల అమెరికాలోని ఆఫ్రికన్ – అమెరికన్ జాతీయుల జీవితాల్లో గాని, ప్రపంచంలోని అన్ని దేశాలలోని దళిత వర్గ ప్రజలలో గాని ఎలాంటి మార్పు రాలేదన్నది స్పష్టం. అయినా, భారతదేశంలోని విజయ్‌మాల్యా విచ్చలవిడితనాన్ని, బ్యాంకులను మోసం చేయడాన్ని, నిస్సిగ్గుగా సమర్థించిన డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల్లో ఓడిపోతే భారత్‌లోనే కాదు అమెరికాలోనూ సంతోషించేవాళ్లు చాలామందే ఉన్నారు!

(డాలస్, అమెరికా నుండి)

(రచయిత రిటైర్డ్ లెక్చరర్) వీ

ప్రపంచీకరణ మాటున మసకబారిన మేడే స్ఫూర్తి!

కార్మికులు ఐక్యంగా పోరాడి సాధించుకున్న హక్కులను సంస్కరణల పేరుతో ప్రపంచ వ్యాప్తంగా పాలకులు తీవ్ర అణచివేతకు గురిచేస్తున్నారని అంటున్నారు **విద్యాభూషణ్**

సమాజంలోని సకల సంపదల సృష్టికి మూలం శ్రమ శక్తి. ఒకనాటి బానిస వ్యవస్థలో, సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకూ శ్రమించి గూటికి చేరుకునే అధో పరిస్థితుల నుంచి బైటపడేందుకై జరిపిన జీవన్మరణ పోరాటమే 'మేడే'! మరో మాటలో చెప్పాలంటే, ఓ నాటి బానిస పరిస్థితులను అధిగమించి సుఖప్రద జీవన సాధనకై సాగించిన పోరాటమే మేడే! శ్రామిక వర్గం నేడు అనుభవిస్తున్న కనీస హక్కులు, సదుపాయాల వెనుక వందల సంవత్సరాల పోరాటాలు, వేలాది మంది కార్మికుల బలిదానాలు ఉన్నాయి. మేడే అంటే ఎనిమిది గంటల పని గంటల సాధనకే పరిమితం కాలేదు. మనిషి అన్నవాడు ఆరోగ్యప్రద జీవనం నెరపేందుకుగాను, రోజులో ఎనిమిది గంటలు పని గంటలుగా, కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఎనిమిది గంటలు, ఎనిమిది గంటలు విశ్రాంతి కాలంగా నిర్దేశించిన సందర్భం మేడే.

మేడే నేపథ్యం

1866లో మొదటి అంతర్జాతీయ కార్మిక వర్గ సమావేశం కారల్ మార్క్స్ నాయకత్వాన జెనీవాలో జరిగింది. ఈ సమావేశంలోనే అమెరికన్ నేషనల్ లేబర్ యూనియన్ ఎనిమిది గంటల పని దినానికై చేసిన – చేపట్టిన తీర్మానం చర్చకు వచ్చింది. నాటి చర్చ ఈ డిమాండును ప్రపంచ కార్మికుల డిమాండుగా మార్చి వేసింది. సత్వరం ఇదో ప్రజా ఉద్యమంగా ఊపందుకుంది. నాటి ఉద్యమ దాటికి 1875లో గని కార్మికులు చేపట్టిన సమ్మెలో పది మంది కార్మికులు బలయ్యారు. అయినా ఉద్యమం ఆగలేదు. 1886 మే ఒకటి నుంచి ఎనిమిది గంటల పనిదినం అమలు పర్చాల్సిందేనని అంతర్జాతీయ కార్మిక రంగం పిలుపునిచ్చింది ఏకపక్షంగానే. ఈనాటి ఆందోళనా కార్యక్రమం అమెరికా నడిబొడ్డున చికాగోలో చేపట్టడం జరిగింది. ఈ ఆందోళనలో సుమారు ఐదు లక్షల మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ ఆందోళనా ఫలంగా లక్షా ఎనబై ఐదు వేల మంది ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకోగా, సుమారుగా మరో రెండు లక్షల మంది కార్మికులు తమ పని కాలాన్ని 12 గంటల నుంచి తొమ్మిది గంటలకు తగ్గించుకున్నారు. కార్మికుల ఆందోళనకు చికాగో వేదికయింది. న్యూయార్క్, బొల్టిమోర్, వాషింగ్టన్ పట్టణాల్లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు చేపట్టడం జరిగింది.

మే 3న చికాగోలోని మెకార్మిక్, హార్వెస్టర్‌వర్క్స్ అనే కంపెనీకి చెందిన కార్మికుల ఆందోళనపై పోలీసులు ఏకపక్షంగా కాల్పులు జరపగా ఆరుగురు కార్మికులు వీర మరణం పొందారు. మరో రెండు వందల మంది కార్మికులు గాయపడ్డారు. దీనికి నిరసనగా మే 4న కార్మికులు మరింత ఉధృతంగా ముందుకు కదిలారు. చేపట్టిన ప్రదర్శన ముగిసే సమయానికి ఎక్కడి నుంచో ఎవరో బాంబు వేశారు. ఓ సార్జంటు చనిపోవడం జరిగింది. ఇంకా ఆగేదేముంది పోలీసులు కాల్పులకు పాల్పడ్డారు మహోత్సాహంగా. ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతిదాడిలో నలుగురు పోలీసులు మరణించారు. ఆ తరువాతి క్రమంలో చేపట్టిన దర్యాప్తులో పోలీసులను కాల్పులకు ఉసిగొల్పేందుకై కంపెనీ యాజమాన్యమే ఏజెంట్ల ద్వారా ఈ విధ్వంసానికి పాల్పడిందని వ్యక్తమయింది. ఇవే ఎత్తుగడలు ఈనాడు కూడా. దీన్ని సాకుగా చూపించి పోలీసులు కార్మిక నాయకత్వాన్ని అరెస్టు చేసి, తప్పుడు కేసులు బనాయించారు. నాయకుల్లో ఏడుగురికి మరణ శిక్షను, ఒకరికి పదిహేనేళ్ళ కారాగార శిక్షను విధించారు. ఈ ఉరిశిక్షల రద్దుకై అమెరికా నగరాలన్నింటిలో కార్మికులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. దీంతో ఓ ఇద్దరి మరణ శిక్షలను జీవిత ఖైదుగా తగ్గించారు. మరో కార్మిక నేత కామ్రేడ్ లింగ్ జైల్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరో నలుగురు కార్మిక నేతల్ని నవంబర్ 11న ఉరి తీశారు. తదనంతరం 1890 మే 1 నుంచి ప్రతీ సంవత్సరం 'మే ఒకటి' ని అంతర్జాతీయ సంఘీభావ దినంగా జరుపుకోవాలని, పారిస్ రెండో అంతర్జాతీయ కార్మిక మహాసభ కామ్రేడ్ ఏంగెల్స్ నాయకత్వాన తీర్మానించింది. నాటి నుంచే ప్రపంచ కార్మికుల్లారా ఏకం కండి! అని నినదిస్తూ ప్రపంచ కార్మికులంతా 'మేడే'ని జరుపుకుంటున్నారు. నాడు చేపట్టిన ఈ మహత్తర పోరులో, చిందించిన రక్తపుటేరుల్లో ముంచెత్తిన 'ఎర్రని జెండా'ను గుర్తుగా చేసుకుని మేడేను జరుపుకుంటూ స్ఫూర్తిని పొందుతున్నారు కార్మికులు నిన్నటి వరకూ.

నాటి కార్మికుల పోరాట స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం దగ్గర్నుంచి, సాధించుకున్న అనేకనేక కార్మిక హక్కుల నేపథ్యంలో ఎన్నో ఆందోళనలు – పోరాటాలు – బలిదానాలు దాక్కొని ఉన్నాయి. మరీ తాత్వికత, ప్రపంచీకరణ అడుగు పెట్టిన నాటి నుంచీ తిరోగమన దిశలో వెనకడుగు వేయనారంభించింది. ప్రభుత్వ రంగ సంస్థలను మూసేసి, ప్రైవేట్ రంగానికి సమర్పించేందుకు అంకురార్పణ జరిగి నేటికి సుమారుగా ముగింపుకు వచ్చేసింది. శాశ్వత ఉపాధి నియామకం సుమారుగా అంతర్ధానం. డాక్టర్లు, టీచర్లు, ఒకటేంటి అంతా కాంట్రాక్టు నియామకాలే. ఏళ్ల తరబడి కాంట్రాక్టు నియామకాలు కొనసాగుతున్నాయి. ఏ విధమైన హక్కులు ఉండవు. చివరకు వారాంతపు సెలవు కూడా మృగ్యమైపోయే పరిస్థితి. ఇదివరకే నియామకాలు పొందిన ప్రభుత్వ సంస్థల్లో పదవీ విరమణ పొందిన వారు పొందుతుండగా, ఉన్నవారితోనే పని చేయించే పరిస్థితి. దాంతో వారి పని గంటలు

తెలుగు రాష్ట్రాల్లో చేనేత పరిస్థితి

రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి ముందు చేనేత పరిశ్రమకు ఎన్నో ఆశలు చూపించిన పాలకులు ఇప్పుడు దానిని పట్టించుకోవడం లేదనీ, రోజురోజుకూ నేతకారుల పరిస్థితి దిగజారిపోతోందనీ అంటున్నారు **డి. నర్సింహారెడ్డి**

2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత ప్రత్యేక ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి రంగంలో, మరీ సూటిగా, పారిశ్రామిక రంగం పైన, పడే దుష్ప్రభావం గురించి మేధావులు, ఇతరులు చర్చించారు. చేనేత రంగం ప్రస్తావన ఎవరు తీసుకురాలేదు. విభజన ముందు, ఆ తరువాత కూడా చేనేత రంగం కష్టాలు పెరిగినాయి. చేనేత కుటుంబాల వృత్తి వలసలు జరుగుతూనే ఉన్నాయి. చేనేత కుటుంబాలు పెరిగే అవకాశాలు కూడా తగ్గిపోతున్నాయి. చేనేత కూలీ నానాటికి పెరుగుతున్న నిత్యావసరాల వస్తువుల సూచితో పోటి పడలేక ఎప్పుడో చతికిలపడింది. ఫలితంగా చేనేత కుటుంబాలకు అప్పులు, దిగజారుతున్న జీవన ప్రమాణాలు. ఒకప్పుడు, గ్రామాలలో ఒక వెలుగు వెలిగిన చేనేతలు, అదే ఊరిలో కట్టెలు అమ్మే పరిస్థితికి వచ్చారు. అక్కడే ఉండలేక, ఆదాయం పెంచుకునే మార్గం లేక, నమ్ముకున్న వృత్తి వదలలేక, అనేక కష్టాల మధ్య తమ కళా నైపుణ్యం బతికించుకుంటున్న చేనేత కుటుంబాలూ, ఆత్మస్థైర్యంలో, త్యాగంలో, కర్షకులతో పోటి పడుతున్నారు.

తమ పిల్లల భవిష్యత్తు గురించిన ఆందోళన మాత్రమే వారిలో ఉంది. అనేక కుటుంబాలు వారికి ఇప్పటికి అవసరమైనంత మేర చదువులు చెప్పించి కష్టాల కడలి దాటించే ప్రయత్నం చేస్తున్నారు. విఫలం అవుతున్నారు. 'పేరు గొప్ప ఊరు దిబ్బ' చందాన వెనుకబడిన తరగతులలో వీరికి ఉన్న అత్యున్నత స్థానం ప్రభుత్వం ఇచ్చే రిజర్వేషన్లలో కొనసాగడం వల్ల, వీరి పిల్లలకు అ ఫలాలు కూడా అందడం లేదు. నగదు పెట్టుబడులు పెట్టి పిల్లలకు చదువులు చెప్పించడం గగనం అవుతున్నది. రాజకీయ శక్తిగా కూడా ఎదగలేకపోతున్నారు. అనైక్యత వల్ల, చారిత్రాత్మక తప్పిదాల వల్ల, సంఖ్య బలం ఉన్న దగ్గర కూడా బలహీనులుగా మిగిలిపోతున్నారు.

ఈ చేనేత కుటుంబాల పరిస్థితిని బాగా అర్థం చేసుకున్న రాజకీయ నేతలు, ఎన్నికల సమయంలో చేసిన ఆశలు రేకెత్తించే వాగ్దానాలు చేసి మరిచిపోవడం పరిపాటి అయ్యింది. చేసిన వాగ్దానాలకు వ్యతిరేకంగా చర్యలు చెప్పట్టినా, చేనేత సమాజం నుంచి ప్రతిస్పందన ఉండదు అని గమనించిన రాజకీయ చాణక్యులు వీరిని మోసం చేయడం అలవాటుగా మార్చుకున్నారు. చంద్రబాబు నాయుడు చేనేత రంగానికి రు. 1,000 కోట్లు కేటాయిస్తామని వాగ్దానం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి తమ ఎన్నికల ప్రణాళికలో చేనేత అభివృద్ధికి ఒక సమగ్ర విధానం ప్రకటిస్తామని వాగ్దానం చేసింది.

2014 ఎన్నికలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో చేనేతకు ఆశల హరివిల్లు పేనిన పార్టీలలో మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్ర సమితి, తెలుగు దేశం ఉన్నాయి. అధికారం వచ్చినాక, చేనేతలు ఓపికతో వేచి చూస్తున్నా కూడా నానాటికి ఇచ్చిన వాగ్దానాల మాట దేవుడెరుగు, చేనేత కష్టాలను పెంచే చర్యలు క్రమంగా తేలుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో కూడా చేనేతకు బడ్జెట్ కేటాయింపులు తగ్గుతున్నాయి. ఇచ్చిన నిధులు ఖర్చు చేయడం లేదు. అవసరమైన పథకాలు పూర్తిగా ఎత్తివేశారు. ఆప్కో విభజన ఆలస్యం అవుతా ఉంటే, ప్రాథమిక సహకార సంఘాలు దారి తెలియక కొట్టుమిట్టాడుతున్నాయి. ఉన్న ఒక కొమ్మ కూడా


నామ్‌కే వాస్తేగా మారి, రోజుకు కనీసం 12 గంటలు పనిచేయాల్సి వస్తుంది.

ఈ పునాది మీదనే ఆధునికంగా వెల్లివిరుస్తున్న (ఐటి సెక్టార్) సాఫ్ట్‌వేర్ రంగంలో సాంకేతిక సిబ్బందిచే రోజుకు 12 గంటలకు మించి పని చేయించుకుంటున్నారు. వీరి పనికి భద్రత లేదు. యాజమాన్య కనుసన్నల్లో పనిచేసినంత కాలం ఉపాధి. లేకుంటే ఇంతే సంగతి. నిరుద్యోగం పెచ్చు మీరడంతో కనీస వేతనాలకు కరువు. మహిళా కార్మికులు – బాల కార్మికులు ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నారు. వీరే ప్రగతికి ప్రతీకలుగా నిలుస్తున్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా పాలకులంతా ఒకటే మాట. డెవలప్‌మెంట్ విత్ హ్యూమన్ ఫేస్ అన్న తాత్వికతలో సామాన్యులు అభివృద్ధికి ఆటంకంగా అనిపిస్తే తొలగించేయడమే. ఉపాధి, జీవన వ్యయం వంటి పదాలతో పాటు అభివృద్ధి అర్థం కూడా మారిపోతూ వస్తుంది. ఈ నేపథ్యంలో సెజ్‌లు, రాజధాని నిర్మాణాలు, అభివృద్ధి పేరిట ఫ్యూడల్ వాస్తు ప్రయోగాలు ఊపందుకుని, లక్షలాది మంది నిర్వాసితులవుతున్నారు. సేద్యపు భూమి కనుమరుగై, అన్నదాత ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. పర్యావరణం ప్రమాద స్థాయికి చేరి విధ్వంసానికే ఊపిరవుతుంది. అతివృష్టి – అనావృష్టి రెండూ జీవన వినాశనానికే హేతువవుతున్నాయి. ప్రపంచీకరణ వెల్లువలో దేశ సౌభాగ్యాన్ని పారిశ్రామికీకరణ పేరిట పలు విదేశాలకు ధారాదత్తం చేయడం జరుగుతుంది. సామాన్యుడి జీవనం అమెరికా జీవన శైలితో పోటీ పడలేక అతలాకుతలం అయిపోతుంది భవిషత్తే ప్రశ్నార్థకంగా. ఈ దాటిని తట్టుకునేందుకు అసంఘటితులంతా సంఘటితం కావాలి. 'పోరాడితే పోయేదేమీ లేదు – బానిస సంకెళ్ళు తప్ప!' అనే నాటి జీవన నినాదానికి – లక్ష్యసాధనకు పునరంకితం కావాలి! అంతర్జాతీయ కార్మిక దినోత్సవ 'స్ఫూర్తి'ని మరోసారి నలుదిశలా విస్తరింపజేయాలి!!


(రచయిత పాత్రికేయులు) వీ

ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ఆప్కోకు విభజనకు ముందు నుంచే ప్రభుత్వ బకాయిలు ఇప్పుడు ఏ ప్రభుత్వ బాధ్యత అన్నది తేలలేదు. ఆస్తులు, అప్పులు, నిరర్థక వస్త్రాల స్టాకు బాధ్యత తేలే దాక, రెండు రాష్ట్రాల ప్రాథమిక సహకార సంఘాలకు దిక్సూచి అయిన రాష్ట్ర చేనేత సహకార సంఘం ఏర్పడి, సమర్థంగా పనిచేసే పరిస్థితి లేదు. ఈ మార్గంలో చేనేత కుటుంబాలకు పని, ఉపాధి పూర్తిగా మూసుకుపోయే ప్రమాదం ఉన్నది. అపెక్స్ సహకార సంస్థలకు బడ్జెట్ కేటాయింపులు రెండు రాష్ట్రాలలో లేనే లేవు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరుగుతున్న 'భేషజాల' పోరులో ఆప్కో, టెస్కో సంస్థల అభివృద్ధి మీద ఆశలు ఆవిరి అవుతున్నాయి. ఇద్దరు ముఖ్యమంత్రులకు ఈ వ్యవహారం మీద శ్రద్ధ లేదు. వారికి రాజకీయపరంగా ఆందోళన కలిగించే విషయం కాదు. వారి దృష్టిలో విభజన అంశాలలో జరిగే గుంజులాటలో ఇది ఒక చిన్న భాగం. కాని లక్షలాది చేనేత కుటుంబాలకు ఈ సంస్థల ఏర్పాటు, అభివృద్ధి చాలా కీలకం.

రాష్ట్ర విభజన తరువాత ఇప్పటికి మూడు బడ్జెట్లు వచ్చినాయి. ఒక్కొక్క బడ్జెట్ మారుతున్న క్రమంలో, చేనేత రంగం పట్ల ప్రభుత్వ ఆలోచనల వ్యతిరేక దిశ స్పష్టమవుతున్నది. చేనేత శాఖను, సిబ్బంది పని తీరును మెరుగుపరిచి, సమర్థవంతంగా చేనేత కుటుంబాల ఉపాధి కొనసాగించే చర్యలు ప్రభుత్వాలు తీసుకోవడం లేదు. అత్యంత ఉన్నత స్థానమైన చేనేత సంచాలకులు ఎవరు అనే సందిగ్ధత నాలుగు ఏళ్ల నుంచి రెండు రాష్ట్రాలలో కొనసాగుతున్నది. పరిశ్రమల శాఖలో చేనేత శాఖ ఉండడం ఇంకొక దౌర్భాగ్యం. చంద్రశేఖర్‌రావు, చంద్రబాబు నాయుడు ఆధునిక పరిశ్రమ స్థాపనకు పూర్తిగా తీవ్ర దృష్టి పెడుతున్న వైనంలో, అదే 'ముఖ్య' శాఖలో ఒక విభాగం అయిన చేనేత శాఖ పట్టించుకోని 'పెద్ద పిల్ల' అయ్యింది. మంత్రుల తీరు కూడా అదే. ఉమ్మడి రాష్ట్రాలుగా ఉన్నపుడు చేనేతను పీడించిన ఈ దౌర్భాగ్యపు పాలన సంస్కృతి ఇప్పటికి కొనసాగుతున్నది. పరిశ్రమ రంగం పాలనలో చేనేతకు స్థానం చాలా సూక్ష్మం.



ఉమ్మడి రాష్ట్రంలో 2013-14లో చేనేత జౌళి శాఖలకు కేటాయింపులు రు. 214 కోట్లు కాగా, 2014-15లో తెలంగాణ కేటాయించింది రు. 142.60 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రు. 99.86 కోట్లు. 2015-16లో తెలంగాణ రు. 201.72 కోట్లు, ఆంధ్రప్రదేశ్ కేవలం రు. 45.92 కోట్లు కేటాయించింది. 2016-17లో తెలంగాణ రు. 83.05 కోట్లు ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్ రు. 124.56 కోట్లు ఇచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలోనే చేనేతకు బడ్జెట్ పెంచాలని చేనేత కుటుంబాలు కోరుతుంటే, రెండు రాష్ట్రాలు అయినాక బడ్జెట్ అంతకంటే తక్కువ కావడం మనం చూడవచ్చు. విభజన చేనేత రంగాన్ని బలహీనం చేసింది అని ఈ పరిణామం స్పష్టీకరిస్తుంది.



అనేక సంవత్సరాల నుంచి చేనేత రంగం, జౌళి నుంచి, పరిశ్రమ శాఖ నుంచి విముక్తి కోరుతున్నది. చేనేత జౌళి శాఖ కేటాయింపులలో కూడా, అచ్చంగా చేనేతకు ఇస్తున్న నిధులు చాలా తక్కువ. ఉమ్మడి రాష్ట్రంలో, విడిగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఇంకా తక్కువగా చేనేతకు కేటాయింపులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2013-14లో చేనేతకు కేటాయింపులు రు. 148.77 కోట్లు కాగా, 2014-15లో తెలంగాణ కేటాయించింది రు. 93.47 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రు. 57.29 కోట్లు. 2015-16లో తెలంగాణ రు. 53.29 కోట్లు, ఆంధ్రప్రదేశ్ కేవలం రు. 16.37 కోట్లు కేటాయించింది. 2016-17లో తెలంగాణ చేనేత పథకాలకు సున్నా ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్ రు. 27.65 కోట్లు ఇచ్చింది.

ప్రపంచీకరణ నేపథ్యంలో, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకుని, వాటికి అనుగుణమైన విధాన నిర్ణయాలు ప్రకటించే ప్రభుత్వ విధాన పత్రం అవసరం ఎంతైన ఉంది. చేనేత విధానం, విస్తృత సంప్రదింపుల తరువాత, ప్రకటించాలి అని చేనేత రంగం ఎప్పటి నుంచో కోరుతున్నది. ముసాయిదా జాతీయ ఫైబర్ విధానం చేనేతకు వ్యతిరేకంగా ఉంది గనుక దీనిని సవరించి సహజ నూలుకు, చేనేతకు అనుకూలంగా తయారు చేస్తే చేనేత రంగానికి, కోట్లాది చేనేత కుటుంబాలకు మేలు చేసిన వారవుతారు.

దేశంలో, చెప్పుకోదగ్గ చేనేత ఉత్పత్తుల పరిమాణం, వైవిధ్యం అధికంగా ఉన్న ప్రాంతాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్నాయి. దక్షిణ భారత దేశంలో చేనేత రంగం బలంగా ఉన్నది ఇక్కడే. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల దృష్టికోణం చేనేత రంగానికి వ్యతిరేకంగానే ఉన్నది. అనేక సంవత్సరాలుగా, చేనేత రంగానికి అవసరమైన నిధుల కేటాయింపు జరపకపోవడం, కేటాయించిన నిధుల విడుదలలో కూడా అనేక అడ్డంకులు, జాప్యం వల్ల, చేనేత కుటుంబాలకు చేరుతున్న ప్రభుత్వ సహాయం పూర్తిగా సున్నా.

(రచయిత జాతీయ చేనేత జౌళి నిపుణులు) వీ

కుల రక్కసి చావదు, చంపాల్సిందే

***కులనిర్మూలన చేయాల్సిన శక్తులు ఆత్మగౌరవం, సాధికారతల పేరుతో సంఘాలుగా ఏర్పడి కుల వ్యవస్థను పెంచి పోషిస్తున్నాయనీ, కుల వ్యవస్థను రూపుమాపేందుకు ఉద్యమించాలనీ అంటున్నారు* వెన్నెలకంటి రామారావు**

'నీకిష్టమైన ఏ వైపుకు తిరిగినా కుల రక్కసి నీ మార్గాన్ని అడ్డగిస్తుంది. ఆ రక్కసిని చంపేంత వరకు నీకు రాజకీయ సంస్కరణ ఉండదు, నీకు ఆర్థిక సంస్కరణ ఉండదు' అని 1936లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పిన విషయం ఏవో కొన్ని స్వల్పమైన మార్పులతో సమకాలీన భారతీయ సామాజిక వాస్తవికతగా ఇంకా కొనసాగుతూనే ఉంది. అంబేద్కర్ 125 జయంతోత్సవాలను సంవత్సర కాలం పాటు దేశ వ్యాపితంగా నిర్వహిస్తున్న తరుణంలో ఆయన ప్రతిపాదించిన 'కుల (రక్కసి) నిర్మూలన' స్వప్నాన్ని సాకారం చేయడంలో యావత్ భారత జాతి విఫలమైంది. ఆ రక్కసి వివిధ ప్రజాస్వామిక రూపాల్లో, ప్రాబల్య – ప్రాబల్యేతర, ఆధిపత్య – ధిక్కార కుల అస్తిత్వ సంఘటిత సంస్థల రూపాల్లో మరింతగా వ్యవస్థీకృతం అయింది. దాన్ని హతమార్చే చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చవలసిన సామాజిక శక్తులు ఆత్మగౌరవం, సాధికారితల పేరుతో దాని విశ్వజనీనతకు ప్రాణం పోస్తున్నాయి. కుల రక్కసిని చంపి ఈ దేశ పీడితులకు ఉపకరించే రాజకీయ, ఆర్థిక సంస్కరణలు అమలు లోకి రావాలన్న అంబేద్కర్ ఆకాంక్ష ఇన్నేళ్లకూ నెరవేరకపోగా, ఆ రక్కసి మరింత విస్తృతంగా, మరింత మర్యాదకరంగా, మరింత సౌమ్యంగా, మరింత ప్రజాస్వామిక రూపాల్లో నివృతమైంది.

బడుగులకు గతంలో కులవృత్తుల రూపంలోనైనా అందుబాటులో ఉన్న జీవన అవకాశాలను సైతం, అభివృద్ధి పేరుతో కబళించే అంత దుర్మార్గంగా, సూటు బూటు వేసుకుని ఆ రక్కసి ఆధునికంగా తయారైంది. అది ఉన్నత విద్యా, సాంకేతిక సంస్థల నుంచి సకల జీవన రంగాల్లో కాషాయీకృత సాఫ్ట్‌వేర్‌తో తిష్ఠవేసింది. ఆస్తుల మేటల్ని తప్ప మరే విధమైన ప్రమాణాలు లేని కుల నిర్మూలన కార్యక్రమంలో ఆ రక్కసి అన్ని బడుగు కులాల్లో సాధికారతను తీసుకొచ్చి క్రీమీలేయర్ రూపంలో 'సామాజిక న్యాయాన్ని' సాధించింది. నిమ్న కులాలు రాజ్యాధికారం సాధించాలని అంబేద్కర్ కలలు గన్నారు. నిమ్న కులాలు సాధించిన సాధికారత కారణంగా పుట్టుకొచ్చిన క్రీమీలేయర్ ఆయన స్వప్నాన్ని (దళిత, బహుజనులను రాజ్యాధికారం) ఉనికిలో ఉన్న అగ్రవర్ణ పాలకవర్గాలతో ప్రభుత్వాధికారాన్ని పంచుకునే క్రీడగా నేడు మార్చివేసింది.

భారతీయ సమాజంలో కులం అనేది మరొకరెవరో అర్థం చేయించాల్సిన అవసరం లేనంతగా కఠోర వాస్తవం. నిత్యం అనుభూత మవుతున్న సామాజిక అస్తిత్వమది. రోజువారీ జీవితంలో ప్రజలు తమను తాము కుల అస్తిత్వంగానే గుర్తిస్తారు, ఆ విధంగానే ఇతరులతో వ్యవహరిస్తుండడం కద్దు. ఆ కారణంగానే ఒక కోపున అగ్ర కులస్తులు తమకు ప్రత్యేక సాంఘికాధికారాన్ని, హోదాని ఆపాదించుకుని వ్యవహరిస్తుంటే, మరోకోపున వారి దోపిడీకి, దాష్టీకానికి గురైన పీడిత, పాలిత కుల సమూహాలు తమ దుస్థితికి నిట్టూర్చడమో, అగ్ర కులాల దుర్మార్గాలు భరించలేని స్థితికి చేరుకున్న తరుణంలో వారిని ధిక్కరించడమో, ప్రతిఘటించడమో చరిత్ర పొడవునా చూస్తున్నాం. అలా తమ సాంఘిక అధికారాన్ని ప్రశ్నించిన, ప్రతిఘటించిన చోట అగ్ర కుల ఆధిపత్య వర్గాలు దురభిమానాన్ని రెచ్చగొట్టి నిమ్న కులస్థులపై దుర్మార్గమైన దాడులకు తెగబడుతున్నాయి. వీటికి వివిధ సామాజిక, రాజకీయ సమీకరణలు తోడవడంతో కుల వైషమ్యాలు మరింతగా హుందా అయిన రూపంలో పదునెక్కుతున్నాయి.

దేశ వ్యాప్తంగా కుడి ఎడమగా ఇదే తీరు కొనసాగుతుంది. భారతదేశ గత, వర్తమాన చరిత్ర పొడవునా అగ్ర కుల, మెజారిటీ మతం, సంపన్న వర్గాల దాష్టీకమే కొనసాగుతున్నది. అగ్ర కుల దాష్టీకం ఏ మేరకు, ఎంతకాలం నుంచి వ్యవస్థీకృతమయిందో, ఆ వ్యవస్థ పోవాలనే ఆకాంక్ష కూడా అంతే గాఢమైనది, ప్రాచీనమైనది. కుల విధానానికి శ్రమ విభజన కారణం కాదని, 'శ్రామికుల విభజన' అంటే శ్రమ చేసే కులాల మధ్య విభజన కారణంగానే కుల వ్యవస్థ ఏర్పడిందనే భావన ప్రపంచ తత్వానికి అంబేద్కర్ ఇచ్చిన అదనపు చేర్పు అని కొందరు మేధావులు సూత్రీకరించి ప్రచారం చేస్తున్నారు.

మొదట కుల విధానమేర్పడిందని, పర్యవసానంగా ఇక్కడ శ్రమ విభజన వచ్చిందని వారు అశాస్త్రీయంగా సూత్రీకరిస్తున్నారు. అంటే దిగువ కులం మొదట సృష్టించబడిందని, ఆ కారణంగా వారు దిగువ వృత్తులను చేపట్టవలసిన దుస్థితి ఏర్పడిందనే అంశం అంబేద్కర్ కొత్తగా కనుగొన్న సత్యం అని వారు చెబుతున్నారు. అంటే కొందరు స్వార్థపరులు అగ్రవర్ణాలు (కులాలు)గా తమను ప్రతిష్ఠించుకుని, నిమ్న వర్ణాలు (కులాలు) సృష్టించి, వారిచే అత్యంత నీచమైన పనులు కుట్రపూరితంగానే చేయిస్తున్నారని, కుల విధానంతో నిమిత్తం ఉన్న శ్రమ విభజన మనదేశంలో ఏర్పడిందనేది అంబేద్కర్ సిద్ధాంతమని వారు ప్రచారం చేస్తున్నారు.

సమాజంలో ఎవరి ఇష్టాలతో సంబంధం లేకుండా ప్రకృతి నుంచి మానవ అవసరాలను తీర్చుకునే క్రమంలో ప్రకృతి – మనుషుల మధ్య సంబంధాల పునాదిగా మనుషుల మధ్య అనివార్యంగా, స్వతంత్రంగా ఏర్పడిన సంబంధాలను శ్రమ సంబంధాలు అంటారు. ఇలా వస్తుగతంగా ఏర్పడిన శ్రమ సంబంధాలను అంబేద్కర్ ఎన్నడూ తిరస్కరించలేదు. ఆయన గొడవల్లా ఈ వస్తుగత సంబంధాలను మనుషులు అర్థం చేసుకున్న తీరును, ఆనాటి వెనుకబడిన చైతన్యంతో ఆ సంబంధాల చుట్టూ వారు ఏర్పరుచుకున్న విశ్వాసాలు, కట్టుబాట్లు, సంప్రదాయాల వ్యవస్థ అయిన కుల వాస్తవికతలోని హేతుబద్ధత, చారిత్రక అసంబద్ధతను మాత్రమే ప్రశ్నించడం. అంతేగాని శ్రమ సంబంధాలు లేకుండానే కుల

వ్యవస్థ ఏర్పడిందని, ఇంకా కుల విధానం పర్యవసానంగా భారతదేశంలో శ్రమ విభజన ఏర్పడిందని ఎన్నడూ, ఎక్కడా సూత్రీకరించలేదు.

అంబేద్కర్ చెప్పనిదాన్ని, ఆయన నిజమైన కాంట్రిబూషన్‌ను దుర్బుద్ధితో కొందరు వక్రీకరిస్తున్నారు. దురుద్దేశంతోనే అంబేద్కర్ పేరు మీద తమ చారిత్రక అజ్ఞానాన్ని ప్రచారం చేస్తున్నారు. ఈ దేశంలో కేవలం 'శ్రమ విభజన' మాత్రమే కాదు, శ్రామికుల విభజనా ఉంది. 'క్యాస్ట్ ఇజ్ నాట్ మెరెలి ద 'డివిజన్ ఆఫ్ లేబర్' బట్ 'డివిజన్ ఆఫ్ లేబరర్స్' బేస్డ్ అపన్ గ్రేడెడ్ ఇనిక్వాలిటీ' అని అంబేద్కర్ 'కుల నిర్మూలన' గ్రంథంలో స్పష్టంగా విశ్లేషించారు.

కమ్యూనిస్టు నేత డాంగే సారథ్యంలో జరిగిన బాంబే టెక్స్‌టైల్ మిల్స్ సమ్మె సమయంలో అంబేద్కర్ కుల వివక్షకు సంబంధించిన డిమాండ్‌ను ముందుకు తీసుకురావడంలో అర్థం ఆయన శ్రమ దోపిడీ పునాది సాగే సమ్మెను వ్యతిరేకించినట్టు కాదు. అలాంటి చైతన్యపూరిత సమిష్టి కార్యకలాపం సాగుతున్న సందర్భంలో కుల వివక్ష సమస్యను ముందుకు తీసుకురావడం వల్ల శ్రామికులు చైతన్య పూరితంగా తమ మధ్య ఉన్న విభజనను వదిలించుకునే అవగాహనను పెంపొందించుకునేందుకు వీలవుతుంది. తద్వారా కుల నిర్మూలన కార్యాచరణకు మార్గం సుగమమవుతుందనేది ఆయన ఉద్దేశం. పీడితులు లేదా శ్రామికుల ఐక్యత శ్రమ విభజన దృష్ట్యా (పునాదిగా) సమీకరించడం వల్ల సాధ్యం కాదు. దానికితోడు, ముఖ్యంగా శ్రామికుల విభజనగా ఉన్న కుల వివక్ష సమస్యను పరిష్కరించడం అత్యవసర షరతు అని అంబేద్కర్ భావన. అంతేగాని ఆయన శ్రమ విభజనను తిరస్కరించి, కుల విభజనను (శ్రామికుల విభజన రూపంలో) భారతదేశ సామాజిక వాస్తవికత అని సూత్రీకరించినట్లు చెప్పడం అంబేద్కర్‌ను ఘోరంగా వక్రీకరించడమే.

ఇలాంటి వారిని చూసి 'నా ఈ జ్ఞానం పలువురు అజ్ఞానుల్ని సృష్టించింది' అని ప్రకటించిన పాశ్చాత్య తత్వవేత్త స్పినోజా మాటలను అంబేద్కర్ పునశ్చరించవలసి వస్తుంది. తమ అజ్ఞానాన్ని అంబేద్కర్‌కు ఆపాదిస్తున్న కొందరు మేధావి ప్రబుద్ధులు మార్క్సిస్టు తాత్వికతను పూర్వ పక్షం చేసే ప్రయత్నంలో ఆయన భావనలను తలకిందులు చేసి ప్రచారం చేయడం ఈ దేశ బహుజనులకు తీరని అన్యాయం చేయడమే అవుతుంది. మార్క్స్ తాత్విక నిర్ణాయకవాదానికి ప్రతిగా (ప్రత్యామ్నాయంగా) చైతన్యవంతులైన వ్యక్తుల కార్యాచరణ ఫలితంగా చరిత్ర రూపొందుతున్న సిద్ధాంతాన్ని అంబేద్కర్ ప్రతిపాదించినట్లు కొందరి భావన.

మనుషులే చరిత్ర నిర్మాతలని సూత్రీకరించిన మార్క్స్ భావన నిర్ణాయకవాదం లేదా విధికృత వాదం ఎట్లవుతుంది? నిర్దిష్ట శ్రమ విభజన ద్వారా వ్యక్తీకరింపబడుతున్న, ప్రతినిధులైన వ్యక్తులే చరిత్ర నిర్మాతలు. భౌతిక వాస్తవికత లేనిదే భావాలు, భావజాలం ఎలా రూపొందుతాయి? అలాగే సామాజిక భౌతిక వాస్తవికత భిన్నంగా చరిత్రను ఎవరూ కుట్రలతో, ఆధిపత్య భావజాలంతో తాము కోరుకున్న విధంగా సామాజిక వ్యవస్థల్ని నిర్మించడం ఎలా సాధ్యం? భౌతిక వాస్తవికతతో సంబంధం లేకుండా వ్యక్తుల ఆలోచనల్లో జనించే భావజాలం ఒక సామాజిక పెట్టుబడిగా పరిణమిస్తుందని, అది ఒక భౌతిక పరిస్థితికి మూలమని మాట్లాడడంలో హేతుబద్ధత ఎక్కడ? ముందుగా ఒక కుల విధానాన్ని సృష్టించి, దానికనుగుణంగా శ్రమ విభజనల్ని ప్రవేశపెట్టడడం అనే సైద్ధాంతిక భావనను భారతీయ వాస్తవికతగా అంబేద్కర్ సూత్రీకరించారని, అది ఆయన తాత్విక అవిష్కరణ అని ప్రచారం చేయడం ఎంత నేరం? ఉత్పత్తి చేసే క్రమంలో శ్రమ విభజన, శ్రమ సంబంధాల రూపంలో ఏర్పడిన భౌతిక వాస్తవికతను, ఆనాటి సమాజం తనను తాను దర్శించుకుని నిర్వచించుకోవడంలో భాగంగా కుల విధానం ఉనికిలోకి వచ్చిందనే మౌలిక విషయాన్ని అంబేద్కర్ ఎన్నడూ తిరస్కరించలేదు.

మనుషులు తమ మధ్య ఉన్న శ్రమ విభజనను ఆనాడు తమకున్న మత భావజాల దృక్పథంతో తాము అర్థం చేసుకున్న మేరకు రూపొందించుకున్న కుల వ్యవస్థ అవగాహనతోనే పరస్పరం వ్యవహరిస్తారని అంబేద్కర్ విశ్లేషణలోని అంతర్గత భావన. శ్రమ విభజనతో ఆగిపోకుండా ప్రజల మధ్య ఆచారాలు, కట్టుబాట్లు, సాంప్రదాయాలతో కూడిన సంక్లిష్ట భౌతిక వ్యవస్థగా ఉన్న కుల విభజనను కూడా పరిగణలోకి తీసుకొని సామాజిక విముక్తికి కృషి చేయాలన్నది ఆయన సిద్ధాంత సారాంశం.

పురాతన భారత సమాజంలో వర్ణాలే వర్గాలు అంటారు అంబేద్కర్. అయితే పశుపాలక దశలో ఉన్న సామాజిక సంబంధాల వ్యవస్థను వర్ణ వ్యవస్థగాను, వ్యవసాయక సమాజాల్లోని సామాజిక వ్యవస్థను కుల వ్యవస్థగాను కొందరు చరిత్రకారులు పేర్కొన్నారు. వర్ణ వ్యవస్థ నుంచి జాతి (కుల) వ్యవస్థకు సాగిన పరిణామ క్రమంలో వృత్తులు కీలక పాత్ర పోషించాయి. వివిధ చేతి వృత్తుల ఉత్పత్తి దారులు సృష్టించే అదనపు విలువ తిరిగి అదే రంగంలో పునరుత్పత్తిలోకి పునః ప్రవేశించకుండా, వడ్డీ వ్యాపారుల దగ్గర పోగుపడుతున్న ఆర్థిక విధానం (యూరప్‌లోని జర్మనీలో వలె) భారత్‌లో సుదీర్ఘకాలం పాటు కొనసాగింది.

ఒక ఆర్థిక వ్యవస్థకు అదనపు విలువ ఇంధనం. ఆ అదనపు ఇంధనం ఉత్పత్తి దారుల వద్దకు చేరితే ఉత్పత్తి ప్రక్రియ సరళ పునరుత్పత్తి రూపం నుంచి విస్తృత పునరుత్పత్తిగా సహజ పరిణామం చెందుతుంది. అలాగాక అదనపు విలువ ఇంధన ఉత్పత్తి ప్రక్రియకు బయట వడ్డీ వ్యాపారుల వద్ద పోగుబడితే ఆర్థిక వ్యవస్థలో గుణాత్మక పరిణామం కుంటుపడి, గిడసబారి పోతుంది. రాజ్యం చొరవతో జోక్యం చేసుకునేంత వరకు ఉత్పత్తి విధానం అలానే స్వల్ప పరిణామాత్మక మార్పులతో కాళ్లు ఈడ్చుకుంటూ ఊరేగుతుంది.

ఉత్పత్తి శక్తుల (శ్రమ సాధనాలు, నైపుణ్యాలు) గుణాత్మక అభివృద్ధి కుంటుపడడంతో అవి నిరంతరాయంగా ఏ మార్పు లేకుండా కొనసాగుతాయి. ఒక తరం నుంచి మరొక తరానికి ఉత్పత్తి శక్తుల అనుస్యూతి (కంటెన్యుటీ) సాగడానికి కుటుంబ ఆధారిత ఉత్పత్తి విధానమే పునాదిగా ఉంది. దాంతో ఆ వృత్తులు గిడసబారి, ఆ భౌతిక ఉత్పత్తి పరిస్థితిని చారిత్రక పరిమితుల్లో తనదైన మత మార్మిక భావజాల శైలిలో అర్థం చేసుకునేందుకు అలనాటి సమాజం ప్రయత్నించింది.

ఆనాటి సమాజం ఆయా శ్రమ స్వభావాన్ని బట్టి అనేక విశ్వాసాలు, సాంప్రదాయాలు, కట్టుబాట్లతో కూడిన సంబంధాల వ్యవస్థను చిత్రించుకొని, ఆ అవగాహనతో ఆచరించింది, ఇతరులతో వ్యవహరించింది. ఆ క్రమంలో శ్రమ సంబంధాల ప్రక్రియగా ఆ సమాజం నిర్మించుకున్న ముకుళిత మానవీకరించిన సామాజిక సంబంధాల వ్యవస్థే కుల వ్యవస్థగా గడ్డకట్టుకుపోయింది. ఇది ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి మరింత అడ్డంకిగా నిలిచింది. అందుకే 'కులం భారతదేశ అభివృద్ధికి పెను ఆటంకం' అని 1853లో అమెరికా పత్రిక ది ట్రిబ్యూన్‌కు రాసిన వ్యాసంలో మార్క్స్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని అంబేద్కర్ లోతుగా అర్థం చేసుకున్నారు. కుల వ్యవస్థను నిర్మూలించనిదే ఒక జాతిని

నిర్మించజాలమని, అభివృద్ధి సాధించలేమని అభిప్రాయ పడ్డారు. వర్గ పోరాటం ద్వారా ఏర్పాటయిన సోషలిస్టు రాజ్యంలో కుల వ్యవస్థను రద్దు చేస్తామని 1930లో తొలిసారిగా ఆనాటి కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. ఆ సందర్భంలో మార్క్సిజం చెపుతున్న పునాది – ఉపరితలం భావనపై అంబేద్కర్ ఆసక్తికరమైన చర్చ చేశారు. ఆ చర్చలో అంబేద్కర్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, అందరినీ ఒప్పించే విధంగా సహేతుక తాత్విక వివరణను ఆనాటి కమ్యూనిస్టులు అందివ్వలేక పోయారు. అంబేద్కర్ వేసిన ప్రశ్నలకు ఈనాటి అంబేద్కరిస్టులు మార్క్సిస్టు సిద్ధాంత మౌలిక భావనలను పూర్తిగా అపభ్రంశపు రీతిలో వక్రీకరించేందుకు వినియోగిస్తున్నారు. తద్వారా కింది కులాల్లోని నిరుపేద వర్గ ప్రజల్ని పక్కదారి పట్టిస్తున్నారు.

ప్రాచీన ఈజిప్టులోనూ, భారతదేశంలోనూ ఆనాటి అవగాహనా పరిమితులకు అనుగుణంగా అక్కడి రాజ్యం, మతం... అప్పటి సమాజంలోని మొరటు శ్రమ విభజనను సంప్రదాయాలు, విశ్వాసాలు, కట్టుబాట్లతో కూడిన కుల వ్యవస్థగా నిర్వచించాయి. ప్రజలు ఆ స్వీయ అవగాహనతోనే ఆనాడు వ్యవహరించారు. ఆ చారిత్రక వ్యవస్థలు అప్పటి సామాజిక అవగాహన ప్రకారమే ఉన్నాయని, ఆ విధంగానే నడిచాయని, ఇప్పటికీ నడుస్తున్నాయని భావించడమంటే భావవాద చారిత్రకుల వలె మనమూ ఆ యుగపు చారిత్రక అర్థరాహిత్యంతో పాలుపంచుకున్నట్లు అవుతుందని మార్క్స్ చెప్పారు.

ఆసియాటిక్ ఉత్పత్తి విధానం, నిరంకుశ రాజరికాల పునాదిగా భారత్‌లో కుల వ్యవస్థ దశాబ్దాలుగా వేళ్లూనుకుని ఉంది. భారత్‌లో కొనసాగిన ఆసియాటిక్ ఉత్పత్తి విధానం నుంచి మధ్య యుగాల్లోని ఫ్యూడలిజం, బ్రిటిష్ వలస కాలంలోను, స్వాతంత్ర్యానంతర కాలంలోను, 1990ల తర్వాత ప్రపంచీకరణ యుగంలోను కుల వ్యవస్థలో గణనీయమైన మార్పులు సంభవించలేదు. భూస్వామ్య వ్యవస్థలో చేతి వృత్తుల టెంకెగా కొనసాగుతున్నప్పుడు కుల వ్యవస్థ రోజువారీ ఉత్పత్తి, సేవారంగ కార్యకలాపాలలో భాగంగా ఉండేది. బ్రిటిష్ వలస, ఆ తర్వాత ప్రపంచీకరణల పర్యవసానంగా కులాలకు మూలాలుగా ఉన్న చేతి వృత్తులు అంతరించిపోవడంతో ఉపాధిరంగ మార్పు రూపంలోనూ, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన రూపంలోనూ గొప్ప సామాజిక వలసలు సంభవించాయి. కుల వృత్తులు అంతరించడం లేదా ఉన్నత, నిమ్న కులాల్లోని తర్వాతి తరాల రిజర్వేషన్ సౌకర్యాలను అందిపుచ్చుకుని ఇతరత్రా సామాజిక శ్రమలను చేపట్టడం వలన సామాజిక అస్తిత్వాల్లో రెండు నూతన అంశాలు తలెత్తాయి. వృత్తులు కొనసాగుతూ వాటిని అంటిపెట్టుకుని బతుకుతున్న ప్రజల్ని ఆ కుల అస్తిత్వానికి సంబంధించిన 'నిజమైన అస్తిత్వాలు' గాను (రియల్ ఐడెంటిటీస్), తమ సంప్రదాయక వృత్తుల నుంచి తప్పుకుని ఇతర ఉపాధి రంగాలకు గాని, పట్టణాలలో ఇతరత్రా పనులకు గాని, ప్రభుత్వ – ప్రైవేట్ ఉద్యోగాలు, విద్యార్థి రంగానికి గాని వెళ్లిన వారిని 'అవశేష అస్తిత్వాలు' గాను (రెసిడ్యుల్ ఐడెంటిటీస్) పరిగణిస్తారు.

అస్తిత్వాల్లో ఏర్పడిన సాధికారిత కారణంగా 'శ్రమ విభజనే కాదు, శ్రామికుల విభజన' అనడంతో పాటు సాంఘిక అసమానత ప్రాతిపదన జరిగిన శ్రామికుల విభజనలోనూ కొత్తగా వర్గ విభజన ఏర్పడిన విషయాన్ని గుర్తించాలి. రియల్ ఐడెంటిటీలుగా ఉన్న అస్తిత్వ ప్రజలు 'తమలో తామొక వర్గం'గా కొనసాగుతుంటారు. అవశేష అస్తిత్వ సమూహాలకు తమ మూలాల ఎరుక ఉన్నప్పటికీ, వారి కార్యాచరణ ఎజెండాలో మూల అస్తిత్వ ప్రజానీకం సమస్యల పరిష్కారానికి సంబంధించిన ఎజెండా ఉండదు. అంబేద్కర్ కాలం నుంచి ఈ పరిస్థితి కొనసాగుతూనే ఉంది. ఏదైనా ఒక సామాజిక అస్తిత్వం సంస్కరణ వల్ల లబ్ధి పొంది, సాధికారతను సాధిస్తే, పర్యవసానంగా ఏర్పడిన క్రీమీలేయర్ (సంపన్న వర్గం) తమ అస్తిత్వ ప్రజానీకానికి నాయకత్వం వహించాల్సిన అవసరం ఉంది. అలాకాక ఆ అవశేష అస్తిత్వాలు తమ మూలాలకు చెందిన నిజ అస్తిత్వాల సమస్యలను పట్టించుకోకుండా క్రీమీలేయర్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై మాత్రమే దృష్టి సారించాయి. దానికితోడు ప్రధానంగా పట్టణాల్లోని ప్రతి అవశేష కుల అస్తిత్వం ఒక 'ముకుళిత' కుల సంఘంగా సంఘటితం కావడం వల్ల కుల వ్యవస్థ పునాదులు బద్ధలు కావడం మాట అటుంచి, మరింతగా ఘనీభవించాయి.

ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న సంక్షోభ పరిస్థితులు భారతదేశ రాజకీయ యవనికపై అనూహ్యంగా మితవాద రాజకీయాలు ప్రబలత్వాన్ని సాధించాయి. ఫాసిస్టు లక్షణాలతో అధికార పీఠాన్ని అధిరోహించాయి. కాషాయ సంస్థలు మత భావజాల అసహనాన్ని బౌద్ధికంగా, భౌతికంగా ప్రదర్శిస్తున్నాయి. పర్యవసానంగా మైనారిటీలపై, దళిత – బహుజన ప్రజానీకంపై దేశ వ్యాప్తంగా దాడులు పెరిగాయి. ప్రతిచోట ప్రగతిశీల శక్తులు వివిధ రూపాల్లో వివిధ ఛాయల్లో అణచివేతలకు గురవుతున్నాయి. జెఎన్‌యు, ఎచ్‌సియు, ఎన్ఐటి వంటి ఉన్నత విద్యా సంస్థలు కాషాయ సంస్థల దాష్టీకానికి గురవుతున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రగతిశీల శక్తులు వివిధ అస్తిత్వవాదాల ముకుళిత భావజాల సంస్థల రూపంలో అసంఘటితంగా ఉన్నందున తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద భావజాల సాధనంగా వామపక్ష, పురోగామి శక్తుల భావజాలానికి వ్యతిరేకంగా తలెత్తిన ఆధునికానంతర వాద ధోరణి వివిధ సామాజిక అస్తిత్వాలను సమన్వయించే కుల – వర్గ ఫ్యాబ్రిక్ (పడుగు – పేక అల్లిక) ను ధ్వంసం చేసింది. దాంతో వామపక్ష భావజాలం ప్రబలత్వం పలచబడింది. ఈ నేపథ్యంలో వివిధ అస్తిత్వాల విడి విడి అసంఘటిత బృందాలు వ్యవస్థీకృత కాషాయ క్రౌర్యానికి విలవిల్లాడుతున్నాయి. అసంఘటిత అస్తిత్వ సంఘాలు, అనియత సంఘాలు ఈ అధికార కేంద్రాలను, ఆధిపత్య సంఘాలను ఎదుర్కొనడం సాధ్యం కాదు.

ఈ ముకుళిత, బహుళ కేంద్ర అస్తిత్వవాద సంస్థల మధ్య ఎంత సంఘీభావం సాధించినప్పటికీ, వాటి మధ్య కుల – వర్గ తాత్విక భావజాల సంబంధాల ఫ్యాబ్రిక్‌లో పటుత్వం లోపించింది. ఇలాంటి బృందాల్లోని వారు అసంతృప్తి, నిర్లిప్తత, నిరాశకు గురై రోహిత్‌లాగా ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి తలెత్తుతుంది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అవశేష అస్తిత్వ సమూహాలు ముకుళిత, శుద్ధ కుల సంఘాల్లో సంఘటితమై తమ అస్తిత్వ మూలాలకు సంబంధించిన సమస్యల స్థాయి నుంచి పరిష్కారం కోసం కార్యచరణ ప్రణాళికను కలిగి ఉంటే, తాము పనిచేస్తున్న రంగాలలో, సంస్థలలో వస్తున్న అడ్డంకులను ఎదుర్కునేందుకు బలమైన పునాది ఉంటుంది.

రోహిత్ ఆత్మహత్యకు వివిధ ప్రజా సంఘాలు, అస్తిత్వవాద సంఘాలు సంఘీభావం తెలిపి నిరసనలు వ్యక్తం చేశాయి. అది మంచిదే. అయితే

లేపాక్షి ఉత్సవాలు దేనికోసం?

తీవ్రమైన కరవు ఎదుర్కొంటున్న అనంతపురం జిల్లాలో నిర్వహించిన లేపాక్షి ఉత్సవాల వల్ల స్థానిక ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేదనీ, రాజకీయ ప్రయోజనాల కోసమే ఈఉత్సవాలను ఆర్భాటంగా నిర్వహించారనీ అంటున్నారు **కె. నాగేశ్వరాచారి**

శ్రమే సంస్కృతి. మన దేశంలో అనేక వృత్తుల వాళ్లు, వ్యవసాయ దారులు సంస్కృతికి మూలం. సామాజిక పరిణామ క్రమంలో విశ్రాంతి వర్గం, ఆర్థిక అణచివేతతో పాటు, సంస్కృతిక అణచివేతను కూడా ప్రారంభించింది. కొకు 'సంస్కృతి ఆరంభం నుంచి నేల విడిచిన సాముగానే కనిపిస్తుంది. సంస్కృతి సహజ స్వభావాన్ని, స్వరూపాన్ని ఎప్పటికప్పుడు ఇలా దెబ్బతీస్తున్నది. విశ్రాంతి వర్గాలు, దోపిడీ వర్గాలు' అని అంటారు.

అనంతపురం జిల్లాలో జరిగిన లేపాక్షి ఉత్సవాలను విశ్లేషించుకుంటే ఈ సత్యం తెలుస్తుంది. ఫిబ్రవరి 27, 28న దాదాపు నాలుగు కోట్ల ఇరవై లక్షల రూపాయలు ఖర్చు పెట్టి, లేపాక్షి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించి నేల విడిచి సాముచేసింది. నిర్వహణ అధినాయకుడు నందమూరి బాలకృష్ణ, స్థానిక శాసన సభ్యుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సినిమా సాంకేతిక వర్గం, సినీ, సంగీత కళాకారులు, సినీ సెట్టింగులతో, మీడియా సహకారంతో నిత్యం కరువు కాటకాలతో సతమతమయ్యే ప్రాంతంలో ఉత్సవాలు జరిగాయి.

ఉత్సవాలలో ఒక్క మాటలో చెప్పాలంటే స్థానిక ప్రజల ఆకాంక్షలు గానీ, ప్రమేయాలు గానీ, ప్రయోజనం గానీ శూన్యం. మరెందుకు ప్రభుత్వం నాలుగు కోట్ల రూపాయలు రోజుకు రెండు కోట్లు చొప్పున ఖర్చు చేసినట్లు?

లేపాక్షి క్షేత్రం కేవలం సంతానాపేక్షతో స్థానిక పాలకుడైన విరుపణ్ణ అనే వైశ్యుడు నిర్మించిన ఆలయం వీరభద్రాలయం. తన అనుమతి లేకుండా ఆలయం నిర్మించాడని విజయనగర ప్రభుడైన శ్రీకృష్ణదేవరాయలు కోపంతో విరుపణ్ణ కళ్లు పీకిస్తాడు. ఈ చరిత్రను కొండూరి వీర రాఘవాచార్యులు లేపాక్షి పేరుతో ఒక నవల రాశాడు. 1961 ప్రాంతంలో వివిధ విశ్వవిద్యాలయాలలో ఈ నవలను డిగ్రీ విద్యార్థులకు ఉపవాచకంగా బోధించారు. లేపాక్షి ఉత్సవాల సందర్భంగానైనా ఈ నవలను పునర్ముద్రించి ఉంటే బాగుండేది. ఈ నవలలో ఆనాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ కుటిలత్వాలు మొత్తం ఆనాటి సమాజం దర్శనమిస్తుంది. దీనికి తోడు ఆలయ వాస్తు, శిల్ప వాస్తు వంటి విషయాలు ఈ నవలలో చర్చించారు.

లేపాక్షిలోని అసంపూర్ణ కల్యాణ మంటపంలోని స్తంభాలకున్న చిత్రాలన్నీ పట్టుచీరల అంచులపై చిత్రించే స్థానిక చేనేత కళాకారులున్నారు. మగ్గంపైకి ఈ చిత్రీకళను ఎలా తర్జుమా చేసుకుంటారో ప్రజలకు తెలియాలి. అదో సాంకేతిక విజ్ఞానం.

ఈ ఉత్సవాలలో చేనేత కులానికి సంబంధించిన రాజకీయ నాయకులు ఉంటారేమో గానీ, చేనేత వృత్తుల వాళ్లకు ఈ ఉత్సవంలో ప్రోత్సాహం లభించలేదు. లేపాక్షి చిత్ర కళను ప్రచారం చేసేది చేనేత వృత్తుల వాళ్లే కదా!

రోహిత్ ప్రాతినిధ్యం వహించే అస్తిత్వ ప్రజానీకం మూల మూలల నుంచి ఉప్పెనలా కదిలి రావడం జరగలేదు. నిజ అస్తిత్వ ప్రజా సమూహాలతో అవశేష అస్తిత్వ సమూహాలకు మధ్య బలమైన బంధాలు కొరవడినాయి. నిజ అస్తిత్వాలకు అవశేష అస్తిత్వాలు నాయకత్వం వహించగలిగితే, అవశేష అస్తిత్వాలకు ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు నిజ అస్తిత్వాలు తొడ్పడగలవు. అవశేష అస్తిత్వాల ఉద్యమాలకు అవి మరింత బలాన్నిస్తాయి. లేకపోతే అవశేష అస్తిత్వ సమూహాలతో ఏర్పడిన పెళుసైన కుల బృందాలు ఆధిపత్య అస్తిత్వాల దాష్టికానికి, పర్యవసానంగా నిరాశ నిస్పృహలకు గురికాక తప్పదు లేదా వాటి నాయకత్వం దిగజారి, లోపాయికారిగా మారక తప్పదు.

నిజ అస్తిత్వాలకు, అవశేష అస్తిత్వ సమూహాలకు మధ్య సజీవ, సంఘటిత బంధం ఏర్పడేదాకా అస్తిత్వ ఉద్యమాలకు ఇలా ఒంటరితనం తప్పదు. ఆత్మహత్యల రూపంలో నష్టాలూ తప్పవు. ఈ విషయాన్ని అంబేద్కర్ తన జీవిత చివరి అంకంలో గుర్తించి, బూర్జువా పార్టీల నాయకులుగా ఎదిగిన దళిత నాయకత్వాన్ని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. అనేక సందర్భాల్లో దుయ్యబట్టారు.

సాధికారిత పేరుతో వివిధ అస్తిత్వాల్లో అత్యంత బలహీనంగానైనా ఏర్పడిన శ్రమ విభజన లేదా వర్గ విభజనలను గుర్తించడమే కాకుండా, ఆ సెక్షన్లు నిజ అస్తిత్వ సమూహాలను ఈ అసమాన సామాజిక వ్యవస్థను అంటిపెట్టుకునేలా ద్రోహపూరితంగా వ్యవహరిస్తున్న తీరును అర్థం చేసుకోవాల్సిన తరుణమిది. పీడిత ప్రజల విముక్తితో ముడిపడిన కుల వ్యవస్థ నిర్మూలన అనే ఆయన తాత్విక వ్యవస్థ, దాన్ని పరిష్కరించేందుకు ఆయన ఎన్నుకున్న పరిశీలన పద్ధతితో తీవ్రంగా ఘర్షణ పడింది.

ఈ నేపథ్యంలో ఆయన బౌద్ధాన్ని పరిష్కార మార్గంగా ఎన్నుకోవడంతో విశాల దళిత బహుజన వర్గాల్లో కొంత గందరగోళం ఏర్పడింది. వర్గ – కుల సామాజిక అల్లికను (సోషల్ ఫ్యాబ్రిక్) భౌతికవాద దృక్పథంతో అవగాహన చేసుకుని అందుకు అనువైన శాస్త్రీయ పద్ధతులను ఎంచుకోవడం నేడు పీడితుల ముందున్న కర్తవ్యం. కుల రక్కసి చావదు... చంపాల్సిందే!

(రచయిత పాత్రికేయులు) వీ

ఆలయ పైకప్పుకు కింది భాగంలో తైలవర్ణ చిత్రాలు ఆరేడు వందల సంవత్సరాల తరువాత కూడా చెక్కు చెదరకుండా నిలిచి ఉన్న సాంకేతిక పరిజ్ఞానంపై పరిశోధనలు జరగాల్సి ఉంది. నాట్య మండపంలోని నాట్య భంగిమల్ని ముద్రల్ని నాట్య సందర్భాల్ని వివరించే ప్రయత్నం జరగలేదు. అన్నింటికీ మించి ప్రతి ఒక్కరూ వేలాడే రాతి స్తంభాన్ని చూసి 'మన శిల్పుల కళా నైపుణ్యం చాలా గొప్పది' అని కళ్లు విప్పి ఆనందంతో చూస్తారే గానీ అది ఎలా నిర్మితమైందని ఆలోచనలు గానీ, పరిశోధనలు గానీ జరగలేదు. పరిశోధన చేయాలన్న ఆకాంక్ష నిర్వాహకులకు ఉన్నట్లు లేదు.

బసవన్న విగ్రహ శిల్పం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఆ విగ్రహాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే బసవన్న మెడ చుట్టూ ఉన్న మువ్వలు పూర్తిగా చెక్కలేదని అర్థమవుతుంది. ఏ చారిత్రక కారణాలు చిత్రణకు అడ్డంకులు కలిపించాయో తెలియదు. అలాగే ఏడు తలల నాగేంద్రుడు పగిలిన తీరుకు, అక్కడ చెప్పే కథకు పొంతన లేదు. ఆలయ శిఖరాలపై శిథిలమైన గచ్చు విగ్రహాలకు మరమ్మత్తులు లేవు. ప్రధాన ఆలయం చుట్టూ ప్రహరి లేదు. అన్నిటికి మించి మంచి నీటి, వసతి గృహాలు గానీ లేవు.

మనకు చారిత్రక ఆధారాలు యాత్రికుల గ్రంథాలు, తామ్ర శిలా శాసనాలు. లేపాక్షి ఆలయంలో దాదాపు 25 శిలా శాసనాలు ఉన్నాయి. కొన్ని గోడలపైన మరికొన్ని నేలపైన ఉన్నాయి. మొత్తం ఆలయమే తాబేలు ఆకారంలో ఉన్న చిన్న కొండపై నిర్మించారు. బునాది తవ్వింది నేలపై కాదు రాతిని తొలచి బునాది వేసి గోడలు కట్టారు. నేలపై ఉన్న శాసనాలను రక్షించే పద్ధతి కర్ణాటకలోని శ్రావణ బెలగొనలో ఒక పద్ధతి పాటించారు. శాసనంపై పెద్ద గాజుపలకను అమర్చి దాని కింద ఉన్న అక్షరాలన్ని కనబడేటట్లుగా ట్యూబు లైటులో అమర్చారు. దుండగుల బారిన పడకుండా, అక్షరాలు చెరిగిపోకుండా తీసుకున్న జాగ్రత్తలివి.

రెండు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా పురావస్తు సంరక్షణ కోసం తీసుకున్న చర్యలు లేవు. ఆలయ గొప్పదనం శిల్ప విశిష్టత గ్రంథస్తం కాలేదు. పానవట్టంపై ప్రతిష్టించేది శివలింగం. ఈ సాంప్రదాయానికి భిన్నంగా ఇక్కడ రామ లక్ష్మణుల విగ్రహాల్ని ప్రతిష్టించారు. ఇలా ఎందుకు జరిగిందో చెప్పడానికి ఆధారం లేదు. లేపాక్షిలో ప్రధాన దేవుడు వీరభద్రుడు కానీ, శివలింగానికి వీరభద్రుని తర్వాతే పూజలు, ఈ గజిబిజి సామాన్యులకు అవసరం లేదు. కానీ. సంస్కృతిని గురించి మాట్లాడే వారికైనా తెలియాలి కదా! లేపాక్షి నవలలో పై విషయాలన్ని చర్చించారు. రెండు రోజులు జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులను ముఖ్యమంత్రికి ఆలయం చూపించి, వీరభద్రునికి పూజలు, హారతులు ఇవ్వడం, వేలాడే స్తంభాన్ని చూపించడం తప్ప మరో కార్యక్రమం లేదు.

కరువు నేలలో పండిన ఫల పుష్ప ప్రదర్శనల్ని కార్పొరేట్ స్థాయి తోట పంటలతో సమానంగా ప్రదర్శించడం, రాగిముద్ద శెనక్కాయ కారం తినే ప్రజలకు 23 స్టాల్స్‌లలో భిన్న రుచుల్ని చూపించడం ఎవరి సంస్కృతి పరిరక్షించుకునేందుకు ఉత్సవాలు నిర్వహించినట్లు? గ్రామీణ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించి బహుమతులు ఇచ్చాం అనిపించుకున్నారు. ప్రాచీన కళలకు జీవం పోసేందుకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు అన్నారు. మరి ప్రాచీన అటల్ని, కళల్ని పరిచయం చేయలేదే? సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్రలో 'రాయల నాటి జనుల వినోదములు కళలు' అన్న శీర్షికతో ఒక వ్యాసం రాశాడు. అందులో స్త్రీలు, పురుషులు, పిల్లలు ఆడుకునే ఆటల్ని సురవరం ప్రతాపరెడ్డి పరిచయం చేశాడు. ఉత్సవాలలోని ఏ ఒక్కరి ప్రసంగంలో కూడా ఈ మాట ఊసెత్తలేదు.

నిజానికి ఈ ప్రాంతంలో గురవయ్యలు, ఉరుములవాండ్లు (వీరి జీవితాల్ని అంటరాని వసంతం అని కళ్యాణరావు నవల రాశాడు) తోలు బొమ్మలాటలు బుడగ జంగాలు వంటి గ్రామీణ కళాకారుల కుటుంబాలు ఉన్నాయి. గత సంస్కృతిని గురించి నిజాయితీగా మాట్లాడేవారు ఈ కళల తాత్విక నేపథ్యాన్ని గురించి వివరించి ఉండేవారు. ఈ కళాకారుల గురించి మాట వరుసకైనా సభలో ప్రస్థావించరు కదా! మద్రాసు నుంచి సినీ కళాకారుల్ని, సంగీత కళాకారుల్ని పిలిపించి పాటలు వినిపిస్తారు. ఇవి ప్రాచీన సంస్కృతికి సాంప్రదాయ కళలంటారా! ఈ ఉత్సవాల ద్వారా ప్రజలకు నేర్పించదలచుకున్న సంస్కృతి ఇదేనా! లేపాక్షి బసవయ్య లేచి రావయ్య, కైలాస శిఖరిలా కదలి రావయ్య అనే అడవి బాపిరాజు గేయాన్ని ఒక్కరు కాకపోతే ఒక్కరు గుర్తు చేయలేదు. ఈ గేయాన్ని నృత్య గేయంగా మలచి ఉండవచ్చు! సభ కార్యక్రమ నిర్వహణకు సినీ యాంకర్‌ను నియమించి తెలుగు భాష సాంప్రదాయాన్ని ఎత్తి పెట్టారు! కళింగర కాయలపైన, కర్బుంజ కాయలపైన నందమూరి తారకరామరావు, బాలకృష్ణ బొమ్మలను చిత్రించి దేశ భక్తిని ఘనంగా చెప్పారు. హిందుపుర నివాసి స్వతంత్ర సమరయోధుడు కల్లూరి సుబ్బారావు గాని, బ్రిటిష్ సైనికులను ఎదిరించిన గూళ్యపాలెం అంప్పన్న గాని గుర్తుకు రాలేదంటే వీరికి దేశ భక్తి లేదనగలమా! నందమూరి బాలకృష్ణ శ్రీకృష్ణదేవరాయల వేషదారణలో ఏడు గుర్రాల రథంపై ఊరేగారు. నాటక కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకుపోయిన బళ్లారి రాఘవ కానీ, తెలుగు నాటక రంగానికి సేవలు చేసిన ధర్మవరం కృష్ణమాచార్యులు గాని ఉత్సవ నిర్వాహకులకు గుర్తుకు రాలేదు!

ప్రపంచ వారసత్వ సంపదను లేపాక్షిని గుర్తించాలని యునెస్కో దృష్టికి తీసుకుపోతామని ఉత్సవ నిర్వాహకులు ప్రకటించారు. ఇదంతా ఒక కళాభాస. ఈ ఉత్సవాలన్ని ప్రజా సంస్కృతిని కొనసాగించేవి కావు. విజయనగర రాజులు ముక్కుపిండి పన్నులు వసూలు చేసే వారని అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పనిచేసిన చరిత్ర ఉపన్యాసకులు పుల్లయ్య ఒక సిద్ధాంత గ్రంథమే రాశారు. కర్ణాటక పీపుల్స్‌వార్ నాయకులు సాకేత్ పై విషయాన్నే బలపరుస్తూ సాధికారికంగా 'మేకింగ్ హిస్టరి' అన్న గ్రంథం రాశారు.

చలన శీలమైన సమాజానికి రెండు లక్షణాలు ఉంటాయట. ఒక వ్యవస్థ కనుగుణమైన సంస్కృతిని కలిగి ఉండడం. రెండు పరోగతికి అవసరమైన బీజాలుండడం. ప్రస్తుత సమాజంలో వ్యవస్థకనుగుణమైన దోపిడీ సంస్కృతిని విశ్రాంతి వర్గం పోషిస్తూ, పరిరక్షిస్తూ ఉంది. ఆర్థిక అణచివేత నిరాటంకంగా కొనసాగాలంటే, సాంస్కృతిక అణచివేతను రెండింతలుగా కొనసాగించాలి. పాలకుల తీరిదే! అనంతపురం జిల్లా ప్రజలు సాగునీరు, తాగునీరు, పరిశ్రమల వృద్ధి వంటి జీవన ప్రమాణాల్ని పెంచాలనే ప్రశ్నలు పాలకుల్ని అడక్కుండా ఉండేందుకు ప్రభుత్వం నిర్వహించిన ఉత్సవాలివి. ఈ ఉత్సవాలు పాలకుల సంస్కృతిని ప్రతిబింబించలేదు సరి కదా! తన వారసత్వాన్ని కూడా కొనసాగించాలనే దౌర్భాగ్య స్థితిలో ఉన్నారు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

డిజిటల్ ఇండియా ఎవరికోసం?

డిజిటల్ ఇండియా పేరుతో కార్పొరేట్‌ల కోసం చేపడుతున్న అభివృద్ధి వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పెరగవనీ, దేశంలోని కోట్లాది ప్రజల అవసరాలు కింది నుంచి వచ్చే మార్పుతోనే ముడిపడి ఉన్నాయనీ అంటున్నారు **ఎస్.ఎం. శాంతి రేఖ**

నేను రోజూ నా ఆఫీసుకు రాగానే ఇంటర్నెట్ కనెక్ట్ చేసి, ఫేస్‌బుక్ ఓపెన్ చేయడం అలవాటైపోయింది. ఎందుకంటే, ఇండియా నుండి థాయిలాండ్ వచ్చాక సోషల్ నెట్‌వర్క్‌లోనే న్యూస్ తెలుస్తుంది. ఎప్పటిలాగానే ఆ రోజు కూడా ఫేస్‌బుక్ ఓపెన్ చేశాను. దాదాపు యాభై మంది స్నేహితులు వాళ్ల ప్రొఫైల్ ఫోటోలు మార్చారు. అందరి ఫోటోలు ఒకేలాగా ఉన్నాయి. ఏంటా అని చూస్తే డిజిటల్ ఇండియాకి స్పందన, మద్దతు తెలియజేస్తూ ఆ ఫోటోని పెట్టుకున్నారు. వెంటనే గూగుల్‌కి వెళ్లి డిజిటల్ ఇండియా అని టైప్ చేసి, సమాచారం చదివాను. అక్కడ పొందుపరిచిన సమాచారం చదివాక చాలా అసంతృప్తి అనిపించింది. ఈ పథకాన్ని ప్రధాన మంత్రి కొద్దిరోజుల క్రితం ప్రారంభించారు. ఈ పథకం పేరు 'డిజిటల్ ఇండియా'. ఇందులోని ముఖ్యమైన విషయాలు, విధి విధానాలు ఇలా ఉన్నాయి.

డిజిటల్ ఇండియాలో భాగంగా భారత్ ఓ బలోపేతమైన ఆర్థిక వ్యవస్థగా రూపొందడం. డిజిటల్ లాకర్ ఈ - విద్య, ఈ - వైద్యం, ఈ - వాణిజ్యం, ఈ - పరిపాలన వంటి ఆన్‌లైన్ సేవలు. లక్షా 13 వేల కోట్లతో, రెండున్నర లక్షల గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం. అవినీతి తగ్గింపుకు ఈ పథకం ద్వారా దోహదపడడం. అన్ని గ్రామ పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ ఇంటర్నెట్ సేవలు ఈ పరిపాలన.

ఇవన్నీ చదివాక చదవడానికి చాలా బాగుంది కానీ, తర్వాత ఆలోచించి చూస్తే, ప్రవేశపెట్టబోతున్న పథకం వలన ఎవరికి నిజమైన ఫలాలు దక్కబోతున్నాయి. సామాన్య ప్రజానీకానికా? లేదా ప్రజాస్వామ్య ముసుగులో సామాన్య ప్రజానీకాన్ని పాలిస్తున్న పాలకులకా? లేదా ప్రజాస్వామ్యాన్ని, ప్రజలను, పాలకులను పాలిస్తున్న అంతర్జాతీయ పెట్టుబడిదారులకా?

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశ పెట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా లక్షా పదమూడు వేల కోట్ల వ్యయంతో గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం, గ్రామ పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్‌లు. కానీ, వీటి వలన సామాన్య ప్రజానీకానికి ఉపయోగం ఏమిటి? భారతదేశం వ్యవసాయం మీద ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ గల దేశం. కానీ, ప్రస్తుత పరిస్థితులలో మారుతున్న పరిణామాల కారణంగా, వ్యవసాయ రంగం కుంటుపడి పోతుంది. ఈనాటికీ చాలా గ్రామాలు విద్యుత్ సరఫరా లేకుండా ఉన్నాయి. కనీస అవసరాలైన తిండి, నీడ, బట్ట లేకుండా దారిద్ర్య రేఖ దిగువన జీవిస్తున్న వేలాది మంది ప్రజలకు ఈ ప్రాజెక్టు వలన కలిగే ఉపయోగం ఎంత? డిజిటల్ ఇండియా కోసం నిర్మించాలనుకుంటున్న అధునాతన రహదార్లు వారికి నీడను కల్పించడానికి ఉపయోగ పడతాయా? ఈ విధంగా వారి జీవనాన్ని మెరుగు పరుస్తుందా ఈ ప్రాజెక్టు? ప్రతీ పౌరుడికి అవసరంగా డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఈ డిజిటల్ సేవలకు సంబంధించిన ప్రాథమిక అవగాహన కల్పించడం వంటి విషయాలను ఈ ప్రాజెక్టు విధి విధానాలలో పేర్కొన్నారు. ఈ నాటికీ భారతదేశంలో సరైన విద్య ఎంతమందికి అందుతున్నది. చదువుకోవాలని కోరిక ఉన్నా, సరైన వసతులు, కుటుంబ పరిస్థితులు సహకరించక ప్రాథమిక విద్యకు దూరం అవుతున్నవారు కొందరైతే, పాఠశాలల దాకా వెళ్లి, సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పిల్లలు చాలా మంది ఉన్నారు. డిజిటల్ ఇండియా కోసం ప్రాథమిక అవగాహన కల్పించడం కోసం ఉపయోగించే డబ్బును, సాధారణ ప్రాథమిక విద్యను మెరుగు పరచడం కోసం వినియోగిస్తే భవిష్యత్తు తరాలవారికి, ప్రత్యేకంగా డిజిటల్ ఇండియా అవగాహన పేరుతో పథకాలను అమలు చేయాల్సిన అవసరం ఉండదు కదా! ఉన్నత స్థాయి బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్‌లు కల్పించాలనుకుంటున్న మోడీ ప్రభుత్వానికి, విద్యుత్ కనెక్షన్‌లు లేని గ్రామ పంచాయతీలు ఎన్ని ఉన్నాయి ఈ అభివృద్ధి చెందుతూ ఉన్న భారత్‌లో గుర్తుందా? ఈ కనెక్షన్‌లు మెరుగుపరచడానికి కావలసిన పథకాలను ఎప్పుడు చేపడతారు. వాటికోసం ఇన్ని వేలకోట్లు ఎప్పుడు ఖర్చు పెడతారు?

సమాజంలో ప్రస్తుతం అందిస్తున్న సేవలనన్నింటినీ ఆన్‌లైన్ సేవలుగా మార్చి, భారతదేశాన్ని డిజిటల్ భారత్‌గా మార్చాలన్న మోడీ ఆలోచన, భారతదేశ అభివృద్ధికి దోహదపడుతుందని అందరూ అభిప్రాయ పడుతున్నారు. ఈ విద్య, ఈ వైద్యం, ఈ పరిపాలనను అభివృద్ధి చేస్తే, ఆ సేవలనే జీవన భృతిగా భావిస్తూ జీవనం సాగిస్తున్న వారి ఉద్యోగ భద్రత పరిస్థితులు ఏంటి? డాక్టర్లు, లాయర్లు, టీచర్లు, కండక్టర్లు, గవర్నమెంట్ అధికారులు, సిబ్బంది సేవలు భవిష్యత్తులో మరచిపోవాలా? ఒక్క ఐటి రంగాన్నే అభివృద్ధి పరిచి, ఐటి ఇంజనీర్లను ప్రోత్సహిస్తే సరిపోతుంది కదా. ఈ ప్రాజెక్టు కోసం విశ్వవిద్యాలయాలు, ఐఐటిలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఎయిమ్స్‌లు ఎందుకు నెలకొల్పడం? ఈ పరిపాలన అవలంబించాలని నిర్ణయించుకున్నప్పుడు యుపిఎస్‌సి, సివిల్ సర్వీసెస్ పరీక్షలను నిర్వహించడం ఎందుకు?

డిజిటల్ ఇండియా ప్రాజెక్టు సామాన్య ప్రజానీకానికి ఎంత వరకు ఉపయోగపడుతుందో తెలియదు కానీ, అభివృద్ధి పేరుతో నల్లధనాన్ని సమకూర్చుకునే వారికి మాత్రం ఈ ప్రాజెక్టు రెండు చేతుల నిండా పనిని కల్పించబోనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం కావాల్సిన సదుపాయాలను అమర్చడం కోసం, అంతర్జాతీయ పెట్టుబడులను ఆహ్వానిస్తారు. వాటి ద్వారా వారు తమ వ్యాపారాన్ని స్వచ్ఛందంగా

తెలంగాణలో భూసంబంధాలు - ఒక పరిశీలన - 2

***ఉమ్మడి రాష్ట్రాల్లో జరిగిన ప్రతి భూసంస్కరణలు భూస్వాములకు, పెట్టుబడిదారులకు మాత్రమే మేలు చేశాయి గాని భూమిలేని పేదలకు కంటి తుడుపు చర్యగా మిగిలాయని అంటున్నారు* నలమాస క్రిష్ణ**

(...గత నెల తరువాయి)

1970 దశకంలో రెండవ దశ భూసంస్కరణలు

నక్సల్బరీ పోరాట ప్రభావం వల్ల రైతాంగం దేశంలో అనేక రాష్ట్రాల్లో భూమి కోసం పోరాడారు. మరోవైపు హరిత విప్లవ ప్రభావంతో అదిక దిగుబడులు సాధించడం వల్ల వ్యవసాయంలోకి వాణిజ్య పంటల ప్రవేశం ద్వారా ఆదాయం పెరిగింది. ఫలితంగా ఆర్థిక వ్యత్యాసాలు కూడా తీవ్రం అయినాయి. 1970 నాటికి పెద్ద కమతపు దారులు ఆదాయంలో (80 శాతం) అధికంగా పొందుతుంటే మధ్యతరగతి (46 శాతం) చిన్న కమతం దారులు (8 శాతం) తక్కువ ఆదాయం పొందుతున్నారు.

1. అనేక రాష్ట్రాలలో ఓడిపోయిన కాంగ్రెస్‌కు ఓటర్లను ఆకర్షించాల్సిన స్థితి ఏర్పడింది.
2. కాంగ్రెస్ చీలికలో పాత కాంగ్రెస్‌లో అధికంగా భూ స్వాములున్నారు. వారి ప్రాబల్యాన్ని దెబ్బతీయవలసిన రాజకీయ అనివార్యత ఇందిరా కాంగ్రెస్‌కు ఏర్పడింది.
3. ఉత్పత్తి సాధనాలపై శ్రమజీవులకు యాజమాన్యం లేకపోవడం మూలంగా దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, కరువు, ఆదాయ అసమానతలకు, అత్యాచారాలు వాటి మూలాల నుండి తలెత్తిన నక్సల్బరీ పోరాట జ్వాలలు కలిసి రెండవ దశ భూసంస్కరణల వైపు పాలకులను నడిపించాయి.

వ్యక్తిని ఒక యూనిట్‌గా కాకుండా కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని భూ గరిష్ట పరిమితిని తగ్గించాలనే ప్రతిపాదన పై కాంగ్రెస్ ముఖ్య మంత్రులంతా ముక్త కంఠంతో వ్యతిరేకించారు. రాజభరణాల రద్దు, వాణిజ్య బ్యాంకుల జాతీయకరణ, గరీభీ హఠావ్ లాంటి నినాదాలతో తిరుగులేని నాయకురాలిగా ఉన్న ఇందిరాగాంధీ రాజకీయ వ్యూహంలో భాగంగా రెండవ దశ సంస్కరణల వైపు మొగ్గింది. ఇందుకు కేంద్రం ప్రతిపాదించిన మార్గదర్శకాలు ఎంత మాత్రమూ విప్లవాత్మకమైనవి కావు. విప్లవం కోసం పోరాడుతున్న వారిని పాక్షికంగా భ్రమలకు గురిచేసేవి మాత్రమే. వాటిని పరిశీలిస్తే.......

1. భార్యాభర్తలు ముగ్గురు మైనర్ పిల్లలను యూనిట్‌గా గుర్తించవచ్చు. అంతకు ఎక్కువమంది ఉంటే కొంత భూమిని అదనంగా పొందవచ్చు. అది కుటుంబ కమతానికంటే రెండురెట్ల కంటే ఎక్కువ ఉండరాదు.
2. కాఫీ,టీ, తేయాకు, రబ్బర్, కోకో తోటలు మొదలైన వాటికి మినహాయింపు యివ్వాలి.
3. రెండు పంటలు పండే నీటి సౌకర్యం గల భూమి గరిష్టంగా 10 నుంచి 18 ఎకరాలుండాలి ఒక పంట గరిష్టం 27 ఎకరాలుండాలి. మెట్ట గరిష్టంగా 54 ఎకరాలుండాలి.
4. మతపరమైన, చారిటబుల్ ట్రస్ట్, విద్యాలయ భూములపై నిర్ణయం రాష్ట్రాల విచక్షణాధికారానికి వదిలేశారు.

చివరికి భూసంస్కరణల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకే కేటాయించబడింది. 70–80 శాతం అగ్రకుల బ్రాహ్మణ, రెడ్డి, వెలమ కులాలకు చెందిన భూస్వాములు అధికారంలో ఉండగా వారి ప్రయోజనాన్ని వారే ఎలా దెబ్బ తీసుకోగలరు?

1979 వరకు ప్రభుత్వ పరంగా 3797, భూస్వాముల పరంగా 42,832 అపీల్లు చేయబడ్డాయి. చేయబడ్డ మొత్తం 46,629లలో 23,083 కేసులలో (49.50 శాతం) భూస్వాములకు అనుకులంగానూ 8,367 కేసులలో (17.94 శాతం) వ్యతిరేకంగానూ తీర్పులోచ్చాయి.

లెజిస్లేచర్, బ్యూరోక్రసీ, జ్యుడిషియరీ ఎలా ప్రజా అనుకూల చట్టాలను తొక్కేస్తుందో, అర్థం చేసుకునే దానికి ఇంత కంటే నిదర్శనం ఏం కావాలి?

ఈ వైరుధ్యం మన దేశంలో ప్రతి రంగంలో అన్ని దశల్లో అనేక రూపాలలో స్పష్టంగా కనిపిస్తుంది. వైరుధ్యం బద్దలై ప్రజలు గుర్తించగలిగే

మెరుగుపరుచుకుంటారు. కానీ, సాధారణ మనిషి తన కనీస నిత్యావసరాల కోసం, ఏదో ఒక రోజు ప్రభుత్వ కేంద్రాల ముందు క్యూలోనే నిలబడుతాడు. ఎందుకంటే, ఎన్ని డిజిటల్ ఇండియా లాంటి ప్రాజెక్టులు వచ్చినా, అది కింది స్థాయిలో ఉన్న సగటు మనిషికి ఉపయోగపడనప్పుడు, వాటి నిర్మాణం బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది తప్ప భారత ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచలేదు.

ప్రధాన మంత్రి మోడీ ఆలోచిస్తున్నట్లు, భారతదేశాన్ని ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ముందుకు తీసుకు వెళ్లాలంటే ఇలాంటి ప్రాజెక్టులకు బదులు, సగటు మనిషి తలసరి ఆదాయాన్ని మెరుగుపరిచే ప్రాజెక్టును తీసుకువస్తే, వాటి వలన భారతదేశ అభివృద్ధి కింది స్థాయి నుండి సాధ్యపడుతుంది. అప్పుడు ఇలాంటి డిజిటల్ ఇండియా ప్రాజెక్టును ప్రత్యేకంగా నిర్మించాల్సిన అవసరం ఉండదు. ఇలాంటి ప్రాజెక్టుల కోసం లక్షల కోట్లు వినియోగించాల్సిన అవసరం ఉండదు. భారతదేశ దిశను, గమనాన్ని మారుస్తాడనే విశ్వాసంతో ప్రజలు మోడీకి పట్టం కట్టారు. ఆ నమ్మకాన్ని ప్రజల కోసం నిలబెట్టుకుంటాడని ఆశిద్దాం

(రచయిత థాయిలాండ్‌లో సాంకేతిక నిపుణులు) వీ

సమయంలో వెంటనే పాలకులు కొత్త ఎత్తుగడతో మరో వైరుధ్యంలోకి నెడతారు. అలా కొంత కాలం గడిచిపోతుంది. మొదటి దశ సంస్కరణల నుండి రెండవ దశకు 23- 25 ఏండ్ల కాలంలో ప్రజల నిరసనను తగ్గించేందుకు కొత్త ఎత్తుగడగా రెండవ దశ సంస్కరణల వచ్చాయని సులభంగా గ్రహించవచ్చు.

గ్రామాల్లో ఉండే ఆధిపత్య శక్తులైన కరణం మునుసబు పట్వారి, పోలీసు పటేల్, దొర ఈ కూటమి తమ నాయకులను నిర్ణయించి చట్ట సభలకు పంపిస్తుంది. దీన్ని కాదనే స్థితి ఆ నాటి రాజకీయ వ్యవస్థకు లేదు. ఎందుకంటే రాజకీయ వ్యవస్థ పునాదే వారు కనుక. కాలువల కింద వరి పంటలతో మిగులు ఉత్పత్తి కొందరు సాధించిన కమ్మకులస్థులు నల్గొండ,వరంగల్,ఖమ్మం,నిజామాబాద్‌లలో తేలికగా భూములపై పట్టుసాధించారు. క్రమంగా వీరూ పాలక కులంగా ఎదిగారు.

1950 కౌలుదారి సంస్కరణ చట్టం (తెలంగాణ)కు వివిధ సంవత్సరాలలో చేసిన సవరణల ప్రకారం 1992 వరకు 2,39,310 రక్షిత కౌలుదారులున్నారు. వీరి ఆధీనంలో 14,25,944 ఎకరాలున్నాయి. చట్ట ప్రకారం 6,65,280 లక్షల ఎకరాలకు సంబంధించి 1,06,965 మంది కౌలుదారులు యజమాన్య హక్కుల సర్టిఫికేట్లు పొందారు. కాని దీనిలో 4,64,288 ఎకరాలకు సంబంధించిన 75,193 మంది కౌలుదారులు మాత్రమే వాస్తవికంగా భూమిని స్వాధీన పర్చుకున్నారు. (ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణలు, తెలుగు అకాడమి, 2005 పేజి.నెం. 61)కౌలు రేటు నిర్ణయం, కౌలుదారునికి రక్షణ, యజమాన్యం కల్పించడమనే లక్ష్యాలతో కౌలు చట్టాలు వాటిని సవరణలు చేయబడ్డాయి. కాని వాటి అమలు ఏ మాత్రం పారదర్శకంగా జరగడంలేదు.

"1967 లో తెలంగాణ ప్రాంతానికి వర్తించే ఇనాం భూముల చట్టాన్ని రూపొందించగా 1970 ఏప్రిల్‌లో హైకోర్టు కొట్టివేసింది. భూమి కోల్పోయే ఇనాం దార్లకు నష్టపరిహార అవకాశం కల్పించడమే ఇందుకు ముఖ్యమైన కారణమని చెప్పవచ్చు." (ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణలు, తెలుగు అకాడమి, 2005 పేజి.నెం. 68) "ఈ కారణంగా 1955 చట్టాన్ని అమలులోకి తెచ్చి 1975లో కొన్ని రూల్స్ తెచ్చింది. వాటి ప్రకారం ఇనాం భూములను సేద్యం చేసుకుంటున్న వారు. (ఆక్యుపెంట్స్) 1976 ఎప్రిల్ 15 నాటికి రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం తెలిపింది. 1955 చట్టాన్ని అనుసరించి మొత్తం తెలంగాణ జిల్లాలలో 3,94,623 ఎకరాలకు సంబంధించిన 81,522 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 46,526 (57 శాతం) మందికి సర్టిఫికేట్స్ ఇవ్వడం జరిగింది. వీరి ఆధ్వర్యంలో 3,04,100 ఎకరాల భూమి ఉంది. సెటిల్ కాని కేసులు 34,924 (42.8 శాతం) ఉండగా కోర్టు లిటిగేషన్‌ల్ 72 కేసులున్నాయి" (ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణలు, తెలుగు అకాడమి, 2005 పేజి.నెం.69)

1985లో వచ్చిన సవరణ ప్రకారం ముఖ్యంగా సేవల ఇనాం, మత చారిటబుల్ ఇనాం భూములపై హక్కుకోసం 1989లో 51,149 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 17,242 (33.7 శాతం) సెటిల్‌కాని కేసుల సంఖ్య 33,732 (65.9 శాతం) లిటిగేషన్‌లో ఉన్న కేసుల సంఖ్య 175" (ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణలు, తెలుగు అకాడమి, 2005 పేజి.నెం.71) సెటిల్ కాని కేసుల సంఖ్య అధికంగా ఉంది. ఇది ఆర్‌డిఓ, కలెక్టర్ చేతిలో పని. సాధారణంగా ఆ స్థాయి అధికారులకుండే కుల, వర్గ దృక్పథం వల్ల ఇనాం భూముల పై హక్కు దక్కాల్సిన చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి, మాల, మాదిగ మొదలగు ఉత్పత్తి కులాల రైతులకు దక్కలేదు.

1970 లో శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట ఫలితంగా భూ బదలాయింపు నిషేధ చట్టం 1/70 ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చింది. కాని ఆచరణలో అది ఏ మాత్రం అమలుకు నోచుకోలేదు. విజయనగరం నుండి ఆదిలాబాద్ జిల్లాల వరకు ఆదివాసీ ప్రజలంతా రోజు రోజుకు భూమి నుండి పరాయీకరణకు గురైనారు. 1970 నుండి 2000 మధ్య కాలంలో దాదాపు 30 సంవత్సరాల కాలంలో నక్సలైటు ఉద్యమం వల్ల గోదావరి తీరంలోని ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలు దాదాపు 6 లక్షల ఎకరాల అటవి భూమిని సాగు యోగ్యంగా మార్చుకుని జీవిస్తున్నారని ఒక అంచనా. కేవలం అటవీ ప్రాంతాలే కాకుండా మైదాన ప్రాంతాలలో కూడా నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల ప్రభావం కనిపిస్తుంది. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్‌లతో పాటు తెలంగాణ నలు మూలలలో వ్యాపించిన భూ పోరాటాలు 1975 నుండి 1995 వరకు అపూర్వంగా కొనసాగినాయి. ఫలితంగా లక్షల ఎకరాల భూములు భూస్వాముల వద్ద నున్న వాటిపై పేద రైతాంగానికి యజమాన్యం లభించింది.

ఇలా సాధించుకున్న భూములలో కొన్నింటిపై రైతులు హక్కులు పొందారు. కొంత భూమిపై రైతులు చట్ట ప్రకారం ఇప్పటికీ హక్కులు పొందలేదు. పట్టణాలకు వెళ్లి ఆశ్రయం పొందిన దొరల వారసులు రాజీలకు రావడం, బెదిరించడం, భూములు తిరిగి వెనక్కి తీసుకోవడం, పోలీసు నిర్బంధం పాలుజేయడం కొంత డబ్బు తీసుకొని చట్టబద్ధం చేయడం, బీడు పడ్డ భూములను మాజీల ద్వారా, దళారుల ద్వారా అమ్మించడం, కొనిపించడం జరిగింది. అయితే నక్సలైటు ఉద్యమం బలంగా ఉన్న కాలంలో పోరాటంలో సాధించుకున్న భూములపై రైతులు తిరుగులేని హక్కు అనుభవించారు. ఆ సమయంలో చట్టపరమైన పట్టా ఇతర విషయాలు సాధారణ రైతాంగం కనీసం కూడా ఆలోచించే అవసరం ఏర్పడలేదు. ఉద్యమం బలహీనపడుతూ వస్తున్న క్రమంలో సమాంతరంగా పారిపోయిన రెడ్డి, వెలమ భూస్వామ్య వర్గాలు తమ గడీ వ్యవస్థలకు తిరిగి కొత్త రూపాలలో ప్రాణం పోస్తూ వచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలంలో అనంతర పరిణామాలలో 15 సంవత్సరాల వ్యవధిలో భూస్వామ్య విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

1990ల తర్వాత మారిన పరిస్థితి -మావోయిస్టులతో చర్చలు - మూడవ దశ భూసంస్కరణలు

1990ల తర్వాత భారత పాలకవర్గాలు బాహాటంగా తమ ముసుగును తొలగించుకొని సామ్రాజ్యవాదులకు బడా భూస్వామ్య,పెట్టుబడిదారీ వర్గాలకు ఊడిగం చేసేందుకు బహిరంగంగా ముందుకొచ్చాయి.అనేక ప్రజా పోరాటాల ఫలితంగా దేశ వ్యాప్తంగా ఒక ప్రధాన ఎజెండాగానున్న భూ పంపకం క్రమంగా రూపం మార్చుకున్నది.అక్కడి నుండి భూమి నుండి కష్టజీవులను గెంటేసే క్రమం మొదలైంది. నరేంద్రమోడీ సర్కార్ తీసుకొచ్చిన భూసేకరణ ఆర్డినెన్స్ భారత పాలకవర్గాల విధానానికి పరాకాష్ఠగా కనిపిస్తుంది.

నక్సలైట్లకు ప్రభుత్వానికి మధ్య చర్చలు జరిగిన సమయంలో భూమి సమస్య మరోసారి ఎజెండా మీదకొచ్చింది.నూతన ప్రజాస్వామిక విప్లవ కార్యక్రమంలో భూసమస్య పరిష్కారం కీలకమైనదని భారత కమ్యూనిస్టు

పార్టీ (మావోయిస్టు) 2004లో చర్చల సందర్భంగా ప్రకటించింది.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం భూమి సమస్యను పరిష్కరిస్తామన్న 7 దశలుగా భూపంపకం చేశామని ప్రకటించింది. మావోయిస్టులు ప్రకటించిన లెక్క ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో ఒక కోటి నలభైలక్షల యకరాల భూమిని పంపకం చేయాలి."ఒక్క కరీంనగర్ జిల్లాలోనే పన్నెండు లక్షల యాభై వేల ఎకరాల మిగులు భూములున్నాయని తెలుస్తుంది." (అభివృద్ధిని ఇలా చూద్దాం,మదునూరి భారతి, వీక్షణం పబ్లికేషన్స్,2010. పేజీ నెం,85)కాని ప్రభుత్వం ఆ లెక్కలను ఒప్పకపోలేదు.వారు చెప్పిన భూములను పంచడానికి అంగీకరించలేదు. ఈ పరిస్థితులలో మావోయిస్టులు లేవనెత్తిన ప్రజల మౌళిక సమస్యకు జవాబు చెప్పకుండ ప్రభుత్వం సాఫీగా పాలించలేని రాజకీయ చక్రవ్యూహంలో కాంగ్రెస్‌ను భూమి సమస్య నెట్టి వేసింది. భూ సమస్య అధ్యాయనానికి రాష్ట్ర ప్రభుత్వం కోనేరు రంగారావు కమిటీని నియమించింది. చాలా కాలం త్రొక్కిపెట్టిన కోనేరు రంగారావు నివేదిక అనేక వాస్తవాలను, స్థితిని బహిర్గతం చేసింది. దాని సిపారస్సులను, వాటి ఆధారంగా వెలువడిన జీఓ నెంబర్ 1176 ను ఈ నాటికీ అమలు పరచడం లేదు.

2004 నాటికి "ఉమ్మడి రాష్ట్రంలో 24 లక్షల మంది కౌలు రైతులున్నారని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ అంచనా వేసింది. 40 లక్షలుగా రైతు సంఘాలు అంచనా వేశాయి". 2004లో నియమించిన కోనేరు రంగారావు కమీషన్ కౌలు దారుల సమస్యలపై చేసిన సిఫారసులను అమలు చేయడానికి జిఒ నెం.1049ని ప్రభుత్వం విడుదల చేసింది. కాని కౌలు రైతుకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. (భూమి సమస్యలు, విజయ్‌కుమార్ పేజి.నెం.6). ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2011-12 రెవెన్యూ రికార్డుల ప్రకారం 17,47,901 మంది కౌలు రైతులుండగా 6,80,226 మంది మాత్రమే రుణ అర్హత గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 5,13,655 మందికి కార్డులు అందాయి. ఆ తర్వాత ఏడాదిలో కేవలం లక్షల కుటుంబాలు ఆసాములుగా నమోదై ఉండి కూడా వారి జీవనోపాధి కొరకు వ్యవసాయంపై ఆధారపడడం లేదని తెలుస్తున్నది. సుమారు 20లక్షల కుటుంబాలు ఆసాములుగా నమోదయి ఉండి కూడా వారి జీవనోపాధి కొరకు వ్యవసాయంపై ఆధారపడడం లేదని తెలుస్తుంది. భూమి సాగుచేయగలిగే వారి చేతిలో లేకపోవడం వల్ల కౌలుదార్లుగా ఎలాంటి రక్షణలేక ఆత్మహత్యలు చేసుకునే స్థితికి రైతాంగం నెట్టబడుతున్నారు. ఉపాధికై వలసలుపోలేక ఉన్న ఊరిలోనే బతుకుదామని, భూమితోనున్న ఆత్మీయ బంధం వల్ల కొంత మిగిలినా చాలు కుటుంబాన్ని ఈడ్చుకరావచ్చునే భావన వల్ల కౌలు ఎంతైనా చెల్లించి వ్యవసాయం చేస్తున్నారు. భూ యజమాని ఇష్టానుసారంగా కౌలు నిర్ణయించడం, బ్యాంకులలో రుణాలు ఇవ్వక పోవడం కౌలురైతు కార్డులు లేకపోవడం నకిలీ ఎరువు విత్తనాలు, పురుగు మందుల బెడద. అతివృష్టి, అనావృష్టి, గిట్టుబాటుధర మొదలైన సమస్యలు కౌలురైతులకు తీవ్రంగా భారమైనాయి.

ప్రతీ ఆత్మహత్య వెనుక కౌలు రైతు కన్నీటి గాథ ఉంటుంది. సొంత భూమి గల రైతువలె అవసరమైతే భూమి అమ్మైనా అప్పుతీరుస్తా బిడ్డ పెండ్లి చేస్తాననే నమ్మకం, భద్రత కౌలు రైతుకుండదు. రైతాంగానికి సొంత యజమాన్యంతో భూమి ఉండవలసిన అవసరాన్ని అనేక కమిటీలు సిఫారస్సు చేసిన అమలు శూన్యంగా కనిపిస్తుంది.

పాలకుల తప్పుడు లెక్కలు - పంపకానికి ఉన్న అవకాశాలు

ఈ నేపథ్యంలో వర్తమానంలో భూమి పంపకం ఆవశ్యకతను - స్థూలంగా పరిశీలిద్దాం. 2011 జనాభా లెక్కల ప్రకారంగా తెలంగాణలో మొత్తం కుటుంబాల సంఖ్య 83.58 లక్షలు, జన సంఖ్య 3,51,93,978గా వుంది. 61.33 శాతం గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. జనాభా దళితులు 15.44 శాతం, గిరిజనులు 9.34 శాతం మైనారిటీలు 15 శాతం ఉన్నారు. బిసీలను కలుపుకుంటే 85 శాతం వరకు వెనుకబడిన వర్గాలే ఉంటాయి. రాష్ట్ర జనాభాలో దాదాపు 55.49 శాతం మంది జీవనోపాధికోసం ఏదో విధంగా వ్యవసాయ కార్యకలాపాల మీద ఆధారపడి జీవిస్తున్నారు. (సామాజిక, ఆర్థిక చిత్రణ 2015 తెలంగాణ ప్రభుత్వం పేజి-23)

"రాష్ట్రంలో మొత్తం భూ విస్తీర్ణం 114.84 లక్షల హెక్టార్లు, దానిలో అడవులు 27.43 లక్షల హెక్టార్లు (23.89 శాతం), దాదాపు సాగు విస్తీర్ణం 49.61 లక్షల హెక్టార్లు (43.20 శాతం), పడావు భూములు 9.60 లక్షల హెక్టార్లు (8.36 శాతం), వ్యవసాయేతర ప్రయోజనాలకోసం 8.95 లక్షల హెక్టార్లు (7.79 శాతం) బంజరు మరియు సాగు యోగ్యం కాని భూములు 6.15 లక్షల హెక్టార్లు (5.36 శాతం), ఇతర పడావు భూములు 7.17 లక్షల ఎకరాలు (6.24 శాతం) మిగిలిన 5.16 శాతం భూములు కల్చర్ చేయడానికి వీలైన వ్యర్థం క్రింద ఉన్నాయి. 5.93 శాతం భూములు శాశ్వత పచ్చిక బయళ్లు, మేత బయళ్లు. నికరముగా విత్తన విస్తీర్ణంలో చేర్చకుండా, ఇతర వృక్షాలు తోపుల కింద ఉన్నాయి. నికరంగా విత్తన భూముల కింద లెక్కించని ఈ భూములు 5.93 లక్షల హెక్టార్ల వరకు ఉన్నాయి.(సామాజిక ఆర్థిక చిత్రణ తెలంగాణ ప్రభుత్వం -2015 పేజీ నెంబర్-24)

రాష్ట్రంలో వ్యవసాయ కమతాల సంఖ్య 2010-11 ప్రకారం భూ కమతాల సంఖ్య 55.54 లక్షలు ఈ కమతాల కిందనున్న భూమి విస్తీర్ణం 61.97 లక్షల హెక్టార్లు, సగటు కమతం 1.11 హెక్టార్లు, 62 శాతం కమతాలు ఒక హెక్టారు కన్న చిన్నవైన నామ మాత్రపు కమతాలు, ఒకటి రెండు హెక్టార్లు మధ్యనున్న కమతాలు 23.9 శాతం ఆ విధంగా రాష్ట్రంలోని మొత్తం కమతాలలో, నామ మాత్రపువి, చిన్నవీ కలిపి 85.9 శాతం ఉన్నాయి. (సామాజిక చిత్రణ తెలంగాణ ప్రభుత్వం పేజి 25.) మిగిలిన 14 శాతం కమతాల కింద 45 శాతం భూమి ఉన్నది. ప్రభుత్వ లెక్కల ప్రకారం సాగులో ఉన్న భూమి 61.97 హెక్టార్లు (కోటిన్నర ఎకరాలు) ఈ భూమిని సమాన నిష్పత్తిలో 55.54 లక్షల కమతాలకు పంచితే ఒక కుటుంబానికి లేదా కమతానికి సుమారుగా 3 ఎకరాల వరకు రావాల్సి ఉంటుంది.

మొత్తం రాష్ట్ర భూ విస్తీర్ణం 114.84 లక్షల హెక్టార్లు నుండి 62.97 లక్షల హెక్టార్లు పోను 51.87 లక్షల హెక్టారుంటుంది. దీనిలో 27.43 హెక్టార్లు అడవుల రూపంలో ఉండగా ఇంకా 24.44 లక్షల హెక్టార్లు భూమి ఉండాలి. వీటిలో జనావాసాలు, విశ్వవిద్యాలయాలు, ఉద్యానవనాలు, పారిశ్రామిక అవసరాలు ఇతర వాటికి సంబంధించి మరో 10 లక్షల హెక్టార్లు తీసివేయవచ్చు. ఈ ప్రకారంగా పచ్చికబయళ్లు, బంజరు భూములు, మొదలైనవి ప్రభుత్వ లెక్కలలో సరిగ్గా చూపనివి సుమారు 14.44 లక్షల హెక్టార్లు ఉంటుంది. అంటే సుమారు 44 లక్షల ఎకరాల మిగులు భూమి ఈ ప్రకారం లెక్కలు తేలాల్సి ఉంటుంది.

(ఇంకా ఉంది)

(రచయిత టిపిఎఫ్ ప్రధాన కార్యదర్శి) వీ

ఒక విప్లవ రచయిత ఆత్మహత్య

కృశ్చేవ్ పాలనా కాలంలో సోవియట్ యూనియన్‌లో ఆత్మహత్య చేసుకున్న ఫెదయేవ్ జీవితాన్ని వివరిస్తున్నారు

ఎన్‌వియస్ నాగభూషణ్

ప్రస్తుతం దేశంలో సాంస్కృతిక టెర్రరిజం నగ్నంగా చిందులేస్తున్న వేళ, దాన్ని ఖాకీలు పరోక్షంగా ఎగదోస్తున్న సమయంలో, వీటన్నింటికీ దన్నుగా కాషాయం రంకెలేస్తున్న సందర్భం – ఇవన్నీ కలిసికట్టుగా నూరు పువ్వుల్ని చిదిమేసి, నూటొక్కటోదాన్ని ఆకాశానికెత్తుతూ వీరంగం వేస్తున్న సన్నివేశం – పెరుమాళ్ మురుగన్‌పై దాడి, గోవింద పన్సారే, నరేంద్ర దభోల్కర్, ఎం.ఎం. కల్బుర్గీ, అఖ్లాక్ హత్యలూ, రోహిత్ ఆత్మహత్య, కన్హయ్యపై దేశద్రోహ నేరాపాదన... వరుసపెట్టి జరుగుతున్న సంఘటనల పరంపర – వీటన్నింటినీ చూస్తుంటే కృశ్చేవ్ కాలంలో ప్రసిద్ధ శ్రామిక వర్గ రచయిత ఫెదయేవ్ ఆత్మహత్య చేసుకుంటూ 1956, మే 13న రాసిన లేఖ గుర్తొస్తుంది.

సామ్రాజ్యవాదులకు కృశ్చేవ్ పరమ ఆప్తుడు. మరణించిన స్టాలిన్‌పై తట్టల కొద్దీ అబద్ధాల్ని ఆరోపించి, అతడి విప్లవ విధానాల్ని తిరగదోడి, లిబరలైజేషన్ పేర బూర్జువా అనుకూల విధానాల్ని తలకెత్తుకొని, పాశ్చాత్య దేశాల్ని అంటకాగి, ఆ దేశాల నుండి టన్నుల కొద్దీ విష సంస్కృతిని దిగుమతి చేసుకున్న ఘనుడు ఈ కృశ్చేవ్. ఇతడి తిరోగమన విశ్వరూపాన్ని పంచదార పూతతో (స్నేహ విస్మృతి) నవల చిత్రించింది. (బోల్షివిక్‌గా జీవితం ప్రారంభించి, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లర్‌పై తన విమర్శల్ని ఎక్కుపెట్టడం ద్వారా స్టాలిన్ అభిమానాన్ని పొందిన ఇల్యా ఎహ్రైన్‌బర్గ్ దీని రచయిత. 'ప్యారిస్ పతనం' రచన ద్వారా తన విప్లవ పదాడంబరంతో తెలుగు వారికీ పరిచితుడైన ఇతడు, ఆ తర్వాత కృశ్చేవ్‌ని అంటకాగి, 'స్నేహ విస్మృతి'లో రాసిన అసహ్యకరమైన రాతలు, విప్లవాభిమానుల్నే గాక, సామాన్య పాఠకులకూ రోత పుట్టించాయి.)

స్టాలిన్ పాలనలో, ప్రక్షాళన సమయంలో ఎన్నెన్నో ఘోరాలు జరిగాయని వాటిని భూతద్దంలో చూపిస్తూ గగ్గోలు పెట్టిన పాశ్చాత్య మీడియా (ఆ సమయంలో అసలేం జరిగిందీ చెప్పేందుకు ఇది సందర్భం కాదు కానీ, ఆసక్తి గలవారు తోలేటి జగన్మోహనరావు రాసిన 'మేం మళ్లీవస్తాం' అనే గ్రంథాన్ని చూడండి), కృశ్చేవ్ హయాంలో జరిగిన హననాల గురించి మాత్రం నోరెత్తదు. వాటి గురించి ఏ కొంచెమైనా ఫెదయేవ్ లేఖ వల్లనే లోకం దృష్టికి తెలియవచ్చింది. నిజానికి ఫెదయేవ్ కూడా కృశ్చేవ్ వల్ల బాధితుడే. అయితే ఫెదయేవ్ ఏదో ఒక అనామక రచయిత కాదు. ఒక ప్రముఖ వ్యక్తి, స్టాలిన్ కాలంలో ఒక వెలుగు వెలిగినవాడు. ఉత్తమ రచయితగా స్టాలిన్, లెనిన్ బహుమతుల్ని పొందినవాడు.

తన 16వ ఏటే బోల్షివిక్ పార్టీలో చేరి 1918 – 21ల మధ్య జరిగిన దేశ అంతర్యుద్ధంలో గెరిల్లాగా పోరాడి, రెండు సార్లు గాయపడ్డాడు ఫెదయేవ్. ఆపై ఉన్నత చదువులు చదివినా, పార్టీకి కార్యకర్తగా పని చేస్తూ, దీర్ఘకాలం పాటు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యునిగా పనిచేశాడు (1939 నుండి 1956 దాకా). సుప్రీం సోవియట్‌లో ఒకసారి రెండో డిప్యూటీగా, ఒకసారి మూడో డిప్యూటీగా పనిచేశాడు. ప్రపంచ శాంతి సంఘానికి ఉపాధ్యక్షునిగా పనిచేశాడు. ఇక సాహిత్య రంగంలో అయితే అత్యంత ఉన్నత స్థానం అతడిది. ప్రపంచ ప్రసిద్ధి పొందిన 'ది యంగ్ గార్డ్' నవల రాసింది ఇతడే. మరెన్నో నవలలూ, చారిత్రక కథనాలూ రాశాడు. ఇతడు రాసిన 'రజ్‌గ్రోమ్' నవల ఒక చరిత్ర సృష్టించి, సోవియట్ సాహిత్య సిద్ధాంతమైన 'సోషలిస్టు వాస్తవికత'కు మూల స్థంభంగా నిలిచింది. దేశ వ్యాప్తంగా ఉన్న పలు సాహిత్య సంఘాల్ని ఏకం చేయడంలో విజయం సాధించి, సోవియట్ రచయితల సంఘాన్ని స్థాపించి, దాని ప్రధాన కార్యదర్శిగా, చైర్మన్‌గా 1939 – 44 దాకా, తిరిగి 1946 – 54 దాకా పనిచేశాడు. స్టాలిన్ చేత అమితంగా గౌరవింపబడ్డ ఫెదయేవ్, స్టాలిన్ అనంతరం అధికారంలోకి వచ్చిన కృశ్చేవ్ చేత తీవ్ర అవమానాల పాలు కావలసి వచ్చింది. కృశ్చేవ్ అనుసరించిన విప్లవ తిరోగమన చర్యల్ని ఫెదయేవ్ విమర్శించడమే అందుకు కారణం. దీంతో అతడి రాజకీయ పదవిని తగ్గించి సిసి సభ్యునిగా ఉన్న అతడి సభ్యత్వాన్ని నిరాకరించ లేదు గానీ, కాండిడేట్ సభ్యుని స్థాయికి దిగజార్చారు. అతడి సాహిత్య సేవల్ని దిగజారుస్తూ అతడికిచ్చిన బహుమతుల్ని వెనక్కి తీసుకున్నారు. అతడి రాతల్లో లోపాల్ని ఎంచుతూ, మాటి మాటికీ తప్పు పడుతూ, అతడి ఆత్మాభిమానాన్ని దెబ్బకొట్టారు. అంతటితో ఆపక అతడు రాయడానికే వీల్లేదని నిషేధం విధించారు. దానిపై అతడు ఎన్నిసార్లు పార్టీ సెంట్రల్ కమిటీకి విజ్ఞప్తిచేసినా, పెడ చెవిన పెట్టారు. దాంతో అతడు తీవ్ర ఒత్తిడికి లోనై, ఆల్కహాల్ సేవిస్తూ, పిస్తోలు పేల్చుకుని మరణించారు. చనిపోతూ అతడు రాసిన లేఖ ఈ మధ్య కాలంలోనే వెలుగు చూసింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమయ్యే సందర్భంగా 1991లో జరిగిన 'రహస్య పత్రాల వెల్లడి'లో ఈ లేఖ బయటపడింది. అంతదాకా కెజిబి లైబ్రరీలో, నాడు దర్యాప్తు జరిపిన పోలీసు అధికారి నోట్‌తో సహా అలా లోకం దృష్టికి వచ్చింది. లేకుంటే ఆల్కహాల్ అతిగా సేవిస్తూ మరణించాడన్న నాటి ప్రభుత్వ కట్టు కథలో నిజం ఏపాటి ఉన్నదో ఎవరికీ, ఎన్నటికీ తెలిసేది కాదు. అంతేగాక ప్రభుత్వం అతడి పట్ల ఎంత దుర్మార్గంగా వ్యవహరించిందీ బయటపడేది కాదు.

ఇంతకీ మరింత దుర్మార్గమైన విషయం ఏమంటే, తాను ఏ రచయితల ఐక్యత కోసం జీవితాంతం కృషి చేశాడో వారిలో పెక్కుమంది, అతడి మరణం తర్వాత వ్యవహరించిన తీరు! కొందరైతే అతణ్ని అవహేళన చేస్తూ, వ్యంగ్య గీతికలు రాశారు! వీరిలో ఓ 'మహా' రచయితా, నోబుల్ విజేతా అయిన పాస్టర్‌నాక్ కూడా ఉన్నాడు. (ఇతడి కడుపు మంటకు కారణం, స్టాలిన్ కాలంలో ఇతడు రాసిన ఓ బూతు కావ్యాన్ని ఫెదయేవ్ నిరసించాడు. విప్లవ ప్రభుత్వ పాలనలో బూతు కావ్యాలకు చోటు ఉండరాదని ఫెదయేవ్ భావించాడు. ఆ కసిని పాస్టర్‌నాక్ ఇలా తీర్చుకున్నాడు. ఇంతకీ ఇతడికి నోబుల్ బహుమతి స్టాలిన్‌ని గొప్పగా తిట్టిన 'డా. ఝివాగో' నవలకు గాను వచ్చిందే. అయితే ఈ నవలని

రష్యాలో ప్రకటించనివ్వడానికి ప్రసిద్ధ వెన్నుపోటుదారైన కృశ్చేవ్‌కి కూడా గుండెలు చాల లేదు. అంచేత విదేశాల్లో దాన్ని ప్రకటించాల్సి వచ్చింది. అంతేగాక ఈ నవలకు గాను నోబుల్ పురస్కారం లభించినందుకు పాస్టర్‌నాక్‌ని అభినందించే ధైర్యం ఒకే ఒక రచయితకు తప్ప మరెవరికీ చాలలేదు. ప్రజా స్పందన ఏ విధంగా ఉందో ఈ ఉదంతాలే చెపుతాయి.) మరి కొందరు 'తప్పు'దోవపట్టిన అతణ్ని నిందించారు. (స్టాలిన్ చనిపోయి, కృశ్చేవ్ హయాం వచ్చినా, ఇంకా విప్లవాన్ని అభిమానించడమే ఆ తప్పుదోవ.) ఇలాంటి వారిలో బూర్జువా వ్యవస్థ అభిమానీ, స్టాలిన్‌ని తిట్టి, ఆపై అతణ్ని అంటకాగేందుకు ప్రయత్నించి భంగపడ్డ విప్లవ వ్యతిరేకి మందేతస్తం ఒకడు. ఇక ఎహైన్‌బర్గ్ లాంటి వారయితే, స్టాలిన్ కాలంలో ప్రక్షాళన ఉద్యమం సందర్భంగా దేశ ద్రోహ నేరారోపణకు గురై అరెస్టయిన కొందరు 'ఇద్దిష్' రచయితల పట్ల, ఫెదయేవ్ సానుభూతితో వ్యవహరించలేదని ఆరోపించారు. (ఒకానొక నిర్దిష్ట ప్రాంతంలో ఉపయోగించబడే హిబ్రూ భాష యాసనే 'ఇద్దిష్' అంటారు – రచ.) ఎందుకంటే సాటి రచయితలయినందున, అరెస్టు కాబడి తీసుకెళుతున్నప్పుడు ఫెదయేవ్ సానుభూతితో కన్నీటి వీడ్కోలు ఇచ్చాడు. ఆ కన్నీటిలో సానుభూతి లేదని ఎహ్రెన్ బర్గ్ ఆరోపణ. ఫెదయేవ్ రచయితల సంఘానికి అధ్యక్షునిగా ఉన్నందున, అతడు వారిని (వారతనికి మిత్రులు కూడా నట!) విడుదల చేయించి ఉండాల్సింది, తన పలుకుబడితో, అని ఎహైన్ బర్గ్ హృదయం! విచారణ సందర్భంలో వారిలో కొందరు ఆరోపణని అంగీకరించగా, మరి కొందరు పాక్షికంగా అంగీకరించారు. కొద్ది మంది వ్యతిరేకించారు. అటువంటి ఆరోపణల్ని ఎదుర్కొంటున్న వారిని, వారు మిత్రులైనా, ఎవరు గానీ విడిపించగలరా? ఇలా చెప్పుకుంటూ పోతే ఆ రచయితల గురించి ఒక గ్రంథమే రాయాల్ని ఉంటుంది. అవార్డులు వాపసు చేసిన రచయితలూ, కళాకారుల్నీ, నిరసనకు నిరసన పేరుతో ఎలా అవహేళన చేసిందీ ఇంకా అందరికీ గుర్తుండే ఉంది కదా! ఫెదయేవ్ ఓ సున్నిత మనస్కుడు. అతడిలో రాజకీయ వాదిని మించి, రచయిత ఉన్నాడు. రచయితను రాయ నీయకుండా నిషేధం విధించడమంటే, అతడి రాతల్ని అడుగడుగునా ప్రభుత్వం తప్పు పట్టడమంటే, అతడికిచ్చిన బహుమతుల్ని వెనక్కి తీసుకోవడమంటే, ఇంతకన్నా అవమానం ఇంకేం ఉంటుంది? ఆ అవమానాల్ని తట్టుకోలేక అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. రచయిత కావాలనుకున్న రోహిత్ ఆత్మహత్య చేసుకుంటే, అతణ్ని నిందించి తప్పు పట్టిన రాజకీయపక్ష నేతలు కూడా, కనీసం పైకయినా సంతాపం వెలిబుచ్చారు. కానీ పాలక పార్టీలో ప్రముఖ స్థానంలో ఉండి, అధినేత కోటరీ వ్యతిరేకించినందున, కనీస సానుభూతికి కూడా ఫెదయేవ్ నోచుకోలేకపోయాడు. ఇవన్నీ చాలవా ఫెదయేవ్ ఔన్నత్యాన్ని తెలియ జెప్పేందుకు? అయితే ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావన్న మాట నిజమే. (పెరుమాళ్ మురుగన్ తీవ్రభయానికి లోనై, తన కలాన్ని పక్కన పెట్టాడు. అతనికి తిరిగి తగిన ధైర్యాన్నిచ్చి, తిరిగి కలాన్ని చేత బట్టేలా ఈ 'ప్రజాస్వామిక' ప్రభుత్వాలు గానీ, 'న్యాయ' స్థానాలు కానీ, చుట్టూ ఉన్న సమాజం గానీ చేయగలదా? చేస్తే మనందరం ఎంతయినా సంతోషించాలి!) కానీ బతికి కూడా, ఏమీ సాధించలేనన్న నిరాశకులోనై ఫెదయేవ్ ఆ పనిచేశాడు. (ఇంతటి అన్యాయానికి గురైన అతడి గురించిన వివరాలు సరైన విధంగా ఏ వెబ్‌సైట్లోనూ లభ్యం కావడం లేదు. అతడికి వ్యతిరేకంగానే లభించిన వెబ్‌సైట్లలోనే కొంతైనా సమాచారం ఉంది. అయితే వెబ్‌సైట్లన్నీ చాలా వరకు విప్లవ వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల, రాజీవాద అనుకూలమైనవే అయినందువల్ల, ఆ వెబ్‌సైట్ల నుండే విమర్శనాత్మక దృష్టితో పరిశీలించి కొంత సమాచారాన్నయినా రాబట్టాల్సి వచ్చింది.) ఇక చూడండి ఫెదయేవ్ తన ఆత్మహత్య లేఖలో ఏమి చెప్పిందీ.

ఫెదయేవ్ ఆత్మహత్య లేఖ

"సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీకి, స్థిరంగా, కఠినంగా వ్యవహరించే పార్టీ నాయకత్వం, కళను నానుండి దూరం చేసి, నా బతుకును దుర్భరం చేసింది. అది దాని తప్పిదాన్ని ఎంత కాలానికీ సరిచేసుకోకుండా ఉంది. అందువల్ల ఇక నేను జీవించగలిగి ఉండడం అసాధ్యంగా మారింది. జార్‌ల కాలం నాటి కొద్దిపాటి నిరంకుశత్వానికి ఎన్నో రెట్లు మించి నేడు సాహిత్య రంగంలో ఉత్తమ కార్యకర్తల్ని అంతం చేయడం, లేదా చంపడం చేస్తున్నారు. అధికార పీఠంలో ఉంటూ, రహస్య నేరాలు చేస్తున్న వారిని ఎంతైనా అభినందించాలి. ఉత్తమ సాహిత్యకారుల్లో పెక్కు మంది యువకత్వంలో ఉండగానే అసహజ మరణాల పాలబడుతున్నారు. మిగిలిన కొద్ది మందీ, నిజమైన నాణ్యత గల రచనలు చేయగలవారు – 40 నుంచి 50 సంవత్సరాలు రాకముందే మృత్యువు పాలవుతున్నారు.

అత్యంత పవిత్రమైన సాహిత్యాన్ని పూర్తిగా ధ్వంసం చేసేందుకు గాను – ప్రజల్లో అత్యంత వెనుకబడ్డ వారైన ఉద్యోగులకు అధికారం ఇచ్చాయి – ఉన్నత న్యాయస్థానాలు –ఆ ఉన్నత న్యాయస్థానాలు ఏవంటే, మాస్కో సమావేశం, పార్టీ 20వ కాంగ్రెస్, అవి ఇచ్చిన కొత్త నినాదం 'ముందుకు వెళ్లండి' (ఇదే దారిలో) అని! (ఈ 20వ కాంగ్రెస్‌లోనే లెనిన్ మార్గం నుండి వైదొలుగుతూ కృశ్చేవ్ నాయకత్వంలోని పార్టీ – సోషలిస్టు విప్లవం శాంతియుతంగానూ అభివృద్ధి చెందవచ్చుననీ, సోషలిజానికి పరివర్తన జరగడం కోసం పార్లమెంటరీ రూపాన్ని కూడా ఉపయోగించుకోవచ్చుననీ, బూర్జువాల సేవచేసే పార్లమెంటును, శ్రామిక ప్రజలకు సేవ చేసేందుకు కూడా సాధనంగా ఉపయోగించుకోవచ్చుననీ తీర్మానించింది – అను.)

ఆ మార్గంలో పయనించేందుకు పురికొల్పబడిన ఉద్యోగులంతా ఓ మూర్ఖుల గుంపుగా జమ అయ్యారు. అయితే వారిలో కొంత మంది గౌరవనీయులు లేకపోలేదు గానీ, ఆ పరిస్థితుల్లోనే తామూ క్రూరంగా బాధింపబడినందున, సత్యాన్ని వెల్లడించడానికి తాము అసమర్థులమని వారు భావించారు. అలా చేయడం లెనిన్ పంథాకు తీవ్ర వ్యతిరేకం అయినప్పటికీ, బ్యూరాక్రటిక్ అలవాట్లలో పెరిగినందున, తామెక్కడ బలి అవుతామోనన్న భయంతో వీరంతా పెదవి విప్పడం లేదు. లెనిన్ కాలం నుంచి ఎటువంటి స్వేచ్ఛ, పారదర్శకతల వల్ల మా తరం సాహిత్య రంగంలో అడుగు పెట్టిందో, ఎలాంటి పరిమితుల్లేని బలం మా ఆత్మల్లో నిండిపోయి ఏ గొప్ప రచనల్నయితే చేశామో, అలాంటి రచనల్ని ఇప్పుడు చేయాల్సి ఉంది.

లెనిన్ మరణానంతరం వారు మమ్మల్ని బాలుర స్థాయికి దిగజార్చి మమ్మల్ని చంపేశారు. మమ్మల్ని భావాల పేరుతో భయపెట్టి, దానికి 'పార్టీ స్ఫూర్తి' అని పేరు పెట్టారు. మళ్లీ ఇప్పుడు ఆదిమానవత్వం, అజ్ఞానం, కించపరచడం – వీటితో కూడిన స్వంత ప్రణాళికను వారిలో ఒకడు రాయగానే, వారంతా ప్రతిదాన్నీ సరిచేస్తామంటున్నారు. సాహిత్యంపై పెత్తనాన్ని ప్రతిభలేని, దిగువ స్థాయి అధికారులకు, సాహిత్యాన్ని ఏ మాత్రం ఆస్వాదించలేనివారికి కట్టబెట్టారు.

ఆ కొద్దిమంది అధికారులూ డప్పుకొట్టుకుంటూ, పవిత్రాగ్నిని ఆహ్వానిస్తూ (ఒక రకమైన మతాచారం – అను), వయసు రీత్యా త్వరలోనే ఆ చిన్న విభాగానికి అధినాథులమవుతామనుకుంటున్నారు. అయితే ఈ ప్రోత్సాహం ఎక్కువ కాలం కొనసాగదనీ, వారికాధిపత్యాన్ని

కరువు కోరల్లో కబేళాలకు పశు సంపద

***తెలంగాణలోని దుర్భిక్ష పరిస్థితుల వల్ల వ్యవసాయ ఉత్పత్తిలో పాల్గొనాల్సిన పశువులు కబేళాలకు తరలిపోతున్న పరిస్థితులను వివరిస్తూ, ఈ పరిస్థితిని అధిగమించడానికి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని అంటున్నారు* మచ్చ శ్రద్ధానందం**

వ్యవసాయం అనేది ఒకే కోణంలో మనం చూడలేం. విభిన్న పార్శ్వాల సమాహారమే వ్యవసాయం. ఇదొక మానవీయ సంస్కృతి, సంప్రదాయం ప్రకృతికి శ్రమ తోడై ఫలితాలు కనబడే ఫలసాయం ఈ వ్యవసాయం. నదీ పరివాహక ప్రాంతాల్లో విలసిల్లిన నాగరికతలు వ్యవసాయం పునాదిగానే ఏర్పడినాయి. 'పనికి మెదడుతో పాటు రక్త మాంసాల్ని ఇవ్వడం అనేది రైతుకు బలంగా తెలుసు' (డా. బెల్లి యాదయ్య).

వ్యవసాయం అనగా సాగు భూమి, చెట్లు, పశు సంపద, నీటి వసతి, సరైన శీతోష్ణస్థితి, కాలం, శ్రమనందించే కుటుంబ వ్యవస్థ, సరైన పౌష్టికాహారం, మానసికొల్లాసం, ఉదయం మేల్కొని రాత్రి నిదుర పోయేవరకు ఉచ్వాస నిశ్వాసల హోరాహోరీ. సరైన సగౌరవ గుర్తింపు, సంతసముల సౌదం. ఇదంతా ఒకనాడు, ఒకప్పుడు శ్లాఘించుకునే పరిస్థితి. సరళీకృత ఆర్థిక విధానాలు, గత పాలకుల పక్షపాత విధానాలు, కరువు కోరల విషకౌగిలి వంటివి 'రైతులు–వ్యవసాయం' అన్న అర్థం స్వరూపాన్నే మార్చివేశాయి. వ్యవసాయం యాంత్రీకరణకు, పరాయీకరణకు నోచుకుంది. ప్రకృతికి, శ్రమకు ఉన్న సంబంధం తొలగింది. ప్రకృతికి, యంత్రాలకు అవినాభావ సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో మనిషి (రైతు) నమ్ముకున్న వ్యవసాయం నుండి తనకు తెలియకుండానే నిరపేక్షికంగా నిష్క్రమింపబడ్డాడు. నిష్క్రియశీలుడుగా మారాడు. మానవ సంబంధాల బలోపేతానికి, శ్రమతో కూడుకున్న వ్యవసాయ ప్రగతికి ఉన్న అవినాభావ సంబంధం అగుపించకుండా పోయింది.

అభివృద్ధి కాంక్షతో ప్రారంభించిన సంస్కరణలు అన్నదాతలను ఆత్మన్యూనతా భావానికి గురి చేసినాయి. అభద్రతకు గురి చేసినాయి. 20 సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా 3 లక్షల మంది రైతులు బలవన్మరణాలు, ప్రతి 30 నిమిషాలకు ఒక రైతు ఆత్మహత్య, రోజుకు 2000 మందికి పైగా రైతులు వ్యవసాయాన్ని వదిలిపోతున్నారని చెపుతున్న గణాంకాల వెనుక నాటి పాలకుల/గత పాలకుల అశ్రిత పక్షపాత వైఖరి ఉన్నదనే విషయాన్ని విశ్వసించాలి. వ్యవసాయ, జీవన ఖర్చుల పెరుగుదల ధనాత్మక రేటులో ఉండడం, ఆదాయంలోని పెరుగుదల కంటే వ్యవసాయంలోని పెరుగుదల అధికంగా ఉండడం, అప్పుల సమస్య, గౌరవ సమస్య అన్నదాతలను చావుల ఊబిలోకి తీసుకపోవడం జరిగింది. గ్రామీణ వలసలు, పశువుల, భూముల, బంగారం వంటి అమ్మకాలు, అదేవిధంగా రైతన్న బలవన్మరణాలు మొదలైనవి వ్యవసాయ సంక్షోభం పర్యావసానాలుగానే పరిగణించాలి.

ఒకనాడు పశువుల్ని, పంటల్ని సాటి మనిషిగా గౌరవించుకునే, ప్రేమించుకునే గ్రామీణ సంస్కృతి మనది. అన్నదాతకు పశువంటే ప్రాణం. ఓ సందర్భంలో మనిషిని అంతగా ప్రేమించకపోవచ్చునేమో గాని, లేదా మనిషి అవసరాలు అంతగా తీర్చలేకపోవచ్చునేమో గాని, నమ్ముకున్న పశువులకు మాత్రం సమయానికి నీరు, మేత అందించి

దక్కించదనీ వారికి తెలీదు. కమ్యూనిజం పేర పార్టీకి అనుబంధంగా, కార్మికుల, కర్షకుల అండతో దాదాపు 60 సంవత్సరాల పాటు గొప్ప గొప్ప సృజనాత్మక కార్యాలెన్నో జరిగాయి. ప్రజలందరికీ పుట్టుకతో వచ్చే సాధారణ నైపుణ్యం గల నేను, మొదట దేవునిపై గల ఆలోచనలూ, భావనలనూ కలిగి, ఆపై కమ్యూనిజం గొప్ప సిద్ధాంతాల్ని మిలితం చేశాను. కానీ ఇదంతా ఈ మధ్య కాలంలో తిరగబడి, నేనెక్కిన గుర్రబ్బండి విరిగిపోయి, కూలి పోయింది. అర్థంలేని, అన్యాయమైన, అసమర్థనీయమైన, అసంఖ్యాకమైన అధికార యంత్రాంగం, నిబంధనల కింద, యావజ్జీవిత పర్యంతం నేనేర్పర్చుకున్న ఆశలూ, ఆశయాలూ పూర్తిగా ఏ ఒక్కటీ మిగల కుండా శిథిలమయ్యాయి. ఇక ఇప్పుడైతే పూర్వం నాకు లభించిన అభినందనల్ని వెనక్కి తీసుకోవడం, అసమ్మతి తెలపడం వగైరా వల్ల, అలాగే నా ఉపన్యాసాల్లోనూ, నా సాధారణ ఆలోచనల్లోనూ లోపాల్ని ఎంచుతూ వీరు నా జీవితం విలువను లెక్కించాలనుకోవడం – ఇవన్నీ ముంచెత్తి, నన్ను కిందికి పడేశాయి. ఒక మనిషిలో ప్రజలు న్యాయ సమ్మతమైందిగా భావించే గర్వం, కమ్యూనిస్టు సంబంధమైన సాహితీ నైపుణ్యం నాలో ఉన్నందున ఆత్మవిశ్వాస రూపంలో అది లోతుగా పాతుకుపోయి ఉంది. దానికి గాను నూతన ప్రభుత్వ అత్యున్నత ఫలాన్ని కూడా నేను అందుకున్నాను. కానీ ఇప్పుడు దాన్ని తెంపెయ్యడమే గాక, తొక్కేసి, నలిపేశారు. లెనిన్ బోధనల్ని పాటిస్తామని విధేయ పూర్వక ప్రతిజ్ఞ చేసిన వీరు, నా రచనల విషయమై ఏమాత్రం పర్యవేక్షణ చేశారు కారు. పూర్వపు పాలకుడైన స్టాలిన్ నుంచి కన్నా, వీరివల్ల తక్కువ నష్టాల్ని ఆశించాం. కానీ ఆయన కనీసం విద్యావంతుడు. కాని వీరో పరమ అజ్ఞానులు!

రచయితగా నా జీవితం తన పూర్తి అర్థాన్ని కోల్పోవడంతో, దాన్నుంచి మహదానందంతో నిష్క్రమిస్తూ, ఈ జీవన కాలుష్యం నుంచి తప్పించుకుని, స్వేచ్ఛను పొందుతాను. ఆపై మీమీద నిర్దాక్షిణ్యం, అబద్ధాల, సంకుచితత్వాల వర్షం పడుతుండడాన్ని నేను గమనిస్తుంటాను (పైనుంచి – అను.)

నా చిట్ట చివరి ఆశ ఏమంటే, జరిగిందంతా ప్రజలకు – ఎవరైతే ప్రభుత్వాన్ని నడుపుతున్నాడో వాడికి చెప్పాలని. ఈ క్రమంలో గత మూడు సంవత్సరాలుగా నేను విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నాను. అయినప్పటికీ నానుండి వారు వాటిని స్వీకరించడానికి కూడా అశక్తులుగా ఉన్నారు.

నా తల్లి పక్కనే నన్ను ఖననం చేయాలని కోరుతున్నాను.

– ఫెదయేవ్, కేంద్ర కమిటీ కాండిడేట్ సభ్యుడు"

(రచయిత సాహిత్యకారుడు, లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకుడు) వీ

ప్రాణంగా చూసుకునే ధోరణి ఉండేది నాడు. ఈ సందర్భంలో రోహిత్ మాటలు గుర్తొస్తున్నాయి. 'నేను నక్షత్రాల్ని, ప్రకృతిని ప్రేమిస్తాను అనవసరంగా మనుషుల్ని నమ్మాను' అదే కోవలో ఈ తీవ్ర ఆర్థిక అసమానత్వ సమాజంలో కలిమిలేమిలతో మనుషుల మధ్య మెదలడం అనేది ఓ కఠోర సమస్యగానే చెప్పవచ్చు. ఆ క్రమంలోనే రైతన్నలు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని బావించవచ్చు కూడా.

పాశ్చాత్య వ్యవసాయ పల్లవిలో యంత్రాలు వ్యవసాయాన్ని చేస్తున్నాయి. పశువుల ప్రమేయం ఏ మేరకు తగ్గిందో సభ్య సమాజం చూస్తూనే ఉన్నది. పశుగ్రాసం, తాగునీటిని సరైన సమయానికి అందించలేని పరిస్థితి, దాని వెనుక రైతు పేదరికంలో మగ్గడం వంటివి పశువును పశువుగానే చూస్తుండడం జరుగుతోంది. గ్రామీణ కుటుంబాల్లో 35 శాతం-45 శాతం కుటుంబాలు పశువులను అమ్ముకుంటున్నాయి. అనేక రైతు ఆత్మహత్యలు జరిగిన కుటుంబాల్లో తదనంతరం ఖర్చుల కోసం, అప్పులు తీర్చడం కోసం, వ్యవసాయాన్ని వదలడం కోసం ప్రాణంగా నమ్ముకున్న పశువులను కభేళాలకు అమ్మడం జరుగుతున్న విషయాన్ని గమనించినప్పుడు రైతులకు ఎదురైన నైరాశ్యత అర్థమవుతోంది. ప్రాణానికి ప్రాణంగా చూసుకున్న అన్నదాతలు వ్యవసాయాన్ని వదిలి వెళుతున్నారు. పశువులు లేని పల్లెలు భవిష్యత్‌లో నిరపేక్షికంగా ధ్వంసమిస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

రైతు నమ్ముకున్న పశు సంపదను అమ్ముకోవడం అంటే తన ఉనికిని తానే ప్రశ్నించుకోవడం వంటిదని చెప్పవచ్చు. కేవలం సాగుకు సంబంధించిన అవగాహన ఉన్న రైతు వ్యవసాయాన్ని వదిలి ఏ విధంగా మిగతా పనులలో ఎటువంటి నైపుణ్యం లేకుండా మిగతా పనులలో ఆదాయార్జన కొరకు నిమగ్నమవగలడు... అని అనుకున్నప్పుడు... ఆ విధంగా నిలదొక్కుకోలేని పరిస్థితులలోనే కదా తనువు చాలిస్తుండు అని భావించాల్సి వస్తోంది. ధనిక దేశాలైన అమెరికా, బ్రిటన్‌లలో ఆధునిక గణాంకాల ప్రకారం నూటికి ఒక్క శాతమే వ్యవసాయ రంగంపై ఆధారపడుతున్నారు. మిగతా 99 శాతం వ్యవసాయేతర రంగాల పైన ఆధారపడి ఉండడం వెనుక వారికున్న అదనపు నైపుణ్యాలు ఏ మేరకు ఉన్నవో అవగాహన చేసుకోవచ్చు.

గత సంవత్సర కాలంగా వర్షాలు లేక తెలంగాణ జిల్లాలు తీవ్ర కరువును చవిచూస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోయినాయి. ఇది దురదృష్టకరం. ముఖ్యంగా మెదక్ వంటి జిల్లాలో మొత్తం మండలాలు (46) కరువు మండలాలుగానే ప్రభుత్వం ప్రకటించింది. ఇది విచారించవలసిన విషయం. వర్షాల లేమి, అప్పుల భారం కారణంగా కుటుంబ పోషణ, అప్పులు తీర్చడం నిమిత్తం పశువులను అమ్ముతున్నారని 'ఈనాడు' మెదక్ జిల్లాలో చేసిన పరిశోధన వల్ల తేలింది. కుటుంబ అవసరాల కొరకు చెట్లను, బంగారాన్ని, భూముల్ని కూడా అమ్ముకుని బతుకులీడుస్తున్న కుటుంబాలు గ్రామీణ భారతదేశంలో ఎన్నో కనబడుతున్నాయి.

మెదక్ జిల్లా జహీరాబాద్ మండలం మన్ననూర్‌కు చెందిన రైతు బేగరి సంగయ్య 8 చెట్లను అమ్మేశాడు. 3 గేదెలు, 2 ఆవులను సైతం అమ్మినట్లు తెలిపాడు. అదే విధంగా సదాశివపేట మండలం రేజింతల్ గ్రామ రైతు గడీల కృష్ణా రెడ్డి 30 ఏళ్లుగా పాడి పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. పంటలు పండక, గ్రాసం లేక తాగునీటికి ఇబ్బంది ఏర్పడడంతో నాలుగు నెలల్లో 8 పశువులను అమ్మడం జరిగింది. (ఈనాడు దిన పత్రిక 2016 ఫిబ్రవరి 26 పేజీ నం. 9 ఆధారంగా) మిగతా జిల్లాల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి కనబడుతోంది.

ప్రపంచ వ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం వల్ల గత రెండు సంవత్సరాలుగా భారత్‌లో కూడా కరువు చాయలు కనబడుతున్నాయి. ఆ ప్రభావం తెలంగాణపై కూడా ఉన్నది. 'కరువు కారణంగా మేత లేక, నీరు లేక డొక్కలెండుకపోతున్న మూగ జీవాలను చూస్తే కడుపు తరుక్కు పోతోందని' తెలంగాణ రాజకీయ ఐకాస ఇటీవల క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా అభిప్రాయపడింది.

ఇవన్ని ఎందుకు పరిగణలోకి తీసుకుని చెప్పాల్సి వచ్చిందంటే వ్యవసాయ సంక్షోభాన్ని తీవ్రంగా చవి చూస్తున్న ప్రాంతాల్లో కర్నాటక, మహారాష్ట్రలోని విధర్భ ప్రాంతం, అవిబాజ్య ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతం అనగా ప్రస్తుత ప్రత్యేక రాష్ట్రం. 60 సంవత్సరాలు పైబడిన స్వాతంత్ర్య పాలనలో ఈ ప్రాంతాలు దుర్భర సాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. అందులో తెలంగాణ ప్రత్యేకమైంది. నీళ్లు ఉన్నా ప్రాజెక్టులు కట్టి ఉపయోగించుకోలేని దాష్టికం ఏర్పడింది. మెదక్ వంటి జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టు ఉనికి లేదు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా కూడా.

పశువులు లేని పల్లె అందాల్ని, వాతావరణాన్ని ఊహించలేం. పశువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత వర్తమాన సమాజం మీద ఉన్నది. 'మనిషి ఒక్కరే కాదు అతనితో పెనవేసుకున్న జీవజాలం బతకాలి' అనే అందెశ్రీ మాటల్ని అందరు స్వీకరించాల్సి ఉన్నది. పశువులు అంతరించి పోవడం వల్ల పశువుల పేడ కూడా లబించకుండా పోతుంది. దీని వల్ల సేంద్రీయ వ్యవసాయానికి అడ్డంకి ఏర్పడుతుంది. పశువులు కనుమరుగై పల్లె గుండెకు సిల్లు పడకముందే ప్రభుత్వాలు స్పందించాల్సి ఉంది. పశువుల పరిరక్షణకు ఇటీవల తెలంగాణ రాజకీయ ఐకాస ఇచ్చిన సూచనలను కూడా ప్రభుత్వం స్వాగతించాల్సి ఉన్నది.

1) ప్రభుత్వ యంత్రాంగం కదిలి మానవత్వంతో స్పందించాలి.
2) కరువు నివారణ చర్యలను బాధ్యతగా చూడాలి.
3) వరదలు, తుఫాన్లు వచ్చినప్పుడు ఎలా స్పందిస్తారో... కరువు సందర్భంలో కూడా అలాగే స్పందించాలి.
4) ప్రభుత్వ యంత్రాంగం గోదావరి పుష్కరాలకు ఏర్పాటు చేసిన విధంగా మూకుమ్మడిగా కదిలితేనే ఈ మహాకరువును తట్టుకోగలం.
5) ప్రస్తుతం ఉన్న కరువు నిబంధనల్లో మార్పు తేవాలి.
6) కేవలం మండల కేంద్రాలలో కాకుండా ప్రధాన గ్రామాల్లో వానల్ని కొలిచే పరికరాల్ని పెట్టి సగటు తీసుకోవాలి.
7) అటవీ శాఖవారు అడవుల్లో వన్యప్రాణి రక్షణ కొరకై అక్కడక్కడా నీటి తొట్టెలు ఏర్పాటు చేసిన విధంగానే గ్రామాల్లో కూడా ఏర్పాటు చేయాలి.
8) పశువుల దానా వంటివి ఉచితంగా పంపిణీ చేయాలి.
9) పశువులు కలిగిన రైతుల్ని వివిధ రూపాలలో ప్రోత్సహించాలి.
10) సాగునీటి ప్రాజెక్టులను త్వరితంగా పూర్తి చేయాలి.

తెలంగాణలో వ్యవసాయం ఆకృతిని కోల్పోయింది. అలాగే ఆర్థిక వ్యవస్థ కూడా. దీనిని పునర్‌నిర్మించే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లుగా అమలు చేస్తున్న విధానాలను బట్టి చూస్తే తెలుస్తుంది. ఆ క్రమంలో వ్యవసాయ రంగానికి చేసిన కేటాయింపులు ముఖ్యంగా నీటి పారుదల రంగానికి 26 వేల కోట్ల రూపాయలు కేటాయించడం అనేది గణనీయమైన విషయం. ప్రభుత్వం సత్వర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి చేసిన సంకల్పాన్ని అందరూ సగౌరవంగా స్వీకరించాల్సి ఉన్నది. నిధులను నిరపేక్షంగా లక్ష్యా పేక్షతో వినియోగించినప్పుడే స్వప్నం సాకారమవుతుంది. పశు జాతిని పరిరక్షించుకున్నప్పుడే ప్రభుత్వాలకు గుర్తింపు ఉంటుంది.

(రచయిత అర్థశాస్త్ర అధ్యాపకులు) వీ

(...4వ పేజీ తరువాయి)

కూడ చౌకబారు వెటకారాలతో, వ్యంగ్యంతో ఎత్తిపొడిచారు. మరి ఎవరూ చేయని ఆచరణ ఏ కొంచెమో వాళ్లు చేస్తున్నారని ఆమె ఊరుకోలేదే?

6. కేవలం పుస్తకాలు రాసి, ప్రపంచానికే తాను న్యాయమూర్తిననీ, తాను తప్ప అందరూ తప్పులు చేసేవాళ్లేనని విర్రవీగే రంగనాయకమ్మ గారి పుస్తకాలలో ఎన్ని తప్పులున్నాయో ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరు బైటపెట్టే ధైర్యం చేయాలి. ఆ పని చేసినందుకు బ్రహ్మచారి గారిని, ధైర్యంగా ప్రచురించినందుకు వీక్షణంను అభినందిస్తున్నాను.

– ఎ. వీరస్వామి
హుజూరాబాద్

ఏప్రిల్ సంచికలో బ్రహ్మచారి వ్యాసం చదివి ఇది రాస్తున్నాను. రంగనాయకమ్మ, మార్క్సుకి వ్యతిరేకమైన అంశాలు చెప్పారనీ, మార్క్సు చెప్పింది రంగనాయకమ్మ చెప్పింది వేరు, వేరు మాత్రమేకాదు, వ్యతిరేకమైనవి కూడా అని, మౌలిక అంశాలలోనే తేడాలు ఉన్నాయని అంటున్నారు. మౌలిక అంశాలు ఏమిటి? 'సమాజంలో శ్రమలు చేసేవాళ్లంతా శ్రమ దోపిడీకి గురి అవుతున్నారని, వాళ్ల శ్రమలో కొంత భాగం జీతాల రూపంలో అంది, మరికొంత భాగం అదనపు విలువ రూపంలో పెట్టుబడిదారులకూ, ఇతరులకూ పంపిణీ అవుతోందని దీన్ని శ్రమచేసే వర్గం గ్రహించాలని చెప్పాడు.' మార్క్సు కాపిటల్ని నాలుగు ముక్కల్లో చెప్పాలంటే ఇదీ సారాంశం. దీన్ని రంగనాయకమ్మ కాదన్నారా? వ్యతిరేకించారా?

'ఒక స్వతంత్ర ఉత్పత్తిదారుడ్ని, ఒక అనుత్పత్తిదారుడిగా మార్క్సు పొరపాటు పడ్డాడు' అని చెప్పడమే రంగనాయకమ్మ పొరపాటా? ఆమె గ్రహించిన విషయాన్ని ప్రస్తావించకూడదా? ఇంతకీ ఆ పియానో తయారు చేసే కుర్రవాడు స్వతంత్ర ఉత్పత్తి దారుడా? అనుత్పాదక శ్రామికుడా? మరో ఉదాహరణ చూద్దాం. ఒక ఇంటికి పెయింటింగ్ వేయాలి. దానికోసం ఒక పెయింటర్ తో కొంత మొత్తానికి మాట్లాడతాడు ఇంటి యజమాని. ముడి పదార్థాలు అన్నీ ఇంటి యజమానివే, అంటే 60సి యజమానిదే. ఈ 60సి లో ముడి పదార్థాలూ, శ్రమ పరికరాలూ కూడా ఉంటాయి. చాలా సందర్భాలలో శ్రమ పరికరాలు శ్రామికులవే అవుతాయి. తన శ్రమ పరికరాలతో, తన శ్రమతో పెయింట్ చేస్తాడు. ఇక్కడ పెయింటర్ ఎవరు? స్వతంత్ర ఉత్పత్తి దారుడు. పెయింటింగ్ అనే శ్రమను ఇచ్చి, దానికి సరిపడా డబ్బు తీసుకుంటున్నాడు. ఇక్కడ అతని మీద యజమాని ఎవరూ లేరు. అతని సరుకు అమ్మకానికి వెళ్లడం లేదు. శ్రమ దోపిడీ లేదు. అతను అనుత్పాదక శ్రామికుడు కాదు. అనుత్పాదక కార్మికుడైతే ఖచ్చితంగా శ్రమ దోపిడీ ఉంటుంది. అది డబ్బు రూపంలో కాకపోయినా మిగులు రూపంలోనైనా సరే. శ్రమదోపిడీ ఉండదు అని ఎలా చెప్ప వచ్చంటే...ఆ పెయింటర్ ఒక్కడే కాకుండా అతని దగ్గర మరో నలుగురు కుర్రవాళ్లు ఉన్నారనుకుందాం. వాళ్లందరికీ కొంత కొంత కూలీలు ఇచ్చి, తనుకూడా శ్రమ చేస్తాడు కాబట్టి తనుకొంత మిగుల్చుకుంటాడు. అంటే అక్కడ తన శ్రమ తను తింటూ కూలీల శ్రమ కూడా కొంత తింటున్నాడని అర్థం. అప్పుడతను పెటి బూర్జువా కోవకు చెందుతాడు. అయితే ఇక్కడ మరొకలా కూడా చూడొచ్చు. ఆ పెయింటర్ దగ్గర పని చేసే కుర్రవాళ్లలోనే ఒక కుర్రవాడు 'ఆ మొత్తం ఇంటి పెయింట్ నేనే వేసేస్తాను' అన్నాడనుకుందాం. అప్పుడు ఆ ఇంటి యజమాని ఎంత ఇస్తాడు? ఆ కుర్రవాడి మేస్త్రీ ఇచ్చినట్టు కూలి డబ్బులు ఇస్తే సరిపోతుందా? కూలి డబ్బులు వచ్చే భాగ్యానికి డైరెక్ట్ ఒప్పందానికి ఎందుకు వస్తాడు? కొంచెం అటూ ఇటుగా మొత్తం డబ్బులు ఇవ్వవలసిందే. స్వతంత్ర ఉత్పత్తి దారులవిషయంలో దోపిడీ ఉండదు అని చెప్పడానికి ఇదే రుజువు. అందుకే మనం చూస్తున్న సమాజంలో కూలీల కన్నా మేస్త్రీలు కాస్త పైస్థాయిలో ఉంటారు. ఎంత స్వతంత్ర ఉత్పత్తిదారులైనా పెట్టుబడి సమాజంలో కొంత ఘర్షణ తప్పదు. యంత్రాల రాకతో వాళ్లుకూడా ఇబ్బందులు పడి శ్రామిక వర్గంతో కలవక తప్పదు.

– వి. వెంకట్రావు
విజయనగరం

ఏప్రిల్ సంచికలో అచ్చయిన బ్రహ్మచారి రాసిన 'మార్క్సు చెప్పిందేమిటి? రంగనాయకమ్మ రాసిందేమిటి?' వ్యాసంలో దిలీప్, నేను కలిసి 1994 ఫిబ్రవరిలో ఒక 28 పేజీల చిన్న పుస్తకం అచ్చు వేశాం' అని!

22 ఏళ్ల నాటి సమాచారాన్ని (ఏ సంవత్సరమో, ఏ నెలో కూడా) ఇచ్చిన బ్రహ్మచారి, దీనికి సంబంధించే ఇంకో సమాచారాన్ని ఎందుకు ఇవ్వలేదు? ఆ సమాచారం ఏమిటంటే, బ్రహ్మచారి దిలీపుల పుస్తకానికి అంజిరెడ్డి అనే ఒంగోలు పాఠకుడు గట్టి సమాధానమే ఇచ్చాడనీ, దానికి బ్రహ్మచారి నుంచి ఎటువంటి ప్రతి విమర్శా రాలేదనీ! నాకు ఈ సమాచారం 4 నెలల కిందట వెలువడిన రంగనాయకమ్మ పుస్తకం 'పాఠకులు నాకు రాసిన ఉత్తరాలు' లో కనపడింది.

రంగనాయకమ్మకు, ఒంగోలు నుంచి నందకుమార్ అనే పాఠకుడు 28-4-1994న (అంటే బ్రహ్మచారి పుస్తకం వచ్చిన 2 నెలలకు) రాసిన ఉత్తరంలో ఈ సమాచారం చూడండి: 'వేణు అన్నా – బావలకు మీ సాహిత్యంతో ఏమీ సంబంధం లేదు. అయినా మీరు వచ్చినప్పుడు జరిగిన చర్చల వలన వారు కొన్ని విషయాలు నేర్చుకున్నారు. అంజయ్య (వేణు బావ), బ్రహ్మచారి, ఒకప్పుడు పుస్తకాల వ్యాపారంలో భాగస్తులు. అంజయ్య ఎవరి వాదననైనా విని ఊరుకుంటాడు. బ్రహ్మచారి, అంజయ్యతో మీ గురించి, 'ఆమె, తనకే మార్క్సిజం తెలుసు అనుకొంటుంది. చాలా అహంభావం ఆమెకు' అన్నాడట. అప్పుడు అంజయ్య, ఎప్పుడూ ఏమీ తెలియని వాడు, 'మార్క్సు కాపిటల్‌ని ఇన్ని సంవత్సరాల నుంచీ కనీసం తెలుగులో అనువాదం కూడా చెయ్యలేదు కదా? ఆమె అందరికీ అర్థమయ్యేటట్టు రాసిందటగా?' అన్నాడంట. అంజయ్య అలా అంటాడని, మేము గానీ, బ్రహ్మచారి గానీ, ఊహించలేదు.

ఎప్పుడూ ఈ విషయాలు మాట్లాడని సుబ్బారావు కూడా బ్రహ్మచారితో, 'బ్రహ్మచారీ! రంగనాయకమ్మేదో తప్పులు రాసిందని మీరు రాసిన పుస్తకానికి అంజిరెడ్డే సమాధానం ఇచ్చాడటగా?' అన్నాడట. 'నా ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పలేదు. 6 ప్రశ్నలకే చెప్పాడూ' అన్నాడట బ్రహ్మచారి. 'మరి, చెప్పిన ఆ ప్రశ్నల గురించే ఏం చేశావు? సమాధానాలు అంజిరెడ్డికి పంపావా?' అని అడిగాడట సుబ్బారావు. వెంటనే బ్రహ్మచారి, 'అంజిరెడ్డి ఎవరు సమాధానం ఇవ్వడానికి? నాకు ఆమె ఇవ్వాలి గానీ?' అన్నాడట.

ఒక వారం క్రితం, శేఖరు ఆ బ్రహ్మచారిని కలిశాడు. బ్రహ్మచారి చాలా సార్లు శేఖరు కోసం కబురు చేస్తేనే వెళ్లాడు శేఖరు. బ్రహ్మచారి, తన పుస్తకం గురించి అభిప్రాయం చెప్పమన్నాడట. 'ఆ పుస్తకం తీసి మీరు చాలా తప్పు చేశారు. 'సైన్సు విషయాలలో తప్పులు' అని చెప్పి మీరు ఒక్కటి కూడా చూపించలేదు. ఇది నిజాయితీ అయిన పనేనా?' అని శేఖరు అడిగాడట. ఇదంతా క్లబ్‌లో జరిగింది. అంజి కూడా పక్కనే ఉన్నాడట. బ్రహ్మచారి, ఎవరితోనో మాట్లాడడం, అడిగిన వాటికి సమాధానం చెప్పకుండా, 'మీరెన్ని విమర్శలు చేసినా స్పోర్టివ్ గానే తీసుకుంటాను' అన్నాడట. రసూల్, 'బ్రహ్మచారిని కడుగుతా'నన్నాడు. ఎలా కడుగుతాడో మా ముందు రిహార్సల్ వేశాడు. అందరం తెగ నవ్వాం.' (పే. 105-106)

దీన్ని బట్టి బ్రహ్మచారికి రంగనాయకమ్మ పట్ల, అవ్యాజమైన ద్వేషం దాదాపు పాతికేళ్ల నుంచి ఉన్నదని విశదం అవుతోంది. అందుకే ఏప్రిల్ సంచికలోని వ్యాసంలో 'కాపిటల్‌లో ఒక్క ముక్క కూడా అర్థం కాని వ్యక్తి'గా రంగనాయకమ్మ గురించి (వాగ్నర్‌ని అడ్డు పెట్టుకుని) వ్యాఖ్యానించ గలిగాడు.

ఇలాంటి వైఖరి కలిగిన వ్యక్తులు చేసే విమర్శ ఆబ్జెక్టివ్‌గా, హేతుబద్ధంగా ఉంటుందని ఆశించడం భ్రమ. ఇలాంటి విమర్శని 'చర్చ' శీర్షిక కింద ప్రచురించినంత మాత్రాన 'చర్చ' అవదు.

– లెనిన్ బాబు
జెఎన్‌యు, న్యూఢిల్లీ

వీక్షణం ఏప్రిల్, 2016 మాస పత్రికలో 'రంగనాయకమ్మ పరిచయం చేసింది మార్క్సు నేనా?' అనే వ్యాసాన్ని ఇ.ఎస్. బ్రహ్మచారి రాశారు. నాకు రంగనాయకమ్మ కాపిటల్ పరిచయం మీద ఉన్న ఇష్టం వల్లా, దానివల్లే నేను అసలు మార్క్సిజం అంటే ఏమిటో కొద్దిగానైనా అవగాహన చేసుకోవడం వల్లా, ఇలా ఈ వ్యాసంలోని విషయాలను చర్చించటం వల్ల రంగనాయకమ్మ పుస్తకం మీద నాకున్న పరిజ్ఞానాన్ని ఇంకొంచెం పెంచుకునే వీలుంటుందని చెప్పి ఇది రాస్తున్నాను. నాకైతే ఇతర మార్క్సిస్టు పుస్తకాలు (తెలుగు, ఇంగ్లిష్) నేరుగా చదివి అర్థం చేసుకోగల స్థాయి లేదు. ఈ విషయంలో రంగనాయకమ్మకి మేమందరం ఎంతో రుణపడి ఉన్నాం. ఎందుకంటే, అసలు మార్క్సిజం అంటే ఏమిటో మాలాంటి వాళ్లం అర్థం చేసుకోవాలనే తాపత్రయం తోనే ఆమె ఎంతో తేలికైన భాషనుపయోగించి 'పెట్టుబడి' పరిచయం రాశారు.

ముఖ్యంగా ఈ వ్యాసంలో ఇ.ఎస్. బ్రహ్మచారి రాసిన ఉత్పాదక, అనుత్పాదక, స్వతంత్ర శ్రమల గురించి చెప్పినదాని వరకే నేను పరిమిత మవుతున్నాను. మొత్తం వ్యాసం చదవదలుచుకున్న వాళ్లు వీక్షణం వెబ్‌సైట్‌లో ఉంచిన ఏప్రిల్ సంచికలో 56 నుంచి 62 పేజీల వరకు ఉన్న ఈ వ్యాసాన్ని చదువుకోవచ్చు.

బ్రహ్మచారి రంగనాయకమ్మ 'పెట్టుబడి' పరిచయం (కార్ల్ మార్క్సు రాసిన పుస్తకాల పేజీ నెంబర్లు కూడా) పుస్తకంలోని పేజీ నెంబర్లను ఈ వ్యాసంలో ఇచ్చారు. అయితే ఆయన రంగనాయకమ్మ పెట్టుబడి పరిచయం 2004 పుస్తకంలో ఉన్న పేజీల నెంబర్లిచ్చారు. నా దగ్గరున్నది 2008 ముద్రణ. కాబట్టి అందులో ఆయన ఇచ్చిన పేజీ నెంబర్లు నా దగ్గరున్న పుస్తకం పేజీ నెంబర్లు ఒకటిగా లేవు. మారినయి. నా లాగే పెట్టుబడి పరిచయం 2008 ముద్రణ పుస్తకం ఉన్న వాళ్ల సౌలభ్యం కోసం, నేను 2008 పుస్తకం పేజీ నెంబర్లు బ్రాకెట్లలో ఇస్తున్నాను.

ఉత్పాదక శ్రమకు నిర్వచనం 'అదనపు విలువని ఇచ్చే శ్రమ ఉత్పాదక శ్రమ'. (పెట్టుబడి పరిచయం 2008 1. 450)

అనుత్పాదక శ్రమ అంటే 'అదనపు విలువను ఉత్పత్తి చేయని శ్రమ అనుత్పాదక శ్రమ' (పెట్టుబడి పరిచయం, 2008 1. 450). ఒక శ్రమనిగానీ, ఆ శ్రమతో తయారైన వస్తువుల్ని గానీ అమ్మకపోతే, ఆ శ్రమకు బదులుగా డబ్బు రాదు. అందులో ఉన్న అదనపు శ్రమ కూడా డబ్బుగా మారదు. విలువగా మారని శ్రమ, అదనపు విలువని ఇవ్వదు. (పెట్టుబడి పరిచయం 2008 1. 451)

'విలువగా మారకుండా ఉపయోగపు విలువగానే ఖర్చయ్యే శ్రమ అదనపు విలువను ఇవ్వదు, అందులో అదనపు శ్రమ ఉన్నప్పటికీ. అది అనుత్పాదక శ్రమ అవుతుంది. అంటే శ్రమకి ఉత్పాదక, అనుత్పాదక తేడాలు ఏర్పడేది, అది అదనపు విలువను ఇస్తోందా లేదా అనే దాన్ని బట్టి' (పెట్టుబడి పరిచయం 2008 1. 451)

'ఉత్పాదక శ్రమలు 'పెట్టుబడి'తో సంబంధంలో ఉంటే, అనుత్పాదక శ్రమలు 'ఆదాయం'తో సంబంధంలో ఉంటాయి.' (పెట్టుబడి పరిచయం 2008 1. 456)

'స్వతంత్ర ఉత్పత్తిదారులు అంటే, తమకు 'యజమాని' లేని తాము యజమానులుగా లేని ఉత్పత్తిదారులు.' (పెట్టుబడి పరిచయం 2008 1. 174).

ఇవన్నీ మార్క్సు చెప్పినవే, రంగనాయకమ్మ రాశారని బ్రహ్మచారి తన వ్యాసంలో ఒప్పుకున్నారు. అయితే రంగనాయకమ్మ పెట్టుబడి పరిచయం పుస్తకంలో కార్ల్ మార్క్సు అనుత్పాద కార్మికుడు ఎవరు అనే దానికి ఇచ్చిన ఉదాహరణలలో కొన్ని చోట్ల (చూసుకోకుండా) పొరపాటుగా స్వతంత్ర ఉత్పత్తిదారుడిని, అనుత్పాదక కార్మికుడిగా చెప్పాడు అంటూ రాశారు. (పెట్టుబడి పరిచయం 2008 531-536) అలా రంగనాయకమ్మ రాయడం ఎట్లా తప్పో, కారల్ మార్క్సు రాసింది ఎలా సరిగా ఉందో బ్రహ్మచారి ఈ వ్యాసంలో వివరించారు. దీన్ని బట్టి చూసినా ఉదాహరణల విషయంలో రంగనాయకమ్మ కార్ల్ మార్క్సును ఒక వేళ తప్పుగా అర్థం చేసుకున్నారనే అనుకుందాం, అంత మాత్రాన (నిర్వచనాలన్నీ మార్క్సు ప్రకారమే ఉన్నాయని ఆయనే ఒప్పుకుంటున్నారు కదా) రంగనాయకమ్మ పెట్టుబడి పరిచయం పుస్తకం మొత్తం తప్పు అనే అవగాహననిచ్చే విధంగా మరి 'రంగనాయకమ్మ పరిచయం చేసింది మార్క్సు నేనా?' అనే టైటిల్ పెట్టాల్సినంత అవసరం ఏమొచ్చిందో(తన గొప్పతనాన్ని చూపించుకోవడం కోసం కాకపోతే) నా కయితే అర్థం కావడం లేదు.

మార్క్సు ఒక ఉదాహరణలో పియానోను షాపులో కొనకుండా సొంతగా తయారు చేయించుకోవడం కోసం తనే ముడి పదార్థాలు కొనుక్కొని పియానో తయారు చేసే అతన్ని తన ఇంటికే పిలిపించుకొని పియానో తయారు చేయించుకుంటే అతను అనుత్పాదక కార్మికుడు అవుతాడు అని చెప్పాడు. ఇలా అనడం పొరపాటనీ, ఇతను స్వతంత్ర శ్రామికుడు అవుతాడని రంగనాయకమ్మ అన్నారు. బ్రహ్మచారి స్వతంత్ర ఉత్పత్తిదారుడి గురించి చెప్పిన మాటలు ఇక్కడ ఒకసారి చూడండి' ఉత్పత్తి సాధనాలూ – శ్రమ పరికరాలూ, ముడి పదార్థాలూ, – పెట్టుబడిదారులకు ఉన్నట్లే స్వతంత్ర ఉత్పత్తి దారులకు ఉంటాయి. పెట్టుబడిదారు వేతన శ్రామికుల చేత ఉత్పత్తి చేయిస్తాడు. స్వతంత్ర ఉత్పత్తిదారు తన శ్రమతో ఉత్పత్తి చేస్తాడు. – ఇదీ తేడా. వేతన శ్రామికుడికి ఉత్పత్తి సాధనాలు ఉండవు. కనక శ్రమశక్తిని అమ్ముకొని వేతన శ్రామికుడిగా ఉంటాడు. పియానో చేసిన శ్రామికుడు వేతన శ్రామికుడు. చేయించుకున్నవాడు వినియోగదారుడు.'

'వేతన శ్రామికుడికి ఉత్పత్తి సాధనాలు ఉండవు. ఉత్పత్తి సాధనాలు అంటే శ్రమ పరికరాలు, ముడిపదార్థాలు కలిపి అని ఆయనే చెప్పాడు. పియానో తయారు చేయడానికి కావలసిన శ్రమ పరికరాలు పియానో తయారు చేసే వ్యక్తి దగ్గరే ఉన్నాయి కదా మరి. దానికి కావలసిన ముడి పదార్థాలు మాత్రమే వినియోగదారుడు తెచ్చుకున్నాడు. అలా కాకుండా వినియోగదారుడు ఇతన్నే స్వతంత్రంగా పియానో ఇంటి దగ్గర తయారుచేసి తెమ్మన్నాడనుకోండి. అప్పుడైనే, అతనైనా దానికి కావలసిన ముడి పదార్థాలను అప్పటికప్పుడు బయట కొని తేవలసిందే కదా. ఇతను కొనే బదులు వినియోగదారుడు కొన్నాడు. ఇతను పియానో తయారు చేయడానికి కావలసిన శ్రమ పరికరాలను తెచ్చి చేసి ఇచ్చి వెళ్లాడు. ఆ పియానో ధర బయట మార్కెట్లో ఎంత ఉంటుందనేది ఇద్దరికీ తెలిసే ఉంటుంది కదా! ఇతను మెటీరియల్ ధర పోను ఆ ధరనే తీసుకున్నట్లైతే అతని విలువ అతనికి వచ్చినట్లే కదా. ఇక్కడ అనుత్పాదక శ్రామికుడిగా అతను అదనపు శ్రమను చేయడం ఎలా సాధ్యం అవుతుంది. ఇన్ని గంటలు అని చెప్పి రోజూ పని చేస్తుంటే అదనపు శ్రమను లాగే వీలుంటుంది. అదే రంగనాయకమ్మ చెప్పారు. పియానోల్ని ఆ ఇంట్లో రోజూ ఒకటి చేయదు. ఇది యజమానీ శ్రామిక సంబంధం కాదు. ఈ శ్రామికుడు స్వతంత్ర ఉత్పత్తిదారుడుగా లెక్కకు రావాలి.' (పెట్టుబడి పరిచయం 2008 1.533) అని.

పైన బ్రహ్మచారి చెప్పిన చివరి వాక్యంలో ఉన్న వైరుధ్యం చూడండి. ఒకరు కనక వేతన శ్రామికుడైతే ఇంకొకరు ఏమవ్వాలి? యజమాని అవ్వాలి కదా! కానీ ఈయన అతన్ని వినియోగదారుడుగానే గుర్తించారు. అంటే వేతన శ్రామికుడు ఏమై ఉండాలి? స్వతంత్ర ఉత్పత్తిదారుడే అయి ఉండాలి కదా! వినియోగదారులు తమ ఆదాయాలతో ఒక కొట్లో వస్తువులు

కొనుక్కున్నట్లైతే మొత్తం డబ్బు చెల్లించే కొనుక్కుంటారు. అలాగే ఒక స్వతంత్ర శ్రామికుడి దగ్గర వస్తువులు కొనుక్కున్నా అలాగే జరుగుతుంది. మార్కెట్లో దాని విలువ ఎంతుందో దాని ప్రకారమే ఆ వస్తువు అతను అమ్ముకుంటాడు. వినియోగదారులు కొనుక్కుంటారు. ఇందులో వినియోగదారులు ఎక్కువ శ్రమను లాగేదేమి ఉంటుంది?

ఇంకా దీని గురించి రంగనాయకమ్మ అన్నది చూడండి. 'ఒక పనివాడు అనుత్పాదక శ్రామికుడిగా లెక్కకు రావాలంటే అతను ఒక ఇంటిలో గానీ, ఒక ఉత్పత్తి స్థలంలో గానీ, ఒక యజమాని కింద జీతానికి పని చేసే వేతన శ్రామికుడిగా ఉండాలి. అలా కానీ వ్యక్తి అనుత్పాదక శ్రామికుడు కాడు. ఇంటికి వచ్చి పియానో చేసి ఇచ్చిన శ్రామికుడి కోసం ఆ ఇంటి యజమాని తన 'ఆదాయం' లోంచి చెల్లించడం చూసి, ఆ శ్రామికుణ్ణి అనుత్పాదక శ్రామికుడిగా భావించడం పొరపాటు. ఆదాయంలో నుంచి ఖర్చు పెట్టడం అనేది, స్వతంత్ర ఉత్పత్తిదారుడితో ఒక పని చేయించుకున్నప్పుడు, అతను తయారు చేసిన వస్తువుల్ని కొన్నప్పుడూ కూడా జరుగుతుంది. కాబట్టి ఆదాయంలోంచి చెల్లించడాన్ని చూసి, అమ్మిన వ్యక్తిని 'అనుత్పాదక శ్రామికుడు' అని నిర్ణయించడానికి వీలులేదు.' సూత్రాన్ని అన్వయించేటప్పుడు రెండో వైపు నుంచి కూడా చూడాలి కదా! పియానో తయారు చేసిన వ్యక్తిని స్వతంత్ర ఉత్పత్తిదారుడుగా నిర్ణయించే విషయంలో రంగనాయకమ్మ చేసిన పని అదే.

రంగనాయకమ్మ అనుత్పాదక శ్రామికుడు, స్వతంత్ర ఉత్పత్తిదారులు విషయంలో మార్క్స్ ఇచ్చిన ఇంకో ఉదాహరణ కూడా చూపిస్తూ ఇది కొంత గందరగోళంగా ఉంది అన్నారు. బ్రహ్మాచారేమో రంగనాయకమ్మే మార్క్స్ రాసినది అర్థం కాక గందరగోళపరిచారు అని అంటున్నారు. మార్క్స్ కొటేషన్ 'నేను తొడుక్కోవడానికి, ఒక టైలర్‌తో ఇంటి దగ్గరే ఒక కోటుని తయారు చేయించుకొన్నప్పుడు, ఆ విషయం నన్ను ఆర్థిక అర్థంలో 'యజమానిగా' చేయదు. ఒక యజమాని-టైలరు, తన పని వాళ్లు తయారు చేసిన కోటుని, తన స్వంత అవసరానికి వాడుకున్నప్పుడు, అది, 'యజమాని - టైలర్‌ని' ఎలాగైతే యజమానిగా చేయదో, అలాగే, నా విషయంలో జరిగింది కూడా నన్ను అంతకన్నా ఎక్కువేమీ యజమానిగా చేయదు. ఇక్కడ, కుట్టు శ్రమని కొన్నవాడూ, కోటుని కుట్టిన టైలరూ కేవలం కొనుగోలుదారుడుగానూ, అమ్మకందారుడుగానూ మాత్రమే ఒకరికొకరు ఎదురవుతారు. ఒకరు డబ్బు చెల్లిస్తే, ఆ డబ్బు ఏ ఉపయోగపు విలువ రూపంలోకైతే మారిందో, ఆ ఉపయోగపు విలువని ఇంకొకరు సరుకుగా చెల్లిస్తారు. ఈ లావాదేవీకీ, నేను ఒక షాపు నుంచి కోటుని కొనడానికీ, తేడా ఏమీ ఉండదు. ఇక్కడ కొనుగోలుదారుడూ, అమ్మకందారుడూ, ఒకరికి ఒకరు ఎదురవుతారు. దీనికి భిన్నంగా ఇంకో ఉదాహరణలో అయితే, పెట్టుబడిగానూ, 'వేతన శ్రమగానూ ఒకరికొకరు ఎదురవుతారు. 'గృహ సేవకుడి' కి (డొమెస్టిక్ సర్వెంట్‌కి) సంబంధించి చూస్తే, అతని విషయం, ఇంటికి వచ్చి కుట్టి పెట్టే టైలరు విషయంలో లాగే ఉంటుంది' (పెట్టుబడి పరిచయం 2008 1.534)

(రంగనాయకమ్మ మాటలు)పై కొటేషన్లో మార్క్స్ ఇంటికి వచ్చి కోటు కుట్టి ఇచ్చే శ్రామికుణ్ణి అనుత్పాదక శ్రామికుడిగా గాక, స్వతంత్ర శ్రామికుడిగానే చెపుతున్నాడు. ఆ స్వతంత్ర శ్రామికుడికి, ఆ ఇంటి మనిషి, యజమానిగా ఉండడనీ, గృహ సేవకుడి మీద మాత్రం యజమానిగా ఉంటాడనీ చెపుతున్నాడు.' (పెట్టుబడి పరిచయం 2008 1.534). బ్రహ్మాచారి ఇలా రంగనాయకమ్మ చెప్పింది 2 రకాలుగా తప్పు అని తన వ్యాసంలో రాశారు. ఇక్కడ ఎంట్రప్రెన్యూర్ అని మార్క్స్ రాస్తే ఈమె యజమాని అని అనువదించారని, ఎంట్రప్రెన్యూర్‌కు యజమానికీ తేడా ఉందని ఒకటీ, 'జాబింగ్ దర్జీ శ్రమ నా డబ్బుతో మారకం అయింది అంటే తయారైన సరుకుతో డబ్బు మారకం కాదిది. ఆ శ్రమను తయారు చేసే శ్రమతో డబ్బు మారకం. అంటే అతను అనుత్పాదక శ్రామికుడే' అని కార్ల్ మార్క్స్ చెప్పాడు అని ఈయన చెప్పుకొచ్చారు. కానీ ఇక్కడ కొచ్చేటప్పటికే ఆయన మార్క్స్ పూర్తి కొటేషనును ఇవ్వలేదు. తనకు కావలసినంత వరకే ఉపయోగించుకుంటూ రాసేశారీయన. ఈ విషయం మొదలు పెట్టి రాసేటప్పుడు కూడా కనెక్షన్ వాక్యాలు కూడా లేకుండా చాలా గందరగోళంగా రాసేశారీయన. మార్క్స్ చివర రాసిన వాక్యం చూడండి 'ఈ లావాదేవీకీ, నేను ఒక షాపు నుంచి కోటుని కొనడానికీ, తేడా ఏమీ ఉండదు. ఇక్కడ కొనుగోలుదారుడూ, అమ్మకందారుడూ, ఒకరికి ఒకరు ఎదురవుతారు.'(ఈ మాటలను ఆయన ఇచ్చిన కొటేషన్లో అసలు తీసుకోనేలేదు) అని స్పష్టంగా ఉంది. అలాగే మార్క్స్ 'ఇక్కడ, కుట్టు శ్రమని కొన్నవాడూ, కోటుని కుట్టిన టైలరూ కేవలం కొనుగోలుదారుడుగానూ, అమ్మకందారుడుగానూ మాత్రమే ఒకరికొకరు ఎదురవుతారు. ఒకరు డబ్బు చెల్లిస్తే, ఆ డబ్బు ఏ ఉపయోగపు విలువ రూపంలోకైతే మారిందో, ఆ ఉపయోగపు విలువని ఇంకొకరు సరుకుగా చెల్లిస్తారు' అని ఇక్కడ ఇంత స్పష్టంగా ఉంటే ఈయన 'జాబింగ్ దర్జీ శ్రమ నా డబ్బుతో మారకం అయింది అంటే తయారైన సరుకుతో డబ్బు మారకం కాదిది.' అని రాసేస్తుంటే ఎవరిది గందరగోళం అనుకోవాలి. పోనీ మొత్తం కొటేషన్ ఇంగ్లిష్లో ఇచ్చి మళ్లా దాని అనువాదం తెలుగులో ఇచ్చారా అంటే అదీ లేదు. ఇస్తేనే రంగనాయకమ్మగారిది తప్పు అనువాదం అని తేలుతుంది. అది ఇస్తే ఈయన బండారం బయటపడుతుందనే ఈయన దీని దగ్గరకొచ్చేటప్పటికి తనకు కావలసిన ముక్కలే కొటేషన్లుగా ఇచ్చారేమోనని నా కనుమానంగా ఉంది.

ఈ అనుత్పాదక శ్రమ గురించి రంగనాయకమ్మ చెప్పిన సూత్రాలు వాటి విషయంలో కూడా ఇంకా ఏవేవో తప్పులున్నాయని చెప్పి బ్రహ్మాచారి రాశారు. రంగనాయకమ్మ ఎంతో సూటిగా సరళంగా ఒక తర్కంతో చెప్పినవాటిని కూడా ఈయన గందరగోళం చేసేసి ఆమె గందరగోళం చేశారు అని వాదించేస్తున్నారు ఈ వ్యాసం మొత్తంలో.

- లక్ష్మి మంజరి

ఇమెయిల్‌లో వచ్చిన ఉత్తరం

వీ

రాబోయే సంచికలలో...

- **అభివృద్ధి చర్చ - సమకాల తెలంగాణ - కొన్ని ఆలోచనలు - హారతి వాగీశన్**
- **ఆర్థిక సంస్కరణలు-వ్యవసాయ సంక్షోభం - మచ్చ శ్రద్ధానందం**
- **గురజాడ రాత ప్రతుల ప్రస్థానం - పి.పి.సి. జోషి**
- **భారత దేశ విదేశాంగ విధానం - చైనా, నేపాల్ సంబంధాలు - డా. సామ సువర్ణాదేవి**
- **డిడి కోసంబి రచనల అన్వేషణ - రామకృష్ణన్ రామస్వామి**

చలో ఎచ్‌సియు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విసి అప్పారావు రాజీనామా చేయాలని, రోహిత్ చట్టం తీసుకురావాలన్న డిమాండ్లతో ఏప్రిల్ 6న జాక్ ఫర్ సోషల్ జస్టిస్, విద్యార్థి సంఘాలు చేపట్టిన చలో యూనివర్సిటీ కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. విసి ఏర్పాటు చేసిన అకడమిక్ కౌన్సిల్ సమావేశాన్ని విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తూ చలో ఎచ్‌సియులో పాల్గొన్నారు. యూనివర్సిటీ లోనికి వెళ్లడానికి ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు గేటు బయటే అడ్డుకున్నారు. చలో ఎచ్‌సియుకి మద్దతు తెలిపి వచ్చిన ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు, టివివి విద్యార్థి సంఘాల నాయకులను గేటు వద్దే అరెస్ట్ చేశారు.

మావోయిస్టు అగ్రనేత రవి మృతి

మావోయిస్టు అగ్రనేత కుడుముల రవి అలియాస్ వెంకటరావు ఏప్రిల్ 9న మృతి చెందారు. గత కొద్దికాలంగా ఆయనకి పచ్చకామెర్లతో పాటు క్షయ వ్యాధి కూడా సోకినట్లు వైద్యులు తెలిపారు. ఆయన తీవ్ర అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉండగా, మావోయిస్టు పార్టీ ఐదు రోజుల కిందట అమ్మవారి దారకొండ ప్రాంతానికి తీసుకువచ్చారు. రెండు దశాబ్దాలుగా ఆయన మావో ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. విశాఖ ఏజెన్సీలోని చింతపల్లి మండలం కొమ్మంగి గ్రామం ఆయన స్వస్థలం.

తెలంగాణ జెఎసి 'లక్ష్య ప్రకటన'

తెలంగాణ జెఎసి విస్తృత స్థాయి సమావేశం ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా జెఎసి 'లక్ష్య ప్రకటన'ను రాష్ట్ర సమన్వయకర్త పిట్టల రవీందర్ ప్రతిపాదించగా జెఎసి నేతలు ఖాజా మొహినొద్దీన్, అడ్వకేట్స్ జెఎసి నాయకులు నల్లపు ప్రహ్లాద్ బలపర్చగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశానికి 45 సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశం సందర్భంగా పలు ఏకగ్రీవ తీర్మానాలు ప్రతిపాదించింది.

విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలి

అంబేద్కర్ జయంతి సందర్భంగా రోహిత్ వేముల న్యాయపోరాట సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో 'యూనివర్సిటీల్లో కుల వివక్ష, హింసలకు వ్యతిరేకంగా' ఏప్రిల్ 14న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎచ్‌సియు విద్యార్థులు, ప్రొఫెసర్లపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలనీ, దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలనీ, లేదంటే పోరాటాలు తప్పవనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల కార్యకర్త, సీనియర్ పాత్రికేయులు తీస్తా సెతల్వాద్, సూరేపల్లి సుజాత, తథాగత్ సేన్‌గుప్త, కె.వై. రత్నం, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బండారు లక్ష్మయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టు దాసరి రవీందర్ మృతి

సీనియర్ జర్నలిస్టు దాసరి రవీందర్ (40) ఏప్రిల్ 16న కన్నుమూశారు. కరీంనగర్ జిల్లా జగిత్యాల మండలం రాయికల్ గ్రామానికి చెందిన రవీందర్ కొంతకాలంగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నారు. చికిత్స కోసం వారంరోజుల క్రితం ఆయన సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు బ్రెయిన్ ఎన్యూరిజమ్ అని తేల్చారు. రవీందర్ గత రెండేళ్లుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పీఆర్వోగా పనిచేస్తున్నారు.

రైల్వే జోన్ ఏర్పాటు కోసం దీక్ష

విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఏప్రిల్ 14న ఆమరణ నిరాహార దీక్షను చేపట్టారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకొని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అమర్‌నాథ్ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ 'ఆంధ్రుల హక్కు - విశాఖ ఉక్కు' అనే నినాదంతో స్టీలు ప్లాంట్‌ను సాధించుకున్నట్లే, విభజన బిల్లులో పొందుపరిచిన రైల్వేజోన్‌ను విశాఖ కేంద్రంగా సాధించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. మూడు రోజుల పాటు దీక్ష కొనసాగగా, ఏప్రిల్ 17 అర్ధరాత్రి పోలీసులు దీక్షను భగ్నం చేసి అమర్‌నాథ్‌ను కెజిఎచ్‌కు తరలించారు.

బ్రాండిక్స్‌లో మహిళా కార్మికుల మెరుపు సమ్మె

విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలంలోని స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఇజెడ్)లో బ్రాండిక్స్ మహిళా కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. ఏప్రిల్ 18న సుమారు 4 వేల మంది కార్మికులు తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ ప్రధాన ద్వారం వద్దకు వచ్చి బైటాయించారు. వేతనాలు పెంచాలని, పిఎఫ్ చెల్లింపులో పాత విధానాన్నే అమలు చేయాలని, వేధింపులు ఆపాలంటూ కార్మికులు డిమాండ్ చేశారు. సెజ్‌లోని బ్రాండిక్స్ అపరెల్ సిటీలో క్వాంటం, సీడ్స్, బ్రాండిక్స్ - 3 యూనిట్లకు చెందిన మహిళా కార్మికులు డిమాండ్ల పరిష్కార కోసం నినాదాలు చేస్తూ, పరిశ్రమ మెయిన్ గేట్ వద్ద బైటాయించారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి మహిళా ఉద్యోగినులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కార్మికుల ఉద్యమం గురించి తెలుసుకున్న వైసిపి, సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి, ఆమ్‌ఆద్మీ పార్టీలకు చెందిన నాయకులు కూడా చేరుకుని మద్దతు పలికారు. వేతనాల పెంపును ప్రకటిస్తే తప్ప ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేవారు

వడదెబ్బ మృతులపై అస్పష్టత

వడదెబ్బ మృతులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో స్పష్టత లోపించింది. 13 జిల్లాల పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ 19 వరకు కేవలం 125 మంది మాత్రమే మరణించినట్లు ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏటా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వడదెబ్బ మృతుల సంఖ్య కూడా పెరుగుతోంది. 2014 వేసవిలో 448 మంది మృతి చెందినట్లు ప్రభుత్వ గణంకాలు చెపుతున్నాయి. 2015లో ఈ సంఖ్య 1369కి పెరిగినట్లు ప్రభుత్వ వర్గాలు నివేదించాయి. అయితే వడదెబ్బ మృతుల సంఖ్యపై ప్రభుత్వ వర్గాలు ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించలేకపోతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన పలువురు సామాజిక వేత్తలు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన హైకోర్టు ఆంధ్రప్రదేశ్‌తో పాటుగా తెలంగాణ ప్రభుత్వానికి కూడా నోటీసులు జారీ చేసింది.

'హైదరాబాద్ కలెక్టివ్' సెమినార్

ఏప్రిల్ 21-22న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సెమినార్ నిర్వహించారు. ఏప్రిల్ 21న 'మీడియా - మతతత్వం' అంశంపై సదస్సు జరిగింది. ప్రముఖ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ 'దేశంలో మార్కెట్, మతతత్వ శక్తుల కూటమిదే రాజ్యంగా ఉన్నదనీ, సరళీకరణ మలిదశలో మీడియా యాజమానులే ప్రథమ లబ్ధిదారులుగా ఉంటార'ని అన్నారు. ఏప్రిల్ 22న 'సహజ వనరులు - క్రోనీ క్యాపిటలిజం' అంశంపై ఇపిడబ్ల్యు సంపాదకులు పరన్జోయ్ గుహ థాకుర్తా బడాబాబులు విదేశాల్లో దాచిన డబ్బును తిరిగి దేశానికి రప్పిస్తాం అంటూ ఎన్నికల సమయంలో చెప్పిన మోడీ ప్రధాని అయిన తరువాత నోరు మెదపడం లేదనీ, ఏ బూర్జువా పార్టీ నాయకుడైనా విదేశాల్లోని డబ్బును తిరిగి దేశంలోకి తీసుకురాలేడ'ని స్పష్టం చేశారు. వీ

హర్యానాలో జాట్‌లకు రిజర్వేషన్లు

జాట్ రిజర్వేషన్ బిల్లుకి హర్యానా రాష్ట్ర కేబినెట్ మార్చ్ 29న ఆమోదం తెలిపింది. విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించే జాట్‌ల రిజర్వేషన్ బిల్లును హర్యానా అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మేరకు జాట్‌లతో పాటు మరో నాలుగు కులాలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో ఆరు నుంచి 10 శాతం రిజర్వేషన్లు కల్పించారు. కాగా రిజర్వేషన్లు కల్పించాలంటూ రాష్ట్రంలోని జాట్ వర్గీయులు గత కొద్దిరోజులుగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.

ఇరోమ్ షర్మిల నిర్దోషి

మణిపూర్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త ఇరోమ్ షర్మిలను ఢిల్లీ కోర్టు నిర్దోషిగా పేర్కొంది. సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సుదీర్ఘకాలంగా నిరాహారదీక్ష చేస్తున్న ఆమెపై ఆత్మహత్యాయత్నం కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మార్చ్ 31న ఈ కేసులో ఆమెను నిర్దోషిగా మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ప్రకటించారు.

బిహార్‌లో సంపూర్ణ మద్య నిషేధం

బిహార్‌లో మద్యాన్ని నిషేధిస్తూ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఏప్రిల్ 4న ఉత్తర్వులు జారీ చేశారు. ముందుగా రాష్ట్రంలో పాక్షికంగా అమలు చేసిన మద్యనిషేధాన్ని తర్వాత సంపూర్ణంగా నిషేధించారు. అలాగే తాటికల్లు క్రయ విక్రయాలును నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ప్రొ. సాయిబాబాకు బెయిల్

మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై నాగపూర్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాకు సుప్రీం కోర్టులో జస్టిస్ జెఎస్ ఖేహర్, జస్టిస్ సి. నాగప్పన్‌ల ధర్మాసనం ఏప్రిల్ 4న బెయిల్ మంజూరు చేసింది. నిందితుడి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వీల్‌చైర్‌కే పరిమితమైన ఆయన ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదంటూ మహారాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టింది. ఆధారాలన్నీ పరిశీలిస్తే ఇంకా ఆయనను జైల్లో ఉంచాల్సిన అవసరం కనిపించడం లేదని స్పష్టం చేసింది.

నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో యావజ్జీవ శిక్ష

పిలిభిత్ నకిలీ ఎన్‌కౌంటర్‌లో 47 మంది పోలీసులకు యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం ఏప్రిల్ 4న తీర్పు చెప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని పిలిభిత్‌లో 1991, జూలై 12న సిక్కు యాత్రికులతో వెళ్లున్న ఒక బస్సును ఆపి పోలీసుల అందులోని పది మందిని బలవంతంగా తమతో తీసుకెళ్లారు. ఆ తర్వాత వారిని వేర్వేరు ప్రాంతాలలో కాల్చిచంపారు. ఆ తర్వాత రోజు పది మంది ఖలిస్థాన్ ఉగ్రవాదులను చంపినట్లు పోలీసులు ప్రకటించారు. దీనిపై సుప్రీం కోర్టు ఆదేశాలతో దర్యాప్తు చేపట్టిన సిబిఐ అవార్డుల కోసమే వారిని పోలీసులు చంపినట్లు తేలింది.

శ్రీనగర్ నిట్‌లో ఉద్రిక్తత

జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) లోని స్థానిక, స్థానికేతర విద్యార్థుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఓడిపోయిన తరువాత కొంత మంది స్థానిక విద్యార్థులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకోగా, స్థానికేతర విద్యార్థులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య ఘర్షణలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 5న విద్యార్థుల పై పోలీసులు జరిపిన లాఠీచార్జీపై చర్యలు తీసుకోవాలని, ఎన్ఐటిని కశ్మీర్ నుంచి ఇతర ప్రాంతాలకి మార్చాలని స్థానికేతర విద్యార్థులు డిమాండ్ చేశారు.

కేరళలో అగ్నిప్రమాదం

కేరళలోని పుట్టింగల్ దేవి ఆలయం వద్ద ఏప్రిల్ 10న తెల్లవారుజామున బాణసంచా పేలుళ్లలో 108 మంది మృతి చెందగా 300 మందికిపైగా భక్తులు గాయాలపాలయ్యారు. పుట్టింగల్ దేవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా బాణ సంచా పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో కొన్ని నిప్పురవ్వలు బాణ సంచా నిల్వ ఉంచే గదిపై పడడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది.

ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన-రద్దు-పునరుద్ధరణ

ఉత్తరాఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని తెలుపుతూ ఆ రాష్ట్ర గవర్నర్ ఇచ్చిన నివేదికను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఏప్రిల్ 3న ఆమోదించారు. సిఎం హరీష్‌రావత్‌పై కాంగ్రెస్, రెబల్ ఎంఎల్ఎలు అవిశ్వాసం ప్రకటించడంతో రాష్ట్రంలో సంక్షోభం ఏర్పడింది. అయితే ఏప్రిల్ 21న రాష్ట్రపతి పాలనను రద్దు చేయాలంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో మళ్లీ రాష్ట్రపతి పాలనను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఏప్రిల్ 27లోగా రాష్ట్రపతి పాలనను ఎత్తివేయబోమంటూ కేంద్రం నుంచి కోర్టు హామీ తీసుకుంది.

రహదారులపై ప్రార్థన మందిరాలా? - సుప్రీం

దేశవ్యాప్తంగా రహదారులు, కాలిబాటలపై చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్రార్థన మందిరాల విషయంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వ్యవహరిస్తున్న తీరుపై సుప్రీంకోర్టు ఏప్రిల్ 19న అసంతృప్తిని వ్యక్తం చేసింది. మతపరమైన అక్రమ నిర్మాణాల తొలగింపునకు తీసుకునే చర్యలపై ప్రమాణ పత్రం దాఖలు చేయడంలో విఫలమైన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ వి. గోపాల గౌడ, అరుణ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పలు వ్యాఖ్యలు చేసింది. 'అలాంటి నిర్మాణాలను కూల్చివేయాలి. ఏ రాష్ట్రమూ ఏమీ చేయడం లేదని మాకు తెలుసు. ఇలాంటి వాటిని అనుమతించే హక్కు మీకు లేదు.' ఆఖరు అవకాశంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రెండు వారాల గడువు ఇచ్చింది.

పుదుచ్చేరి నిట్ విద్యార్థుల ఆందోళన

పుదుచ్చేరిలోని కారైకల్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) విద్యార్థులు సమ్మెబాట పట్టారు. ఆరేళ్ల క్రితం స్థాపించిన నిట్ సంస్థకు ఇప్పటి వరకూ శాశ్వత భవనం, ఆవరణ లేదు. ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. అక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తరగతులు బహిష్కరించి సమ్మెకు దిగారు. 2013లోనూ ఇలాగే విద్యార్థులు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఉద్యమం చేశారు. అప్పట్లో ఆరు నెలల్లో నిట్‌కు శాశ్వత ప్రాంగణం ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చి విరమింపజేశారు. అయితే ఇప్పటివరకూ అలాంటి ప్రయత్నాలేవీ చేయకపోవడంతో విద్యార్థులు మళ్లీ ఉద్యమ బాట పట్టారు. నిట్ సంచాలకులు ఎస్.కె.పాండేను బదిలీ చేసి, మరొకర్ని సంచాలకులుగా నియమించాలని, కారైకల్‌లో నిట్‌కు శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సంస్థలో మొత్తం 429 మంది విద్యార్థులు చదువుతున్నారు.

పిఎఫ్ సవరణలపై కార్మికుల నిరసన

ఉద్యోగుల భవిష్య నిధి (ఇపిఎఫ్) నిబంధనలలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన మార్పులకు వ్యతిరేకంగా బెంగళూరు, దాని పరిసర పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులు ఏప్రిల్ 18 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరసనకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో ఆందోళకారులు హింసాత్మక దాడులకు దిగారు. వీ

భూగోళమంత అవినీతి

ప్రపంచ వ్యాప్తంగా అక్రమ సంపాదనను ఆర్జించిన దేశాధ్యక్షులు, వ్యాపార వేత్తలు, ఆటగాళ్లు, నేరస్తులు, సినీ నటులు, తారలు ఉత్తుత్తి కంపెనీల పేరుతో సంపదను పోగుచేసుకున్నారు. ఇందులో 500 మంది భారతీయులు ఉన్నారు. 70 దేశాల ప్రస్తుత, మాజీ అధ్యక్ష, ప్రధానులు వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. అందులో రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్తాన్ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ తదితరులు ఉన్నారు. 377 మంది పాత్రికేయులు నెలల తరబడి శోధించి 1.15 కోట్ల రహస్య పత్రాలను బయటపెట్టారు. ఈ అవినీతి వ్యవహారం అంతా పనామా అనే చిన్న దేశం కేంద్రంగా, బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్ అనే మరో దేశం కేంద్రంగా సాగింది. ఐస్ల్యాండ్ ప్రధాని రాజీనామా చేశారు.

లాహోర్‌లో మానవ బాంబు పేలుడు

పాకిస్తాన్‌లోని లాహోర్‌లో ఎక్బాల్ టౌన్‌లో ఉన్న గుల్షన్-ఎ-ఇక్బాల్ పార్క్‌లో మార్చ్ 27న ఓ వ్యక్తి తనను తాను పేల్చుకున్నాడు. దీంతో 60 మంది చనిపోగా, 300కు పైగా గాయపడ్డారు. మృతుల్లో మహిళలు, పిల్లలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ ఘటనతో పార్క్ అంతా రక్తసిక్తమైందని, పలువురి శరీర అవయవాలు పడి ఉన్నాయని ప్రత్యక్ష సాక్షి ఒకరు వెల్లడించారు. లాహోర్‌లోని అన్ని ఆస్పత్రులలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు.

మయన్మార్ అధ్యక్షునిగా టిన్ చా

మయన్మార్ రాజకీయ చరిత్రలో ఐదు దశాబ్దాల సైనిక ఆధిపత్య పాలనకు దాదాపు తెరపడింది. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధి తొలిసారి దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. మయన్మార్‌లో అంగ్‌సాన్ సూచీ మిత్రుడు టిన్ చా (69) మార్చ్ 30న మయన్మార్ పార్లమెంట్‌లో నూతన అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. మయన్మార్ మాజీ అధ్యక్షుని నుంచి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. అంగ్‌సాన్ సూచీ విదేశాంగ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. మిలిటరీ సైతం కీలకమైన హోం, రక్షణ, సరిహద్దు భద్రత శాఖలకు ముగ్గురు అభ్యర్థులను మంత్రులుగా నామినేట్ చేసింది.

ఆఫ్రికాలో సైనికుల అకృత్యాలు

శాంతిస్థాపన కోసం ఆఫ్రికాకు పంపిన సైనికుల బృందం అకృత్యాలకు అంతులేకుండా పోయింది. మైనర్ బాలికలను తాళ్లతో కట్టేసి, వివస్త్రలుగా మార్చి అమానుషంగా కుక్కలతో అత్యాచారం చేయించారని ముగ్గురు మైనర్ బాలికలు తెలిపారు. ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక దళ సైనికులు మహిళలపై లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఆరోపణలపై యుఎన్ బృందం ఒకటి సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో పర్యటిస్తోంది. సైనికుల అకృత్యాలకు సంబంధించి బాధిత మహిళలను కలుసుకొని వివరాలు సేకరిస్తోంది. ఈ బృందం ముందుకు మరో వంద మంది మహిళలు అత్యాచార ఆరోపణలతో వచ్చారు. ఆరోపణల నేపథ్యంలో ఏప్రిల్ 1న యుఎన్ సెక్రటరీ జనరల్ బాన్ కీ మూన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

సిరియాపై వైమానిక దాడులు

సిరియాపై జరిపిన వైమానిక దాడుల్లో 24 మంది ఇస్లామిక్ స్టేట్ మిలిటెంట్లతో పాటు 8 మంది పౌరులు మృతి చెందారు. ఈ వైమానిక దాడులను సిరియా, రష్యా, అమెరికా దళాల్లో ఎవరు జరిపారో తెలియరాలేదని మానవహక్కుల పరిశీలకులు తెలిపారు. మరోవైపు అలెప్పోలో ఇరువర్గాల మధ్య జరిగిన భీకరదాడిలో 35 మంది మరణించినట్లు పరిశీలకులు తెలిపారు. ఈ పోరులో 19 మంది అల్‌ఖైదా సానుభూతి పరులతో పాటు 16 మంది సైనికులు మరణించినట్లు వెల్లడించింది.

54 శాతానికి పెరిగిన మరణ శిక్షలు

మరణ శిక్షలు నిషేధించాలని ప్రపంచవ్యాప్తంగా మానవహక్కుల సంఘాలు గగ్గోలు పెడుతున్నప్పటికీ 2015లో వాటి సంఖ్య 54 శాతం పెరిగిందని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంది. అత్యధిక మరణ శిక్షలు విధిస్తున్న దేశాల జాబితాలో చైనా, ఇరాన్, పాకిస్తాన్, సౌదీఅరేబియా, అమెరికా తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. మొదటి మూడు దేశాల్లోనే దాదాపు 90 శాతం మరణశిక్షలు అమలయినట్లు వెల్లడించింది. 2014లో 22 దేశాల్లో 1,061 మరణశిక్షలు అమలుకాగా, 2015లో ఈ సంఖ్య 1,634కు పెరిగిందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల్లో మరణశిక్షను నిషేధించారు. గత సంవత్సరం దాదాపు 61 దేశాల్లో 1,998 మరణశిక్షలు నమోదయ్యాయి.

భూకంపాలతో తల్లడిల్లుతున్న దేశాలు

ఏప్రిల్ 14 నుంచి 17 వరకు వరుస భూకంపాలతో ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, జపాన్‌లోని కుమమెటో కేంద్రంగా సంభవించిన రెండు భూకంపాలు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. 14న మయన్మార్‌లో సంభవించిన భూకంపంతో భారత్‌లో కూడా కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి. 17న దక్షిణ అమెరికాలోని ఈక్వెడార్‌లో 7.8 తీవ్రతతో సంభవించిన భూకంపం వల్ల ఏప్రిల్ 19 నాటికి మృతుల సంఖ్య 413కు చేరుకుంది. మూడు నాలుగు వేల మంది గాయపడ్డారు. లక్షకు పైగా నిరాశ్రయులయ్యారు. జపాన్‌లో ఏప్రిల్ 14న రాత్రి సంభవించిన భూకంపం ధాటికి తొమ్మిది మంది మృతి చెందగా, పలు ఇళ్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. క్యుషు ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 6.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీని కారణంగా దాదాపు 44 వేల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇండోనేషియా సముద్రంలో ఏప్రిల్ 15 తెల్లవారుజామున భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేల్‌పై భూకంప తీవ్రత 5.6గా నమోదైంది. మలుకు బరత్ దయ ప్రాంతానికి 215 కిలోమీటర్ల దూరంలో, సముద్రమట్టానికి 134 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి

అఫ్ఘానిస్తాన్‌లో తాలిబన్లు దేశ రాజధాని కాబూల్‌లో ఏప్రిల్ 19న ట్రక్కు బాంబుతో ఆత్మహుతి దాడికి పాల్పడడంతో 30 మంది మృతిచెందారు. ఈ ఘటనలో దాదాపు 320 మంది గాయపడ్డారు. ప్రముఖుల భద్రతా వ్యవహారాలు పర్యవేక్షించే ప్రభుత్వ భద్రతా సంస్థ కార్యాలయం లక్ష్యంగా కాబూల్‌లో ఈ దాడి జరిగింది. వందలాది కిలోల పేలుడు పదార్థాలతో ఉన్న ట్రక్కును జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రధాన ద్వారం వద్ద ఆత్మాహుతి దళ సభ్యుడు పేల్చివేశాడు. ఈ దాడికి పాల్పడింది తామేనని తాలిబన్ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ప్రకటించాడు.

ప్రపంచ వ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

180 దేశాల్లో పత్రికా స్వేచ్ఛకు సంబంధించి 'రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్' విడుదల చేసిన 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచీ-2016'లో ఫిన్లాండ్ వరుసగా ఆరో ఏడాది ప్రథమస్థానంలో నిలవగా... రెండోస్థానాన్ని నెదర్లాండ్స్, మూడోస్థానాన్ని నార్వే దక్కించుకున్నాయి. పాకిస్థాన్-147, అఫ్ఘనిస్తాన్-120, బంగ్లాదేశ్-144, చైనా-176, అమెరికా-44 స్థానాల్లో నిలిచాయి. భారతదేశం 133వ స్థానంలో నిలిచింది. భారత్‌లో పాత్రికేయులపై పలు మతసంస్థలు దాడులు జరుపుతున్నాయంటూ తాజా నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది. పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రధాని మోదీ అంతగా చొరవ చూపుతున్నట్లు కనిపించడం లేదని అభిప్రాయపడింది. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(మార్చ్ 1 నుండి మార్చ్ 31, 2016 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (1251), ఆంధ్రప్రదేశ్‌లోని 11 జిల్లాలలో (727) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1978)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	-	3	-	14	17	4	-	4	2	3	2	2	2	3	26	34	-	-	-	3	14
హైదరాబాద్	-	-	-	3	10	2	4	-	-	1	4	11	-	-	19	13	-	-	-	-	-
కరీంనగర్	-	8	1	12	13	3	4	1	1	-	1	7	-	4	23	18	-	-	-	-	1
ఖమ్మం	-	4	-	10	12	1	12	1	2	-	-	1	-	3	22	14	-	-	-	-	18
మహబూబ్‌నగర్	-	9	-	8	22	1	2	4	-	-	4	14	14	12	42	7	-	1	-	-	13
మెదక్	6	19	3	19	25	32	42	4	6	5	9	6	15	19	29	31	-	-	-	4	1
నల్గొండ	-	11	-	9	11	4	5	1	-	2	4	9	-	5	39	11	-	-	-	-	33
నిజామాబాద్	-	3	-	6	18	6	2	1	1	1	1	2	1	6	14	3	-	-	-	-	6
వరంగల్	-	7	3	7	8	1	3	2	-	-	3	2	2	9	32	18	-	-	-	-	17
రంగారెడ్డి	-	4	-	7	9	1	1	1	2	1	4	9	-	-	41	13	-	-	-	-	4
తెలంగాణ	**6**	**68**	**7**	**95**	**145**	**55**	**75**	**19**	**14**	**13**	**32**	**63**	**34**	**61**	**287**	**162**	**-**	**1**	**-**	**7**	**107**
అనంతపురం	-	1	2	15	25	1	2	1	-	6	2	9	7	5	40	-	-	-	-	-	9
చిత్తూరు	-	1	-	2	4	6	11	-	-	3	4	6	3	1	27	6	-	-	-	-	51
కడప	-	-	-	1	2	1	-	1	-	8	-	1	-	1	12	4	-	-	-	-	6
గుంటూరు	-	2	-	5	1	-	2	-	-	4	1	4	-	1	19	15	-	-	-	-	-
కృష్ణా	-	1	-	6	4	-	3	-	-	1	3	3	1	2	23	15	-	-	-	-	-
కర్నూలు		వివరాలు అందలేదు																			
తూర్పు గోదావరి	-	-	-	4	11	1	5	-	3	4	2	1	1	1	15	15	-	-	-	-	-
ప్రకాశం	-	2	-	-	1	-	2	-	-	3	2	3	-	5	22	6	-	-	-	-	3
శ్రీకాకుళం		వివరాలు అందలేదు																			
పశ్చిమ గోదావరి	-	1	-	4	4	1	3	-	1	-	1	-	-	2	12	10	-	-	-	-	-
నెల్లూరు	-	-	-	6	5	2	1	-	-	3	1	2	-	4	18	21	-	-	-	-	5
విజయనగరం	-	-	-	1	1	2	-	-	1	-	-	2	1	-	11	4	-	-	-	-	2
విశాఖపట్నం	2	-	-	9	11	2	4	-	-	2	1	2	3	2	17	15	-	-	-	7	2
ఆంధ్రప్రదేశ్	**2**	**8**	**2**	**53**	**69**	**16**	**34**	**2**	**5**	**34**	**17**	**33**	**16**	**24**	**216**	**111**	**-**	**-**	**-**	**7**	**78**

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం - ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
నిత్యజీవితంలో సోషలిజం	భూసారం శివన్న	100
విధ్వంసక అభివృద్ధి	డిఎస్‌యు	180
భారతదేశంలో ఉత్పత్తి విధానం-ఉత్పత్తి సంబంధాలు	విరసం	20
పోలవరంతో విధ్వంసమే	డా. ఎస్. తిరుపతయ్య	40

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
తెలంగాణ జైత్రయాత్ర	ఘంటా చక్రపాణి	200
సమగ్ర తెలంగాణ	వీక్షణం ప్రచురణ	295

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం-మతం

భారతదేశంలో కుల సమస్య	అనురాధ గాంధీ	120
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్‌సి, ఎస్‌టి నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా పూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు - రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు - అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు - మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందువునెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ - వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
స్వేచ్ఛారావం	జి. హరగోపాల్	250
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
సాహిత్య వ్యాసాలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ రచనలు	చలసాని ప్రసాద్	100
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
కెవిఆర్ డిటెన్యూ డైరీ	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	170
సాహిత్య సమాలోచన	కృష్ణాబాయి	300
సందిగ్ధ సందర్భం	సి.వి. సుబ్బారావు	40
సామాజికం	వి. చెంచయ్య	30
మన ప్రపంచం	దుప్పల రవికుమార్	75
దారులేసిన అక్షరాలు	భారతీయ మహిళల రచనలు	400
కవిత్వంతో ములాఖాత్	ఎన్. వేణుగోపాల్	120

చరిత్ర-జీవిత చరిత్ర

భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	రు. 250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కౌశాంబి	40
భగవద్గీత చారిత్రక పరిణామం	డి.డి. కౌశాంబి	10
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	100
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్‌సన్	150
24 గంటలు	కె.జి. కన్నబిరాన్	200
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
చేగువేరా	కాత్యాయని	80
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
నూరేళ్ల కాళోజీ	వరవరరావు	60
అలిశెట్టి ప్రభాకర్ కవిత	అలిశెట్టి ప్రభాకర్	150

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	విరసం	125
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్ని		

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
ఏది నేరం?!	బి. అనూరాధ	75
మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
రివిజనిజం	విరసం ప్రచురణ	75
అంతర్యుద్ధంలో ఆదివాసులు	విరసం ప్రచురణ	20
ఆదర్శ జీవులు ఆమరులు	విరసం ప్రచురణ	30
మావో రచనలు - 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు - 2	విరసం ప్రచురణ	220
సంకెళ్ల సవ్వడి	అరుణ్ ఫరేరా	150
వామపక్ష కమ్యూనిజం - ఒక బాలరిష్టం	లెనిన్ ప్రసిద్ధ రచన	30

కథ - నవల

దండకారణ్య కథలు(2005-2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
రేపు కథ	వెర్నన్ గొంజాల్విస్	20
మిగిలేటోళ్లు	బాసిత్	50
కాంత పున్నం వెన్నెల	పద్మకుమారి	20
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50
పంచమం	చిలుకూరి దేవపుత్ర	100
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
హింసపాదు	బమ్మిడి జగదీశ్వరరావు	180

డివిడి

వీక్షణం (2003 - 2012)	200
సృజన (1966-1992)	240
అరుణతార (1970-2013)	125
'ఓయు'ద్ధకాండ	100


వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

‘వీక్షణం’ను ఆదుకుందాం
‘వీక్షణం’ నాలుగు కాలాల పాటు నిలిచేందుకు చేయూతనిద్దాం

తెలుగులో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వంటి పత్రిక ఉండాలనే ఆలోచనతో, సీనియర్ పాత్రికేయులు వి. హనుమంతరావు సంపాదకులుగా 2003లో ప్రారంభమై, 2005 నుంచి ఎన్. వేణుగోపాల్ సంపాదకత్వంలో నడుస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక ‘వీక్షణం’ తెలుగు సమాజానికి అవసరమైన చర్చావేదికగా పనిచేస్తున్నదని, మనందరితో పాటు ఎందరో పాఠకుల ఆదరాభిమానాలు చూరగొన్నదని మనకు తెలుసు. పదమూడు సంవత్సరాలుగా నిరంతరాయంగా నడుస్తున్న ఈ పత్రిక ఆర్థిక పరిస్థితి ఇప్పటికీ దినదిన గండంగానే ఉంటున్నది. ఎప్పుడు ఆగిపోతుందో తెలియదని దాదాపు ప్రతినెలా పత్రికలో అచ్చవుతున్న ఆందోళనాకరమైన ప్రకటన, ఈ పత్రికను నిలబెట్టడానికి తోడ్పడమనే అభ్యర్థనలు మా ఈ బహిరంగ ప్రకటనకు కారణం. ఇంతకాలంగా నిర్వాహకులు కష్టనష్టాలు భరిస్తూ సాగించిన కృషికి ఇప్పుడు మన సహకారం అవసరమని చెప్పడానికే ఈ ప్రకటన.

‘వీక్షణం’ ఈ పదమూడు సంవత్సరాలలో మూడువేలకు పైగా వ్యాసాలను ప్రచురించి ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ అంశాలెన్నిటి పైననో తెలుగు సమాజానికి అత్యవసరమైన సమాచారాన్నీ, వివరణలనూ, విశ్లేషణలనూ అందించింది. సంపాదకుడి అభిప్రాయాలే వైనప్పటికీ, తెలుగు సమాజంలో ఉన్న ప్రగతిశీల భావాలకూ, ధోరణులకూ అన్నిటికీ ప్రజాస్వామిక స్ఫూర్తితో వేదిక కల్పించింది. ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్ఎస్ఎన్ గుర్తింపు సంపాదించి పరిశోధక విద్యార్థులకు, విశ్వవిద్యాలయ అధ్యాపకులకు అవకాశాలు కల్పించింది. ప్రతి సంవత్సరం రచయితల సమావేశాలు, సంభాషణలు ఏర్పాటు చేసి తెలుగు సమాజంలో సామాజిక శాస్త్ర రచనను ప్రోత్సహించింది. వ్యాసరచనా అధ్యయన తరగతులు నిర్వహించి వ్యాసప్రక్రియ ప్రమాణాలు పెంచడానికి తన వంతు కృషి చేసింది. పత్రికలో లబ్ధప్రతిష్ఠుల రచనలు ప్రచురించడంతో పాటు, విషయమే ప్రధానంగా ఐదారు వందలమంది కొత్త వ్యాసకర్తలకు అవకాశం కల్పించింది. ‘ఒక దళారీ పశ్చాత్తాపం’ వంటి విస్తృత ప్రచారం పొందిన పుస్తకంతో సహా దాదాపు డజను పుస్తకాలు ప్రచురించింది.

తెలుగు సమాజానికీ, మేధో ప్రపంచానికీ, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణకూ ఇంత దోహదం చేసిన ‘వీక్షణం’ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, ఆ దీపం కొడిగట్టిపోకుండా కాపాడడం సమాజం బాధ్యత. ఇతోధిక పాఠకులను తయారు చేయడం, విరివిగా చందాలు చేర్పించడం, వ్యాపార ప్రకటనలు సేకరించిపెట్టడం, విరాళాలు అందించడం మన కనీస కర్తవ్యం. ‘వీక్షణం’ శ్రేయోభిలాషి, చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణ ‘వీక్షణం’ రచయితల సమావేశాల్లో సూచించినట్టుగా ఆర్థిక ఇబ్బందుల నుంచి సుస్థిరమైన పద్ధతిలో గట్టెక్కాలంటే ‘వీక్షణం’కు ఒక మూలనిధి కూడ ఏర్పాటు చేయవలసి ఉంది. మనంతట మనం మన శక్తి మేరకు గాని, విరాళాలు ఇవ్వగలిగిన మిత్రుల ద్వారా గాని ఈ మూలనిధి విరాళాలు సేకరించి మనందరికీ, మొత్తంగా సమాజానికీ అవసరమైన ‘వీక్షణం’ రాజకీయార్థిక, సామాజిక మాసపత్రికను కాపాడుకుందాం. ఈ చైతన్యజ్వాల ఆరిపోకుండా మన రెండు చేతులూ అడ్డుపెట్టి వెలుగు నిరంతరం ప్రసరించనిద్దాం.



ఒక సంవత్సరం కింద వెలువడిన ఈ విజ్ఞప్తికి విస్తృతమైన ప్రతిస్పందన వచ్చింది. ఆర్థిక, హార్దిక సహాయం అందించిన మిత్రులందరికీ కృతజ్ఞతలు. అయినా వీక్షణం ఆర్థిక పరిస్థితి ఇంకా సుస్థిరంగా మారలేదు. అందువల్ల ఈ విజ్ఞప్తికి ఇంకా అవసరం ఉంది. ఈ విజ్ఞప్తిపై సంతకం చేసి, జూలై 2015లో మరణించిన చలసాని ప్రసాద్ గారిని సగౌరవంగా స్మరించుకుంటున్నాం.